పల్నాటి

చారిత్రక వీరుడు

మాల కన్నమనీడు

రచయిత

బొనిగల రామారావు M.Com., (B.L)

"సింహాల నుండి ఒక చరిత్రకారుడుద్భవించేవరకు, వేట, వేటగాని యొక్క ఘనత గొప్పగా చాటుకుంటూనే ఉంటారు - ఆఫ్రికన్ సామెత"

ప్రథమ ముద్రణ - 1998 ఏప్రియల్

ప్రతులు : 2000

వెల : 75 రూపాయలు

ప్రతులకు :

శ్రీమతి బొనిగల కృప, B.A., B.Ed.,

మన్నవ గ్రామము

పొన్నూరు మండలము

గుంటూరు జిల్లా - 522316

ఈ క్రింది వారి వద్ద కాపీలు లభిస్తాయి.

- విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు
- నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాదు.
- నవయుగ బుక్‌హౌస్, సుల్తాన్‌బజార్, హైదరాబాదు.
- ప్రగతి బుక్‌హౌస్, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ.
- మణి బుక్‌హౌస్, సండే మార్కెట్, నెల్లూరు.
- నవోదయ బుక్‌హౌస్, గుంటూరు.

కవర్‌పేజీ : జి. యస్. ప్రకాష్, కాకినాడ.

డి.టి.పి. : శ్రీ సత్య గ్రాఫిక్స్, కాకినాడ.

ప్రింటింగ్ : ప్రశాంతి ప్రింటర్స్, కాకినాడ.

చాలా జాగ్రత్తగా గమనించండి

ఒక పదము లేదా ఒక అక్షరము, ఒక మాట వేరువేరు భాషల (దేశం మొత్తం) లిపులలో వ్రాయబడినప్పుడు రూపాంతరము చెందు విధానము (పద్ధతి) ఈ విధముగా ఉండును.

System of the Transliteration

*	k	kh,	g,	gh,	n,	-	h,	h,	a,	a		
	క	ఖ	గ	ఘ	ఙ							
*	c,	ch,	j,	jh,	n,	-	s,	y,	i,	i,	e,	e, ai
	చ	ఛ	జ	ఝ	ఞ							
*	t,	th,	d,	dh,	n,	-	s,	r,	r,	r		
	త	థ	ద	ధ	న							
*	t,	th,	d,	dh,	n,	-	s,	l,	l,	l		
	ట	ఠ	డ	ఢ	ణ							
*	p	ph,	b	bh,	m,	-	h,	v,	u,	u,	o,	o, au
	ప	ఫ	బ	భ	మ	-	(మనకు కావలసినదది ఈ వరుస)					

మనకు కావలసిన లిపి అంతరీకరణము, చివరి వరుసలో ఉననది. అది ఏవిధముగా మార్పు చెందుతుందో గమనించండి.

ప ఫ బ భ మ

<u>"పల్నాడు" అనే పదము చూడండి :</u>

పల్నాడు	ఫల్నాడు	బల్నాడు	భల్నాడు	మల్నాడు
పలనాడు	ఫలనాడు	బలనాడు	భలనాడు	మలనాడు
పాలనాడు	ఫాలనాడు	బాలనాడు	భాలనాడు	**మాలనాడు**
పల్లినాడు	ఫల్లినాడు	బల్లినాడు	భల్లినాడు	మల్లినాడు
పలినాడు	ఫలినాడు	బలినాడు	భలినాడు	మలినాడు
పల్లనాడు	ఫల్లనాడు	బల్లనాడు	భల్లనాడు	మల్లనాడు

పై విషయాల్ని గమనిస్తే :

పల్లి (Palli)	-	పల్ల (Palla)
పాలి (Pali)	-	మల్ల (Malla)
బలి (Bali)	-	పాల (Pala)
మాల (Mala)	-	బల్ల (Balla)

మొదలైన పదాలు కూడా వేరువేరు భాషలలో వ్రాయునప్పుడు లిపిలో చెందిన రూపాంతరాలు అని అర్థమౌతుంది.

"మహాబలిపురం" అనే పదము చూడండి :

మహా బలిపురం	-	మహా పలిపురం	-	మహా మలిపురం
మహా బల్లిపురం	-	మహా పల్లిపురం	-	మహా మల్లిపురం
మహా బల్లపురం	-	మహా పల్లపురం	-	మహా మల్లపురం
మహా బాలపురం	-	మహా పాలపురం	-	**మహా మాలపురం**

బలి (Bali)	-	మల్ల (Malla)
పలి (Pali)	-	మాల (Mala)
పాల్లి (Pali)	-	పల్ల (Palla)
పల్లి (Palli)	-	మల్లి (Malli)
పాల (Pala)	-	బల్ల (Balla)

మొదలైన పదాలు వేరువేరు బాషల లిపులలో వ్రాయబడినపుడు జరిగిన రూపాంతరాలే కాని వేరు కాదు.

- బలి (బలి చక్రవర్తి)
- పల్లి (మాలపల్లి - మాదిగపల్లి)
- పాలి (పాలి భాష) అశోకుని శిలా శాసనాలు పాలిభాష బ్రహ్మీలిపిలో వ్రాయబడినవి.
- 'మల్ల' వంశాలు = 'మాల' వంశాలు అని తెలియుచున్నవి.

"సింహాల నుండి ఒక చరిత్రకారుడు జన్మించే వరకు, వేట, వేటగాని యొక్క ఘనత గొప్పగా చాటుకుంటూనే ఉంటారు" - ఆఫ్రికన్ సామెత.



ప్రేమ మూర్తులు

శ్రమ జీవులు

మా అమ్మా - నాన్నలు

కీ॥శే॥ బొనిగల సింగయ్య

శ్రీమతి బొనిగల సలోమ్మి

పవిత్ర పాదాలకు

ప్రేమతో

అంకితం.

ఒక్క నిముషం

"సింహాలనుండి ఒక చరిత్రకారుడు జన్మించేవరకు, వేట, వేటగాని యొక్క ఘనత చాటుకుంటూనే ఉంటారు". వేటకు వెళ్ళిన వేటగాడు, ఎన్నిసార్లు పారిపోయాడు ? ఎన్నిమార్లు ప్రాణభయంతో గజగజవణికాడు? ఎన్ని జిత్తులమారి ఎత్తులు వేశాడు? ఎన్నిసార్లు చెట్లెక్కాడు? వెనుకనుండి దొంగచాటుగా ఎన్ని బాణాలు వేశాడు? మొదలైన చరిత్ర తెలియాలంటే సిహాలనుండి ఒక చరిత్రకారుడు జన్మించాల్సిందే!అదే విధంగా అణగారిన ప్రజల నుండి ముఖ్యంగా దళితుల నుండి చరిత్రకారులు ఉద్భవించేవరకు, నిజమైన చరిత్రను వెతికి, వెలికి తీసేవరకు, గుంటనక్కలన్నీ తమ గుంపుల చరిత్రను ఘనంగా కీర్తించుకుంటూనే ఉంటాయి. మన చరిత్రను వేరొకరు వ్రాయరు. ఒకవేళ వ్రాసినా అది అబద్ధాల పుట్టగా ఉంటుంది. అందువలన మన చరిత్రను మనమే వ్రాసుకోవాలి.

పల్నాటి వీర చరిత్రలో మొదటి నుండి చివరివరకు, అజేయంగా నిలబడిన 'మాలకన్నమనీడు' చరిత్ర వ్రాయడానికి నాకు ఐదు సంవత్సరాలు పట్టినది. ఎందువలనంటే ఆంధ్రదేశంలో ఏ చరిత్రకారుడు కూడా, కన్నముడ్ని గూర్చి సవివరంగా వ్రాయలేదు. పల్నాటి చరిత్రలో బ్రహ్మనాయుడు, నాయకురాలు నాగమ్మ, బాలచంద్రుడ్ని గూర్చిన అవాస్తవాలు పుంఖానుపుంఖాలుగా మన చరిత్రకారులు వ్రాసినారు. అందువలన నేను ఎక్కువగా కథకుల్ని, స్థానికుల్ని, ఆశ్రయించాల్సి వచ్చినది. అదృష్టవశాత్తు దళిత పల్లెల్లో ఏ ఒక్కర్ని అడిగినా, ఎవ్వరి తలుపుతట్టినా పల్నాటి వారిని గూర్చి కాస్తో కూస్తో చెప్పేవారే ఉన్నారు.

మరి ముఖ్యంగా మా నాన్నగారు అయిన కీ॥శే॥ బొనిగల సింగయ్యగారు నాకు చిన్ననాటి నుండి పల్నాటి చరిత్ర పూసగూర్చినట్లు చెప్పేవారు. అయితే ఆయన కూడా కథకులు చెప్పే కథలు విని, నాకు చెప్పేవారు. అవి నాకు గుర్తున్నాయి, ఎంతో ఉపయోగపడినవి. నేను లెక్చరర్‌గా కామర్స్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నప్పుడు, నాకు Historical దృక్పదాన్నిచ్చినది. కె.కృపాచారిగారు (చరిత్ర ఉపన్యాసకులు, రిటైర్డు), వారి నుండి దళిత aspect పల్నాటి వారికి ఎలా? ఎందుకు ? చెందుతుందో తెలుసుకున్నాను.. దానితో నా యొక్క ప్రయత్నము మ్మురము చేశాను. పల్నాటి ప్రాంత పల్లెలో తిరిగాను. అచ్చట దళితుల్ని సంప్రదించాను. వారి మాటలను బట్టి నాకు అర్థమయినది ఏమిటంటే; పల్నాటి రాజులైన నలగాముడు, మాలదేవుడు ఇద్దరూ మాలకులస్థులనియు, సోదరులనియు, పల్నాటి యుద్ధంలో దళిత వంశాలు చాలవరకు పతనమయినట్లు నాకు అర్థమయినది.

పల్నాటి చరిత్ర మొత్తంలో, 'మాల' అనే కులం పేరును, పేరుకు ముందు ధరించిన సర్వసైన్యాధిపతి (మాలకన్నముడు) కనిపించాడు. ఓహో! ఇక్కడ ఏదో చారిత్రక రహస్యమున్నట్లు గమనించి పరిశోధించాను. వ్యయప్రయాసలు లెక్కబెట్టుకొనలేదు. కన్నముని 'వీర భైరవ ఖడ్గాని' కున్న పదును ఆంధ్రులకు తెలియజేయాలనుకున్నాను. ఎప్పుడో పన్నెండవ శతాబ్దంలో జరిగిన చరిత్రలో సర్వసేనాపతి గూర్చి ఆంధ్రదేశంలో ఎవ్వరూ వ్రాయలేదు. బహుశా ఎవ్వరూ వ్రాయకుండా వదిలి వేయడం నా అదృష్టంగా భావించుకున్నాను. ఆ వీరుని చరిత్ర వ్రాసే భాగ్యం నాకు కలిగినందులకు చాలా సంతోషంగా ఉన్నది.

అలాంటి సంతోషంలో research ఒక వైపు, రచన ఇంకొకవైపు ప్రారంభించాను. ఎందరో మిత్రులు సహకరించారు. అమూల్యమైన సలహాలనిచ్చారు. నేను అడిగినదే తడవుగా వ్యయ ప్రయాసలకోర్చి పల్నాడులో Photos సేకరించిన జువాలజీ ఉపన్యాసకులు నాకు ఆప్తుడు, మిత్రులు ఉండవల్లి రమేష్‌గారికి నాకృతజ్ఞతలు. మరియు A.R. సంపత్‌కుమార్, పులిపాటి నాగేశ్వరరావు, వి.మిల్టన్, Ch. శ్రీనివారావు (A.C.T.O.), A., కిషోర్, వేముల చెంచారావు, (లక్కచిట్టి) నన్నంబెన్ని, బడుగు భాస్కరరావు, కంచెర్లజాన్, మొ॥న మిత్రుల సహకారం మరువలేనిది.

శ్రేయోభిలాషులు మంచి మనస్కులు, సాహితీవేత్త జూపూడి అమ్మలయ్య (అమూల్యశ్రీ) గారు, సోదరతుల్యులు బడుగు. రాజాసునాద్ కుమార్‌గారు, నాగేండ్ల శేఖర్‌గార్లకు నా కృతజ్ఞతలు.

పల్నాటి చరిత్రలో dynasty (రాజవంశము) నిర్ణయించడానికి, ఎక్కువ శ్రమ పడ్డాను. ఆ శ్రమలో సహకరించిన నా శ్రీమతి కృపకు కృతజ్ఞతలు. మరుగున పడ్డ నిజాల్ని వెతికి వెలికి తియ్యాల్సి వచ్చినది. విజ్ఞులు సహృదయంతో చేయు విమర్శలు, ఇచ్చు సలహాలు ఆనందంతో స్వీకరించగలవాడను.

అక్షరాలు అందంగా తీర్చిదిద్దిన కె. బాల ప్రసాద్ గారికి, ప్రింటింగ్‌లో జాగ్రత్త వహించి సకాలములో పుస్తకాన్ని అందంగా అందించిన టి.ఎస్.ఎన్. మూర్తి గారికి కృతజ్ఞతలు.

మీ

ఆరార్ బొనిగల

భారతదేశ చరిత్రను మనచరిత్రకారులు పరిశీలించిన కోణం :

'పల్నాటి చరిత్ర' - కథ కాదు, కల్పన కాదు, పురాణం కాదు, ఇతిహాసం కాదు, ఇది చరిత్ర. దీనిని చారిత్రక ధృక్పథంతో చూడాలి.

భారతదేశ చరిత్ర వాస్తవ - అవాస్తవాల మిశ్రమము అన్న విషయము మనమెరిగినదే, అయితే మన దేశ చరిత్ర వ్రాసిన చరిత్రకారుల చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుంది. చరిత్రలో కొన్ని విషయాలకు ఆధారాలు లభించడం లేదు. దానికి కారణము శాసనాలు, తాళపత్ర గ్రంథాలు నాశనము చేయడం జరిగినది. మన చరిత్రను భవిష్యత్తు తరాలకు దక్కకుండా చేయడానికి కులద్వేషాలు కూడా తన వంతు పాత్ర నిర్వహించాయి.

పైగా దళిత జాతుల చరిత్ర వ్రాయడానికి చిత్తశుద్ధితో చర్చించడానిక ఏ హైందవ చరిత్రకారుడు ముందుకురాడు. ఎందుకనగా సామాజిక ద్వేషాలు ఒక కారణము, మనదేశంలో కాశ్మీరు మరియు శ్రీలంక (పూర్వము భారత దేశంలో భాగంగా ఉండెడిది) కు మాత్రమే పరిపూర్ణమైన ఒక క్రమబద్ధమైన చారిత్రక ఆధారాలున్నవి. హైందవ చరిత్రకారులు వారి తాత ముత్తాతల గూర్చి మాత్రమే అభూత కల్పనలు రచన చేసినారు. నిమ్న జాతుల చరిత్రను కావాలని నిర్లక్ష్యము చేసినారు. ఈ విషయాన్ని గూర్చి Gustav Oppert ఈవిధంగా అన్నారు.

"If we except Kashmir and Ceylon, regarding the latter as belonging to India, no part of India possesses anything like a continuous historical record. The preponderance of caste and the Social prejudices.

Creates are disabilities such as no Hindu who wishes to relate the history of his country can entirely overcome. The natives of India have, as a rule, little synpathy with people out side their own class and when it is believed that persons belonging to the highest caste can their piety ensure final beatitude. If they simply remember and the memory of their three immediate predecessors father, grand father and great grand father. We need not wonder at the apattey displayed towards history by them and by others who are beneath them in the social Scale."

పై విషయాన్ని పరిశీలిస్తే హైందవ చరిత్రకారులు కుల ద్వేషాలతో చరిత్రను రచించినట్లు అవగతమవుతుంది.

చరిత్రను నిర్మించేటప్పుడు ఆధారాలు దొరకనప్పుడు ఆధారాలు దొరికే వరకు చరిత్రకారుడు ఏమి చేయవలయును ? లుప్త భాగాలను తను వదలి వేయవలయునా? లేక తన మేధాశక్తి, తర్కజ్ఞానంతో పూరించ వలయునా? అన్నప్పుడు పూరించవలయునని పెద్దలు చెప్పి యున్నారు.

అంబేద్కర్ ఈ విధంగా అన్నారు :

"చరిత్ర విద్యార్థి కర్తవ్యమేమిటి ? తెగిన లింకులు దొరికే వరకు అతడు తన ప్రయత్నాన్ని విరమించుకోవాలా ? అలా అని నేనే అనుకోను. అలాంటి పరిస్థితులలో అతడు తన ఊహాశక్తిని, సహజ ప్రేరణా జ్ఞానాన్ని ఉపయోగించి వాస్తవాధార గొలుసులో లింకులు తెగిన చోట అవి దొరికే వరకు అతుకు పెట్టాలి. విషయాలు ఒక దానితో మరొకటి ఎక్కడ ముడిపడినవో అక్కడ ఊహా సేతువుతో అవి పరస్పర సంబంధము కలిగి ఉండవొచ్చునని చెప్పగలగాలి. ఇది అనుమతించ వచ్చునని నా విశ్వాసము. పరిశోధనా కృషిని విరమించు కోవడం కంటే నాకు తారసిల్లే లుప్త భాగాన్ని పూరించడానికి ఈ పద్ధతి అనుసరించడం పట్ల మొగ్గు చూపుతాను. " అన్నారు.

గేడే మహాశయుడు ఈ విధంగా అన్నారు.

"అసత్యాన్నుంచి సత్యాన్ని " అనిశ్చితాన్నుంచి నిశ్చయాన్ని అనంగీకార యోగ్యమైన దాన్నుంచి సందేహాన్ని వేరుపరచడం చరిత్రకారుని విధి", అన్నిటి కంటే ముందు ప్రతి పరిశోధకుడు, తనను తాను న్యాయపీఠం పై నియమితుడైన సభ్యునిలాగ భావించుకోవాలి. వాదంలో ఇచ్చిన వివరణ ఎంతవరకు సంపూర్తిగా ఉంది? ఎంతవరకు సాక్ష్యాధారాలున్నాయి ? అనే విషయాన్ని మాత్రమే అతడు పరిశీలించాలి. అప్పుడు తన అభిప్రాయాన్ని ఏర్పరచుకొని, తన అభిమతాన్ని తెలుపు తాడు. అది అతని కటె పై వ్యక్తి అభిప్రాయంతో, సంపదించనూవచ్చు సంవదించకపోనూ వచ్చు". అన్నారు.

మాగ్జిమ్ గోర్కీ ఈవిధంగా అన్నారు :

"శాస్త్ర సాహిత్యాలకు చాలా విషయాలలో సాదృశ్యముంది. రెంటిలోను పరిశీలన తులనాత్మకత, అధ్యయనం ప్రాథమిక ప్రాముఖ్యత కలిగి యున్నారు. శాస్త్రజ్ఞుని లాగే కళాకారునికి ఊహ, సహజ ప్రేరణ అవసరం వుంది. ఊహ, సహజ ప్రేరణ వాస్తవాధారాల గొలుసులో లింకులు తెగిన చోట లుప్త భాగాన్ని పూరిస్తాయి. " అన్నారు.

పైన చెప్పిన ముగ్గురు మేధావుల అభిప్రాయాలను చూచినపుడు చరిత్రలో తెగిన లింకులను తన ఊహ, ప్రేరణాజ్ఞానాన్ని ఉపయోగించి కలపడం చరిత్రకారుని విధి అని తెలియుచున్నది.

మన చరిత్రపై మన చరిత్రకారుల కులం, మతం బలంగా ముద్రపడినది. దానివల్ల కొన్ని అభూత కల్పనలు, అవాస్తవాలు చోటు చేసుకున్నాయి. కొన్ని వాస్తవాలు మరుగున పడినాయి.

ఉదాహరణకు :

1. గుప్తుల పరిపాలన గూర్చి :

హైందవ చరిత్రకారులు 'స్వర్ణయుగం' అని ఆకాశానికెత్తారు. గుప్తులు పాలించిన భూభాగము చాలా చిన్న ప్రాంతం. వారి భూభాగములో తామ్రలిపి, బరుకచ్ఛము, ఓడరేవులు లేవు. అవి వారి ఆధీనములో ఉన్నవన్నట్లు చూపి విదేశీ వర్తకము ఎక్కువగా చేసినట్లు చెప్పారు. వారు నిర్మించిన దేవాలయము ఒక్కటి కూడా లేదు. ఎప్పుడో మరణించిన మహాకవి కాళిదాసు గుప్తుల కాలములో నివసించినట్లు వ్రాయడం ఇవన్నీ పక్షపాత ధోరణితో భారత దేశ చరిత్ర వ్రాయడమే.

2. మౌర్యుల రాజ్యం గూర్చి :

మౌర్య సామ్రాజ్య నిర్మాత చంద్రగుప్త మౌర్యుడు 'మురి' అను పేరు గల దళిత స్త్రీ పుత్రుడు. ఇతడు మొదట 'గణ' రాజ్యాన్ని స్థాపించి తన శక్తి సామార్థ్యాలతో (పర్వతకుడు అను దళితుని సహాయం కూడ ఉంది.

ముందు, ముందు ఈ విషయాన్ని విపులంగా చర్చించాను.) మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించడం జరిగింది. ఈ ఉన్నత దశకు మేమే కారణం అన్నట్లు హైందవ చరిత్రకారులు చాణుక్యుని రాజకీయ చాతుర్యముతో రాజ్యాన్ని స్థాపించినట్లు చరిత్ర వ్రాయడం జరిగినది.

(ఎ) వీరిద్దరు సమకాలీకులు కాదు. (చాణుక్యుడు - చంద్రగుప్తుడు)

(బి) జైన మతం యెడల చంద్రగుప్తునికి, అపారమైన ప్రేముంది ప్రపంచములో ఏ చక్రవర్తి కూడ తన శరీరాన్ని మతం కొరకు కృశింపజేసుకొని ఆహుతి కాలేదు. ఇతను సల్లేఖన వ్రతము (నిరాహార దీక్ష లాంటిది) ఆచరించి శ్రావణ బెళగొళ యందు మరణించెను. చాణుక్యుడు హిందూమత పిచ్చివాడు. వీరిద్దరు కలసి ఉన్నట్లు మన చరిత్ర ఉంది. జైనులు, హిందువులు చరిత్రలో గొంతులు కొసుకున్న రోజులవి. వీరిద్దరిని కలపడం మన బ్రహ్మణ చరిత్రకారుల జిమ్మిక్కు మాత్రమే.

(సి) మౌర్య శిలా శాసనాలలో ఒక్కదానిలో కూడా (సుమారు 200 శాసనాలు దొరికినవి) చాణుక్యుని పేరు లేదు.

(డి) మెగస్తనీసు చైనా యాత్రికుడు. చంద్రగుప్తమౌర్యుని ఆస్థానానికి వచ్చి "ఇండికా" అనే మహా గ్రంథాన్ని వ్రాశాడు. అందులో మౌర్యుల పరిపాలన ఉన్నది. కాని చాణుక్యుని పేరు లేదు.

(ఇ) చాణుక్యుడు రచించాడని చెబుతున్న అర్థ శాస్త్రమునందు మౌర్యుల రాజధాని 'పాటలి పుత్రము' పేరు లేదు. ఇది మరీ విచిత్రము. నేను పేర్కొన్నవి ఇచ్చట కొన్ని మాత్రమే.

ఇవే కాక ఎన్నో విషయాలను బట్టి చాణుక్యునికి మౌర్యులతో ఎటువంటి సంబంధము లేదన్న విషయం తెలియుచున్నది. కాని హిందూ చరిత్రకారులంతా 'చాణుక్య-చంద్రగుప్త' అని చెప్పి అబద్దాలు ఆమోదయోగ్యం చేశారు. 'అర్థశాస్త్రము' మౌర్య సామ్రాజ్య పతనం తరువాత లిఖించబడినట్లు పరిశోధనలలో వెల్లడైనది. దానిని 'మామిడిపూడి వెంకట రంగయ్య తన అర్థశాస్త్ర అనువాదము నందు సవివరంగా చర్చించినాడు.

3. ఝాన్సీ లక్ష్మీభాయ్ :

ఈమె అసలు పేరు మణికర్ణిక. 14 సం॥ల వయస్సులో 40 సం॥ల గంగాధరరావు తో వివాహము అయినది. ఈమెను పట్టించిన 20,000 రూ॥లు నగదు బహుమతి ఆనాటి ప్రభుత్వం ప్రకటించినది. ఆమె చాలా గొప్ప వనిత. యుద్ధ రంగానికి వెళ్ళినపుడు ఆమె గుర్రం మీద ఉన్నప్పుడు ఆమె వీపున పిల్లాడ్ని కట్టడము. అవి చరిత్ర విద్యార్థులకు పాఠాలు పెట్టడం హిందూ చరిత్రకారుల మితిమీరిన ప్రేమకు నిదర్శనంగా కనిపిస్తుంది. ఆమె ఒక రాజ్యానికి 'రాణి' అన్న విషయాన్ని మనం గమనించాలి. పిల్లాడ్ని యుద్ధ రంగానికి జ్ఞానం కలిగిన ఎవ్వరూ తీసుకురారు కదా ?! ఆమె కూడ తేలేదు. అయినా మన చరిత్రకారుల ఊహలు అద్భుతంగా, అవాస్తవంగా ఆంటాయి.

4. ఆంధ్ర చరిత్రకారులు మొత్తం బ్రాహ్మణులు, రెడ్లు, కమ్మలు, నాయుళ్ళు వీరు కూడ ఆధారాలు లేని వాదనలతో, చరిత్రలో గొప్ప వంశాలన్నీ తమ తమ కులాలకు సంబందించినవని నిరూపించుటకు తాపత్రయ పడినారు. ఉదాహరణకు కాకతీయులలో "క" అనే అక్షరం కనిపిస్తే చాలు వారు 'కమ్మవారు' అయి ఉంటారని సెలవిచ్చారు. కాకతీయుల వంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాల్సి వుంటుంది. "కాకతీయ రాజ్యప్రతి స్థాపనాచార్యుడు" గా వర్ణించబడ్డవాడు. రేచర్ల గోత్రజుడు దామానాయుడు (మాలకుటుంబానికి చెందినవాడు) ఇతను దళితుడని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈ రేచర్ల గోత్రము మాల వంశానికి చెందినది. ఈ విషయం ముందు ముందు విపులంగా చర్చించాను.

కాకతీయులలోనే ఇంకొక విషయం గణపతి దేవుడిని, శశాంకుడు బందించి తీసుకెళ్ళినపుడు, అతను తిరిగి రావడానికి 12 సం॥లు పట్టినది. అతను వచ్చేవరకు రాజ్యాన్ని పరిపాలించినది - రేచర్ల రుద్రుడు. ఇతడు మాల వంశానికి చెందిన వాడు. ఇతనే 'రామప్ప దేవాలయం' కట్టించినాడు. ఇతను ప్రాచీన నాగ వంశానికి చెందినవాడు. కనుకనే ఆదేవాలయం నిండా "నాగిని" చిత్రాలు, చెక్కడాలతో ముంచెత్తినాడు. 12 సం॥రాలు

పరిపాలించిన వానిని గూర్చి ఒక్కమాట వ్రాసి దాటేస్తారు. కారణం అతడు దళితుడు కనుకనే అన్న విషయాన్ని గమనించాలి. 13 వ శతాబ్దము యాదవ సింగన్న పరిపాలన కాలం నాటి అనంతపురం జిల్లాలో, 3 రాతి ఫలకాలు దొరికినవి. వాటిని బట్టి ఒక 'చిత్రమేలి' సంఘమున్నట్లు తెలుస్తున్నది. ఆ ఫలకం మీద - నాగలిబొమ్మ, ఎద్దు, పాము, డప్పు, పూర్ణ కుంభం బొమ్మలు చెక్కి ఉన్నవి. ఇచ్చట తప్ప ఇలాంటి సంఘ ప్రసక్తి మరెచ్చట కనిపించదు. మేలి=నాగలి (ఆంధ్రాల సంస్కృతి - చరిత్ర -11. కంభంపాటి సత్యనారాయణ)

1090 కాజీపేట శాసనం, ఒకటవ బేతరాజు ని "సామంత విష్ఠివంశ శ్రీమాన్ కాక తిపురాధి నాధునిగా" కీర్తించినది. విష్ఠి = వెట్టి దీనిని బట్టి నేడు 'వెట్టి' చేస్తున్న దళితులే నాటి కాకతీయ వంశనికి చెందినవారు. 'వెట్టి' వారు అనగా మాల-మాదిగలే కదా! అవిషయాన్ని మనం గమనించాలి.

- గణపతి దేవుడు తన చెల్లెలు 'మాలాంబిక' ను నేతవానికి ఇచ్చి వివాహము జరిపించాడు (పూర్వకాలములో మగ్గాలపై నేతనేసిన జాతులు 'మాలలు' అందువలననే నేటికి కూడా, మాలనేత, సాలినేత అనే పదాలు వాడుకలో ఉన్నాయి.

- గణపతి దేవుని సేనాని మాలోల్ల గౌడప్ప. ఇతనిని చరిత్రకారులు మాల్యాల గౌడప్ప అని దిద్దారు. పై వివరణ స్థలాభావము వలన వివరించలేక పోతున్నారు. కాకతీయులు దళితులే, రేచర్ల గోత్రజులే, మల్ల (మాల) జాతులే అన్న విషయము గమనించాలి. గౌడలు - మాలలు ఒకే జాతి వారు ఈ విషయాన్ని గూర్చి Qustav Oppert, తన "Original in habitants of Bharatavarsha or India" అనే బుక్‌లో సవివరంగా చర్చించారు.

శాతవాహనులు బ్రహ్మణులు అని వ్రాయడం ఇలాంటిదే. శాతవాహనులది మాతృస్వామిక వ్యవస్థ. గౌతమీ, బాలశ్రీ, నాగనిక మొ॥ స్త్రీమూర్తులు

రాజ్యవ్యవహారాలలో ప్రముఖ పాత్ర వహించారు. రాజులు మాతృ సంజ్ఞలు వాడారు. మాతృస్వామిక వ్యవస్థ ఆర్యులది కాదు. వారు ఎలా బ్రాహ్మణులౌతారు ? శాతము అనగా సింహము. సింహము వాహనముగా కలవారు శాతవాహనులు. అయితే ఈ విషయాన్ని ఎచ్చట వ్రాయరు. వీరు బ్రహ్మణులని ఎలా నిర్ధారించారో ఇప్పటికీ అర్ధం కాదు. వీరు ఖచ్చితంగా దళితులే. స్థలాభావం వల్ల ఇచ్చట నిర్ధారణ కూదరదు.

చరిత్రలో క్రింది కులాలకు (దళితులు) చెందిన గొప్ప వారిని గూర్చి తెలియకుండా, భవిష్యత్తరాలకు వారి కులాలు తెలియకుండా మన చరిత్రకారులు కుట్ర పూరితముగా జాగ్రత్త వహించారు.

కొన్న ఉదాహరణలు :

1. మహాకవి కాళిదాసు మాతంగి లేదా మాలంగి స్త్రీ వద్ద దాస్యము చేసి విద్యనభ్యసించాడు. అతడు ఆమెకు (కాళి' అనే ఆమెకు - కాళి అనగా నల్లని, అనగా నల్లని స్త్రీ) దాసుడు కనుకనే కృతజ్ఞతగా ఆమె పేరుతో 'కాళిదాసు' అయినాడు. అతడే ఆవిషయాన్ని చెప్పకున్నాడు.

"మాణిక్య వీణాం ఉపలాలయంతీం

.... అనే శ్లోకంలో

మాతంగి కన్యామనసాస్మరామి" అని ముగిస్తాడు. మాతంగి కన్యను స్మరించి, నమస్కరించి అతను సాహిత్యాన్ని వ్రాశాడు. ఆవిషయాన్ని మరుగు పరచి, వేరే విధంగా కథలల్లి ప్రచారము చేశారు.

2. నాగార్జునాచార్యుడు బ్రాహ్మణుడు ఇతడు నలందా విశ్వవిద్యాలయంలో చేరి అచ్చట ప్రపంచ మేధావియైన ఆచార్య మహానాగుని వద్ద (ఇతను నాగ వంశానికి చెందిన దళితుడు) విద్యనర్జించాడు. మహానాగుని వద్ద విద్యానర్జించి, నాగార్జునడైనాడు. ఈ విషయాన్ని మరుగు పరిచారు.

3. 15 వ శతాబ్ధానికి చెందిన మేధావి, దళితకవి వేమన యోగి గత చరిత్ర తెలియకుండా చేశారు. సి.పి. బ్రౌన్ వెలికి తీసే వరకు బ్రాహ్మణ చరిత్రకారులు

నిర్లక్ష్యము చేశారు. ఎప్పుడో 11వ శతాబ్ధానికి చెందిన 'నన్నయ్య' గోత్రాలతో సహా లెక్కలు చెప్ప గలిగినవారు, 15 వ శతాబ్ధానికి చెందిన "వేమన" చరిత్ర లేదంటే అర్థం చేసుకోవాల్సిన అంశాలు చాలా ఉండి ఉంటాయి. మరియు వేమనకు బట్టలు లేవని ప్రచారము కూడ చాలా అబద్ధము. అతడు ఒక ఆచార్యుడు. ఒక ఆశ్రమ పాఠశాలను నెలకొల్పి, గ్రంథాలు పరిశీలించి,పరిశోధించి మూఢాచారాలను, కులవ్యవస్థను చీల్చి చెండాడిన మేధావి.

4. కాల జ్ఞానము చెప్పుట, బ్రాహ్మణుల గుత్తహక్కని, దానిని పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి (ఒక వడ్రంగి, కంసాలి) చెప్పాడని, అది అవమానంగా భావించి. అతనిని హత్య చేసి తరువాత జీవ సమాధి అని వక్రీకరించి చరిత్ర చెప్పారు.

5. అదే విధంగా 'కబీరు' జీవిత చరిత్ర తెలియకుండా చేయడం, సాక్ష్యాలు దొరకకుండా జాగ్రత్త పడడం ఇలాంటిదే. ఇతడు నేత కార్మిక వంశానికి చెందిన వాడని చెప్పారు. ఇది సంతోషించాల్సిన విషయం. పూర్వం నేత నేసిన వారు దళిత (మాల) కులం అని అందరూ ఎరిగిన సత్యమే. బహుశా మతం మారి ముస్లిం అయి ఉండొచ్చు. మాల వంశమునందు జన్మించిన ఇతని గొప్పతనాన్ని బ్రహ్మణులు వారి కులానికి ఆపాదించుకున్నారు. దానిలో భాగమే 'కబీరు బ్రాహ్మణ వితంతవు బిడ్డ' అని అభూతకల్పన ఒకటి ప్రచారం చేశారు.

6. జగద్గురు శంకరాచార్యులు చదువు నేర్చుకొన్నది ఒక చండాలుని వద్ద. అతడు జాగిలాల (కుక్కల) శిక్షకుడు. అతడు శంకరాచార్యుడికి తత్త్వం చెప్పాడు. దేవునికి, జీవుడికి ఉన్న బేధాలు, సారూప్యాలు, దాని మర్మాలు విడమర్చి చెప్పాడు. అప్పుడు మాత్రమే అతడు అద్వైతి అయినాడు.

7. మూడుసార్లు యుద్ధభూమి నుండి పారిపోయిన ఖడ్గ తిక్కన్న (బ్రాహ్మణుడు) ను వీరుడుగా చిత్రించడం. భారత చరిత్రలో యుద్ధభూమినుండి పారిపోయిన ఏకైక వ్యక్తి ఇతడే. ఇతనిని నీచంగా వ్రాయాలి కాని

బ్రాహ్మణుడు కనుక లేనిపోని కీర్తి ఆపాదించారు. ఇతను యుద్ధంలో ఎవ్వరినీ ఓడించలేదు.

ఖడ్గ తిక్కన్నను యుద్ధభూమి నుండి తరిమిన వీరుడు. "మాల కన్నె గర్భ సంజాతుడు పేర్నీడు" (పేరి నాయకుడు లేదా బీరి నాయకుడు అని నామాంతరంలతో మన చరిత్రకారులు పేర్కొన్నారు.) కాటమరాజు సేనాని, ఇతనిని 'పట్టా కత్తి' వీరుడు అంటారు. తన కత్తితో ఒక్క దెబ్బన ఎలాంటి చెట్టునైనా కూల్చే బలవంతుడు. ఇతనిని గూర్చి (వీరుడ్ని) చరిత్రలో వ్రాయరు. ఏదో ఒక మాట వ్రాసి దాట వేస్తారు. ఎందుచేత? అంటే సమాధానం చాలా తేలిక. అతడు దళితుడు కనుక.

ఇలా చెప్పుకుంటూపోతే అనేక ఉదాహరణలున్నాయి. రికార్డులు నాశనం చేయడం చరిత్రను వక్రీకరించడం, అభూత కల్పనలు, అబద్ధాలు ప్రచారం చేయడం, నేరాన్ని ఆమోదయోగ్యం చేయడం, హిందువులకు (ఆర్యులకు) వెన్నతో పెట్టిన విద్య. ఆ క్రమములో పల్నాటి చరిత్ర కూడ రచించడం జరిగినది. దీని మూలాలను కదిలించవలసిన అవసరం ప్రస్తుత చరిత్రకారుల కర్తవ్యము. **రాజుల మధ్య కాకుండా మంత్రుల మధ్య యుద్ధం జరగడం ఏమిటి?**

"పల్నాటి యుద్ధం" అనే పేరుతో ఆంధ్రదేశంలో పేరొందిన పల్నాటి చరిత్రను, పల్నాటి వీర చరిత్ర అని కూడా సంబోధిస్తారు. చరిత్రలో ఈ "యుద్ధం" చరిత్ర గతిని నిర్ణయించినది. ఈ చరిత్రలో 'యుద్ధమే' ముఖ్యం. **ఈ యుద్ధ వ్యూహాలు రచించిన సేనాపతి మాల కన్నమనీడు అత్యంత ముఖ్యము.**

చరిత్ర వ్రాసేటప్పుడు రాజులను గూర్చి వారి రాజకీయ - ఆర్థిక - సైనిక - మత - నైతిక - సాంఘిక - సాంస్కృతిక పరిస్థితులను గూర్చి చర్చించాలి. భారతదేశ చరిత్రలో అలానే జరిగింది.

కాని పల్నాటి చరిత్రలో మాత్రము మంత్రులు వారి చరిత్ర, వారి ప్రాముఖ్యము వివరించారు. ఆంధ్ర చరిత్రకారులు యుద్ధము మంత్రుల (బ్రహ్మనాయుడు - నాగమ్మ) మధ్య జరిగినట్లు చెప్పారు. రాజుల పేర్లు బయటకు రాకుండా చేశారు. వారి వంశాన్ని నిర్ధారించేటప్పుడు కూడా సరైన చిత్తశుద్ధిలేకుండానే

నిర్ణయించారు. మంత్రులను ఎందుకు అంత గొప్ప వారిగా వ్రాయాల్సి వచ్చింది? మంత్రుల మధ్య యుద్ధం జరగడము ఏమిటి? పల్నాటి రాజులైన నలగాముడు - మాలదేవుడు మధ్య జరగాలి. ఉదా॥ విజయనగర సామ్రాజ్య విషయం తీసుకుంటే లేదా మౌర్య సామ్రాజ్యము తీసుకున్నా, అశోకుడు కళింగ రాజుకు జరిగినట్లు వ్రాస్తారు. మంత్రుల నడుమ జరిగినట్లు వ్రాయరు. కాని పల్నాటి వీర చరిత్రలో మాత్రము బ్రహ్మనాయుడు - నాయకురాలు నాగమ్మ మధ్య జరిగినట్లు వ్రాయడము వెనుక చరిత్ర వక్రీకరణ, పక్షపాత ధోరణి కన్పడుతున్నది.

సంక్షిప్త విషయాలు :

ఎ) యుద్ధం రాజుల మధ్య జరిగినది. చరిత్ర ఆకోణంలో రచించాలి.

బి) నిర్ణయాలు తీసుకునేది రాజులు. సలహాల వరకు మాత్రమే మంత్రులుండాలి. వాటిని సేనాపతులు. అమలు పర్చాలి.

సి) పల్నాటి యుద్ధంలో - మంత్రులైన బ్రహ్మనాయుడు - నాగమ్మకు యుద్ధము జరిగినట్లు వ్రాయడము చరిత్ర వక్రీకరణ అవుతుంది. మంత్రుల మధ్య యుద్ధము జరుగదు. ఇచ్చట పద్దతి చరిత్రలోఅనుసరిస్తే, బారతదేశ చరిత్రను తిరగరాయాలి. అన్ని రాజ్యాలలో మంత్రుల మధ్య యుద్ధం జరిగినట్లు లిఖించాలి.

డి) బ్రహ్మనాయుడు రాజైన మాలదేవుని ఆజ్ఞను అమలు పరచాడు. రాజైన మాల దేవుడు, నలగాముని (చాలా బలమైన రాజు) ఎదుర్కొనుటకు కుల సంస్కరణలు, చాపకూటి సిద్ధాంతాలు అమలు జరిపాడు. వాటి కొరకు ఖజానా, సైన్యాన్ని వినియోగించాడు. మంత్రి బ్రహ్మనాయునికి అమలు జరపాల్సిన విధి ఉంది అంతే. బ్రహ్మనాయునికి అంత కీర్తి ప్రతిష్టలు ఆపాదించాల్సిన అవసరము కన్పించలేదు. సంఘ సంస్కర్త 'మాలదేవుడు' మాత్రమేనని గుర్తుంచుకొనవలెను.

ఇ) రాజుయొక్క (మాల దేవుని) ఉన్నత భావాలైన సంస్కరణలు మత సహనం బ్రహ్మనాయునకి ఆపాదించారు. ఇచ్చట చరిత్ర వక్రీకరణ జరిగినది.

పల్నాటి వారి వీరగాథలు :

వీర గాథలు 25 ఉన్నాయి. కాని జన సామాన్యము పాడుకునే వీరగాథలకు, ఈ కవులు రచించిన వీర గాథలకు ఎలాంటి సంబంధము లేదు.

25 వీర గాథలు :

1. పెద్దన్న పెళ్ళిరాయ భారము
2. బ్రహ్మన్న పుట్టుక
3. దక్షిణ యాత్ర కథ
4. పేర్నీడు యుద్ధం
5. తెప్పలనీడు యుద్ధం
6. అరణగండ్ల యుద్ధం
7. నాయకురాలు కథ
8. అనుగురాజు మరణం
9. శివనందుల కోట దోపు
10. రాజుల పెళ్ళి కథ
11. బాలుని పుట్టుక
12. కోడి పోరు
13. మండాది వలస
14. మందపోటు కథ
15. గురజాల యుద్ధం
16. అలరాచమల్లు గురజాల రాయభారము
17 కల్లు ప్రతిష్ట

18. బాలుని కథ (బాల చంద్రుడు)

19. బాలుని యుద్ధం

20. గుఱ్ఱాల చాటువ

21. అమ్మవారి పుట్టుక

22. కొమ్మరాజు యుద్ధం

23. పేర్నీడు సన్నిగళ్ళయుద్ధం

24. కన్నమనీడు చింతపల్లి యుద్ధం

25. బ్రహ్మన్నవిరుగు

ఈ పాతిక వీరగాథలు హిందూ రచయితులు, కథకులు, కవులు, ప్రచారము చేసినవి. వీటిలో చాలా స్వపక్ష భావాలు వక్రీకరణలు ఉన్నాయి. జనపదులు (పల్నాటి వారు) పాడుకనే గాథలకు సంబంధము లేనివి. ఈ 25 గాథలు.

పల్నాటి వీరులు అని ఎవరిని అంటారు ?

మాలదేవుని పక్షము వారు మాత్రమే వీరులు. పెద్దన్న,కొమ్మరాజు, కన్నమదాసు, బ్రహ్మనాయుడు అలరాజు (అలరాచమల్లు), బాల చంద్రుడు మొ॥గు వారు. అంతేగాని పల్నాటి యుద్ధంలో విజయం సాధించిన నలగాముడు కాని, అతని తరపున పోరిన నాగమ్మ, నరసింగుడు, వీర భద్రుడు మొ॥వారు వీరులు కాదా? కాదని మన చరిత్రకారుల కథనాలు. పల్నాటి వీరాధి వీరుల సంఖ్య 66 అనుటకు స్థానిక వీరగాథలను బట్టి ఎక్కువ అవకాశమున్నది. **ఈ వీరాధి వీరులకు సేనాపతి మాల కన్నమనీడు నాయకుడుగా యుద్ధాన్ని నడిపాడు.**

శ్రీనాథుడు - దళిత ద్వేషా ???

'పల్నాటి వీర చరిత్ర' ఆధునిక పేరు, జాన పదులు దీనిని 'చెన్నుడి కథ' అని ఈనాటికీ చెప్పుకుంటూ ఉంటారు. 'పల్నాటి యుద్ధం' కార్యంపూడి నందు క్రీ॥శ॥ 1180 లో జరిగినది. దీనిని రచించిన శ్రీనాథుడు క్రీ॥శ॥ 1475 సం॥లో మరణించెను. యుద్ధము జరిగిన 300 సం॥లకు సామాన్య జనం గానం చేస్తున్న

కథలకు ఉత్తేజితుడై శ్రీనాధుడు మరి ఇద్దరు మల్లయ్య, కొండయ్య కలసి రచించినారు.

ఈ చరిత్ర రచించిన శ్రీనాధుని జీవిత చరిత్రలో ఒక విచిత్ర కథ యున్నది. దానిని జాగ్రత్తగా పరిశీలించిన కొంత వరకు వాస్తవం అర్థమౌతుంది.

(కథః) చివరి దశలో 'నారి కురుపు'తో బాధపడుతున్న శ్రీనాధుడు, యౌవన దశలో తిరుగుబోతు, వేశ్యాలోలుడు కావడం వలన వృద్ధాప్యంలో అనేక వ్యాధులు సంభవించినవట. అతను పల్నాటి భూములలో తిరుగుతూ చంద్రవంకలో స్నానమాడి చెన్నకేశవస్వామిని దర్శించగా కొన్ని వ్యాధులు తగ్గినట్లు, అదే రాత్రి స్వామి కలలో కనిపించి పల్నాటి వీరుల చరిత్ర వ్రాయమన్నట్లు, అది వ్రాసిన తరువాత మిగిలిన వ్యాధి తగ్గినట్లు, మరల శ్రీనాధుని మనస్సు చలించి వెనుకటి వలె తిరిగినట్లు, మరలా చెన్నకేశవ స్వామికి కోపం వచ్చి రోజూ పగలే ప్రత్యక్షమయ్యే ఆ స్వామి ఆరాత్రి కలలో కనిపించి, నీవు నీచుడవు, భ్రష్టుడవు, పతితుడవు,"నీ గ్రంథము నాకు అంకితమివ్వవద్దు" అని చెప్పి **"అది మాల మాదిగల పాలగుగాక**'అని శపించెను.

శ్రీనాధుడు బాధ భరించలేక దుఃఖాన్ని ఆపుకోలేక భగవంతుడు స్వీకరించని గ్రంథం ఎందుకని, ఆ తాళ పత్ర గ్రంథాన్ని చింపి, చిందర వందరగా విసరి వేయగా మాల మాదిగలు ఎవరికి దొరికినవి వారు తీసుకున్నారు" ఇది సంక్షిప్తముగా కథ.

పై కథ చదివినప్పుడు కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి.

(ఎ) శ్రీనాధుడు అనేక గ్రంథాలు రచించాడు. కాని అతను రచించి చింపి వేసిన గ్రంథము ఇదొక్కటి మాత్రమే !

(బి) "మాల మాదిగల పాలగుగాక" అని చెన్న కేశవుడు శపించడం, చిరిగిన గ్రంథాన్ని మాల మాదిగలు ఏరుకొనడం, మొ॥న ప్రశ్నలు ఉద్భవిస్తాయి.

మాల మాదిగలు చించిన గ్రంథం ఎందుకు తీసుకున్నారు? వారు గ్రంథ పఠనం చేస్తారా? ఎందుకు వారికి ఈ గ్రంథం పై ఇంత ప్రేమ, ఇంత ఆసక్తి?

భారతదేశ చరిత్రలో వారు ఏ గ్రంథాన్ని కూడా ఇంత భద్రంగా దాచుకున్న దాఖలాలు లేవు.

(సి) శ్రీనాథుడు చించడం వెనుక అతని దురాలోచన ఏమిటి? ఈ కథ రచించిన తరువాత అతనికి ఇది మాలమాదిగల చరిత్ర (కథ) అని తెలిసినదా? అందువలన చించివేసి ఉంటాడా?

శ్రీనాథుడు మాల ద్వేషి, అతను అనేక పర్యాయములు ఆ కులాన్ని ద్వేషించి చెప్పిన పద్యాలు కలవు. ఉదాహరణకు ఒక చాటువులో

గీ॥ ఓయి దృతరాష్ట్ర నీ కొడుకుత్త గోల
కొండ విధ **'మాలముండ'** గృష్ణుండు కాచి
పాండుసుతుల గెల్పించు నండయగుచు
నుదరమున బూలదండ రే కొత్తకుండ"

అని చెప్పియున్నాడు. కనుక అతను ఈ పుస్తకాన్ని ఉద్దేశ్య పూర్వకంగా చించి ఉంటాడు అనుటలో ఆశ్చర్యము లేదు. (మాలముండ' అని ముఖాన తిట్టిన కవి తెలుగు భాషనందు ఎవ్వరూలేరు. ఇతని ద్వేషానికి ఇంతకంటే సాక్ష్యము అవసరమా?)

(డి) మాల మాదిగల కథను శ్రీనాథుడు వక్రీకరించి వ్రాయడము వలన, వారికి ఆ విషయము తెలిసి బలవంతంగా లాగి వేసుకున్నప్పుడు చిరిగిందా? ఆ విధంగా గ్రంథం పాడైపోయిందా? నిమ్న జాతుల ఆధీనంలో ఈ గ్రంథం మాత్రమే ఎందుకు ఉంది? ఈ చరిత్రలో వీరులు దళితులేనా? అందువలననే వారికి ఎక్కువ మక్కువ ఆసక్తి ఉన్నదా? మొదలగు విషయాలను పరిశీలిద్దాం.

పల్నాటి వారు అంటే మాలవారేనా?

పిచ్చి గుంటల వారు, పంబల వారు ఈ కథను గానం చేసెడివారు అని చెప్పడం చరిత్ర తెలియక పోవడమే అవుతుంది. వీర విద్యావంతులు అనెడి 'మాలలు' ఈ కథను ప్రచారం చేసెడివారు అని "కాటమరాజు కథలు" (మొదటి సంపుటి) లో చరిత్రకారులు నిర్ధారించినారు. వీర విద్యావంతులనగా విద్యావంతులైన

వీరులై యుంటారు. వీరినే 'పల్నాటి వారు' అని సంభోదిస్తారు. దీనిని బట్టి 'పల్నాటివారు' అనగా 'వీరవిద్యావంతులైన మాలలు' అని తెలియుచున్నది. వీరు కథను ప్రచారము చేయుటకు, పంబజోడు, తిత్తి, కత్తి, డాలు ఉపయోగించెడివారు. (ఉపయోగిస్తున్నారు.)

విద్యావంతులకు నేటికీ (మాలలకు) కారెంపూడి (కార్యంపూడి) యుద్ధక్షేత్రంలో 'గురుపీఠము' కలదు. దీనిన బట్టి వీరి ప్రాముఖ్యత తెలియుచున్నది. ఏ ఇతర కులానికి ఇచ్చట 'గురుపీఠము' లేదు. అన్న విషయాన్ని గమనించాలి.

వీరపూజలో ఉంచిన యుద్ధ ఖడ్గాలు ఎక్కువగా దళితులవేనా?

పల్నాటి వీరుల స్మరణగా ఇప్పటికి కూడా ప్రతీ సంవత్సరము కార్తీక మాసము బహుళ అమావాస్యరోజున (నవంబరు నెల చివర 20 నుండి 25 ప్రాంతములో) పల్నాటి యుద్ధము జరిగిన కారెంపూడి నందు వీరపూజ జరుగును. దీనిని 'వీరుల తిరుణాల' అని కూడా అందురు.

ఆరోజునయుద్ధంలో వీరులు వాడిన ఖడ్గాలు కడిగి, పసుపు వ్రాసి, కుంకుమ బొట్లు పెట్టి వాటిని ప్రదర్శనకు పెడ్తారు. అందు ముఖ్యమైనవి సేనాని మాల కన్నమనీడు ఉపయోగించిన **వీర భైరవఖడ్గం'** మరియు డాలు, బ్రహ్మనాయుని నృసింహకుంతం ముఖ్యమైనవి. అలరాజు (అలరాచమాల) వాడిన సూర్య భేతాళ ఖడ్గము లేదు. ఇవి కాక అనేక భయంకర ఖడ్గాలు ఉన్నాయి.

అదే రోజులలో నేనొక విచిత్ర విషయము గమనించాను. గురజాల, దాచేపల్లి, మాచెర్ల, కారెంపూడి మొ॥న చుట్టు ప్రక్కల గ్రామాలలో ప్రజలు వీరపూజ మొదటదినం ఉదయాన లేచి కొన్ని ఇల్లల్లో కత్తులు కడిగి, పసుపుపూసి, కుంకుమ బొట్లు పెట్టి కొత్త బట్టలో చుట్టి దాచుకుంటారు. వాటిని ఈనాటికీ తమ వారసత్వంగా దాచుకుంటారు. ఇలా దాచుకున్న వారు సుమారు ఆ గ్రామాలలో 500 ఇళ్ళు ఉన్నాయి. ఇంకా తెలియకుండా ఉండవచ్చును. ఈ కత్తులు కడిగిన ఇళ్ళు మొత్తము మాలవారివే అన్న విషయము మనల్ని ఆశ్చర్యములో ముంచెత్తుతుంది. ఇంకా కొన్ని క్రింద కులాల వారి దగ్గర కూడా కొన్ని కత్తులు ఉండటం గమనించాను.

దీనిని బట్టి పల్నాటి యుద్ధంలో యోధులు ఎక్కువ మంది మాల మాదిగలే

అనే విషయము అర్ధమౌతుంది. దళితులే నాటి యుద్ధ వీరులు అనేది స్పష్టం. అందు సేనాపతులు కూడా దళితులే అన్న విషయాన్ని గమనించాలి.

పల్నాటి వారు ద్రావిడులా? వీరిది నాగ వంశమా?

పల్నాటి చరిత్రలో పేర్లు పరిశీలించినా, వారు పూజించిన దేవుళ్ళను పరిశీలించినా, ఆ రాజులు తెలుగువారే అని అర్ధమౌతుంది. ఉదా : అలుగురాజు, అలరాచమల్లు, బీర్నీడు, పేర్నీడు, కన్నమనీడు, పేరమ్మ, సీరమా, మాలదేవుడు, బిరుదురాజు మొదలగునవి తెలుగు పేర్లే. వారి ఇలవేల్పు. కనకాద్రి చెన్నకేశవుడు తెలుగు ఇలవేల్పే. మరియు వారు స్త్రీ శక్తులైన పోలేరమ్మ, రూపులమ్మ, చౌడమ్మ, ఆంకాళమ్మ, మహాలక్ష్మమ్మ, దుగ్గదేవమ్మ, కనకదుర్గమ్మ, పెద్ద ముత్యాలమ్మ, ఎల్లమ్మదేవర మొ॥ దేవతలను పూజించెడి వారు. స్త్రీ శక్తిని ఆరాధించే ఆచారము ద్రావిడులదే కాని, ఆర్యులది కాదు. ఈ విషయాన్ని బట్టి వీరు ద్రావిడులని (దళితులని) తెలియుచున్నది.

వేరొక కోణమునుండి పరిశీలించిన పల్నాటిని పరిపాలించిన వీరులు 'నాగవంశము' అని తెలియుచున్నది. చరిత్రలో నాగవంశము అనగా దళితులే అనే విషయాన్ని భారత చరిత్రకారులే ముక్త కంఠంతో ఒప్పుకున్న సత్యము.

నాయకురాలు నాగమ్మ నాగవంశానికి చెందిన అతిశక్తివంతమైన స్త్రీ అయి ఉంటుంది. అందువలననే ఈమె వంశావళి ఆధారాలు లేకుండా హిందువులు కథలల్లారు. పైగా ఆర్యులకు వ్యతిరేకము కనుక ఈమెపై అనేక అపవాదులు వేసినారు. క్రూరంగా చిత్రీకరించినట్లు కన్పడుతున్నది. ఈమె ఖచ్చితంగా దళిత స్త్రీ అయి ఉంటుంది. ఈమెపై ఒక కథ ప్రచారములో ఉన్నది. ఈమె పుట్ట వద్ద (నాగులపుట్ట, నాగవంశ ప్రతీక అనుకోవచ్చు). చిన్నపిల్లగా ఏడుస్తుంటే ఒక రెడ్డి పెంచినట్లు కథనం. ఇది ఎంత వరకునిజమో తెలియదు. కనీస ఆధారాలు కూడా లేవు. నాగమ్మ మాతృస్వామ్య వ్యవస్థ యొక్క అంతిమ దశకు గుర్తుగా రాజ్యంలో భాగంగా యుండి ఉంటుంది.

పల్నాటి యుద్ధంలో నాగవంశము నాశనమయినది. దాయాదులైన దళితుల మధ్య యుద్ధము జరిగినది. ఇది రాజ్యం కొఱకు జరిగిన పోరు మాత్రమే.

నాగులేరులో నాగ వంశము యొక్క రక్తము ప్రవహించి, ఆ నదికి ఆ పేరు వచ్చినట్లు తెలియు చున్నది.

శ్రీ నాధుడు చెప్పిన వాక్యాన్ని గమనిస్తే అది మనకు అర్థమౌతుంది.

"నాగాధిపతి నాశంబు చేసి, నడుమగా బారినాగులేరాయె" దీనిని బట్టి నాగ వంశాధిపతులు నాగవంశాలు నాశనమయ్యి వారి రక్తము నాగులేరు నందు ప్రవహించినట్లు అర్థమౌతుంది.

అప్పకవి నాగులేటిని నాగానది అని పేర్కొన్నాడు. అక్కిరాజు ఉమాకాంత గారు నాగులనే ఒక జాతివారీ ప్రాంతమున నుండిరని పూర్వ చరిత్రవలన తెలియుచున్నది. నాగయ్య, నాగమ్మ అను పేరులు గూడ స్త్రీ పురుషులకిచ్చట ఎక్కువగా పెట్టబడుచున్నవి" అన్నారు. వీరి మాటలను బట్టి నాగజాతి ఇచ్చట నివసించినట్లు అర్థమౌతుంది. వీరే ఇంకొక మాట నాగులేటిని గూర్చి అన్నారు బహుశః నాగ జాతివారికి ప్రియమైనది కనుక దీనికి నాగులే రని పేరు వచ్చినదేమో ' దీనిని బట్టి చూస్తే నాగజాతి యొక్క ప్రాముఖ్యత, మరియు ఇచ్చట అనేక 'నాగ శాసనాలు' లభ్యమైనవి. శాసనములో నాగులు చెక్కబడి యున్నవి. (ఈ విషయమై ఈ పుస్తకములో శిలా శాసనము ఒకటి పొందుపర్చాను. గమనించగలరు) పైన పేర్కొన్న ఆధారాలను బట్టి, ఇచ్చట పాలక జాతులు ద్రావిడులని, వారిది నాగవంశమని, తెలియు చున్నది. పూర్వము నాగ వంశమే నేడు దళితులు అనేది నిర్వివాదాంశము.

నాగ వంశము నివసించినది పల్నాడు ప్రాంతమా?

చరిత్రలో ప్రాచీన నాగ వంశము, కాలక్రమములో బౌద్ధమతాన్ని స్వీకరించారు. భారత దేశములో నాగులు ఆదివాసీలు, బౌద్ధ జాతక కథల వల్ల, బుద్ధ ధాతువులతో నాగరాజును ముడిపెట్టే కథల వల్ల, అమరావతీ స్థూపము నందు గల నాగరాజు చిత్రాల వల్ల నాగులు బౌద్ధ మతాన్ని స్వీకరించారు అని చెప్పవచ్చు. అమరావతి స్థూపము నందు ఒక శాసనము పై 'చర్మకారుడు' తన మొక్కు తీర్చుకుని 'పూర్ణ కళశాన్ని' (చెంబు, దానిలో తమలపాకుల మద్య కొబ్బరికాయ నిలిపిన రూపం) చెక్కించినట్లు ఉన్నది. కనుక దళితులే అమరావతీ స్థూప

నిర్మాతలై యుంటారు. వారే నాగులు అన్న విషయంలో సందేహము లేదు. నాగలి - నాగరం (స్త్రీలు జడలో అలంకరించుకునే నగ) నగలు - నగరం మొ॥న పదాలు, ఈ నాగ వంశము నుండి ఆద్భవించినట్లు తోస్తున్నవి. నాగులు తయారు చేసినారు కనుక 'నాగలి' అయి ఉంటుంది. వారు నివసించిన ప్రాంతన్ని 'నగరం' అని సంబోధించి ఉంటారు. మొదట వ్యవసాయం చేసినది - నగరాలు నిర్మించినది. సింధులోయలో ఈ నాగ వంశాలే, వారే నేటి దళితులు. (మాల-మాదిగలు)

ఇద్దరు మనుష్యులు బుద్ధుని అస్థికలు పట్టుకొని పడవపై నుండి దిగుతున్నప్పుడు నాగరాజు స్వాగతమిస్తున్నట్లు ఒక చిత్రం అమరావతీ స్థూపంలో వుంది. బ్రాహ్మ లిపి నగరానికి - సింహళ ద్వీపానికి మధ్య ఉన్న వజ్రాల దిన్నె (ధాన్య కటకం - అమరావతి) భౌద్ధ కథలు, బుద్ధుని అస్థికలకు ముడి పెడుతున్నాయి. బౌద్ధమతాన్ని స్వీకరించడానికి పూర్వమే ఇచట 'నాగులు' అనే ఆదిమ జాతులు నివసించారని చెప్పవచ్చు.

అంటే పల్లవ రాజ్యం, పల్లవ బొగ్గ (పల్నాడు) నాగుల ప్రాచీన నివాసం అని తెలియుచున్నది.

'టాలమి' 'బస్సరా నాగుల్ని' గూర్చి పేర్కొన్నట్లు రామకృష్ణాచార్య గారు (ప్రాచీన దక్షిణ భారత చరిత్ర) వివరించారు.

"పల్లవులు నాగకన్యను వివాహమాడి, నాగమండలాన రాజ్యాన్ని స్థాపించారు. వేలూరు పాలయం తామ్రశాసనం (9వ శతాబ్ధి) వీర కుర్మడు (వీర కామేంద్రుడు కావొచ్చు ఇతడు అనుగు రాజు తండ్రి అయి వుంటాడు). నాగ కన్యను వివాహమాడి రాజ్యాన్ని సంపాదించినట్లు చెబుతుంది. ప్రాచీన పల్లవుల చరిత్ర గుంటూరు, నెల్లూరు, బళ్ళారి, మండలాల్లోను, మైదవోలు, కందుకూరు, హీరహడగళ్ళి తామ్ర శాసనాల వల్ల లభిస్తుంది" (ప్రాచీన దక్షిణ భారతదేశ చరిత్ర)

సింహ విష్ణుని ప్రాచీన శాసనాలు గుంటూరు మండలంలో ఉన్నాయి. క్రీ.శ. 6వ శతాబ్ధి వరకు పల్లవ రాజ్యంలో అధిక భాగము కృష్ణానదికి దక్షిణాన ఉన్న తెలుగు దేశమే. అదే పల్లవనాడు తర్వాత పల్లవ రాజులు దానిని క్రమముగా విస్తరింప జేసారు. అదే నేటి పల్నాటి రాజ్యము. పల్నాటి పాలకులు ప్రాచీన

నాగ వంశమని తెలియుచున్నది. వీరు అనేక విధాలుగా పరిణామం చెందారు.

శైవ - వైష్ణవ మత వైరుధ్యాలు యుద్ధానికి కారణమా ?

పల్నాటి యుద్ధం వీరశైవ - వైష్ణవ మత వైరుధ్యాలుగా కొందరు చరిత్ర కారులు చెప్పుచున్నారు. రాజులైన నలగాముడు, మల దేవుడు వీరశైవానికి సంబంధించిన వారు. వారి యొద్ద పనిచేయుచున్న (మంత్రిత్వము) నాగమ్మ - బ్రహ్మనాయుడు శైవ - వైష్ణవులని, వారి వల్లనే యుద్ధం జరిగినదని చెప్పట అబద్ధం. ముదిగొండ వీరభద్ర కవి ఒక అడుగు ముందుకేసి బ్రహ్మనాయుడు సాక్షాత్ విష్ణు స్వరూపమని పొగిడి, అకాశానికి ఎత్తారు. శ్రీ నాథుడు కూడ అంతే. వీరంతా బ్రాహ్మణ కవులు. వీరు వైష్ణవులు కనుక అపజయం పాలై అప్రతిష్ఠపాలై గుత్తికొండ బిలంలో దాగి మరణించిన బ్రహ్మనాయుడ్ని వైష్ణవుడని, అతనే జయించినట్లు రచించడం ఖచ్చితంగాపక్షపాతమే అవుతుంది. నలగాముడు, నాగమ్మ శైవ మతమనుటలో వివాదము లేదు.

కాని మాల దేవుడు, బ్రహ్మనాయుడు ఖచ్చితంగా వైష్ణవులు కారు అనేటందుకు అనేక ఆధారాలు చరిత్రలో ఉన్నాయి.

బ్రహ్మనాయుడు "శివుని బంగారు పూవులతో పూజించు అగ్రశ్రేణి శివభక్తుడు.' ' (కాటమ రాజు కథలు మొదటి సంపుటి) మరియు యుద్ధం కొరకు త్రిపురాంతకంలో విడిది చేసినపుడు బ్రహ్మనాయుడు" నంది వాహనా, నాగ భూషణా, పాలాక్షా, పరమ శివ" అని స్తోత్రము చేస్తాడు. దీనిని బట్టి బ్రహ్మనాయుడు శైవ మతాన్ని స్వీకరించాడు. రాజు శైవుడు కనుక ఒకవేళ బ్రహ్మనాయుడికి తప్పనిసరై ఉంటుంది.

మరియు మాల దేవుని పక్షంలో ప్రముఖుడైన అలరాజు (అలరాచమాల) రాయబార కథలో ఈ క్రింది పంక్తులున్నాయి.

1. "విరజాజి మల్లెలు విభూతి పత్రి
   లింగని కీరితి బూజలు చేసి"

2. "లింగ పూజలు చేసి నిజముగా దాను
   విభూతి రేఖలు తిన్నగా దీర్చి"

3. "పేలుమని జంగాల బిలిపించె రాజు
వచ్చిరి అప్పుడు పున్యజంగాలు
పసిడి పాత్రల వారు పదులఋవదులు
పెడ మటము జంగాలు పెద్దల బిలిపించిరి"

పై విషయాలను బట్టి అలరాజు శైవుడని తెలియుచున్నది. నలరాజు తాత శివ శింగునిపై యుద్ధానికి వెడలునప్పుడు ఈ పంక్తులున్నాయి.

"వారి పేరులు కొన్ని వరుస జెప్పెదను
మేడయ్య పడమటి, మేటి బసవయ్య
బోడ శివయ్య, బొబ్బోడి బుగ్గయ్య
కఱకంఠ లింగయ్య కళ్యాణి బసువ
అక్కయ్య, కుక్కయ్య, ఆది మల్లయ్య
నిజ లింగ చిక్కాయన, నీల కంఠయ్య
ఉరమున లింగాలు మెరిసెడి వారు
గరళములు, రుద్రాక్ష గలిగిన వారు.

మొదలైన వారంతా కలసి యుద్ధానికి తరలినట్లున్నది. (బాలచంద్రుని యుద్ధం 7వ పుట నందు ఉన్నది.)

"అందెల బసవన్న ఆది నాధుండ

కరి నంది బసవన్న కంచి వరదుండ" అని యున్నది.

పై విషయాలను పరిశీలించినచో బ్రహ్మనాయుడు, అలరాజు, బాల చంద్రుడు శైవ భక్తులని అర్ధమగు చున్నది. మరియు మాలదేవుని తరపున ఉన్న వీరులంతా జంగాలు వారు. వీర శైవులని తెలియు చున్నది. ఎచట కూడ వైష్ణవులు అన్న విషయం కనిపించదు.

మరియు పల్నాటి యుద్ధము క్రీ॥శ. 1180 సం॥లో జరిగినట్లు చరిత్రకారులు నిర్ణయించారు.

వైష్ణవ మత స్థాపకుడైన రామానుజుడు క్రీ॥శ. 1017 సం॥నందు జన్మించెను. ఈతను 1067 ప్రాంతములో ఈ మతమున గూర్చి ప్రచారం చేసియున్నాడు.

శైవ మత స్థాపకుడైన బసవడు 'బిజ్జలుని' సమకాలికుడు, బిజ్జలుని యొద్ద దండ నాయకునిగా ఉన్న వాని కుమార్తెను బసవడు పెండ్లాడెను. పశ్చిమ చాళుక్య రాజులతో ఒకడైన రెండవ తైలుని వద్ద ఈ బిజ్జలుడు 1163 సం॥నందు దండ నాయకునిగా ఉండి, తరువాత తిరుగుబాటు చేసి రాజ్యాన్ని ఆక్రమించెను. తరువాత బిజ్జలునికి, బసవుడికి కలహములో బిజ్జలుడు ప్రాణాలు కోల్పోయెను. బసవడు తర్వాత హత్య గావించబడెను. శివ లింగము నందు ఐక్యము చెందినట్లు ప్రకటించినారు.

కనుక రామానుజుడు - బసవడు 11 వ శతాబ్దము మధ్యలో జీవించినారు. మతాలు స్థాపించినారు. అప్పటికి శైవ - వైష్ణవ మతాల వైరుధ్యాలు మొగ్గ దశలోనే ఉన్నాయనుట నిర్వివాదాంశము. అటువంటప్పుడు శైవ - వైష్ణవ మతాల మధ్య వైరుధ్యాలే పల్నాటి యుద్ధానికి కారణమని చెప్పుటకు హేతువులు కనిపించుట లేదు.

బ్రహ్మనాయుడు

పల్నాటి వీరగాథలలో ఎక్కువ భాగము బ్రహ్మనాయుని యెడల పక్షపాతముతో రచింపబడినట్టివే. అయితే చరిత్రకారుడు Sewell (సీవెల్) పండితుడు ఈ విధంగా అన్నారు. "అలుగు రాజును తన తండ్రి దొడ్డ నాయుని సంహరించి, బ్రహ్మనాయుడు నలగాముని సింహాసన మెక్కించెను." **దీనిని బట్టి తండ్రిని హతమార్చిన తనయుడు బ్రహ్మనాయుడు అని తెలియు చున్నది.**

"రచించిన వీరగాథలను బట్టి మాల దేవుడే యుద్ధంలో (బ్రహ్మనాయుడు) జయించినట్లు ఉంది. కాని, స్థానిక గాథలను బట్టి నలగాముడే విజయం సాధించినట్లు తెలియుచున్నది." (కాటమ రాజు కథలు మొదటి సంపుటి)

"అలరాజు మరణమునకు బ్రహ్మనాయుడే కారణం, తన కంటే, తన అన్న పెద్దన్న బాదరాజు కంటె, మహా బలశాలి అయిన అలరాజును (అలారాచ మాలను) ఏ విధముగ్గానైన మట్టు పెట్టవలయునని గురజాల రాయబారమునకు పంపెను.' ' (కాటమ రాజు కథలు మొదటి సంపుటి) ఆలోచించి ఆవిధంగా ఆచరించాడు. పల్నాటి యుద్ధంలో బ్రహ్మనాయుడు రణభూమిలో వీరుల విజయము కొరకు

శివలింగాన్ని ప్రతిష్టించి, యుద్ధం జరిగిన అన్ని రోజులూ శివ లింగానికి పూజలు జరిపాడు. ఈ విషయం చరిత్ర చదివిన అందరికి తెలిసిన చిన్న విషయం. ఇతను వైష్ణవుడని చెప్పడం పచ్చి అబద్ధం. మరియు నీతి, నియమాలు చాలా తక్కువగా కలిగిన వ్యక్తిగా తోస్తున్నాడు. పైగా ఇతనిలో పెద్ద వీరత్వము కూడ కనిపించదు. ఇతను భోజనము చేయునపుడు మొదటి యుద్ధ సేనాపతిమాల కన్నమనీడుకి పెట్టెడివాడు. తనపై విష ప్రయోగం జరుగునని భయం. ముద్ద పెట్టడానికి కన్నమునిపై అమితమైన ప్రేమ కారణమని బొంకెడివాడు. యుద్ధం చివరిలో పారిపోయి గుత్తికొండ బిలంలో దాగి చాలా నీచమైన మరణాన్ని పొందిన పిరికివాడు.

బాలచంద్రునికి గుర్రపు స్వారీ తెలియదా?

ఇతనిని బ్రహ్మనాయుని కొడుకుగా చరిత్రకారులు చలామణి చేసినారు. "బాల చంద్రుడు బ్రహ్మనాయుని కుమారుడు అనుటకు ఆధారాలు లేవు. ఇతడు యాదవ చెంచమ్మ కొడుకై ఉండవచ్చు" (కాటమరాజు కథలు).

అసలు బాల చంద్రుడు బ్రహ్మనాయుని వద్ద పెరగలేదు. ఇతడు రహస్యముగా పెరిగినాడని చరిత్రకారులు వ్రాసినారు. ఇతడు రహస్యంగా పేర్నీడు మరియు అతని భార్య గేరాంబ వద్ద పెరిగినట్లు చరిత్రకారుల కథనం. ఇతడు రహస్యంగా పెరగాల్సిన అవసరం చరిత్రలో కనబడదు. కనుక అసలు బ్రహ్మనాయునికి సంతానం లేదని భావించాల్సి యుంటుంది. ఇతనిని దత్తత తీసుకొని ఉండవచ్చు.

ఇతడు ఒక వేశ్యాలోలుడు సబ్బాయి (బహుశ సుబ్బులు) అనే వేశ్యతో ఉండేవాడు. ఈమెను భార్యలా ఉంచుకున్నాడు (ఈమె పేరున 'శ్యామాంగి' అని దిద్దినట్లు అక్కిరాజు ఉమాకాంతం గారు ఒప్పుకున్నారు.) ఇతడు జాలాయి అని తెలియు చున్నది. ఇతడు యుద్ధ విద్యలు గాని, కత్తిసాము గాని, వ్యూహాలు గాని నేర్చుకున్న దాఖలాలు లేవు. రోడ్ల వెంట తిరగడం లేదా వేశ్యల వెంట తిరగడం.

మరియు ఒక విచిత్రమైన విషయం మన చరిత్రకారులు వ్రాయడం హాస్యము కలుగుతుంది. ఇతడు గొట్టె పొట్టేలును ఎక్కితిరిగెడి వాడట. అదే గొట్టె పొట్టేలును

యుద్ధానికి వాడెడి వాడట. దాని గిట్టల గుర్తులు కూడ కొండల పై ముద్రించ బడినవట. భారతదేశ చరిత్రలో ఏ వీరుడు కూడ గొఱ్ఱెను యుద్ధానికి వాడిన దాఖలాలు లేవు. పైగా గొఱ్ఱె యుద్ధ వాహనంగా పనికిరాదన్న విషయం చెప్పుటకు పెద్ద జ్ఞానము అవసరం లేదు.

బహుశ ఇతనికి గుర్రపు స్వారీ కూడ వచ్చి ఉండదు. ఇలాంటి వాడ్ని వీరుడిగా చిత్రించడం కూడ హాస్యాస్పదమే అవుతుంది.

బాల చంద్రునికి చట్టబద్ధంగా ఒక వివాహం జరిపించారు. భార్యపేరు 'మాంచాల' పెళ్ళి జరిగిన తర్వాత ఇతనికి ఇంతకు ముందే వివాహ విషయం (సుబ్బాయితో జరిగిన విషయం) తెలిసి ఇతనికి పిల్లనిచ్చిన మామ గండు కన్నమనీడు 'మాంచాల'ను కాపురానికి పంపలేదు. బ్రహ్మనాయుడు మధ్యవర్తిత్వము నెరపినప్పటికి ఫలితం లేకపోయింది.

ఇతనిని పట్టణంలో స్త్రీలంతా అసహ్యించు కొనెడివారంటే (వైశ్యస్త్రీ అయిన అన్నమ్మ తిట్టడం ఒక ఉదాహరణ మాత్రమే) ఇతడు ఎంత పనికిమాలిన వాడో అర్థం చేసుకొనడం కష్టం కాదు. ఇతనికి గర్వము ఎక్కువగా కనిపించును. తల్లిదండ్రుల మాట లెక్కలేదు. పెళ్ళి రోజు, పెళ్ళయిన మొదటి రోజు ఈ రెండు రాత్రులు వేశ్య సబ్బాయితో ఉన్నాడంటే ఇతని శీలం అర్థం చేసుకోవచ్చు

ఇంకొక విచిత్రమైన విషయం ఉన్నది. బాలచంద్రుని ముఖ్య శత్రువు నరసింగుడు, నరసింగుని హతమార్చుతానని ఇతడు ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ నరసింగుడు నలగాముని సేనాపతి మరియు తమ్ముడు, ఇతనిని నరసింగరాజు అని కూడ అంటారు. శత్రువుని గూర్చి ఎవరైనా సరే విపులంగా తెలుసుకుంటారు కదా?

కాని బాలచంద్రుడు యుద్ధ భూమిలో తెగిపడిన ఒక శిరస్సు తీసుకొని, బ్రహ్మనాయుని వద్దకు వచ్చి, నరసింగుని సంహరించానని తెలుపుతాడు. ఆ శిరస్సు చూచిన బ్రహ్మనాయుడు ఇది నరసింగునది కాదని చెబుతాడు. అతడు మరలా యుద్ధ భూమికి వెళతాడు. దీనిని బట్టి అసలు నరసింగుడు ఎవరో ఇతనికి తెలియదని మనం అనుకోవాలి. ఇతడు నలగాముడ్ని గాని, నరసింగుడ్ని (సేనాపతి కదా అందరికి తెలిసి ఉంటాడు) గాని, నాగమ్మను గాని యుద్ధానికి

ముందు చూచి ఎరుగడు. ఇది ఇతని పరిజ్ఞానం, మరియు ప్రతిజ్ఞలు. ఇతన్ని యుద్ధ వీరునిలా చిత్రించడం చరిత్ర వక్రీకరణ అవుతుంది. ఇతడు ఒక్కడ్ని కూడ హతమర్చిన దాఖలాలు లేవు. చివరికి యుద్ధ భూమిలో (యుద్ధం చేయడం తెలియదు కదా) పరారౌతున్న ఇతన్నివెంటాడి చంపి యుండవచ్చు. లేదా దాగిన ఇతన్ని హతమార్చి యుండవచ్చు. ఇతనికి ఇంత ప్రాముఖ్యత ఎందుకిచ్చారో మన చరిత్రకారులే సమాధానం చెప్పాల్సి యుంటుంది.

పల్నాడు పద వ్యుత్పత్తి - ప్రాచీనత

'పల్నాటి చరిత్ర' వారి రాజ వంశాలు, లోతుగా తెలుసు కొనవలయునంటె 'పల్నాడు' (Palnadu) అనే పదాన్ని అన్ని కోణాల నుండి పరిశీలించాల్సి యుంటుంది.

I. కుందూరి ఈశ్వర దత్తుగారు

ఈ 'పల్నాటి' నామమును గూర్చి విపులంగా చర్చించిరి. మరియు అక్కిరాజు ఉమాకాంతం గారు, చిలుకూరి వీరభద్రరావు గారు కూడ ఈ పద ఉత్పత్తిని పరిశీలించిరి.

కుందూరి ఈశ్వదత్తుగారు పల్నాడు అనే పదాలు, వాటి పర్యాయ పదాలకు అనేక శాసనములు మరియు సాహిత్య ఆధారములు చూపించినారు. సాహిత్యము, శాసనాలలో ఈ పదము అనేక రూపములలో ఉన్నది.

1. పూర్వ చాళుక్య ప్రభువు రెండవ విష్ణువర్ధనుని కోనెకి శాసనము నందు : 'పల్లిరాష్ట్ర' అని యున్నది (క్రీ.శ. 669)
2. చాగి బేతరాజు మాచర్ల శాసనము నందు "పల్లిదేశ" అనే పదము ఉన్నది (శా.శ. 1033)
3. భృగుబండ శాసనము నందు 'పల్లినాడు' అని యున్నది. (శా.శ. 1040)

4. కులోత్తుంగ గోంకరాజు కొదమగుండ శాసనము నందు 'పల్లినాడు' అనే పదమున్నది. (శా.శ.1069)

5. ద్రోణాదుల శాసనంలో 'పల్లినాడు' అని యున్నది. (శా.శ.1173)

6. త్రిపురాంతక శాసనము (శా.శ.1181) మరియు కాకతి రుద్రమదేవి దుర్గి శాసనములలో (శా.శ.1191) 'పల్లినాండు' అనే పదము ఉన్నదనే ఆధారాలు చూపించినారు.

తెలుగు సాహిత్యంలో కన్పించే పదాలు పల్నాడు - పలనాడు- పలినాడు - పల్లెనాడు చూపించి, ఈ 'పల్నాడు' అనే పదము 'పల్లి' - 'నాడు' అనే రెండు శబ్దాల కలయిక వలన ఏర్పడినదని తేల్చినారు. 'పల్లి' అనగా బౌద్ధులు, జైనులు నివసించే స్థలమని ఈ ప్రాంతంలో సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు నాగార్జుని సంఘారామానికి నిలయమై బౌద్ధ మత వ్యాప్తికి స్థానమై, బౌద్ధ నివాసాలకు ఆటపట్టయినందున ఇది 'పల్లె నాడై' ఆ తర్వాత 'పల్నాడు' యిందని తన వాదాన్ని చెప్పారు ('పల్లి' అనగా బౌద్ధుల నివాస స్థలమని, పల్లి వారి భాష 'పాలి' అని దానిలోనే బౌద్ధ మత వ్యాప్తి జరిగిన విషయం ముందు ముందు నేను విపులంగా చర్చించాను.)

కుందూరి వారు 'నాడు' శబ్ధాన్ని వివరించారు. ఆంధ్ర దేశంలో బహుళ వ్యాప్తి గాంచిన దేశకం 'నాడు'. ఇది

1. మండలాన అంతర్భాగమనీ

2. సామ్రాజ్యకాలాన రాజ్యంలో అంతర్భాగమనీ

3. కొట్టములోను, 'వలనాడు'లోను అంతర్భాగమని సాక్ష్యాధారాలు చూపించారు.

2. నందూరి రామకృష్ణాచార్య (ప్రాచీన దక్షిణ భారత చరిత్ర) :

వీరు సేకరించిన విషయాలను బట్టి 'పల్లవ బొగ్గ' 'పల్లవ భాగ' - పల్లవ భోగం' అనే పదాలు కన్పిస్తున్నాయి. ప్రాచీన కాలాన 'పహ్లవులు' 'పల్లవ బొగ్గ' లో నివసించారని,దానిని బట్టి 'పల్లవనాడు' అనే పదము వ్యవహారములోని వచ్చి ఉండవచ్చుని చెప్పినారు.

3. అక్కిరాజు ఉమాకాంతంగారు :

1. "పాలరాయి" విశేషంగా ఉండుట వలన 'బాలనాడని' పేరు వచ్చిందనియు, ఈ బాలనేడే పల్నాడయినది" అనే వాదాన్ని (అ॥ఉ॥గారు) విపులంగా పరిశీలించి ఈ వాదనలో పసలేదని ఖండించినారు.

2. "చిన్న చిన్న పల్లెలు గల దేశముగాన బల్లెనాడని పేరొచ్చినది" అనే వాదాన్ని కూడ సవివరంగా చర్చించి,ఖండించినారు. (అందువలన నేను ముందు ముందు విపులంగా ఈ రెండు వాదాలను చర్చించడం లేదు).

కారంపూడి వీరాలయములో తూర్పు వైపు బండ మీద 'నల్లాం చక్రవర్తుల శాసనంలో లిఖించిన 'పలనాడు' అనే పదానికి మద్దతు ఇచ్చారు. వీరు 'పలునాడు' 'పలనాడు', 'పల్నాడు' అనే రూపాల్నే అంగీకరించారు.

4. తెలుగు సాహిత్యం :

తెలుగు సాహిత్య రంగంలో మరియు సంస్కృతంలో కవులు పల్నాడు గూర్చి పేర్కొన్న అనేక సందర్భాలు, 'పల్నాడు' అనే పదాన్ని కవులు ఎన్ని రూపాలలో వాడారు అనే విషయాన్ని గూర్చి పరిశీలిద్దాం.

1. "ప్రధమ కారణమున 'పల్నాటి' యేకాంగ వీర పురుష సంహారమునకు" (క్రీడాభిరామం)
2. "రసికుడు పోవడు పల్నాడు" (చాటు పద్మ మంజరి)
3. "పన్నుగ' బల్నాటి సీమ' ప్రజలందరకున్ (చాటు పద్యమంజరి)
4. "పలనాటి వీరుల భాగవతంబు" (పల్నాటి వీర చరిత్ర)
5. "లలింబలినాటను బాక నాటనుం విలసిల్లు పలనాటి' వీరుల చరిత్ర" (ప్రభావతి ప్రద్యుమ్నము)
6. "కారెమపూడి పట్టణం కాశిగదా 'పలినాటి' వారికిన్" (చాటు పద్యమంజరి)
7. "పలినాటికి మాటికి బోవ నేటికిన్" (చాటు పద్య మంజరి)
8. "పల్లెనాటి వీర బాంధవులకు " (క్రీడాభిరామం)

9. "పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు" (చాటు పద్య మంజిరి)

10. "పలెనాట"ను నూట తొంబదియు నాల్గు" (అప్ప కవీయం)

11. పల్లవ బొగ్గ, పల్లవ భాగ,పల్లవ భోగం (మహావంశం అనే బౌద్ధ గ్రంథం)

12. అచ్చట నచట జనప పెద్దలు 'పల్లె దేశమ్ము' లందు (క్రీడాభిరామం)

13. "పల్లె విషయంబు' నకా మహిమంబు చెల్లె" (క్రీడాభిరామం)

పై సాక్ష్యాల్ని బట్టి పల్నాడు, పలనాడు, పలినాడు,పల్లెనాడు, పల్లెదేశం,పల్లె విషయం, పల్లవభాగ,పల్లవ భోగం, పల్లవ బొగ్గ మొ॥న పదాలు మన గ్రంథాలలో 'పల్నాడు'కు పర్యాయ పదాలుగా ఉన్నట్లు తెలుస్తున్నవి.

5. చిలుకూరి వీరభద్రరావు గారు :

వీరి ప్రకారం "ఆంధ్ర రాజధానీ నగరమగు ధాన్య కటకమునకు (అమరావతి) దక్షిణ భాగమున (పల్నాడు ప్రాంతము) జైన, బౌద్ధ,శైవ మతాలు అవలంభించినట్లు 'పహ్లావాదులు వేనవేలు నివసించుచూ క్రమముగా ఆంధ్రలో కలసిపోయి ఆంధ్ర 'పహ్లావు' లనంబడు చుండిరి. ఈ యాంధ్ర పహ్లావులే 'పల్లవు' లైరి. ఈ పల్లవులు నివసించు ప్రదేశమే పల్లవనాడు పేరం బిలవబడుచు గుంటూరు మండలములోని నున్నది." అని తన 'ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము' పుస్తకమునందు చెప్పియున్నాడు.

శాసనాధారాలు, సాహిత్య ఆధారాలు మత గ్రంథాలు, చరిత్ర కారుల తర్కాలు పరిశీలించిన తర్వాత పల్నాడు గూర్చి ఈ విషయాలు మనకు బోధ పడుచున్నది.

1. పల్నాడును పాలించిన జాతి 'నాగజాతి' అని తెలియుచున్నది. (ఈ విషయాన్ని ఇంతకు ముందు వివరంగా చర్చించాను.)

2. "పహ్లావ" అనే రాజ వంశము ఆంధ్రలో మమేకమై 'పల్లవ' వంశమైనది. వారు పాలించినారు కనుక ఆ ప్రాంతము 'పల్లవనాడు' అయినది.

3. 'పల్లి' 'నాడు' అనే రెండు పదాల కలయిక వలన 'పల్నాడు' అనే పదము ఏర్పడినదనియు 'పల్లి' అనే జాతి బౌద్ధమతం పుచ్చుకున్నారనియు తెలియు

చున్నది. (మతాన్ని పుచ్చుకొనక ముందు వారు ఏ జాతి అనే వివరాలు విపులంగా చిర్చించాను.)

4. గుంటూరు మండల ప్రాంతం 'పల్నాడు' అని పిలవ బడుచున్నది.

పల్నాడు కు వాడిన పర్యాయ పదాలు :

పల్లి రాష్ట్ర, పల్లి దేశ,పల్లినాడు, పల్లినాండు, పల్నాడు - పలనాడు, పల్లెనాడు, పలినాడు, పల్లునాడు, పహ్లవ (పల్లవులు) పల్లవనాడు, పల్లవ బొగ్గ, పల్లవ భాగ, పల్లవ భోగం పలినాటి, పల్లెనాటి, పల్లె దేశము, పల్లె విషయం.

పై విషయాన్ని ఈ విధంగా వ్రాయవచ్చు

పల్లి	-	Palli	రాష్ట్ర	-	Rastra
పల	-	Pala	నాడు	-	Nadu
పల్లవ	-	Pallava	దేశ	-	Desa
పల్లె	-	Palle			

వీటిని ఇంకా విపులంగా చర్చించాల్సిన అవసరమున్నది. అపుడే వారి రాజవంశము, ఏ జాతికి సంబందించినది అని సాధ్యపడుతుంది.

భాషా శాస్త్రము :

ఈ పాలజాతి (Palas) ఎవరు ? ఈ పల్లి జాతి (Pallis) ఎవరు? ఈ పల్లవులు ఎవరు ?

1. ఎవరు ఈ పాల జాతి ? (Palas) (Palanadu)
2. ఎవరు ఈ పల్లవ జాతి ? (Pallavas) (Pallavanadu)
3. ఎవరు ఈ పల్లి జాతి ? (Pallis) (Pallinadu)
4. ఎవరు ఈ పహ్లావులు ? (Phlavas)
5. ఎవరు ఈ పల్లె జాతి ? (Palle)

6. ఏమిటీ పల్లెనాడు ? (Pallenadu)

7. ఏమిటీ పల్లి రాష్ట్ర ? (Pallirastra)

8. ఏమిటీ పలి (పాలి) ? (Pali) (Palinddu)

ఈ విషయాలను గూర్చి సంస్కృత - ద్రావిడ భాషలలో పరిణామాలు విపులంగా చర్చించాల్సియుంటుంది.

ఈ 'పల్నాటి' పదాన్ని నిగ్గు తేల్చాలంటే పల్నాటి వంశాన్ని కనుగొనాలంటే, ఒకసారి భాషా శాస్త్రంలో ద్రావిడ భాషలు, ద్రావిడ పదాలు ఎలా సంస్కృతీకరించబడినది, ఎలా రూపాంతరం చెందినవో తెలుసుకొనవలయును.

ఒక భాషను వేరొక భాష యొక లిపి యందు వ్రాయునప్పుడు (Transiliteration) సంభవించిన మార్పులను ఖచ్చితంగా పరిగణనలోనికి తీసుకొన వలసియుంటుంది.

ఈ విషయాన్ని గూర్చి Gustav Oppert 1888 లో రచించిన "On the original Inhabitants of Bharatavarsa or India" అనే పుస్తకము నందు ఆయన విపులంగా చర్చించారు. దానిలో ద్రావిడ భాషలు వేరొక భాష లిపిలో వ్రాయు పద్ధతిని విపులంగా చర్చించారు. ఆ విషయాన్ని తప్పక మనం పరి శీలించాల్సి యుంటుంది. విషయాన్ని పరిశీలించేటప్పుడు ఈ మాట గుర్తుంచుకొనవలెను.

వీర విద్యావంతులైన మాలలే పల్నాటివారా ????

ద్రావిడ భాషల పదాలు వేరొక భాష యొక్క లిపి యందు ఈ విధంగా రూపాంతరం చెందును.

1. K, Kh, g, gh, n,h,h,a,a (క, ఖ, గ, ఘ, ఙ........)

2. c. ch, j, jh, n, s, y, l. l. e. e. ai (చ, ఛ, జ, ఝ, ఞ .....)

3. t, th, d, dh, h, s, r, r, r, (ట, ఠ, డ, ఢ, ణ ....)

4. t, th, d, dh, n, s, l, l, l (త, థ, ద, ధ, న........)

5. P, ph, b, bh, m, h, v, u, u, o o, a, u (ప, ఫ, బ, భ, మ...వ........)

పైన పేర్కొన్న అక్షర క్రమములో 5 వ క్రమము మనకు కావల్సింది. అందువల్ల దానిని గూర్చి చర్చించుచున్నాను.

భాషలందు ఒక పదము పరిణామ క్రమములో వేఝ భాష యొక్క లిపి యందు వ్రాస్తారో, అలా వ్రాసినప్పుడు ఆ పదము, ఎన్ని విధాలుగా రూపాంతరము చెందునో తెలుసుకుందాము.

పల్నాడు పదము :

ప, ఫ, బ, భ, మ, (వ) అనే అక్షరాలు ఒక వరుస క్రమము అనే విషయము మనం (తెలుగు) ఎరిగిన విషయమే. ఆ ప్రకారం చూసినట్లయితే 'పల్నాడు' పదము మరియు దాని రూపాంతర పదములు, వేరు బాష లిపిలో ఏ విధంగా మార్పు చెందునో గమనిద్దాము.

(ఒత్తులు కలిగిన (ఫ, భ) వదిలి వేశాను) ప. ఫ బ భ మః క్రమము.

1.	పల్లిరాష్ట్ర (Palli-rastra	బల్లి రాష్ట్ర Balli rastra	మల్ల రాష్ట్ర Malla Rastra)	వల్ల రాష్ట్ర (Valla rastra)
2.	పల్లి దేశ (Pallidesa	బల్లి దేశ Balli desa	మల్ల దేశ Malla desa)	వల్ల దేశ (Valla desa)
3.	పల్లినాడు (Palla-rastra	బల్లినాడు Balli rastra	మల్లినాడు Malla Rastra)	వల్లినాడు (Valla rastra)
4.	పల్నాడు (Palnadu	బల్నాడు Balnadu	మల్నాడు Malnadu)	వల్నాడు (Valnadu)
5.	పాలనాడు (Palanadu	బాలనాడు Balanadu	**మాలనాడు Malanadu)**	వాలనాడు (Valanadu)
6.	పల్లెనాడు (Pallenadu	బల్లెనాడు Balle nadu	మల్లెనాడు Malle nadu)	వల్లెనాడు (Valle nadu)

7.	పలినాడు	బలినాడు	మలినాడు	వలినాడు
	(Pali nadu	Bali nadu	Mali nadu)	(Vali nadu)
8.	పల్లునాడు	బల్లునాడు	మల్లునాడు	వల్లునాడు
	(Pallu nadu	Ballu nadu	Mallu nadu)	(Vallu nadu)
9.	పల్లవ నాడు	బల్లవ నాడు	మల్లవ నాడు	వల్లవ నాడు
	(Pallava nadu	Ballava nadu	Mallava nadu	Vallava nadu

10. పహ్లవ (Phlava, Palhava)

(ఈ విషయం గూర్చి ముందే చర్చించాను గమనించండి)

పైన పేర్కొన్నవి స్థూలముగా పల్నాడు అనే పదానికి, వేరు భషయొక్క లిపి (Transliteration) యందు వ్రాయునప్పుడు ఏర్పడు రూపాలని తెలియుచున్నవి.

C.P. బ్రౌన్ :

మన తెలుగు భాష (ద్రావిడ భాష) ఆది గురువు. మన తెలుగునకు ఒక నిఘంటువును తయారు చేసి, తెలుగు భాషకు జీవాన్ని పోసి, ప్రజాకవి వేమన సాహిత్యాన్ని వెలుగులోనికి తెచ్చిన బ్రౌన్ తను తయారు చేసిన తెలుగు నిఘంటువు (Dictionary) నందు

m,p,b,v, మ,ప,బ,వ. - అనే అక్షరాలు ఒకేచోట, ఒకే head క్రింద వ్రాసినాడు, వేరు భాష యొక్క లిపి యందు ఒక పదము వ్రాయునప్పుడు పైన పేర్కొన్న నాలుగు అక్షరాలు ఏ విదంగానైనా రూపాంతరం చెందవచ్చుననియు, ఆ నాలుగు ఒకే అర్థం క్రింద మారుననియు అర్థమగుచున్నది.

బ్రౌన్ ప్రకారం :

పలనాడు - బలనాడు - మలనాడు - వలనాడు (Palanadu - Balanadu - **Mala nadu** - Valanadu) గా మారునని తెలియు చున్నది దేశము నందు ఒక చోట మలనాడు, ఇచ్చల పలనాడు అయినట్లు నిర్ధారించ వచ్చును. వీటికి దీర్ఘములు చేర్చి చూచినచో పాలనాడు - బాలనాడు - **మాలనాడు** అవుతున్నవి. దీని ప్రకారము నేటి పల్నాడు. ఆనీటి మల్నాడు లేదా మాలనాడు అనవొచ్చునేమో ? ? ముందు ముందు ఇంకా విపులంగా చర్చించాను.

తమిళ భాషనందు 'కక్కలి' (Cakkali) అనగా తెలుగు, కన్నడ భాషనందు 'మాదిగ' (Madiga) అని అర్థము. మరాఠా భాషనందు వీరిని 'మాంగ్' లేదా 'మంగ్' (Mang) అంటారు.

తిరుమాల (శ్రీమాల) దేవుడైన శ్రీ వెంకటేశ్వరుని భార్యలలో ఒకరు శ్రీమతి 'అలిమేలు మంగ' అన్న విషయము మన మెరిగినదే! ఈ 'అలిమేలు అనే స్త్రీ 'మాంగ్' కులానికి చెంది ఉంటుంది. 'అలి' అనగా తెలుగునందు 'నీరు' (water) అని అర్థమున్నది. తమిళమునందు 'అలి' అనగా 'నాగలి' అని అర్థము. బహుశా ఈ స్త్రీ పేరు నదీజలాలు, నాగలికి దగ్గరగా ఉండటము వలన ఈమె వ్యవసాయ కుటుంబానికి సంబందించి యుంటుంది.

మన ఆంధ్రదేశంలో 'పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి' (కాలజ్ఞానం చెప్పిన బ్రహ్మంగారు, వడ్రంగి కులానికి చెందినవారు) చరిత్రలో 'మాదిగ కక్కడు' అనే పాత్ర ఒకటి మనకు కనిపిస్తుంది. ఇచ్చట 'మాదిగ' అనే పదము తెలుగు, కక్కడు తమిళభాష ఈ రెండు పదాల కలయిక ఈ మాదిగ కక్కడు సృష్టి.

కక్క - అనగా 'మాదిగ' ఈ పదాన్ని మన బ్రాహ్మణ పండితులు (ముఖ్యంగా, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి) పిల్లవాడు కూర్చునే మలానికి వాడారు. అనగా దళిత జాతులను కించపర్చడానికి వారు ప్రతి చ్ని అవకాశాన్ని ఉపయోగించుకున్నారన్నమాట. (పిల్లవాడి మలాన్ని కక్క కూర్చోవడం, అనటం పై జిల్లాలలో పరిపాటి చరిత్రకారులు గమనించవచ్చు).

ఇంకొన్ని విషయాలు సంస్కృతంలో

Mara (మార)

Mala (మాలా)

Malli (మల్లి)

Mara (మారా)

Mala (మాల)

తెలుగునందు

Mala (మాలా)

Malamu (మాలము, మలము)

Malu (మాలు)

Malla (మల్ల)

Malle (మల్లె)

Mala (మాల)

Mali (మాలి)

Male (మాలె)

Malu (ములు)

Mule (ములె)

Mella (మెల్ల)

Melamu (మేళము)

Melu (మేలు)

Maila (మైల)

సంస్కృతము	తెలుగు	తమిళము
Para	Pulla (Pulla)	Palar
Pala	Palemu	Palam
Pallava	Pallemu	Pali
Palvala	Pala	Pal
Pala	Palu	Pallam
Pula	Pilla	Palli

Phala	Pula (Pulla)	Palam
Phala	Pula (Pullu)	
Phulla	Pulla	

మాండాది (Mandadi) : రాజ్యాన్ని కోల్పోయిన మాలదేవుడు (Mandadi) వలస వెళ్ళాడు. దీనిని Malladi > Maladi అని వ్రాయవచ్చును. అనగా 'మాలాది' (ఆదిమాల) వలస వెళ్లినట్లు తెలుస్తుంది. ఇది నేటి శ్రీశైల ప్రాంతము. అచ్చట వీరు ఒక దేవాలయాన్ని నిర్మించారు. ఆదేవాలయమే "శ్రీశైల మాలన్న' ఆలయం. ఈ ఆలయాన్ని 'మాలలు' నిర్మించారు. కనుకనే అందులో దేవుడ్ని కూడా 'మాలన్న' అంటున్నారు. ఆ దేవుడ్ని శ్రీ శైల మాలన్న లేక శ్రీశైల మల్లన్న అంటున్నారు. (Malanna (or) Mallanna)

Ala (Wave) : తెలుగు నందు అల అనగా 'శక్తి' అని కూడా అర్థమున్నది. అలరాజు అనగా శక్తివంతమైన రాజు అని అర్థము. అలరాచమాల అనగా, మాలరాజులలో శక్తివంతుడని అర్థము.

వెలమలు : (వెలమాల)

వీరిని వెలమ దొరలు అని కూడా అంటున్నారు. వీరి వంశములో బ్రహ్మానాయుడు ప్రముఖుడు, ఈ "వెలమలు' అనే పేరు 'వెలమాల' నుండి వచ్చినట్లు, కథకల మాటల నుండి గ్రహించును. మాల జాతులలో శక్తివంజమైన యువకులను, ధైర్య సాహసాలు కలిగిన సమర్థులను, కొంత సొమ్ము చెల్లించి (వెల) వారిని, ధనికులు, రాజులు రక్షణగా నియమించుకొనెడివారట. అలా 'వెల' పెట్టికొన్న మాలలు క్రమముగా వెలమాల = వెలమలు అయినట్లున్నది.

పలనాడు (Palanadu) మాలనాడు (Malanadu) ఒకటేనా ?

పలనాడు (Pala-nadu) మాలనాడు (Mala - nadu) అనే పదాలు రెండూ ఒకటే అని అర్థమగుచున్నది (లేదా) పాలనాడు, మాలనాడు అని కూడ సంభోదించవచ్చును అని తెలియు చున్నది.

భారత దేశము మొత్తం కూడా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో మల్ల (Malla) లేక మాల (Mala) అనే జాతులు నివసించినట్లు అనేక చారిత్రక ఆధారాలున్నాయి. వారు ఆదివాసీలు, ఈ దేశ పాలకులు, ప్రాచీన నాగజాతికి చెందిన వారసులు అని తెలియు చున్నది. వీరు వివిధ పేర్లతో భారత దేశం మొత్తం నివసించారు. ఆ విషయాన్ని Gustavoppert ఈ విధంగా చెప్పారు. భారతదేశంలో వారిని గూర్చి, వారి గొప్పతనాన్ని గూర్చి వారి పరివ్యాప్తి గురించి తెలుసుకునే ముందు వారిని ఏ విధంగా సంబోధిస్తారో చూద్దాం.

"Mallas or Malas preserved among the allover India for Mala's (Mals) Mala Arayar or Arasar, Malacar, Malayalis, Malavas, Malair, (Malar or Paharias) Mallar, Mars, (Mahars Mhars, Maharas) Maris, Marvar, as they are named in different places are found scaltered allover the country". ("The Dravidians" Gustav oppert).

భారతదేశం మొత్తం మీద నివసించిన మల్ల లేదా మాల జాతులు పాలకులు వారిని ప్రాంతాలను బట్టి ఈ విధంగా సంబోధిస్తారు.

"మాలలు, మల, మాల అరమార్, మాలకార, మాలయాలీలు, మాలవలు, మాలయార్, మాల్లార్, మార్స్, మహర్స్ (మహారాష్ట్రలో అంబేద్కర్ జన్మించిన కులం) మాహరాస్, మారిస్, మార్వార్ (మాలవార్)".

మహాభారతం : మల్ల లేదా మాల జాతులు ఉన్నట్లు, అవి చాలా గొప్ప జాతులు అయినట్లు 'మహా భారతం' నందు అనేకసార్లు ఉదహరించడం జరిగినది.

సిద్ధాంత కౌముది :

మల్ల - బల్ల (Malla - Bhalla) (మల్లనాడు - భల్లనాడు) ఒకే పదము ఒకే అర్థము అని సిద్ధాంత కౌముది తెలియు జేయుచున్నది.

రామాయణం, హరివంశము, బృహసంహిత, లలిత విస్తర మొ॥ గ్రంథాలలో మల్ల భూమి, మల్ల రాష్ట్ర, మాలయ భూమి మొ॥న పదాలు ఆ రాజ్యాలకు ఎక్కువగా ఉపయోగించారు. (Mala - Bhumi, Mala - Rastra, Mala - Ya-bhumi = మాలభూమి (మాలరాష్ట్ర - మాలయ భూమి అని తెలుగు నందు వ్రాయడం ధర్మం).

ముద్ర రాక్షసము నందు పార్వతకుడి కొడుకు 'మాల'యకేతు (Mala-ya-ketu) అని యున్నది. హిమాలయాల వద్ద నున్న "మాల-య-భూమి (Mala-ya-bhuni) నందు మల్లలు లేదా మాలలు (Mallas or Malas) నివసించినట్లు తెలియు చున్నది.

శూద్రకుని నాటకం 'మచ్ఛ కటికం' నందు మాల్లక లేదా 'మాల'క (Mallak or Malaka) అన్న పదానికి రాజ వంశము (Royal) అని అర్థం వచ్చు చున్నది.

పలనాడును 'బలి'నాడు అని కూడ రచయితలు సంబోధించారు :

Palanadu = Balinadu ఒకే పదము

ఓనమ్ (Onam) పండుగ దినమున (మనకు సంక్రాంతి లాంటి గొప్ప పండుగ కేరళ నందు జరుపుకుంటారు) 'మాల' బారు (Malabar) తీరమున 'బలి' (Bali) చక్రవర్తిని అచ్చటి ప్రజలు పూజిస్తారు. దీనిని బట్టి 'బలి' చక్రవర్తి 'మాల' (లేదా) మల్ల చక్రవర్తి అని తెలియుచున్నది. ప్రస్తుతమున్న మాలబారు (మలబారు తీరము) నాటి బలి చక్రవర్తి పరిపాలన యందు ఉండి ఉంటుంది. ఆ తీరములో మాలలు లేదా మల్లలు నవిసించియుంటారు.

దక్షిణ భారత దేశము నందు :

తిరుమాల, పెరుమాల (Tiru - Mala, Peru -Mala) అనే రెండు పదాలు కూడా 'మాల' నుండే వచ్చాయి. 'తిరు' అనే ప్రాకృతి పదాన్ని సంస్కృతంలో 'శ్రీ' అంటారు. 'పెరు' అనగా పెద్ద లేదా పెను అని అర్థం. 'మాల' జాతులకు గౌరవ సూచకంగా 'తిరు' 'పెరు' అనే పదాలు చేర్చారు. దక్షిణ భారతం ముఖ్యంగా మళయాళం (మాలయాలం) (Mala-Yalam) నందు తిరుమాల, పెరుమాల రాజులకు బిరుదులు, ఈ రాజులు ఎన్నుకొన బడెదరు. వీరు పాలించే ప్రాంతాలను మాలనాడు (Mala Nadu) మళయాళం (మాలయాలం) (Mala - Yalam) అనేవారు. మలబారు (మాలబారు) తీరమున పెరుమాల (పెద్దమాల) అనగా రాజుల బిరుదు. (The name of the Perumala, The great Mala, is still a royal title in Malabar) (The Dravidians' Gustov Oppert)

చేర, చోళ, పాండ్య రాజులకు (దక్షిణమున) అనాది నుండి ఉన్న బిరుదు 'పెరు మాల' (పెనుమాల) 'మల్లన్న' (మాలన్న) అనే ఒక పెరుమాల పొలనాడు (పల్నాడు) వద్ద 'మత్తూరు' అనే నగరాన్ని నిర్మించినట్లు కేరళ నందు, ఒక శాసనం ఉన్నది. ఇచట పల్నాడు అనే పదాన్ని గమనించవచ్చు ఇచ్చట మాలనాడు, పొలనాడు (పల్నాడు) ఒకటే అని తెలియుచున్నది. దళితులు పాలించిన ప్రాంతమని తెలియుచున్నది. (Dr. Gunderts Malayalam Dictionary).

దక్షిణ భారత రాజుల బిరుదులు గమనించిన ఈవిధంగా ఉన్నాయి.

మాల యధ్వజ (Mala - Yadhvaja) 'మాల'య నారపతి (Malaya narapati) 'మాల' య ప్రభ (Mala - ya Prabha) 'మాల' య సింహ (Mala -ya simha) త్రిభువన మాల, జగదేక మాల, త్రైలోక్యమాల, భువనైక మాల, యుద్ధమాల, అవహమాల (Mala or Malla) పైన పేర్కొన్న రాజులు ధరించిన బిరుదులు గమనించినచో మల్ల లేదా మాల (Malla or Mala) అనే జాతులు పాలక వర్గం అని తెలియు చున్నది. ఆ జాతి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఉచ్ఛదశలో ఉన్నట్లు తెలియు చున్నది. వారు బలవంతులు మరియు పరిపాలకులు కూడా అని తెలియుచున్నది.

'మాల వాడు' అనే తెలుగు నవీన పదానికి తమిళము నందు పరియ (వాడు) అంటారు. తమిళంలో పరియాలు, ఆంధ్రలో మాలలు, మహారాష్ట్రలో మహర్లు ఒక్కరే. మాలరాష్ట్ర - మల్ల రాష్ట్ర - మహా రాష్ట్ర గా మారినట్లు శబ్ధ ఉత్పత్తి (Phiilological) శాస్త్రం ప్రకారం ఆధారాలు ఈ వాదనకు అనుకూలముగా యున్నవి.

శ్రీశైలంలో నేటికి ఒక విచిత్ర ఆచారమున్నది మాలన్న లేదా మల్లన్న (మల్లికార్జునుని పేరు) దేవాలయానికి, తిరుణాల రోజున ఈనాటికి ఒక మాల వానిచేత ఆ గుడికి తెల్లని వస్త్రాన్ని చుట్టూరా చుట్టిస్తారు (లేదా దారాన్ని చుట్టిస్తారు). ఈ శ్రీశైలం పల్నాటి వారు వలస వెళ్తారు. (మాల దేవుడు - బ్రహ్మనాయుడు - కన్నమనీడు. ఇచట ఇంకా పరిశోధన జరగాల్సి యున్నది.)

విజయనగర సామ్రాజ్యము :

శ్రీ కృష్ణరాయలు - తల్లి నాగమాంబ (నాగమ్మ) ఈమె నాగజాతి స్త్రీ.

ఈమె పేరున 'నాగులాపురం' నిర్మిస్తాడు, ఇతని కుమారుడు తిరుమాల రాయులు (శ్రీ మాలరాయలు) కృష్ణరాయలు భార్య తిరుమలాంబ లేదా తిరుమాలమ్మ 'శ్రీమాలమ్మ) (Tirumalamma) " వీరి ఆరాధ్య దైవము తిరుమాల దేవుడు (శ్రీనివాసుడు) ఇతని భార్య Mang (మాంగ) (మాదిగ కన్య) ఆమెనే మనం అలిమేలు మంగ (మాంగ) అని పిలుస్తాము. (మనం 'తిరు' అంటే 'శ్రీ' అని అర్థమని తెలుసుకున్నాం).

కొన్ని పదాల్ని గమనిద్దాం :

	ప్రాకృతము	సంస్కృతము	ఇంగ్లీషు
1	తిరుమాలరాజు	శ్రీ మాలరాజు	(Tiru - Mala - Raju)
2	తిరుమాలరాయలు	శ్రీ మాలరాయలు	(Tiru - Mala - Rayalu)
3.	తిరు మాల కొడపతి	శ్రీమాల కొడపతి	(Tiru - Mala - Pati)
4.	తిరు మాల కొండ	శ్రీమాల కొండ	(Tiru - Mala - Konda)
5.	తిరు మాల దేవుడు	శ్రీ మాల దేవుడు	(Tiru - Mala - Deva)

శ్రీ కృష్ణదేవ రాయలు 'మాల దాసరి' నాయకుడిగా ఒక గ్రంథాన్ని వ్రాయడం కూడ గమనించాలి.

మైసూరు నందు హోలియ (Holiya) పరియ కులానికి సమానము, ఈ హోళియ అనే పద రూపము పులయ 'లేదా' పొలయ అనే పదానికి సమానము. (ఈ 'పొలమ' నుండి 'పొలనాడు' వచ్చి ఉంటుంది. దీని రూపాంతరం 'పలనాడు' కావచ్చు).

మళయాళం భాష నందు పల్లి, పరి అనేవి ఒకే అర్థాన్నిచ్చే మాటలు (పల్లిరాష్ట్ర అని కూడ పల్నాడును పిలుస్తారు అని చెప్పుకున్నాము). మళయాళం నందు 'పరియ' అనగా తెలుగు నందు మాలవారు (మాలార్) తమిళం నందు పెరియార్ పొలయార్ అంటారు.

ఇంత విపులంగా ఎందుకు చర్చించాల్సి వచ్చిందంటే, దక్షిణ భారత దేశం మొత్తం మల్ల లేదా మాల జాతులు ఆవరించి ఉన్నారు. మరియు వారు పాలకులు, వారు పాలించిన ప్రాంతము 'మాలనాడు'. ఈ పదము రూపాంతరం చెంది

'పలనాడు' అయినది అని ఖచ్చితంగా చెప్పవచ్చు. (ఇంకా చర్చిద్దాం).

మల్ల లేదా మాల (Malla or Mala) పదాలను సంస్కృత భాషలో ఉపయోగించిన సందర్భాలు :

1. **ప్రజలను :** మాలక, మాలడ, మాలజ, మాల్ల, మాల్లక, మాల్లవ, మాల, మాలవ, మాలవతి మొ॥నవి.

2. **వారి లక్షణాలు (గుణాలు లేదా విశేషణాలు)** మాలకేతు, మాలయ ధ్వజ, మాలయ నారపతి, మాలయ ప్రభ, మాలయ సింహ, మాలయ గంధిని, మాలయ సిన్హ, మాలవి మొ॥నవి.

3. **దేశాల్ని :** మాలయ, మాలయ దేశ, మాలయ భూమి, మాల్ల భూమి, మాల్ల రాష్ట్ర, మాల, మాలవ, మాలవ దేశ, మాలవక మొ॥నవి.

4. **పర్వతాల వరుస :** మల్ల కూట, మాలయ, మాలయ పర్వత మాలయ భూ భర్త, మాలయకాల మాలయాద్రి మొ॥నవి.

5. **పట్టణాలు :** మాలయ పురము, మాల్లపూర, మాల్ల వస్తు, మాల్ల ప్రస్త మొ॥నవి

6. **వృక్షాల పేర్లు :** మాలయజ, మాలయ ధ్రువ, మాలయోధ్భవ (గంధం చెట్టు) మాల్లజ (మిరియాల చెట్టు) మొ॥నవి.

7. **మాలవి (నది పేరు) మాల (పూల దండ)** (Malavi = మాలవి అని వ్రాశాము.

Malaya Parvata = మాలయ పర్వత, అంతే కాని దీర్ఘము లేకుండా మలయ పర్వత అని వ్రాయకూడదు. నేను దీర్ఘములతో ఖచ్చితంగా అనువాదం చేశానని అనుకుంటున్నాను)

ఈ విధంగా మనుష్యులు, పర్వతములు, బిరుదులు, వృక్షాలు, పట్టణాలు, దేశాలు, నదులు మొ॥నవి అన్ని పదాలు మాల లేదా మల్ల (Male or Malla) తో ముడి పడి యున్నాయి. దీనిని బట్టి 'మాల' (Mala) అనే పదం పూర్వము ఎంత సామాజికోన్నతి చెంది, ఎంత ప్రాముఖ్యత సంతరించుకుందో అర్థమవుతుంది.



శక్తివంతమైన మల్ల లేదా మాల (Malla or Malla) జాతులు :

గౌతమ బుద్ధుడు : మాల లేదా మల్ల జాతులు మన దృష్టికి వచ్చిన ఒక ముఖ్యాంశం ఏమిటంటే, భారత దేశ సంఘ సంస్కర్తలలో ప్రముఖుడైన బుద్ధుడు కుశీ నగరమునందు గల మాల్ల (మాల) జాతుల మధ్య నిర్యాణం చెందాలను కోవడం, మరియు మాల్ల (మాల) సుభద్రుడ్ని తన ముఖ్య అనుచరునిగా (Arhat) నియమించుకొనడం ఒక దృష్టాంతం మాత్రమే. బుద్ధుడు చివరి దినాలలో మాలల వద్దకు (కుశీనగరం - మాలల సాలవనం) చేరినట్లు అర్థమౌతుంది. బుద్ధుని అవసాన కాలములో ఆర్యమతము విజృంభించినది. ఆసమయమున బుద్ధునికి ఆర్యుల నుండి, రక్షణ అవసరమయినది. ఆ సమయమున మాలల వద్దకు చేరినట్లు చరిత్ర అన్పించుచున్నది. దీనిని బట్టి మాలలు, ఆ జాతుల శక్తిని మనం అంచనా వేయవొచ్చు

అలెగ్జాండర్ :

ప్రపంచ విజేత అలెగ్జాండర్ భారత దేశముపై దండెత్తి, సింధు నదీలోయ గుండా దక్షిణానికి జయిస్తూ ప్రయాణిస్తున్నప్పుడు, మాల్ల (మాల) జాతుల 'నగరాన్ని' ముట్టడి చేసినప్పుడు అలెగ్జాండర్ సైన్యానికి తీవ్ర గాయాలు ఏర్పడ్డాయి. క్షతగాత్రులైనారు. **రోము సైన్యాలను గజగజ లాడించినవి. 'మాల' జాతులు అని అర్థమవుచున్నది.** వీరు దేశ భక్తులు, వీరి రహస్యాలు అలెగ్జాండర్‌కు తెలిపి వీరి ఓటమికి కారణమైన 'అంభి' బ్రాహ్మణ రాజు అన్న విషయం గమనించాలి.

ఈ సంఘటన ప్రసుత ముల్తాన్ (Multhan) నందు జరిగినది. దీనిని మాల్లస్థాన్ (Malla Sthana) అని కూడ అంటారు. ఇది మల్ల (Malla or Mala) రాజుల పట్టణం. ఈ ఆముల్తాన్‌ను నేడు మనము మాలల స్థానముగా అర్థము చేసుకొనవలసి యుంటుంది.

సర్ అలెగ్జాండర్ బర్నేస్ రచన Travels in Bokhara (Vol III Page 114) ప్రకారం "Mooltan is Styled Mallithan or Malitharun the Place of Malli (Palli (or) Pali) today" అన్నారు. ఈ ముల్తాన్, మల్లితాన్, మల్లి ధారన్ అంటారని, ఈ 'మల్లి' లేదా 'పల్లి' లేదా 'పాలి' ఒకే పదమని తెలియు

చున్నది. మల్లి, పల్లి, పాలి, మల్ల, మాల ఒకే పదాలు అని ముందే తెలుసు కున్నాము. ఈ నాటి Mooltan ఆనాటి Malastan అని అనుకొన వొచ్చును.



పల్ల - పల్లి - పల్లె పదాలు
(PALLA - PALLI - PALLA)

(పల్లవ నాడు, పల్లనాడు, పల్లినాడు, పల్లెనాడు, పహ్లవ, పల్లిదేశ, పల్లి రాష్ట్ర ఈ పదాలలో పల్నాడును సంభోదించారు.)

పల్లవులు : సంస్కృత భాషలో 'పల్లాస్' (Pallas) అనే పదము పల్లవులు, పహ్లవులు, పహ్నవులు, పల్హవ, పార్వలు అనే రూపాలుగా ఉన్నవి (Pallas appear in Sanskrit literatures Pallavas, Palhalvas, Pahanvas, Palhava and Palvas)

ఈ పల్లవ, పల్హావ లేదా పల్హ, పహ్ల, అనే పదాలకు కల్హణ, కహ్లణ (కళ్యాణ) మరియు 'కల్లా' అనే పదాలకు సారూప్యమున్నది. (పల్నాటి వారు కళ్యాణ చాళుక్యులతో వైవాహిక సంబంధాలు ఏర్పరచు కున్నారు. ఆ విషయం తర్వాత చూద్దాం.)

ఈ పల్లవుల, పరియ, పల్లార్ జాతులకు మతాధి పతులను 'వల్లువార్' (Valluvar) అంటారు. ఆ మతాధిపతులు 'నయనార్' అనే బిరుదులు ధరించెడి వారు. ఉదాహరణకు 'పల్లవ' అనే శబ్ధానికి అర్ధం 'పల్లము' అని చెప్పడం భాషలో విపరీత (వెకిలి) చేష్టగా ఖండించడం జరిగినది. పల్లమైన ప్రాంతం కనుక, దాని నుండి పల్నాడు వచ్చినదని చెప్పడం అసహజం. (గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతం చాలా ఎత్తైన ప్రదేశమన్న విషయం మనమెరిగినదే). కనుక పల్నాడు అనగా పల్లము కాదని తెలియుచున్నది.

పల్లి లేదా పల్లె జాతులు (Palli (or) Palla (or) Malli (or) Malla (or) Mala

(పల్నాడును పల్లినాడు, పల్లి రాష్ట్ర, పల్లి దేశ, పలినాడు అని సంభోదించారు)

పల్లిజాతులు ఎవరు? వీరి ప్రాచీనత ఏమిటి ? ఈ పేరుకు ఇంకా వేరే రూపాలున్నాయా? వీరు కూడా ఆదివాసీలైన నాగజాతి వారసులా? వీరు నేటి దళితులా ? అనే విషయాన్ని లోతుగా చర్చించాల్సియుంటుంది. వీరు చరిత్రలో గొప్ప జాతా? అనే విషయాన్ని చూడాలి

రాజ్యము, రాజ వంశము, రాచరికమునకు సంబంధించిన ప్రతి మాటకు పల్లి (Palli) అనే పదము మళయాళం (మాల-యాలం) (MalaYalam) భాష నందు ఉన్నది.

మళయాళ పదాలు : తెలుగులో అర్థము చూడండి.

1. పల్లి కోవిలకమ్ (Palli Kovilakan) రాజ-భవనం (Royal Palace)
2. పల్లి మెట్ట (Palli metta) - రాజవిశ్రాంతి మందిరం (Royal bed)
3. పల్లివల్ (Pallival) - రాజఖడ్గం (Royal Sword)
4. పల్లివేట (Palli vetta) - రాజుల వేట (Royal Chase or hunt)

పై పదాలను బట్టి Pallas or Pallis ఎంత రాజరికం అనుభవించారో అర్థమవుతుంది. పై పదాలను బట్టి పల్లి (Palli) అనగా రాజు (లేదా) రాజ వంశము అని తెలియు చున్నది. (ఒక వేళ మాల పల్లి, మాదిగ పల్లి ఈ పదాలతో సంబంధం ఉండి ఉంటుంది. రాజ వంశాలు అణగ ద్రొక్కబడి, వాటి చిహ్నాలుగా 'పల్లి' ఉండి ఉంటుంది. మాలపల్లి = మాలరాజు, మాదిగ పల్లి = మాదిగరాజు అయి ఉంటుంది.)

ద్రావిడ భాషలలో ఒకటైన ప్రాకృతమునందు జైన, బౌద్ధ మతాలయాలను 'పల్లి' (Palli) అంటారు. బౌద్ధమతం నందు ఈ పల్లి జాతులు (Pallis) ఎక్కువగా ప్రవేశించారు. వారి భాష 'పల్లి' (Palli) భాష దానినే 'పాలి' (Pali) భాషగా అని కూడ సంభోదించారు.

బౌద్ధ గ్రంథాలు, శిలా శాసనాలు, వారి మత ప్రచారం, 'పాలి' (Pali) భాషలోనే జరిగినది. అశోక చక్రవర్తి కూడ 'పాలి' (బ్రహ్మీ లిపి) భాష నందు శాసనాలు చెక్కించారు. ఆభాష ఎంత ప్రాముఖ్యం చెంది, ఎంత విరివిగా, ప్రచారం పొందియున్నదో గమనించవచ్చు. నాటి దళితుల భాష 'పాలి'.

పల్లె జాతి, పల్లి పదము (Pallis) విస్తృతి :

"Another Portion of the oboriginal South - Indian Population is represented by Pallis. The difference which at an early stage divided pallar from the 'Pallis' in Contradistinction to the country or Palaiam (పాలాయియమ్) in Tamil and Palemu (పాలెము) in Telugu. The fuedal chief tains were called after the country poligars (పాలెగారు)".

ఇంకొక అంశమేమిటంటే దక్షిణ భారతదేశంలో ఆదివాసీలు పల్లి జాతులు. ఈ ఆదిమ జాతి 'పల్లి' నుండి 'పల్ల' అనే పదము వచ్చినది. వారు పాలించిన దేశాలలో భాగాన్ని తమిళం నందు పాలాయియమ్ (Palaiam) తెలుగు నందు పాలెము (Palemu) అంటారు. వీటి నాయకులను 'పాలెగారు' (Paligars) అంటారు.

(పాలెగారు ఉద్యమం ఆంధ్రలో జరిగినది. ఇందులో పాల్గొన్నవారు దళితులు. వీరి పేర్లను వెలికి తీసి, స్వాతంత్ర్య సంగ్రామ వీరులుగా చరిత్ర వ్రాయిల్సిన అవసరమున్నది. అదే విధంగా చీరాల - పేరాల ఉద్యమంలో అరెస్టులు జరిగినవి. అందు ఒక స్త్రీని పేరాల నుండి అరెస్టు చేయబడినట్లు చరిత్రకారులు వ్రాశారు. కాని ఆమె పేరు వ్రాయలేదు. ఆమె దళిత స్త్రీ అన్న విషయం గమనించాలి.

భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో మొదట అరెస్ట్ అయిన స్త్రీ ఆమె. అదే విధంగా 'పుల్లరి' (పల్నాడు ప్రాంతం) ఉద్యమంలో మరణించిన దళితుల్ని, ఏజెన్సీ తిరుగుబాటు (సీతారామరాజు)లో మరణించిన నాయకులు గిరిజన వీరులన్న విషయం మన మెరిగినదే. ఈ విషయానికి ప్రాముఖ్యత కల్పించాల్సి యుంటుంది. స్వాతంత్ర్య చరిత్రలో అమరులైనది ఎక్కువ దళితులన్న విషయం చాలా మందికి తెలియదు.)

మరియు పల్లీలు (Pallis) పూజించిన దేవుళ్ళు పోతురాజు, పోతరాజు, పోతప్ప అని పిలుస్తారు. పోతురాజు భార్యలైన (కొన్ని ప్రాంతాలలో సోదరీమణులు అంటారు) పోలకమ్మ, పోలేరమ్మలను కూడ పూజిస్తారు. (పల్నాటి వారు కూడ ఈ దేవతలను పూజించారు.) ఈ దేవతలు ద్రావిడ సంస్కృతికి సంబందించిన దేవతలని గమనించాలి.

మల్ల, పల్లి, పల్ల (Malla - Palli - Palla) ఒకే పదము అని తెలియుచున్నది. 'పల్లీ'లు నిర్మించిన పట్టణమే 'మామాల్ల పురము' లేదా 'మా వల్లి పురము' దీనినే 'మహా మాల్ల పురము' లేదా 'మహాపల్లి పురము' దీనిని మాలలు లేదా పల్లీలు

(Mallas or Pallis) నిర్మించినట్లు మనకు తెలుస్తుంది. 'మహా బలి పురము' దళితుల గొప్ప నిర్మాణానికి నిదర్శనం అని అర్థమవుతుంది.(మహాబలిపురం ఒకప్పుడు మహామాలపురం అయింటుంది)మన ఆంధ్ర దేశములో పల్లెవాండ్లు (Palle vandlu) పల్లెకారు అనగా చేపలు పట్టువారని అర్థము. ఉత్తర భారత దేశములో చాలా ప్రాంతాలలో చేపలు పట్టువారని 'మాలలు (malas) అంటారు. అనగా 'మాల', 'పల్లె'అనే రెండు వేర్వేరు భాష లిపి నందు (Transliteration) వ్రామునప్పుడు జరిగిన మార్పే కాని వేరుకాదని ఈ రెండు ఒక్కటే అని తెలియుచున్నది.

ప్రాచీన భారత దేశ చరిత్రను పరిశీలించిన ఈ దేశాన్ని ద్రావిడులు పరిపాలించారు. వీరిని అసుర రాజులు లేదా అసుర గణాలు అంటారు. వీరిని దాస్యులు అని కూడ అంటారు వీరిది ప్రాచీన నాగ జాతి, ఈ జాతినే తరువాత మల్ల లేదా మాల (Malla or Mala), పల్ల లేదా పల్లి (Palla or Palli) అని పిలువబడినారు.

వీరు ఆర్యుల నిరంతర దాడులలో అణగారినారు. వీరికి అనేక ప్రాంతాలలో అనేక పేర్లు స్థిర పడినాయి (మొదట్లో ఒకే జాతి). వీరు రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా, నైతికంగా అణగ ద్రొక్కబడినారు. వీరిని ప్రస్తుతం'దళితులు' అని అంటున్నారు.

ద్రావిడ రాజుల (గణాల) పరిణామాన్ని గూర్చి :-

ద్రావిడుల పేర్లన్నియు నేరుగా 'మాల్ల' లేదా 'మాల'కు సంబంధించిన పదాల నుండే వచ్చినవి. ఆ జాతులు మాల్ల (Malla) లేదా పల్ల (Palla) కు సంబంధించి ఉన్నాయి. (Dravidians whose names are derived either directly from Mala or from cognate terms, and who are of the same races as the Mallas or Pallas (Gustavoppert)

మాల్ల, పల్ల లేక మాల, పాల లేదా పల్లి మొ॥ పదాలు భారత దేశము మొత్తంపై ఉన్న రూపాలను Gustavoppert ఈవిధంగా చూపించారు. (" The Dravidians" Gustavoppert) ఆంధ్రలో 'మాల' అన్నపదము వివిధ భాషలలో లిపివ్రామునప్పుడు భారతదేశంలో, ఈ 'మాల' పదము చెందిన రూపాంతరములు.I may mention the Mars-Mhars-mahars, Maharas or Malas, Maris, Maravas, Pariahs, Prajars, Paravar, Paravari, Paratas, Paradas, Parheyas, Bars, Bhars, Brahmis, The Mallas(Malli) Malas, Mals, Mars, Mala Arayar, Malacar, Malayalis, Malava (malvas), Malair (Malar

or Paharias), Mallar (or) pallar, the palliyar, poliayar, pulayar, Holiyar, Pulindas, Pundras, Pallis, Palas,Palis Pallavas, Palhavas, Pahlvas, Pahnavas, Plavas, Pandyas, Ballas, Bhallas, Bhils, Bhillas, Ballalas, Vellalar, Velamas (Vallamas, Vallambams) Valluvar,(The Dravidians - Gustavoppert).

వారిని మార్స్ - మహర్స్, మహర్స్, మహరాస్ లేదా మాలలు, మారిస్ (దళిత దేవిని మారిమ్మ లేదా మారెమ్మ అంటారు) మారవార్, పరిహాస్, ప్రజార్స్, పరవార్, పరవారి, పరతాస్, పరదాస్, పర్హియస్, బార్స్, బహర్స్, బ్రహ్మిస్(బ్రహ్మలిపి నందు అశోకుని శిలా శాసనాలు 'పాలి' భాషలో వ్రాయబడినవి. బ్రహ్మలిపి దళిత లిపి లో చాలా ఉత్తమ మైనదని తెలిముచున్నది).

మాల్లస్, మల్లి, మాలలు, మాల్స్, మర్స్, మాల అరమార్ మాలకార్, మాలయాలిస్, మాలవ (మాలవలు), మాలయ్యార్(మాలేర్), మాల్లార్ లేదా పల్లార్, పల్లియార్, పొలయ్‌యార్, పులయార్, హొలియార్, పులిందలు, పుండ్రలు, పల్లి, పల్ల, పాలి, పల్లవులు, పల్హవులు, పహ్లవులు, పహ్ణవులు, ప్లవలు, పాండ్యలు, బల్లాస్, భల్లాస్, భిల్స్ భిల్లాస్, భిల్లాలాస్, బల్లాలాస్, వెల్లలార్, వెలమలు, వల్లమాస్ వల్లంబాస్, వల్లువార్.

ఈ విషమాలను పరిశీలించిన మల్ల లేదా మాల, పల్లి పల్ల, బల్ల మొ|| పదాలు ఇటీవల రూపాలు. ఇవన్నియు ప్రాచీన ద్రావిడులైన మాల (mala) లేదా మల్ల (Malla) నుండి వేర్వేరు భాష లిపులందు (Transliteration) వ్రాసినప్పుడు జరిగిన మార్పులే కాని వేరు కాదు. వీరు ప్రాచీన నాగజాతి. వీరు పాలక . జాతులు, రాజ్యాధికారులు (తెలుగు నందు 'పొలము' అనే పదము కూడ వీరి పరిపాలనా చిహ్నానికి ప్రతి రూపమే). దక్షిణ ప్రాంతము, మన సరిహద్దు, రాష్ట్రాలలో ఈ జాతులను చర్చించిన మీదట మన 'పలనాడు'ను 'మాలనాడ'ని సంభోదించవచ్చుననియు, పలనాడును పాలించిన జాతులు మాలలనియు (దళితులు), అందువల్లనే నేడు వీర విద్యావంతులైన 'మాలల్నే'పల్నాటి వారు అని సంభోదిస్తున్నట్లు అర్థమవుతుంది.

పల్నాటి వారు వియ్యమొందిన వంశము :-

(మాల్ల లేదా మాల (Malla or Mala) వంశమని తెలియుచున్నది)

అలుగురాజు మరణాంతరం నలగాయుడు పరిపాలనకు వస్తాడు. ఇతడు మాలమ్మదేవి (మైలమాదేవి) కుమారుడు. మరియొక్క భార్య వీరవిద్యల దేవి

పుత్రులు 1,పెదమాల దేవుడు 2, చినమాలదేవుడు 3,బాలమాల దేవుడు వీరు కన్నమనీడు సేనానిగా, మాచర్ల (మాలచర్ల-Malacharla) రాజధానిగా పరిపాలన కొనసాగిస్తారు. (శిలాశాసనాలలో 'మాచర్ల' ఈ విధంగా ఉన్నది, మాల్ చర్ల, మాలచర్ల, మహదేవిచర్ల)

1. పెదమాల దేవుడు (పెదమలి దేవుడు అని చరిత్ర కారులు దిద్దారు) (పెదమలి, చినమలి, బాలమలి అనే అర్థాలు పొసగడం లేదు వారు ఎవరికి 'మలి', ఎవరికి తొలి? ....అసంతృప్తిగా ఉన్నాయి)ఇతని వివాహ ఏర్పాట్లు చేయుటకు, అతని మంత్రి బ్రహ్మనాయుడు కళ్యాణ పురం బయలుదేరతాడు, వీర సోముని కుమార్తెతో వివాహం జరుగుతుంది.

ఆ విషయాన్ని పరిశీలిద్దాం: -

"పయనం చేసె బ్రహ్మతానప్పు
సుంకరి కన్నమ సొంపుగరాగ
దనవెంట దోడ్కొని తరలి బ్రహ్మన్న
కళ్యాణ నగరంబు కడు వేగ చేరి
యా పట్టణంబేలు నట్టి భూపతులు
అల్లాణ రాజును భల్యాణ రాజు
నంది సోముడు మరి నాగ సోముడు
కంచుసోముడు మరి పెంచు సోముడును
జలముల కర్తన జల సోమరాజు
అంచటకను వైన నావీరసోము
తములేడ్గురు కల ధరణీశుకపుడు
పుత్రులు నల్వురు పుత్రికయునొకతె",

వీర చరిత్ర నందు ఉన్న పై పంక్తులను పరిశీలించిన, కళ్యాణ పురాన్ని పాలించిన వీర సోముని కుమార్తెతో పెదమాల దేవునికి వివాహ ఏర్పాట్లుకు, బ్రహ్మనాయుడు, మాల కన్నమనీడు బయలుదేరినట్లు అర్థమవుతుంది.

కళ్యాణ పుర రాజులు మొదట జైనులని తరువాత శైవ మతస్థులని అర్థమవుతుంది. అనగా వారితో వియ్యమందిన పెదమాల దేవుడు కూడ శైవుడేనని

అర్థవవుతుంది. అతని మంత్రి (బ్రహ్మనాయుడు) వైష్ణవుడెలా అవుతాడు? ఒక వేళ వైష్ణవుడైనచో అతనిని తొలగించి వేరే ఎవరినైనా నియమించుకొనును కదా?


వీర సోమునిది ఏ వంశం? :-

వీరు కళ్యాణ చాళుక్యులు. వీరిని పశ్చిమ చాళుక్యులు అని కూడ అంటారు (రాజమహేంద్ర వరం రాజధానిగా పాలించిన వారు తూర్పు చాళుక్యులు) వీరి రాజధాని 'కళ్యాణ పురం' వీరి వంశం జయ సింహునితో ప్రారంభమైనది. వీరి వంశములో పులకేశి అఖండ పరాక్రమ వంతుడని తెలియుచ్నుది (ఆ విషయం ఇచ్చట అప్రస్తుతము) ఈ వంశము చాలా పురాతనమైనదన్న విషయుం చరిత్రకారులు ఎరిగినదే. క్రీ.శ. 973లో రాష్ట్ర కూట వంశములో కడపటి రాజు 'కర్కరాజు'ను, తైలవుడు ఓడించి ఆరాజ్యాన్ని ఆక్రమించడముతో మళ్లీ చాళుక్య వంశపాలన ప్రతిష్టింప బడినది. వీరు 'కళ్యాణి' రాజధానిగా పాలించారు. అందువలననే వీరిని 'కళ్యాణి చాళుక్యులు' అంటారు. తైలవుడు నర్మదానది, తుంగ భద్రనది మధ్యప్రాంతములో తన అధికారాన్ని సుస్థిరము చేసుకున్నాడు. తైలవుడ్ని అవహమాల్ల లేదా యుద్ధమాల (Avahamalla (or) Yuddha malla) అని కూడ సంబోధిస్తారు. ఇతనికి ఇద్దరు కుమారులు 1,సత్యాశ్రయుడు 2, దాస్యవర్ణ (దాసవర్ణ) ఇందు సత్యాశ్రయుడు అతి శక్తి వంతమైన రాజు. ఇతని భార్య అంబికా దేవి, ఇతడు జైన మతస్తుడు ఇతని ఆస్థానమునందు కన్నడ కవిత్రయములో ఒకరైన 'రన్నడు' ఉన్నాడు. నాగ వర్ణ, నాగచంద్ర, వాయుసేనుడు మొ॥ నాగ వంశజులు విజ్ఞలు, మేధావులు ఈ రాజుల వద్ద నివసించినారని సాక్ష్యాలు తెలుపుచున్నవి.

వీరి పేర్లు బిరుదులు:- జగదేక మాల, భువనైకమాల, త్రైలోక్యమాల వీరపెరుమాల, ఉరుమాల, త్రిభువన మాల.

పైపేర్లు గమనించిన వీరు ప్రాచీన మల్ల లేదా మాల (Malla or Mala) వంశానికి చిందిన వారని అర్థమవుతుంది. వీరు మొదట జైనులని, తరువాత వీర శైవులని అర్థమగుచున్నది. కనుక వీరు ద్రావిడ రాజ వంశ వారసులని తెలియుచున్నది (ఆర్య గణాలకు సంబంధం లేదని చెప్పవచ్చు).

పల్నాటి వారు వియ్యమందిన వంశవృక్షము



ఇందు త్రిభువనమాల (సోమేశ్వర IV)అయిన సోమేశ్వరుడే, వీర సోముడు అంటారు. ఇతడు పెదమాలదేవునికి కుమార్తెను ఇచ్చాడు. ఈ వివాహము పరస్పర

అంగీకారముతో పెద్దలు నిశ్చయించారు కనుక రెండు రాజ్యాలు, రాజులు ఒకే జాతి అయి వుంటారు. వారు మాల లేదా మల్ల (Mala or Malla) వంశాలు అనుకోవాల్సివస్తుంది.

'పలనాడు' వారి వంశము (లేదా) 'మాలనాడు' వారి వంశము

వీరి వంశాన్ని గురించి చరిత్రకారులు, గందరగోళం సృష్టించినట్లు కనపడుతున్నది. సాక్ష్యాధారాలు దొరకనప్పుడు, అసమగ్ర పరిజ్ఞానముతో వీరి వంశాన్ని చరిత్రకారులు నిర్ణయించినట్లున్నారు. విషయాలను సునిశితంగా పరిశీలించిన వీరి వంశ నిర్ణయం ఏమంత కష్టంగా కనబడుట లేదు. వీరి వంశాన్ని మరుగుపరచడానికి ఎక్కువ ప్రయత్నాలు జరిగినట్లున్నవి. అందువలననే నేను ఎక్కువ ఆసక్తితో పరిశీలించడం జరిగినది.

వీరిది హైహయ వంశమని మొదట నిర్ణయించిన వారిని పరిశీలిద్దాం. (అందు (1) అ॥ఉ గారు (2) ముదిగొండ వీరభద్రకవి). అ॥ఉ గారి మాటలలో "ఇది వీర కామేంద్రుని వరకు సరిగ్గాలేదు. ఈ వంశక్రమమును (అ॥ఉ. గారికి దొరికిన తాళపత్రగ్రంథమట. వారికి ఆ తాళపత్ర గ్రంధము ఎచ్చట దొరికిందో? తరువాత దానిని ఎచ్చట భద్రపరిచాడో చెప్పలేదు) ముదిగొండ వీరభద్రకవి పద్య కావ్య వంశక్రమమునకు భేదమగుపడుచున్నది. అనుగురాజు సుందర చక్రవర్తి కొడుకు అని వీరభద్రకవి చెప్పినాడు. కాని అనుగురాజు పుత్రుని పేరు వీర కామేంద్రుడు. సాధారణంగా తాత పేరు మనుమనికి పెట్టెదరు. కనుక వీరభద్రకవి చెప్పినట్లు అనుగురాజు తండ్రి సుందర చక్రవర్తి కాక, వీర కామేంద్రుడై యుండవలయును." పై విషయాన్ని పరిశీలించినచో వైరుధ్యాలు అర్థమవుతున్నాయి.

1. ముదిగొండ వీరభద్రకవి అలుగురాజు తండ్రి సుందర చక్రవర్తి అని చెప్పినాడు. (అది అతని తాళపత్ర గ్రంథమై యుండవచ్చు)
2. అలుగురాజుకుమారుడు వీర కామేంద్రుడు. ఇది అ॥ఉ॥ గారి తాళపత్ర గ్రంథమై యుండవచ్చును.
3. తాత పేరు మనుమనికి పెడ్తారు కనుక అలుగురాజు తండ్రి వీర కామేంద్రుడని ఇతని వాదన.


అసలు అలుగురాజుకు ముందు వారి వంశావళికి ఆధారాలు లేనట్లు

కనబడుతున్నాయి. (వీర కామేంద్రుడు - అనే పేరులో 'ఇంద్రుడు' హిందువుల మత చిహ్నము)


ఈ వాదనలు పరస్పర పొంతన లేవు. ఆధారాలు లభించి ఉండకపోవచ్చు కాని ఊహాశక్తి తర్క జ్ఞానాన్ని ఉపయోగిస్తే వారి వంశాన్ని నిర్ణయించుట పెద్ద కష్టము కాదు.


ఇచ్చట రెండు వంశావళులను పేర్కొన్నాను. ఇందు వీర కామేంద్రుని నుండి ఒకటిగా ఉన్నాయి. పైన చూచినచో 'లింకు' కలిపినట్లు అర్థమవుతుంది.

I అ॥ఉ॥ గారు చెప్పినది



2. కాటమరాజు కథలు (మొదటి సంపుటి) వంశావళి :





పైన పేర్కొన్న రెండు వంశావళులను గమనిస్తే

1. కార్తవ్యవీరునికి పదిలక్షల మంది భార్యలు (2) కోటి మంది పుత్రులు మరియు నాలుగు కోట్ల మంది కూతుళ్ళు (3) మనుమల పదు నాలుగు కోట్లమంది. ఇవన్నీ పురాణాల్లో అయితే బాగుంటాయి.

కాని చరిత్ర వ్రాస్తున్నాము అనే విషయము చరిత్రకారులకు గుర్తుండాల్సిన అవసరముంది. ఊహలతో చెప్పినప్పుడు; లుప్త భాగాలు కలిపినప్పుడు అవి పరస్పర సంబంధము కలిగి యుండవచ్చునని చెప్పగలగాలి. కాని ఇచ్చట విషయాన్ని గమనించినచో, మన చరిత్రకారులు ఈ చరిత్ర ఎలా వ్రాశారు? ఏం చేశారు? అనే విషయం మనకు అర్థమవుతుంది.

1. వీరిది హైహయ వంశమైనచో కార్తవ్య వీర్యార్జునునితో లింకు ఉండాలి.

2. కార్తవ్య వీర్యార్జునుడు రామాయణములో పాత్ర. ఇతడు రావణ బ్రహ్మకు వ్యతిరేకి. అందువలన హైందవ చరిత్రకారులకు కార్తవ్య వీరునిపై ప్రేమ ఉండి ఉంటుంది.

3. ఇతని 5 కోట్ల సంతానం. 14 కోట్ల మనుమలు, వీరి వంశావళి విష్ణు, బ్రహ్మ, నారదుడు మొ॥ అంశాలు గమనించినచో పురాణాల్ని తలదన్నినట్లున్నది.

కార్తవ్య వీర్యార్జునుడు :

ఇతడు తన వేయి చేతులను అడ్డుపెట్టి నర్మదా నదిలో జలక్రీడలాడటం, దానికి కోపించి రావణబ్రహ్మ ఇతనితో కలహించడం జరుగుతుంది. ఇది రామాయణం నందు ఒక పాత్ర 1. రమేష్ చంద్రదత్తు మొ॥న అనేకమంది చరిత్రకారుల ప్రకారం రామాయణం క్రీ॥పూ॥ 13వ శతాబ్దమున జరిగినట్లు నిర్ణయించారు.

2. అలుగురాజు కార్తవ్యవీర్యార్జునకు 7వ తరము వాడని చెప్పినారు. అట్లైన పల్నాటి యుద్ధం క్రీ॥పూ॥ జరగాలి కదా?

3. అలుగురాజు తండ్రి సుందర చక్రవర్తి (ము॥వీ॥క) అని, అలుగురాజు కొడుకు వీర కామేంద్రుడని మరియు అదే పేరు అతని తండ్రి అని (అ॥ఉ॥గారు) చెప్పారు. (నేను వీరినే ఎందుకు ఉదహరించానంటే తర్వాత వ్రాసిన చరిత్రకారులు మొత్తం వంశం హైహయ నిర్ణయించుటలో వీరిని అనుసరించారు). (అక్కిరాజు ఉమాకాన్తం, ముదిగొండ వీరభద్రకవి)

కనుక ఏ విధంగాచూచినను పల్నాటి వారు హైహయులుకాదని తెలియుచున్నది. ఇచ్చట సరైన సాక్ష్యాలు లభించకపోవడం జరిగి యుండాలి. చరిత్రను పక్షపాతముతో, పురాణాలతో లింకు కలపడానికి చరిత్రకారులు వెనుకాడలేదని నాకనిపించుచున్నది.

చేశారు. ఆమె భారతదేశ స్వాతంత్ర్యోద్యమములో మొదట అరెస్టు అయిన స్త్రీ (పేరాల మాలపల్లికి చెందిన దళిత స్త్రీ). ఆమె చరిత్ర వెలుపలికి తియ్యాల్సిన అవసరమున్నది. చరిత్రకారులంతా ఒక స్త్రీ అని పేర్కొన్నారు. కాని, ఆమె పేరు వ్రాయలేదు. పెదనందిపాడు, నందు పన్నుల నిరాకరణ ఉద్యమపుడు, పెదనందిపాడు, నాగులపాడు, చిన నందిపాడు నందు గల దళితులే ఆ ఉద్యమంలో ఉధృతంగా పాల్గొన్నారు. ఆ విషయాన్ని గూర్చిన వివరాలు వెలుగు చూడాలి. ఈ విధంగా గుంటూరు జిల్లా నందు దళితుల పోరాటాలు వెలుగు చూడాల్సిన అవసరమున్నది).

పై విషయాలన్ని ఎందుకు చెప్పానంటే (మల్లులు - పాలెగారు ఒకటే అన్న విషయాన్ని ఇంతకు ముందు చర్చించాను) దళితులు, దళిత రాజ్యాలు గుంటూరు (పల్నాడు ప్రాంతం) నందు ఎంత బలంగా ఉన్నారో అర్థమవుతుంది.

వీరగాముని పుత్రులు : 1. అలుగు రాజు 2. బిరుదురాజు 3. అర్థరాజు 4. తెప్పలి రాజు 5. తేజస్సు రాజు

1. అలుగురాజు : ఇతను చాలా ప్రముఖమైన వ్యక్తి. ఇతని పేరు 'అలుగురాజు' అయి ఉండాలి. 'అల' అనగా 'గొప్పశక్తి' అని అర్థం. ఇతను శక్తివంతమైన రాజు అయి ఉండాలి.

ఇతనిని గూర్చి వేరొక కథ ప్రచారంలో నున్నది. అలుగురాజు తల్లి 'వీరమాలమ్మ' నిండు గర్భిణిగా ఉన్నప్పుడు, తోటలో సంచరిస్తూ ఉండగా పురిటినొప్పులు వచ్చినట్లు, అచ్చటి పనివారు వచ్చి ఈమె చుట్టూ అలుగులు (పలుగులు, గునపాలు) పాతి, అడ్డంగా పంచెలు చుట్టి, అందులో ఈమెను పెట్టినట్లు, ఈమె అలుగుల మధ్య బిడ్డను ప్రసవించినట్లు, అలుగుల మధ్య బిడ్డను ప్రసవించినది కనుక 'అలుగురాజు' అని నామము సార్థకమైనట్లు పల్నాడులో జనపదకథకులు చెప్పుదురు. ఏమైనా ఇతడు వీరుడు, శక్తివంతుడు అని అర్థమగుచున్నది. ఇతనికి భార్యలు ముగ్గురు.

భార్యలు : 1. వీర విద్యల దేవి
2. మాల మా దేవి
3. భూ రమా దేవి (వీరమాదేవి)

వీరవిద్యలదేవి : ఈమె పెద్ద భార్యం. ఈమెకు ముగ్గురు కుమారులు 1. పెదమాల దేవుడు (రాజ్యానికి న్యాయంగా వారసుడు) 2, పినమాల దేవుడు 3. బాల మాలదేవుడు. వారసత్వంగా రాజ్యము పెద్ద భార్య కుమారులకు చెందాలి.

మాలమ్మదేవి : చందోలు రాకుమార్తె. ఈమె కట్నంగా పల్నాడును తీసుకువచ్చినది. అందువల్ల బహుశ అలుగురాజు మరణం తరువాత ఈమె కుమారుడైన నలగాముడు రాజ్యాధికారానికి వచ్చి ఉండవచ్చు.

నలగాముడు : ఇతనికి కుమార్తె ఉన్నది. ఆమె పేరు రత్నాల పేరమ్మ. ఈమెను అలరాచమాల (అలరాజు) కు ఇచ్చి వివాహం జరిపిస్తాడు. కాని నలగాముని భార్య పేరు తెలియదు. ఇతని వద్ద నాగమ్మ (నాయకురాలు) అను ఒక సమర్థవంతమైన నాగవంశ స్త్రీ మంత్రిణిగా యుంటుంది. బహుశా ఆమెతో సన్నిహితంగా ఉండి ఉండవచ్చు.

భూరమాదేవి (వీరమాదేవి) : ఈమె అలుగురాజు భార్య. ఈమెకు నలుగురు కుమారులు. 1. కామరాజు 2. నరసింగరాజు 3. పెరుమాలరాజు 4. ఝుట్టిరాజు. వీరు నలగాముని వైపు ఉంటారు. నలగాముని సేనాపతిగా నరసింగుడు ఉంటాడు.

తెప్పలి నీడు : ఇతనిని తెప్పలి నాయుడు అని కూడ అంటారు. ఇతడు వీరకాముని సంతానమే. అన్న అలుగురాజుకు సేనాపతిగా ఉంటాడు.

పెనుమాలమ్మ : ఈమెను రూపావతి, పెమ్మసానమ్మ అని కూడ పిలుస్తారు. ఈమె తెప్పలినీడు భార్య.

మాల కన్నమనీడు : తెప్పలనీడు మరియు పెనుమాలమ్మ సంతానం. మహా సమర్థవంతుడు. ఇతనిని మాల కన్నమదాసు. మాల కన్నమనాయుడు, మాల కన్నమనీడు అని కూడ సంబోధిస్తారు. పెదమాల దేవుని సర్వసేనాపతిగా మన్ననలందినాడు.

అలరాజు : అలరాచమాల అని కూడ సంబోధిస్తారు. ఇతని పేరుతో 'రాచమాలపాడు' అనే గ్రామం కూడ కలదు. ఇతడు కోడి పందెములో న్యాయ నిర్ణేతగా ఉంటాడు. మహా బలశాలి.

దొడ్డనాయుడు : ఇతని భార్య శీలమ్మ. ఇతని కుమారుడు బ్రహ్మనాయుడు.

పందెం కోళ్ళు : చిట్టెమల్ల లేదా చిట్టిమాల (పెదమాలదేవుని కోడి)

౨. నల్లమల్ల లేదా నల్లమాల (నలగామునిని కోడి)

పందెం కోళ్ళను కూడ మల్ల లేదా మాల వంశంలో సంబోధించటమే జరిగినది. అన్న విషయాన్ని మనము గమనించాలి.

గోత్రాన్ని బట్టి : గుంటూరు జిల్లాలో మాలలు నేటికీ వారిది 'రేచర్ల' గోత్రమని చెప్పుకొనుచున్నారు. ఈ గోత్రము పల్నాడు ప్రాంతంలో చాలా ప్రాముఖ్యతను సంతరించుకొనినది. ఈ రేచర్ల గోత్రము వెనుక చిన్న కథ ఉన్నది.

1. వెంకటగిరి సంస్థాన వంశ చరిత్రనందు వంశావళి చేవిరెడ్డి వద్ద నుండి చెప్పబడిది. చేవిరెడ్డియు, మరొక మాలవాడు పొలం దున్నుచుండగా ధనం దొరికెననియు, ఆ ధనమునకా మాలవానిని బలియిచ్చి వాని అభీష్టము ప్రకారం చేవిరెడ్డి తన గోత్రనామము 'రేచర్ల'గా మార్చెనని దచ్చరిత్ర యందు వ్రాయబడినది (అ॥ఉ॥గారు).

దీనిని బట్టి 'రేచర్ల' గోత్రము మాలవారిదని తెలియుచున్నది. ధనముతో పాటు గోత్రాన్ని కూడ సొంతం చేసుకొనినట్లు తెలియుచున్నది. అయితే మాలవాని అభీష్టము మేరకు అతనిని హత్య చేసి గోత్రము తీసుకొన్నట్లు కథలల్లినారు. చరిత్రకారులు ఈ రేచర్ల గోత్రాన్ని బ్రహ్మనాయునికి ఆపాదించారు. ఒకవేళ పై కథ నిజమైతే, **మాలవారి నుండి 'రెడ్ల' కు సంక్రమించాల్సిన గోత్రం వెలమవారికి (బ్రహ్మనాయుడికి) ఎలా చెందినదో చరిత్రకారులే చెప్పాలి.**

రేచర్ల నుండియే మాచర్ల, పేరేచర్ల, చర్ల, చేజర్ల (చేచర్ల) అనే గ్రామాల పేర్లు వచ్చి ఉండవచ్చు. బహుశ మా (రే)చర్ల (వారు నివసించిన ప్రాతం) పే(రే)రేచర్ల వారి గోత్రం పేర్లు అని చెప్పవచ్చు. పదాల ఉచ్ఛారణలో జారి (Gliding) మాచర్ల, పేరేచర్ల అయినట్లు అనుకొనవచ్చును. (చెర్లగుడి, ఒప్పిచర్ల).

మల్లవరము (మాల్లవరము) (మాలవరము) : ఈ నాటికి కూడ ఈ గ్రామమున్నది. పెదమాల దేవుని పేర గ్రామమై యుండును. ఈ మల్లవరమును

మాల గూర్చి Memories of Geological survey of India volume 8 లో ఈవిధముగా ఉన్నది. "Along the eastern edge of the Tunukota range, there are traces of old diamond workings, more decidely around 'Mallavaram' on the right bank of Krishna where the line stone lapping around the base of hill have been regular by undermind to get at the Quartzites beneath them containing diamonds."

గుత్తికొండ : దీనిని గొలుముల పాలెము (Palem) అని కూడ అంటారు. ఇచట ఇనుమును కరిగించెడి కొలుములు కలవని కూడ అంటారు.

పాలమాలపురి : దీనిని జంభనాపురి అంటారు. పాలమాచాపురి నుండి వీర కాముడు వచ్చినట్లు చరిత్రకారులు చెప్పుతున్నారు. జంభనాపురి, జంబూ ద్వీపము, మాల్లపురి మొ॥వి ఆదిమ ప్రజలకు చెందిన నగరాల పేర్లు అనగా వీరగాముడు ఆదివాసీలైన దళితుల వారసుడు అని అర్థమవుతుంది.

రాచమాలపాడు : అలరాజు పేర నిర్మించినట్లు చెబుతున్నారు. మాచర్లకు 6 మైళ్ళ దూరములోనున్నది. దీనిని 'రాచమల్లుపాడు' అని కూడ అంటారు.

పేరాల - చీరాల : ఈ రెండు గ్రామాలు కూడ పల్నాటి వారు నిర్మించినట్లు చరిత్రకారులందరూ ముక్తకంఠంతో ఒప్పుకున్నారు. పేరాల మొత్తం మాలలే ఉన్నారు. పాత చీరాల - పేరాల అనగా మాలపల్లి అని అర్థమే (మాలలే ఉన్నారు). పేరాల - చీరాల పదాలు గమనించిన పల్నాటి వారి గోత్రము 'రేచర్ల' విడిపోయి, 'పేరేచర్ల'గా మారి, పేరేల, చరాల గా ఏర్పడి, తరువాత పేరాల - చీరాల గా రూపాంతరము చెందిఉండవచ్చని నాకనిపించుచున్నది.

మాల్లవాగు : దీనిని 'మేళ్ళ వాగు' అని ప్రస్తుతం పిలుస్తున్నారు.

నాగులేరు : నాగజాతి నివసించిన ప్రాంతము. ఆ జాతిని బట్టి ఈ నదికి ఆ పేరు వచ్చినది.

దళితులు ఏలినట్లు తెలుస్తుంది :

మారీచుడేలినది = మాల్ చర్ల, మాలచరల

ఖరుడేలినది = కారెంపూడి

దూషణుడేలినది = దుర్గి

అని అచ్చటి సామాన్య జనపదులు నేటికి చెప్పుకొనుచున్నారు. రాక్షసులు పరిపాలించారు అని తెలియుచున్నది. నాటి రాక్షసులు (అసురులు) అనగా ఒకనాటి ద్రావిడులు తరువాత వారే దాసులు వారే నేటి దళితులని అర్థము.

శాసనములలో మాల్ చర్ల, మహాదేవిచర్ల మొదలగు పదాలున్నాయి. మాలచర్ల క్రముగా మాచర్లగా మారినది. మాచర్ల అనే పదము తరువాత కవులు, చరిత్రకారులు దిద్దిన రూపమేకాని, శాసనములో ఆ విధంగా లేదని మనం గమనించాలి.

వరమాలపాడు : దీనిని నా 'మాలపాడు' అని కూడ పిలుస్తారు.

ఇంకొన్నిపేర్లు : మాల్ల వాగు, నాగులేరు. పిల్లేరు, చంద్రవంక, పల్లేరు = పల్లె + ఏరు (కృష్ణానది), నల్లమల, మించుపాడు, జాలుకల్లు, పిల్లుట్ల, గొల్లల మాసారం (కోనంకి), కొదమగుండ, మాడుగల మొ॥ వాని గమనించిన దళిత పదాలకు దగ్గరగా ఈ పేర్లు ఉన్నట్లు అనిపిస్తుంది.

పల్నాడు నందు ద్రావిడ సమాధులు (గుట్టలు లేదా బోడులు) :

యుద్ధంలో వేనవేలుగా వీరులు, సామాన్యులు మరణించినారు. ఆ శవాలను కొన్నిటిని కలిపి పాతిపెట్టనారు. అవి :

1. పొసర పోలయ్య బోడు : (పోలేపల్లి వద్ద) : దీనిలో ద్రావిడ సమాధులు, రాక్షస గుళ్ళు (కైరన్లు) ఉన్నాయి.

2. తేరాలబోడు : (తేరాల వద్ద) రాక్షస బండలు ప్రాచీన సమాధులు (రాక్షస గుళ్ళు) ఉన్నాయి.

3. పాలువాయి : గన్నారాల మధ్య బోడు ఉంది. ఇచట కూడ ప్రాచీన సమాధులు ఉన్నాయి.

4. గుబ్బల గూడ తండ పశ్యామల మధ్య ఉన్న బోడుల్లో కైరన్లు, ద్రావిడ సమాధులు ఉన్నాయి.

5. పశ్యాము - మాడుగుల మధ్య ఉన్న చోటి వద్ద జైన బసతులు (నివాసాలు) కైరన్లు ఉన్నాయి.

6. గుత్తికొండ, గుండల్ల పల్లుల వద్ద బోడులు ఉన్నాయి.

7. మంచాలపాడు, కాకిరాల, ముటుకూరు, కోలగుట్ల మొదలైన ఈ నాలుగు గ్రామాల మధ్య ఉన్న అడవులలో బోడులు చాలా ఉన్నాయి.

అందులో తురకోడి కుంట బోడు పచ్చిక బయలుకు పేరు గాంచినది.

ఇన్ని విషయాలు పరిశీలించి, చర్చించి, విశ్లేషించిన మీదట ప్రాచీన నాగజాతికి చెందిన మల్ల లేదా మాల వంశాలు భారతదేశము మొత్తం విస్తరించినట్లు తెలియుచున్నది. అవి చాలా శక్తివంతమైన జాతులు అన్న విషయం అర్థమవుతుంది. ఈ జాతులలో కొన్ని మొదట చీరాల - పేరాల ప్రాంతాలలో తమ పరిపాలనకు పునాదులు ఎత్తినప్పటికి పల్నాటి ప్రాంతములో స్థిరపడినారని తెలియుచున్నది. వారు పాలించిన ప్రాంతాలు - చీరాల, బాపట్ల, పొన్నూరు, పేరేచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, గురజాల, మాచర్ల, దాచేపల్లి, కారెంపూడి, త్రిపురాంతకం, వినుకొండ, శ్రీశైలము మొ॥ ప్రాంతాలలో తమ ప్రాబల్యము ఉన్నట్లు తెలియుచున్నది.

ఈ చరిత్ర నిర్మించుటకు నేను కొంతవరకు చరిత్రకారుల రచనలపై ఆధారపడ్డాను. కాని ఎక్కువగా పల్నాటి ప్రాంతములో మాల,మాదిగ పల్లెలు సంచరించాను. 'వీరుల తిరుణాల' జాగ్రత్తగా గమనించాను. ఈ కథ చెప్పే కథకులు (వీర, విద్యావంతులనెడి మాలలు) వద్ద కథలు చెప్పించుకున్నాను. వేటపాలెం, రాజమండ్రి (గౌతమి) గ్రంథాలయాలు నాకు చాలా ఉపయోగపడినవి. చరిత్రకారులు ఏవైనా మార్పులు చూయించిన సహృదయంతో స్వీకరించగలవాడను.

అలుగురాజు - పల్నాడు :

క్రీ.శ 11వ శతాబ్దం చివర 'లేదా' 12వ శతాబ్ధము మొదటి దశలో, నేటి గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతములో మాల లేదా మల్ల రాజవంశములో

అన్నదమ్ముల మధ్య కలహం లేదా వారి పోరాటక్రమాలను గూర్చి తెలిపే చరిత్ర పల్నాటి వీరచరిత్ర అనవచ్చును.

ఇంతవ పూర్వము మన చరిత్రకారులు మొత్తము ముక్తకంఠంతో 'అనుగురాజు' హైహయ వంశస్తుడని, అతడు తీర్థయాత్రల నిమిత్తము (పూర్వీకులు చేసిన పాప ప్రక్షాళన కొఱకు) ఉత్తర భారతదేశములోని పాలమాచాపురి లేదా జంభనాపురి నుండి తెలుగుదేశం వచ్చినట్లు చెప్పినారు. ఇంకా ఏమన్నారంటే (చరిత్రకారులు) వీరి వంశములో పూర్వం కార్తవీర్యార్జునుడు చేసిన బ్రహ్మహత్యాదోషం, ఈ అనుగురాజును బాధింపగా, బ్రాహ్మణులు సలహామేరకు జీడినూనె గుడ్డలు ధరించి, సచివులూ, సైన్యాధిపతులు, అంతఃపురకాంతలు సకల సంపదలు వస్తువాహనాలు, వారి ఇలవేల్పు కనకాద్రి చెన్నకేశవ విగ్రహాన్ని తోడ్కొని, ఏ పుణ్యక్షేత్రంలో స్నానం చేస్తే నీలి కోకలు తెల్లబడ్తాయో, ఆ పుణ్యతీర్థాలలో తన బ్రహ్మహత్యాదోషం తొలగిపోతుందని వారి ఆలోచన. ఆంధ్రదేశంలో మోటుపల్లిలో స్నానం చేస్తుండగా, నీలి కోకలు తెల్లబడ్డాయని కథనం.

1. హైహయ రాజవంశము ఉత్తర భారతంలో ఉన్నమాట వాస్తవమే, కాని చరిత్రలో ఎచ్చటా అనుగురాజు అనే రాజు హైహయ వంశములో కన్పించడు. మరి ఈ పల్నాటి అనుగురాజుకు, హైహయ వంశంతో లింకు ఎలా కలిపారో మన చరిత్రకారులకు తెలియాలి.

2. ఉత్తర భారతం నుండి వచ్చాడనుకుంటే 'పాలమాచాపురి' (పాలమాలాపురి) అచ్చ తెనుగు పదము (గ్రామము). అది ఉత్తర దేశంలో ఉందని చెప్పడం విచిత్రం.

3. అనుగురాజు వెంట తరలి వచ్చారని చెప్పున్న భార్య విద్యలాదేవి, దొడ్డనాయుడు, తెప్పలినీడు, పెద్దన్న, బ్రహ్మన్న, పేర్నీడు, సూర్నీడు, కన్నమనీడు మల్నీడు అంతా తెలుగువారే మరియు వారిననుసరించివచ్చిన ఆవాలవారు - అట్లూరు - ముట్లూరి - ఆఖ్యలవారు - ముతసాని, ముయ్యూరు వారు, బండారు, బాదం, గోవిందుల వారు, కొండవిందులవారు మొదలగు కార్యపురుషులు తెలుగువారే కదా! వీరితో పాటు శీలమ్మ, పెద్దసానెమ్మ, పెనుమాలమ్మ (పెమ్మసానెమ్మ) వారి కోడండ్రు వీరంతా తెలుగువారే, తెలుగుపేర్లే వీరంతా ఉత్తర భారతదేశంలో ఎచ్చట ఉన్నట్లు?

అలుగురాజు ఇలవేల్పు చెన్నకేశవ స్వామి తెలుగు ఇలవేల్పు అందరికి తెలిసిన విషయమే. ఎందువలనంటే ఈ దేవుని పేరుతో ఒక్క ఆలయం కూడా ఉత్తర భారతదేశంలో లేదు.

5. 'అనుగురాజు' పేరు కూడా తెలుగుపదమే! మరియు పూర్వమేనాడో కొన్నియుగాల క్రిందట (పురాణాల్ని బట్టి) కార్తవ్య వీర్యార్జునుడు చేసిన పాపాలు, (బ్రాహ్మణులను హింసించుట మొ॥నవి) ఈ అనుగురాజుకు ముందున్న ఆయన పూర్వీకులను ఎవ్వరినీ బాధింపక, ఒక్క ఈ అనుగురాజునే పట్టి పీడించాయి అని చెప్పడం హాస్యాస్పదం.

6. చరిత్రకారుల నిర్ణయాన్ని బట్టి పల్నాడును పరిపాలించిన రాజులు ఆరుగురు అని తేలుతుంది. అనుగురాజుకు ముందు ముగ్గురు పల్నాడును పరిపాలించారు. అలాంటప్పుడు అనుగురాజు ఎలా వలస వచ్చాడని నిర్ణయించారో తెలియదు. దీనికి సంబంధించిన ఆధారాలు మాచర్ల చెన్నకేశవస్వామి దేవాలయం ఆవరణలో 'నాగస్తంభం' మీద ఉన్నాయి. ఈ 'నాగస్తంభము' పల్నాటి వారి వంశ వృక్షాన్ని తెల్పుతుంది. పలనాటిరాజుపేరు అనుగురాజు లేదా అలుగురాజు అనవచ్చు అని, 'గుంటూరు మండల సర్వస్వం' వ్యాసకర్త ఎన్. రమేశన్, ఐ.ఏ.యస్. పేర్కొన్నారు.

నాగస్థంభాన్ని బట్టి అలుగురాజుకు ముందు అతని వంశజులు పల్నాడును పరిపాలించారని చెప్పవొచ్చు. అలుగురాజు చందోలురాజైన రెండవ గోంకరాజుపై (మొదటి కళోత్తుంగ రాజేంద్ర చోడయ కుమారుడు) దాడి జరిపి ఓడించి అతని కుమార్తె మాలమాదేవి లేదా మల్లమాదేవి (మైలమాదేవి)ని, వివాహమాడి, పల్నాడును అరణంగా పొందినాడు. అనుట యదార్థము కావచ్చును. మొదటి భార్యకు సంతానము లేనందున గయ భీమదేవుని కుమార్తె, భూరమాదేవిని రెండవభార్యగా వివాహము చేసుకున్నాడు అనవచ్చును.

బహుశా మహబూబ్ నగర్ జిల్లాలోని పాలమూరును (దీనిని అప్పట్లో **మాలమూరు** లేదా మాలూరు అనేవారు) స్థావరంగా చేసుకుని, కృష్ణానదికి దక్షిణాన విస్తరించి పల్నాడు వరకు ఉండవొచ్చు కృష్ణా తీరానికి ఉత్తరంగా

రాయలగండి అడవులలో తన పరివారానికి స్థావరం ఏర్పరిచారు. వారి నివాస స్థలమునకు పేరు పెట్టారు అది 'మాలవానిపల్లె' దీనిని ప్రస్తుతము 'మాధవవాని పల్లె' అని చరిత్రకారులు మార్చారు. ఇవి అచ్చంపేట తాలూకా అమరాబాదు మండలములో ఉన్నది. ప్రస్తుతము ఈ మాలవాని పల్లె (మాధవవాని పల్లె)లో నాలుగు వందలకు పైగా, మాల వారి కుటుంబాలు ఉన్నవి. వీరి ఇంటి పేర్లు వేరు వేరుగా ఉన్నప్పటికి, వీరందరి గోత్రమూ 'రేచర్ల' గోత్రమే. రాయలగండి కొండపై చెన్నకేశవస్వామి ఆలయముంది. దీనికి 50 ఎకరాల మాన్యం భూమిని అలుగురాజు ఏర్పరిచాడని చెప్తారు. కాని అది ప్రస్తుతము అగ్రకులాల భుక్తమైనది. ఆ, ఆలయానికి ప్రస్తుతము అర్చకులుగా శ్రీ దాశరధి సుధాకరయ్యగారు ఉన్నారు. ఇతను మాల కులస్తుడు. రేచర్ల గోత్రజుడు.

మహబూబు నగరు (మాలమూరు) జిల్లాలోని త్రైలోక్యమాలపురము లేదా త్రిలోకమాలపురము అనే గ్రామములోను ప్రస్తుతము ఈ గ్రామానికి 'గంగాపురము' అని పేరిడినారు. శిలాశాసనాల ప్రకారము ఇది 'మాలపురము' అని ఉన్నది) మరియు రాయలగండి కొండ మీద సుస్థిర స్థావరాలు ఏర్పరచుకుని, అనుగురాజు - దొడ్డ నాయుడు (మంత్రి) మరియు సర్వసేనాపతి తెప్పలినీడు (మాల కులస్తుడు ఇతని కుమారుడే సేనాపతి మాలకన్నమనీడు) మిగిలిన సపరివారము ఉన్నారు. అచ్చట నుండి పల్నాడును ఆక్రమించారు.

అలుగురాజు జననం పల్నాటి ప్రాంతంలో జనసామాన్యంలో చిన్నకథ ఒకటి బహుళ ప్రచారములో ఉన్నది. ఒకనాడు అలుగురాజు యొక్క తల్లిగారు, నిండు చూలాలుగా ఉన్నప్పుడు ఆ ప్రాంతంలో సాయంసమయమున పొలాలపై (చేలగట్లపై) నడుస్తున్నప్పుడు, ఆమెను పురిటి నొప్పులు వచ్చినవట. ఆ సమయమున ఆ ప్రాంతమున పనిచేయుచున్న వ్యవసాయ కూలీలు ఆమె చుట్టూ అలుగులు (గునపాలు) పాతి వాటికి పంచెలు చుట్టినారట. ఆ అలుగుల మధ్య ఆమె మగబిడ్డలు కన్నదట. అందువలన అతనికి, అలుగురాజు అని పేరు వచ్చినదట అనే కథ బహుళ ప్రచారము పొందినది.

ఓటిగుళ్ళు 'లేదా' వట్టిగుళ్ళు :

మొదట్లో గుహలే ఆలయాలుగా మల్చుకున్న జైనులు, ఆ తరువాత కొంత

కాలానికి జనసంచారానికి చేరువలో నదీతీరాల్లో, మైదాన ప్రాంతాల్లో, పెద్ద పెద్ద తటాకాల సమీపంలో ఆలయాలు నిర్మించారు. ఆనాడు వారు కట్టించిన ఆలయాలనే నేడు మనం 'వట్టిగుళ్ళు' అంటున్నాము. 'వట్టిగుడి' అంటే విగ్రహం లేని ఆలయం అని అర్థము.

కృష్ణానదీ తీరాన ఈ 'వట్టిగుళ్ళకు' కేంద్రస్థానం 'మునిమాణిక్యం' అనే గ్రామము. అదే విధంగా పల్నాడుప్రాంతంలో మాదిరాజుపాడు (దీనిని మాదిగరాజుపాడు అంటారు) ఇది మాచర్లకు 10 కిలో మీ. దూరంలో బుగ్గవాగు నది ఒడ్డున ఉండేది. నాగార్జున సాగర్ జలాశయం నిర్మించినప్పుడు ఈ 'బుగ్గవాగు' అందులో మునిగిపోయినది. పూర్వమున్న మాచర్ల (మాలచర్ల) కు దక్షిణంగా ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మాలపల్లి (ఇప్పటి మాచర్ల)కి చుట్టూ ఎనిమిది ఓటిగుళ్ళు మధ్యలో కొన్ని ఉండేవి. పెద్ద ఓటిగుడి అని ఒకటి నేటికి ఇచ్చట కలదు.

దీనిని బట్టి చూస్తే, మాచర్ల (మాలచర్ల)కు సమీపములోని మాలపల్లి వాసులంతా ఒకనాడు జైన మతస్తులని తెలియుచున్నది. 'చెన్నకేశవస్వామి హరిజనార్చకులు' అనే గ్రంథములో ఈ విషయాలు విపులంగా ఉన్నవి. (రచయిత గంధం నాగేశ్వరరావు)

కోడిపోరులో రాజ్యాన్ని కోల్పోయి, వలసజీవితం దుర్భరంగా అనుభవిస్తున్న మాలదేవుడు (మలిదేవుడు), ఆనాడు హోయసలనేలు మాలరాజు (మాకరాజు) ను ఆశ్రయించి ఇరవైరెండు గ్రామాలను అద్దెక తీసుకుని, బ్రతుకు తెరువు అచ్చటే గడిపారు. ఈనాడు కూడా శ్రీశైలంలో దేవుడు, 'మాలన్న' లేదా 'మల్లన్న' అంటారు' 'శ్రీశైల మాలన్న' అనడం పరిపాటి. మరియు శ్రీశైల ఉత్సవదినాన మొదటి రోజు, క్రొత్త నూలుపోగు సొంత మగ్గం పై వడికి, గుడిచుట్టూ అచ్చట మాల కులానికి చెందిన ఒక 'పెద్ద' చేత చుట్టించడం ఈనాటికీ పరిపాటి. దీనిని బట్టి శ్రీశైల పరిపాలకులు కూడా మాల వంశస్తులు అని ఘంటాపథంగా చెప్పవచ్చును.

చాపకూటి సిద్ధాంతము : ఎందుకో తెలియదు కాని ఆంధ్రదేశంలో చరిత్రకారులు, మేధావులు రెచ్చిపోయి, ఈ చాపకూటి సిద్ధాంతాన్ని బ్రహ్మనాయునికి ఆపాదించి, అతనిని ఒక సంఘ సంస్కర్తగా తయారుచేశారు. మరి నేటికీ అనేకమంది మేధావులు

(ఆంధ్రలో) చరిత్ర తెలుసుకొనకుండా మాట్లాడటం, విచారకరం.

1. వర్ణరహిత సమాజం కొఱకు బ్రహ్మనాయుడు చాపకూడు పెట్టించాడని 2. చెన్నకేశవ ఆలయంలో హరిజనులను ప్రవేశపెట్టి చాపకూడు పెట్టించాడని చెప్పారు.

ఆనాడు చెన్నకేశవ ఆలయాలకు అర్చకులుగా హరిజనులున్నారు. వారే రాజ్యాధికారంలో ప్రముఖులు. అలాంటప్పుడు ఇతను చాపకూడు పెట్టించాడని చెప్పడము పచ్చి అబద్ధం.

పల్నాటి చరిత్ర మొత్తము వివిధ గ్రంథాలు (ఆంధ్రదేశంలో) కూలంకషంగా పరిశీలించాను. పల్నాటి ప్రాంతాన్ని స్వయంగా పర్యటించాను. వీర విద్యావంతుల నుండి కథలు విన్నారు. మొత్తంమీద ఈ 'చాపకూడు' రెండుసార్లు మాత్రమే మనకు కనిపిస్తుంది.

1. పల్నాటిరాజులు మరియు సామంతరాజులు కలిసి సహపంక్తి భోజనాలు చేయడం. (ఇది బ్రహ్మనాయుడు పెట్టించింది కాదు).

   క్రీడాభిరామంలో

   "ఇచ్చోట భుజియించి రేక కార్యస్థులై
   సామంత నృపతులు చాపకూడా"

2. అలరాజు మరణాంతరము, పల్నాటిలో ఇరువర్గాలు పోరుకు సంసిద్ధులౌతారు. సంధి కార్యక్రమాలు కూడా మొదలౌతాయి. చిట్ట చివరకు నలగాముడు మరియు మాలదేవులు సంధికి సంసిద్ధత తెలియపర్చుతారు. ఆ సంతోషములో ఒకసారి సహపంక్తి భోజనాలు జరుగుతాయి. (ఈ సంధి కూడా బాలచంద్రుని ఉన్మత్త ప్రేలాపనల వలన విఫలమౌతుంది). దీనిని C.P. Brown "A heap of boild rice poured on a sheet of cloth అన్నారు.

అంతేకాని పల్నాటి చరిత్రలో సంఘాన్ని ఉద్ధరించే ఉద్దేశ్యము ఒక్కసారి కూడా బ్రహ్మనాయుడు చాపకూళ్ళు పెట్టించలేదు. ఇది ఒకసారి విజ్ఞులు, మేధావులు నిశితదృష్టిలో పరిశీలించాలి.

నాయకురాలు నాగమ్మ

కరీంనగర్ జిల్లా (సబ్బి మండలము) మాలోల్ల సంస్థానము (చరిత్రకారులు మాల్యాల సంస్థానం అని పేర్కొంటున్నారు) లేదా మాలల సంస్థానములో ఆరవెల్లి గ్రామము నుండి ప్రవాసముగా, ధన, వస్తు, గో గణాలు మందీ మార్బలంతో పల్నాడు చేరినది. గురజాల నుండి పొందుగల అడవులకు వెళ్ళే మార్గమధ్యంలో, ఈ నాగమ్మ ఒక గ్రామాన్ని నిర్మించినది. దాని పేరు 'మాలపాడు' అందులో ప్రజలంతా మాలలే కనుక ఆ పేరు పెట్టినది. ఆ పేరు క్రమముగా 'గామాలపాడు' గా మారి తరువాత 'జెట్టి గామాలపాడు' గా రూపాంతరము చెందినది. ఇది 'జెట్టిగాల్లమాలపాడు' ఎక్కువగా వస్తాదులు, యుద్ధ వీరులు జెట్టీలకు సయ్యనేవారు ఉండటం వలన ఈ పేరువచ్చి ఉంటుంది. ఇది క్రమముగా జిట్టగామాలపాడు అయ్యింది. మాలపాడు రూపాంతరము చెందలేదు. దీనిని బట్టి నాగమ్మ మాలవంశ సంజాత అని అర్థమగుచున్నది.

అనుగురాజు (అలుగురాజు) వేటకు పొందుగల అడవులకు వెళ్ళి తిరిగి గురజాల వస్తున్నపుడు, మార్గమధ్యంలో 'మాలపాడు' నందు నాగమ్మ విందు ఏర్పాటు చేసినది. దారి పొడవునా చలువ పందిళ్ళు, షడ్రసోపేతమైన వంటకాలతో భోజనాలు పెట్టించింది. వేట నుండి తిరుగు ప్రయాణమై అలసిఉన్న అలుగురాజు, నాగమ్మ విందు వినోదాలతో సేద తీరాడు. ఆ మురిపెంలో ఏదైనా కోర్కె కోరుకొమ్మని అడిగినాడు. అప్పుడు పల్నాటి మంత్రిత్వము ఏడుగడియలు ఇవ్వమని కోరినది. ఆనాట నుండి రాజుతో సాన్నిహిత్యము సంపాదించి, రాజు కొలువుకు తరచూ వస్తూ పోతూ ఉన్నది. అలుగురాజు నాగమ్మతో ఎంత చనువుగా ఉన్నప్పటికి అతను బ్రతికి ఉండగా 'మంత్రిణి' చెయ్యలేదు. అది అతని రాజనీతిజ్ఞత అనుకొనవచ్చును.

అలుగురాజు మరణాంతరము అతని కుమారుడు 'నలగాముని' వద్ద మంత్రిణిగా చేరినది (ముఖ్యసలహాదారు అనుకొనవచ్చును).

నాగమ్మ మంత్రిణి అయిన తరువాత కొంతమంది యువకులను చేరదీసి సాముగరిడీలు నేర్పినది. కత్తిసాము, గుఱ్ఱపుస్వారి నేర్పి సొంత దళాన్ని తయారుచేసుకున్నది. వారిని జెట్టీలు (కుస్తీపట్టేవారు) అనేవారు. ఆనాటి నుండి

'మాలపాడు' జెట్టిగా(ల్ల)మాలపాడు అయినది. అది క్రమముగా జిట్టగామాలపాడు అయింది.

నాగమ్మ ఒక శివాలయము, పెద్ద తటాకము, ఒక ఆశ్రమాన్ని నిర్మించుకున్నది. ఒక పెద్దపూలతోట పెంచినది. నేడు ఆప్రాంతము మాగాణి అయినా, ఆ ప్రాంతవాసులు నేటికి ఆ మాగాణి భూములను, పూలతోట అని సంబోదిస్తారు. ఆ యొక్క తటాకమునందు ఈత, శివాలయమునందు అర్చన, ఆశ్రమములో విశ్రాంతి, సాయంసమయమునందు రాజకీయ కార్యకలాపములందు పూర్తిగా నిమగ్నమై యుండెడిది.

ఆరవెల్లి : కరీంనగర్‌నుండి జగిత్యాల వెళ్ళే మార్గములో 40 కి.మీ దూరంలో మాలోల్ల జంక్షన్ (మాల్యాల జంక్షన్) ఉన్నది. అక్కడ నుండి 10 కి.మీ నడచి వెళ్తే 'ఆరవెల్లి' వస్తుంది. నాగమ్మది ఆరవెల్లి అని చెప్పినవారు 1. భక్త పలనాటి వీర చరిత్ర శ్రీ కలవల వెంకట సుబ్బారావుగారు 2. పలనాటి వీరకధాచక్రము డా॥ తంగిరాల వేంకట సుబ్బారావు. వీరే కాక ఎక్కువమంది చరిత్రకారులు వొప్పుకున్న సత్యమిది.

పల్నాటి యుద్ధములో విజయము సాధించి బ్రహ్మనాయని హతమార్చిన తరువాత కొంతకాలానికి నాగమ్మ (నాగమ్మ యుద్ధంలో మరణించినదని చెప్పుట బాలచంద్రుడు సంహరించాడని చెప్పుట అభూత కల్పనలు) తన సొంత గ్రామము 'ఆరవెల్లి' వెళ్ళినట్లు రూఢిగా తెలుస్తున్నది.

ఆరవెల్లి చేరిన తరువాత, అచ్చట వీరమరణము చెందినది. ఒక కథ ఆ ప్రాంతము జనసామాన్యములో నేటికీ ఉన్నది : 'బల్మూరి కొండరాయుడని' ఒక బందిపోటు దొంగ ఆరవెల్లి ప్రాంతాన్ని దోచుకొనుచుండెడివాడు. ఒకనాడు ఒక వృద్ధ స్త్రీ ఆ ఊరు ఒంటరిగా ఒక గుట్టముపై చేరుకొన్నది. నాది ఈ ఊరే అని చెప్పినది. కాని ఎవ్వరూ నమ్మలేదు. తరువాత తన శేష జీవితాన్ని మీతో గడపడానికి వచ్చానని చెప్పింది. అయినా నమ్మలేదు. చివరకు కడారి జింకడు (మాల కులస్థుడు) అనే వీరుని చేరదీసి, సాము గరిడీలు నేర్పినది. అనుకున్న విధముగా కొండల రాయుడు రానే వచ్చాడు. అతనిని కడారిజింకడు ఎదుర్కొని ఢీకొని వీరోచితంగా పోరాడి, వీరమరణం పొందాడు. ఆ సమయములో నాగమ్మ

కూడా పోరాడినది. పారిపోయిన కొండలరాయుడు తగిలిన దెబ్బలకు మూడు రోజులకు మరణించాడు అని ఆ తరువాత తెలిసినది.

పై కథను బట్టి బాలచంద్రుడు నాగమ్మను హతమార్చాడని చెప్పుట అబద్ధాల పుట్టగా తోస్తున్నది. "పై కథను ఆరవెల్లి గ్రామపెద్ద శ్రీ కస్తూరి మల్లేశంగారు, నూకపల్లి వాస్తవ్యులు బండారు కేశవరావుగారు, నుస్తులపూర్ తెలుగు పండితులు శ్రీ నన్నపరాజు హనుమంత రాజుగారు గుడి అర్చకుడు శ్రీ నగునూరి వెంకటయ్యగారు మొ॥వారి చెప్పిరి (పల్నాటి చరిత్ర - గుజ్జం చెన్నారెడ్డి).

రూపాంతరం

మాలపాడు

జెట్టిగాళ్ళ - మాలపాడు

జెట్టిగా(ళ్ళ) మాలపాడు

జెట్టగామాలపాడు

అలనాటి నాగవంశాలేనేటి దళితులు :

నేటి దళిత జాతులు, ప్రాచీన నాగవంశానికి వారసులు అన్న విషయము మన చరిత్రకారులంతా ముక్తకంఠంతో ఒప్పుకున్న విషయము మనకు తెలిసినదే.

నాగులపై ఎక్కువగా పరిశోధన చేసిన సి.యస్. హార్టహెూం ఇలా వ్రాశారు. "ప్రాచీన కాలము నుండి ద్రావిడ ప్రజలు చేర, ,చోళ, పాండ్యులుగా చీలిపోయి ఉన్నారు. ద్రావిడులలో "చేర" లేక "శార" శబ్దం "నాగ" శబ్దానికి తుల్యార్థకం - 'శారమండలం' అనగా నాగద్వీపం లేక నాగదేశం".

పైన చెప్పిన విషయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే 'శారమండలం' అనగా 'నాగదేశం' అనగా దళితులు నివసించిన దేశము. ఈ శారమండలాన్ని చేరమండలంగా సంబోధించారు. తరువాత 'చోరమండలం' (Chora mandalam)గా మార్పు చెంది, ప్రస్తుతం కోరమండలం (Choramandalm) అంటున్నారు. ఈ కోరమండల తీరము అనగా మద్రాస్ నుండి విశాఖపట్నం వరకు ఉన్న సముద్ర తీరము అని ప్రస్తుతము అర్థము. ఈ ప్రాంతము మొత్తము

పూర్వకాలములో దళితుల ఆధీనములో ఉండెడిది. అందువలననే దీనిని నాగద్వీపము లేదా నాగదేశము, శార మండలము లేదా చోరమండలము అన్నారు.

ప్రొఫెసర్ : దక్షవార్ తన "రామాయణంలోని దక్షిణాపథం" అనే వ్యాంలో ఇలా వ్రాశారు. నాగులు సముద్రయాన జాతి వారు నాగరికతకు సౌందర్యానికి ప్రసిద్ధి చెందనది. వారు కీ.శే 10వ శతాబ్ధములో అధికారానికి వచ్చిన చోళ వంశాలతో వాళ్ళు కలసి పోయారు."

పై విషయాన్ని బట్టి మొట్టమొదట నౌకాయానము చేసినది దళిత జాతులే. నాగరికత నిర్మించినది వీరే. నావ(గ) జాతులే నాగరికత నగ, నగరం, నాగరం, నావికులు, నాగలి మొ॥న పదాలు ఈ నాగవంశము నుండి ఉద్భవించి ఉండవచ్చును. ఆర్యులు నౌకాయానాన్ని పాపంగా భావించి, అభివృద్ధి నిరోధకులుగా తయారైన రోజులలో, ఈ దళితులే అంతర్జాతీయ వర్తకాన్ని అభివృద్ధి చేశారు అనే విషయాన్ని గమనించాలి.

చిలుకూరి వీరభద్రరావుగారు 'ఆంధ్రుల చరిత్రము'లో యిలా వ్రాశారు. "మనదేశ చరిత్ర వ్రాసిన గ్రంథముల యందు, (పాశ్చాత్యులు, హైందవ చరిత్రకారులు తాము వ్రాసిన గ్రంథములయందు నాగుల (మాల-మాదిగల) చరిత్రను విశదీకరించక ఏమి కారణము చేతనో విస్మరించియున్నారు. నాచుచే కప్పబడిన శుద్ధ జలమువలె వీరి చరిత్ర యంతయు పురాణ గాధలచే కప్పబడి నేత్రములకు గోచరముగాక యుండెను. ప్రాధమికార్యులు దస్యులతో పోరాడినట్లుగ ఋగ్వేదార్యులయందు తరచుగా గనపడుచుండినను, తరువాత వచ్చిన యార్యులీ నాగులతోడను, నాగ కుటల తోడను, పోరాడినట్లుగా మహాభారత గ్రంధములయందు గానపడుచున్నది.

పాతబస్తీలన్నీ (పట్టణాలు) దళితుల నివాసాలే!

దళితులే ఈ దేశ ఆదివాసీలు అని చెప్పడానికి ఇంకొక అంశము దోహదపడుతుంది. భారతదేశంలో ఏ పట్టణాన్ని తీసుకున్నప్పటికి Old Town (పాత నగరం, పాత పట్టణం, పాత బస్తీ అనవచ్చు) అనగా దళితులే నివసిస్తున్నారు. లేక మతం మార్చుకున్న దళితులున్నారు. ఉదా॥ పాత గుంటూరులో మొత్తం

దళితులే లేదా మతమార్పిడి (ముస్లిం మతంలోనికి) వెళ్ళినవారు అనగా ముస్లింలు, మరియు హైదరాబాదు పాతబస్తీలో కూడా దళితులే, Old Delhi (పాత ఢిల్లీ) లో కూడా దళితులే. పాత విజయవాడ కూడా అదేవిధముగా ఉననది. ఆంధ్రదేశంలో ఏ పాత పట్టణం తీసుకున్నా, ఏ పాతనగరం గమనించినా, లేదా దేశంలో ఏపాత నగరం తీసుకున్నా (గమనించినా) దళితుల నివాసాలే! దీనిని బట్టి ఒకనాటి ఆదిమవాసులు, గుంపులు గుంపులుగా భారతదేశం మొత్తం నివసించారు. తరువాత వలసవచ్చిన జాతులు, వారికి దూరంగా స్థిరపడ్డారు. మొదట దళిత పల్లెలు ఉండేవి. వాటికి దూరంగా 'ఊరు' ఏర్పడినట్లు మనం అర్థంచేసుకొనవలసి ఉంటుంది. ఈ దేశ ప్రాచీన జాతులు దళితులే అనే విషయానికి ఇదొక ఉదాహరణ మాత్రమే.

రేచర్ల గోత్రం - మాలల సంబంధం

ఆంధ్రదేశంలో ముఖ్యంగా, కోస్తా జిల్లాలలో మాలలు నేటికీ వారిది 'రేచర్ల గోత్రము' అని చెప్పుకొనుచున్నారు. ఈ గోత్రము పల్నాడు ప్రాంతము (గుంటూరు జిల్లాలో)లో చాలా ప్రాముఖ్యత సంతరించుకున్న విషయాన్ని తెలుసుకుందాం. ఈ రేచర్ల గోత్రము వెనుక ఒక చిన్న కథ ఉన్నది.

"వెంకటగిరి సంస్థాన వంశ చరిత్రనందు వంశావళి చేవిరెడ్డి వద్ద నుండి చెప్పబడినది. చేవిరెడ్డియు, మరొక మాలవాడు పొలం దున్నుచుండగా ధనం దొరికెననియు, ఆధనమునకా మాలవానిని బలియిచ్చి వాని అభీష్టము ప్రకారము చేవిరెడ్డి తన గోత్రనామమును 'రేచర్ల' గా మార్చెనని దచ్చరిత్ర యందు వ్రాయబడినది. (అక్కిరాజు ఉమాకాంతంగారు).

దీనిని బట్టి రేచర్ల గోత్రము 'మాల'వారిదని తెలియుచున్నది. మాలవానిని హతమార్చి ఆ ధనముతోపాటు వారి గోత్రాన్ని కూడా సొంతము చేసుకొనినట్లు తెలియుచున్నది. అయితే ఇచ్చట ఒక వివాదాస్పదమైన అంశము కన్పించుచున్నది. మాల వాని అభీష్టము మేరకు, అనగా మాలవాని ఇష్టము మేరకు, అతని హతమార్చి గోత్రాన్ని తీసుకున్నారట. ఇది చాలా విడ్డూరముగా ఉన్నది. అతనిని హత్య చేసి, తరువాత అతని అభీష్టము మేరకు అని కథలల్లినారు. మన చరిత్రకారులు (ఆంధ్రచరిత్రకారులు) వెలమ దొరల నాయకుడైన బ్రహ్మనాయునికి ఈ గోత్రాన్ని (రేచర్ల) ఆపాదించినాడు.

పై గోత్రనామాన్ని బట్టి అనేక గ్రామాల పేర్లు వచ్చినవి. ఈ రేచర్ల నుండియే మాచర్ల, (శిలా శాసనాలలో మాల్ చర్ల (మాలచర్ల) మహాదేవిచర్ల అని ఉన్నది. పేరేచర్ల, చర్ల, చేజర్ల, చెర్లగుడి, ఒప్పిచర్ల, రొంపిచర్ల, నల్లజర్ల వచ్చి ఉండొచ్చు రేచర్లపేట కాకినాడలో కలదు. దానిలో మొత్తం 'మాలలు' నివసించడం పరిశోధించాల్సిన అంశముగా ఉన్నది.

పేరాల - చీరాల (ప్రకాశం జిల్లా) : ఈ రెండు గ్రామాలు కూడా మొత్తం మాలలే నేటికీ నివసించుచున్నారు. చీరాల నందు 20పేటలలో మాలలు నివసించటము గమనించవచ్చు పాతచీరాల - పేరాల అనగా మాలపల్లి అని అర్థము. మాలవారి గోత్రము రేచర్ల క్రమముగా పే(రే)రేచర్ల. పేరేచర్లగా మారి, పేరేల - చరాలగా ఏర్పడి తరువాత పేరాల - చీరాలగా రూపాంతరము చెంది ఉండవచ్చని నాకనిపించుచున్నది.

రేచర్ల

పేరేరేచర్ల

పేరేచర్ల

పేరేచరల

పేరల - చరల

పేరాల - చరాల

పేరేల - చీరాల గా మారి ఉండవచ్చును.

అని నాకు అనిపించుచున్నది.

మాలవారి - తలంబ్రాలతో 'వెలమవారి' పెండ్లి జరిగేది :

రేచర్ల గోత్రజులు, గోసంగి ఇంటి నామధేయుల పెండ్లి జరిపి, ఆ తలంబ్రాలు తెచ్చుకుని నాడు వెలమ కులస్తులు పెండ్లి జరుపుకోవలెనని ఆదేశముండెడిది. అనగా పల్నాటి సేనాని మాల కన్నమనీడు గోత్రము వారికి ఎవరికైనా పెండ్లి జరిపి ఆ తలంబ్రాలు తెచ్చుకుని వెలమకులస్తులు (బ్రహ్మానాయుడి వంశమువారు

వివాహము జరుపుకొనవలెను. ఆ మాటలనే పల్నాటి చరిత్రలో గుర్రం చెన్నారెడ్డిగారు ఈ విధంగా అన్నారు. "వెలమవారు పెండ్లి జరుపుకోవలెనంటే, రేచర్ల గోత్రీకులైన కన్నమదాసు వంశము వారికి ముందుగా పెండ్లి జరిపి, ఆ తలంబ్రాలతోనే పద్మనాయక వెలములు, పెండ్లి జరుపుకోవాలి" (నేటికి కూడా ఈ తంతు కొన్ని ప్రాంతాలలో జరుగుతుంది) దీనిని బట్టి నాటి మాల వంశస్తులు (కులస్తులు) సామాజికంగా, రాజకీయంగా ఆర్థికంగా చాలా ఉన్నతులని తెలియుచున్నది. అలాంటప్పుడు బ్రహ్మనాయుడు (వెలమకులస్తుడు) దళితులను దేవాలయ ప్రవేశం చేయించాడని చెప్పడం చాపకూటి సిద్ధాంతం ద్వారా వర్ణ వ్యవస్థను రూపుమాపటానికి పాటుపడ్డాడని చెప్పడము పచ్చి అబద్ధము. ఆ రోజులలో (12వ శతాబ్ధంలో) ముఖ్యముగా పల్నాటి ప్రాంతంలో (గుంటూరు జిల్లా) అన్ని కులాలు, దళితులు ప్రాపకం కొఱకు ప్రాకులాడుతున్నప్పుడు, ముఖ్యంగా వెలమవారి మనుగడ (బ్రహ్మనాయుడు) మాల కులస్తుల అండతో (మాల కన్నమనాయుడి) ఉన్నప్పుడు బ్రహ్మనాయుడు సంఘాన్ని ఉద్ధరించాననడం పొరపాటు. ఒకవేళ ఉద్ధరిస్తే ఏ సమాజాన్ని ఉద్ధరించారో చరిత్రకారులు, మేధావులు చెప్పాలి.

బ్రహ్మనాయుని జననంలో రహస్యం దాగి ఉన్నట్లు కన్పిస్తుంది.

మాల తెప్పలీడుకి పుట్టిన కుమారుడు బ్రహ్మనాయుడా?????

బ్రహ్మనాయుడికి, సేనాపతి తెప్పలినీడు భార్య పెనుమాలమ్మ (ఈమెను పెమ్మసాని, రూపవతి అనికూడా అంటారు)కు అక్రమ సంబంధం ఉన్నదని, బ్రహ్మనాయుడికి, పెమ్మసానికి పుట్టినవాడే, మాల కన్నమనీడు అని, శ్రీనాథుడు, అక్కిరాజు ఉమాకాన్తం, ముదికొండ వీరభద్రకవి మొ॥న బ్రాహ్మణ మేధావులు రచించారు. వీరికి ఈ ఆలోచన ఎలా వొచ్చినదో తెలియదు. జనసామాన్యంలో కూడా ఇలాంటి కథలేవి ప్రచారంలో లేవు. బ్రహ్మనాయుడు విష్ణుంశ సంభూతుడని భావించి భావదాస్యానికి లోనై, కనీస తర్కజ్ఞానం లేకుండా వ్రాసినట్లు నాకపించుచున్నది.

అలుగురాజుకు, సర్వసేనాపతి మాల తెప్పలనీడు, మహామంత్రి దొడ్డనాయుడు. తెప్పలి భార్య పెనుమాలమ్మ, దొడ్డనాయుని భార్య శీలమ్మ. అనగా మంత్రి కంటే సేనాపతి వయస్సులో చిన్నోడు అయిఉంటాడు. లేదా సేనాపతి (తెప్పలి) మరియు మంత్రి (దొడ్డనాయుడు) ఒకే వయస్సు వారు అయి ఉంటారు (ఇంచుమించుగా). తెప్పలి కుమారుడు, కన్నమనీడు, దొడ్డనాయుడి కుమారుడు బ్రహ్మనాయుడు. ఇది న్యాయంగా జరగాల్సిన విషయము.

అగ్రవర్ణచరిత్రకారులంతా మాల కన్నమనీడు జననాన్ని వక్రీకరించారు. ఎందువలనంటే, అరివీరభయంకరుడు, అఖండ అస్త్ర శస్త్ర నైపుణ్యుడు, జ్ఞాన తేజోవంతుడైన కన్నమనీడు మాల వంశంలో జన్మించడం ఓర్చుకోలేని ఆర్య (అగ్రకుల) చరిత్రకారుల, చరిత్రను వక్రీకరించారు అని చెప్పడానికి పెద్ద జ్ఞానం అక్కర్లేదు.

కన్నమనీడు జన్మానికి కారకుడనిచెబుతున్న బ్రహ్మనాయుడి పరిస్థితి చూడండి. బ్రహ్మనాయుడి భార్య ఐతమ్మకు, వివాహమైన పన్నెండు సం॥రాలు పిల్లలు కలుగలేదు. ఆమె పూజలనీ, నోములనీ తిరిగి తిరిగి 13 సం॥రాలకు ఒక బిడ్డను కన్నది.

అతని పేరు బాలచంద్రుడు. బ్రహ్మనాయుడు ఊర్లో ప్రజలందరికీ పుత్రభిక్ష పెట్టగలిగినవాడు సొంత ఇల్లాలికి ఆ మాత్రం కూడా ప్రసాదించలేకపోయాడా? ఐతమ్మకు కలిగిన సంతానాన్ని హత్య చేయించమని భటులను పంపాడు. ఐతమ్మ శీలాన్ని శంకించాడు. అందువలననే బాలచంద్రుడు, పేర్నీడు వద్ద పెరుగుతాడు. పై విషయాలన్నీ కథకులు చెప్పే వీరగాథలలో స్పష్టంగా ఉన్నవి. మరి వీరగాథల ఆధారంతోనే కదా పల్నాటి వీరచరిత్ర వ్రాసినది. (మొత్తం చరిత్రకారులంతా) మరి చరిత్రకారులు ఈవిషయాన్ని ఎందుకు వదిలి వేశారు?

కథకుల గాథల ప్రకారం జొన్న చేను దోపిడి చేసిన తరువాత, ఆ జొన్న కంకులు అంతఃపురానికి తీసుకుని వచ్చి తెప్పలి నీడు వాటిని అంతఃపుర కాంతలకు చూయించెను. ఆ జొన్న కంకుల ఎడల అమితంగా ఇష్టపడినది శీలమ్మ (బ్రహ్మనాయుడి తల్లి) ఆమె తెప్పలినీడిని వేడ్కతో కలసి జొన్న కంకులు ఇంకా

కావాలని అడిగినది. తెప్పలికి, శీలమ్మకు ఆ చనువు ఉన్నట్లు కథకుల వీరగాథలు పరిశీలించిన అర్థమగుచున్నది.

ఉదా : గుంటూరు జిల్లా, పిట్టల వాని మండలం పెదపల్లి గ్రామ నివాసి (అల్లూరు, భావాజీపాలెం) 1. కర్రా పోతురాజు ప్రధాన కథకుడు ఇతని తాత 2. కర్రా రామదాసు మరియు పోతురాజు చిన్నాన్న 3. కర్రా నరసింహుల వీరి వంశము యావత్తూ ఈ పల్నాటి కథను గానం చేసెడివారు. చేస్తున్నారు.

వారు చెప్పినది ఏమనగా, "జొన్న చేను నుండి (కాపలాదారుడ్ని కుంటిరెడ్డి అని కథకులు చెప్పారు.) తెచ్చిన జొన్నలు, దుప్పట్లపై కొట్టి వాటిని తూర్పార పట్టి, కొన్ని శీలమాదేవికి (బ్రహ్మనాయుడి తల్లి) ఇచ్చాడు. శీలమాదేవి ఆ జొన్నలు చూచి (ముత్యాల్లా ఉన్నాయి) మురిసిపోయింది. తాను అలిగి, సొగసుగా వగలుపోయి, వీర తెప్పలిని ముద్దారా పిలచి, జొన్నలు ఇంకా తెమ్మని అడిగింది. మురిసిన తెప్పలి ముదము తోడ సైన్యాన్ని జొన్న చేను కొయ్యమని ఆజ్ఞాపించాడు. ఒక్క స్త్రీ కొఱకు వేయి కుచ్చెళ్ళ చేను కోశారు. స్త్రీల కొఱకు రాజ్యాలు, రాజులు పతనమయ్యారు కదా? ఇదీ అంతే.

దీనిని బట్టి ఏదో దగ్గర సంబంధము వీరతెప్పలికి, శీలమాదేవికి ఉన్నట్లు తోస్తున్నది. ఈ జొన్నచేను గొడవతోనే కదా చివరకు మాల తెప్పలి అంతరించినది. ఆమె కొఱకు ప్రాణాలు సైతం లెక్కించక వదలి వేశాడంటే కారణమేమై ఉంటుందో? ? ?

విజ్ఞులు, మేధావులు, చరిత్ర కారులు సహృదయంతో ఇచ్చు సలహాలు స్వీకరించగలవాడను.

మీ


ఆరార్ బొనిగల



తన ముగ్గురు భార్యలతో నలగామ చక్రవర్తి

"సింహాల నుండి ఒక చరిత్రకారుడు జన్మించే వరకు, వేట, వేటగాని యొక్క ఘనత గొప్పగా చాటుకుంటూనే ఉంటారు"

- ఆఫ్రికన్ సామెత.



పల్నాటి సర్వసైన్యాధిపతి కన్నమనీడు

బాల కన్నమడు బంగారు కొండ
వీర కన్నమడు విప్లవయోధుడు
మాల కన్నమడు మహాలో శూరుడు
కర్రసాములో వీరుడు కుర్ర కన్ననీడు
కత్తిసాములో కన్నమడికి ఎదురేలేదు
మల్లయుద్ధంలో మగధీరుడు వాడు
పల్నాటి పౌరుషానికి ప్రతీక వాడు
పగవారిగుండెల్లో నిదురపోతాడు
పగలాడి పలపుల్లో నిలచి ఉంటాడు
తెగువలో తెప్పలన్నకు తక్కువగాడు
తల్లి మాలమ్మ ముద్దుల తనయుడు వాడు
గోసంగి ఇంటి పేరుకు గౌరవం వాడు
రేచర్ల గోత్రానికే రేచుక్కవాడు
మాచర్ల పల్లెలో మొనగాడు వాడు
నాగులేటిలో వాడి నయనంబు చూడు
పల్నాడులో వాడి పౌరుషంబు చూడు
మాలవంశానికే మణిపూస వాడు
నల్గొండపై నల్లని గుర్రాన్ని చూడు
గుర్రాన్నెక్కిన కుర్రాడ్ని చూడు
కుర్రాడి కున్న కోర మీసాన్ని చూడు
మీసానికున్న రోషాన్ని చూడు

ఎర్రచారికల కనుగుడ్లు చూడు
నల్లని గిరిజాల జుల్పాలు చూడు
కాలికున్న వెండి కడియం జూడు
చేతికున్న వీర కంకణం జూడు
రాతిబండర్లాంటి కండల్ని చూడు
కొదమ సింహం లాంటి అడుగులు చూడు
మత్తగజం లాంటి మందగమనం చూడు
మగసిరి జ్వలిస్తున్న మోమును చూడు
అగ్నిపర్వతం లాంటి అణుకువచూడు
మంచుకొండ లాంటి మనసును చూడు
మొలనున్న పచ్చల పిడికత్తిని చూడు
మెడనున్న బంగరు పులిగోరును చూడు
అడుగులేస్తుంటే పడుతున్న పిడుగులు చూడు
శతృమూకలను తుదముట్టించు వాడు
మిత్రవర్యులకు తన ప్రాణమిచ్చువాడు
మింటి కెగసిన అగ్ని కీలలంటివాడు
రాచవంశలో సింహం వాడు
పోరులో రణశూరుడు వాడు
భూమిపుత్రుడు
మానధనుడు
మానసచోరుడు
మాలకుల సంజాతుడు
సర్వసేనాపతి అన్న కన్నమదు.

- ఆరార్ బొనిగల

పల్నాడులో తెలతెల వారింది

తొలివేకువన కూసిన కోడిపుంజుకూతతో త్రుళ్ళిపడ్డ పల్నాడు, పక్షుల రావాలతో, కాకుల అరుపులతో మేల్కొంది. మంచుతెరలు దట్టంగా కమ్ముకున్నాయి. తూర్పున ఉదయించిన సూర్యుడు మంచుతెరల్లో నుండి మసక మసకగా కనిపిస్తున్నాడు. కృష్ణానది నెమ్మదిగా గంభీరంగా ప్రవహిస్తుంది. దక్షిణాన పర్వతాలు, అడవులు ఉన్నాయి. పల్నాటిలో అంతఃపురం నెమ్మదిగా ఆలస్యంగా మేల్కొంటుంది. అంతఃపురానికి అల్లంత దూరాన ఉన్న మందిరం, తెప్పల్నీడుది. తెప్పలిని తెప్పలన్న, తప్పల్నాయుడు, మాల తెప్పలి అని సంబోధించడం పరిపాటి. తెప్పలి వేకువనే మేల్కొన్నాడు. వ్యాయామశాల నుండి గుఱ్ఱంపై మందిరానికి వచ్చినాడు. అప్పటికే మేల్కొని, పనులు పరిచారికలకు పురమాయిస్తున్న రూపవతి కనిపించింది. ఈమె తెప్పలన్న భార్య అతి సౌందర్యవతి, చూడ చక్కని చిన్నది. తళుక్కున మెరుస్తుంది. ఆమె ఒడ్డూ పొడవు చూచువారికి ముచ్చట గొల్పుతుంది. నుదుటన కుంకుమ బొట్టు, చేతుల నిండా గాజులు, కళ్ళకు కాటుక చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది. ఆమెను చూస్తే ఎవ్వరికైనా గౌరవ భావం కలుగుతుంది. అంతలో ఇంట్లో నుండి పరుగున వచ్చిన కుమారుడు తండ్రిని చూచి, తండ్రీ అనగా, ఆఁతండ్రి కన్నా! నా ముద్దుల తండ్రీ! అని దగ్గరకు తీసుకుని ముద్దాడినాడు. తన కుమారుని కన్నా! అని పిలుచుకుంటూ ఉంటారా తల్లిదండ్రులు. రూపవతి చందోలునందు ఒక భూస్వామికి లేక లేక కలిగిన కుమార్తె. గారాలపట్టి. చందోలు నందు డేరాలెత్తి వీర తెప్పలి తన సైన్యంతో ఉన్నప్పుడు ఆమె ఏడంతస్తుల మేడపై నుండి వీరతెప్పలిని చూచి మనస్సు పడినది. వీర తెప్పలి తన సైన్యముతో ఏడుదినములు డేరాలెత్తి అక్కడే ఉన్నాడు. కారణము ఆ ప్రాంతములో బందిపోటు దొంగల బెడద ఎక్కువగా ఉన్నది. ఒకరోజు వీరతెప్పలి తన తెల్లని అశ్వముపై వస్తుండగాః మేడపై నుండి పూలను తెప్పలిపై విసిరినది. ఆ చిన్నదాన్ని తలెత్తి చూచి, ఆశ్చర్యపడ్డాడు. ఏమి అందము ఇలాంటి యువతిని తాను ఇంతకు ముందెన్నడూ చూడలేదు అనుకున్నాడు. ఆమె తెప్పలన్నకు రెండవ దినమున పూలదండ విసిరినది. అది తెప్పలి మెడ నందు పడినది. తెప్పలి వెంటనే భూస్వామి వద్దకు తన అనుచరులలో ఇద్దరు పెద్దల్ని పంపినాడు. వివాహానికి భూస్వామి అంగీకరించలేదు. దానితో కోపం

చెందిన తెప్పలి తన పరివారంతో వెళ్ళి ఆమెనెత్తుకుని, పల్నాడు చేరుకున్నాడు. అందరి ఆమోదంతో రంగరంగ వైభోగంగా వివాహము చేసుకున్నాడు. ఆనాటినుండి రూపవతి పెద్ద తరహాగా వ్యవహరించడం వలన ఆమె పెనుమాలమ్మ అయినది.

అంతఃపురమంతా కోలాహలంగా ఉన్నది. రాజులు, రాకుమారులు, రాకుమార్తెలు, అలుగురాజు అతని భార్యలు, నలగాముడు నరసింగుడు, పెరుమాలరాజు, జెట్టిరాజు, పెద్దన్న, బాదన్న, పేర్నీడు, కొమ్మభూపతి, గండు కాంత సానెమ్మ, ఆమె కోడండ్రు. శీలమ్మ, దొడ్డనాయుడు మొదలగు పెద్దలందరూ తయారై వారి వారి విధులకు వెళ్తున్నారు. స్త్రీలు వారిని పంపిస్తున్నారు.

తెప్పలి కుమారుడైన కన్నముడు దినదినాభివృద్ధి చెందుతున్నాడు. తెప్పలి తన కుమారుడ్ని రోజు వ్యాయామశాలకు తీసుకుని వెళ్తున్నాడు. యుద్ధ విద్యలు నేర్చుకొనుటకు ఏర్పాటు చేసినాడు. కొమ్మ భూపతి వద్ద విలువిద్య నేర్చుకొనుచున్నాడు. కత్తిసాము, కర్రసాము, గుర్రపు స్వారీ నందు మేటి అనిపించుకొనుచున్నాడు.

పన్నెండు సం॥రాల ప్రాయంలోనే చదువునందు, యుద్ధ విద్యలనందు గట్టి వాడనిపించుకొనుచున్నాడు. గోసంగి ఇంటిపేరుకు రేచర్లగోత్రానికి పేరు తెస్తున్నాడు.

ఒకనాడు అలుగరాజు వేటకు బయలుదేరినాడు. అతనితోపాటు తెప్పలీడు కూడా అనుసరించాల్సి వచ్చినది. ఇది తెలిసిన కన్నముడు ఎంత వారించినా వినలేదు. నాయనా కన్నా! వేట అంటే బొమ్మలాట కాదు, మదపుటేనుగుల ఘీంకారాలుంటాయి, సింహాలు, పులులు ఘర్జిస్తుంటాయి. నీవు బాలుడవు వద్దు అని వారించాడు. వినలేదు. అందువలన కన్నముడ్ని కూడా వేటకు తీసుకువెళ్ళినాడు.

ఆరోజు రాజుగారు వేటాడి అలసిపోయి, ఒక చెట్టుక్రింద విశ్రాంతి తీసుకుంటున్నారు. పరివారము మొత్తము వారు తెచ్చుకున్న అల్పాహారము తింటుంది. అంతకు ముందు బాణం దెబ్బతిన్న ఒక పులి ఎక్కడ నుండి దూసుకు వచ్చిందో పరివారంపై పడినది. పరివారమంతా ఆ హఠాత్పరిణామానికి పారిపోయారు. రాజుగారి పైకి దూకబోతున్న పులిని కన్నముడు తన బాణంతో కొట్టాడు. వెంటనే గిల గిల కొట్టుకొని మరణించినది. ఆ ప్రమాదం నుండి రాజు

గారిని కాపాడినందులకు అందరు మెచ్చుకున్నారు. తెప్పల్నీడు కన్నముడ్ని ముద్దులతో ముంచెత్తాడు. ఈ విషయం తెలుసుకున్న పల్నాటి ప్రజలు కన్నముడిని వేనోళ్ళ పొగిడారు. ఇదంతా తెలుసుకున్న పెనుమాలమ్మ ఆ రోజు కన్నముడికి దిష్టి తీసి కడుపునిండా పంచభక్ష్యపరమాన్నాలు పెట్టి నిద్రపుచ్చినది.

కాలచక్రం చాలా వేగంగా కదులుతుంది. పల్నాటి ప్రజలందరూ సంతోషాలతో ఉన్నారు. శత్రురాజుల భయం లేదు. గుండె మీద చెయ్యి వేసుకొని నిద్రిస్తున్నారు. కన్నముడు 16 సం॥రాలు నుండి 17వ సం॥లో అడుగు పెట్టాడు. కుర్రవాడు చాలా చలాకీగా ఉన్నాడు. చూచిన వారు కొందరు ముచ్చటపడుతున్నారు. కొందరు ఈర్ష్యపడుతున్నారు.

కన్నముడు ఒక మదమెక్కిన అడవి గుర్రాన్ని తెచ్చాడు. కారునలుపుతో ఎదురెండకు నిగనిగలాడుతుంది. ఆ గుర్రం చాలా చిన్న వయస్సుది. దానికున్న పొగరుమోతుతనాన్ని లొంగదీసి, తర్ఫీదిస్తున్నాడు. దానికి ముద్దు పేరు పెట్టాడు. ఆ పేరు 'కారుమాల'! దానిపై స్వారీ చేస్తున్నాడు అది ఆఘమేఘాలపై కదులుతుంది. ఆ గుర్రం ధాటికి తట్టుకొని నిలువ గలిగిన గుర్రాలు పల్నాడులో చాలా కొద్దిమాత్రమే ఉన్నాయి.

ఒకనాడు సాయంత్రం మసక మసక చీకటిలో కారుమాలపై కన్నముడు ఇంటికి చేరుకున్నాడు. కన్నముని వస్త్రాలన్ని రక్తసిక్తమైనాయి. ముఖం, ఒళ్ళు, గీరుకుపోయి ఉన్నది. ఈ దృశ్యాన్ని చూచిన పెనుమాలమ్మ గుండె అదిరింది. పెద్దగా ఏడుస్తూ నాయనా కన్నా! ఏమిటిరా? ఏం జరిగింది? ఎందుకు గాయాలు తగిలాయి అని అడిగింది. అంతలో అక్కడకు చేరుకున్న రాజవైద్యులు, ఆ గాయాలపై ఆకుపసరు రాసి, భయపడవలసిన విషయము ఏమిలేదని చెప్పి వెళ్ళిపోయారు. అంతలో తెప్పలి వచ్చాడు. ఏడుస్తున్న రూపవతిని సంభాళించాడు. కన్నముని తల నిమిరి ఏమి జరిగిందో తెలుసుకొని భార్యకు ధైర్యం చెప్పి, నాయనా కన్నా! **'వీరుడుకి ఏమరుపాటు పనికిరాదు'** అని మాత్రం చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయినాడు.

కన్నమునికి ముద్దలు కలిపి ఒక్కొక్క ముద్ద తినిపిస్తూ, పెనుమాలమ్మ ఏం జరిగిందినాయనా! అని అడిగింది. అప్పుడు చెప్పాడు ఈ రోజు యువకులం

వేటకు వెళ్ళాం తల్లీ. అడవిలో వేటాడుతున్నపుడు పులులు సింహాలు బాణాల దెబ్బలకు పారిపోయినవి. నేను శూలం పుచ్చుకొని విజృంభించాను. వేటాడి అలసిపోయి మధ్యాహ్న ఎండవేళ చెట్ల క్రింద విశ్రాంతి తీసుకొనుచున్నాము. యువకులంతా దగ్గరలో ఉన్న జలపాతంలో జలక్రీడలాడుతున్నారు. నేను ఒడ్డున కూర్చుని నా ప్రక్కన శూలాన్ని పెట్టుకుని ఆ దృశ్యాన్ని చూస్తున్నాను. అంతలో దెబ్బతిన్న పులి ఒక్కటి దగ్గర పొదలో నక్కి ఉన్నది కాబోలు, ఒక్క ఉదుటన నాపై దూకినది. నేను శూలం కొఱకు వెతికాను, అది దొరకలేదు. వెంటనే పోరాటానికి దిగాను. పులి పంజా వేట్లు నాపై పడినవి. కళ్ళు బైర్లు కమ్మినవి. పరుగున చెట్టుచాటుకు వెళ్ళాను. పులి పరుగున వచ్చి పంజా ఎత్తి చెట్టును కొట్టినది. పులి రెండు కాళ్ళు పట్టుకున్నాను. పులికి నాకు మధ్యలో ఎత్తుగా పెరిగిన తాడి చెట్టు, చెట్టు చుట్టూ పులి నేను గిరగిర తిరిగాం పులి గర్జనలతో అడవి మార్మోగినది. పులిని రెండు కాళ్ళు పట్టి చెట్టుకు లాగి లాగి గట్టిగా కొట్టాను. పులి స్పృహ తప్పి పడిపోయినది. ఆ దృశ్యాన్ని చూస్తున్న యువకులు బిక్కు బిక్కున చూస్తు నిలబడిపోయినారు. వారు ఆ పడిపోయిన పులిని చంపివేశారు. నాకు చేతులు గుండెలు దొక్కుపోయినవి. అది జరిగింది తల్లీ! అనగా పెనుమాలమ్మ కళ్ళ వెంట బొట బొట నీటి చుక్కలు రాలినవి. అమ్మా! తరువాత తెలిసినది 'అనపోతు' అనే బ్రాహ్మణ యువకుడు మాతో వేటకు వచ్చాడు. వాడు నా శూలాన్ని నేను చూడకుండా చాటుగా సెలయేరులోనికి విసిరివేశాడట, తరువాత నేను అడిగితే, ఊరికే ఎగతాళిగా విసిరివేశాను అన్నాడు. నేను ఇక ఏమి చేయలేకపోయాను అన్నాడు. తొలగిన ఆపదకు తమ కులదైవం చెన్నుడ్ని మనస్సు నందుస్మరించుకున్నది పెనుమాలమ్మ.

కన్నమునికి తల్లి పెనుమాలమ్మ బోధించిన వీర గాధలు

విశ్రాంతికి ఉపక్రమించిన కన్నముడు తన తల్లిని గూర్చి ఆలోచిస్తున్నాడు. తన తల్లి పెనుమాలమ్మ, అఖండ మేధాసంపన్నురాలు, బౌద్ధమతానికి సంబంధించిన త్రిపీటకాలు, జాతక కథలు జైనమత గ్రంథాలైన త్రిరత్నాలు, కపిలుని సాంఖ్యాశాస్త్రం, శూద్రకుని మృచ్ఛకటికం లాంటి మహాగ్రంథాలు ఔపాసన పట్టినది. ప్రాకృతము, పైశాచికము, సంస్కృత భాషలలో పాండిత్యము సంపాదించినది. 'ఉత్కృష్టమైన

బ్రహ్మీలిపిలో 'పాలి' భాష ముత్యాలు వెదజల్లినట్లు అక్షరాలు వ్రాయగలదు. ఫాహియాన్, మెగస్తనీస్, హుయాన్‌త్సాంగ్ వ్రాసినరచనలతో పాటు శిలా శాసనాలుకూడా చదవగలిగిన దిట్ట. రామాయణ భారతాలు, కాళిదాసు రచనలు చిన్ననాడే చదివినది. తనకు చిన్ననాటి నుండి అనేక వీర గాధలు రాజతంత్రాలు, యుద్ధనీతి బోధించిన తన తల్లిని గూర్చి ఆలోచిస్తున్నాడు. తల్లి చెప్పినది ఒక్కొక్కటి గుర్తుకొస్తున్నది.

తన వంశాలు నలందా, తక్షశిల, విక్రమశిల మొ॥ విశ్వ విద్యాలయాలు స్థాపించి తన పూర్వీకులు ఈ దేశాన్ని మేధో సంపన్నం చేశారట, నలందా విశ్వ విద్యాలయ మహా మేధావి ఆచార్య మహానాగుని వద్ద అనేకమంది శిష్యులుగా చేరినారు. అందులో ఒకడు నాగార్జునాచార్యుడు, ఇతడు శూన్యవాదాన్ని బోధించాడట. **బ్రాహ్మణులు గురుకులాలు స్థాపించి విద్య బోధిస్తుంటే దళితులు విశ్వవిద్యాలయాలు స్థాపించారు. గురువు ఏ కులమైతే ఆ కులం వారికే విద్య చెప్పే స్థలాన్ని 'గురుకులం' అంటారు 'గురుకులం' అనగా గురువు యొక్క కులం అని అర్థం. గురువు యొక్క కులం కాకుండా, వేరే కులంవారు (కర్ణుడు, పరశురాముడు) విద్య నేర్చుకుంటే బ్రాహ్మణులు వారిని శపించేవారట. అలాంటి వారి బారినుండి ప్రజలను రక్షించి, అందరికి విద్య అందుబాటులో తెచ్చుట కొరకు విశ్వవిద్యాలయాలను దళితులు ప్రారంభించారట. తన పూర్వీకులైన, ఆచార్య మహానాగుడు నలందుడు కపిలుడు, కణాదుడు, అశితకేశ కంబలుడు మొ॥న మహామేధావులను గూర్చి అమ్మ చెబుతుండేది. ఆచార్య కపిలుడు మరణించిన తరువాత, అతని జ్ఞాపకార్థంగా, శుద్ధోదనుడు తన రాజధానికి కపిల వస్తు నగరమని పేరుపెట్టాడట.** కపిలుడు ఈ దేశంలో అఖండ మేధావని అమ్మ చెబుతుంటే తనకు అమితోత్సాహమేసేది. వేణుడు (వేణరాజు), శంభూకుడు, బలి చక్రవర్తిని గూర్చి అమ్మచెప్పేది. వారి దాతృత్వం, వారి మేధస్సు, వారి కీర్తి ప్రతిష్ఠలు చూచి ఓర్వలేని తనాన్ని, ఆర్యులు వారిని ఎంత నిర్దాక్షిణ్యంగా హతమార్చారో తన తల్లి నోట వింటే తనకు కన్నీరు వచ్చింది.

ఐశ్వర్యవంతులలో ప్రధముడు కాటి వీరబాహుడు, ఒక చక్రవర్తిని కొనుగోలు చేసిన వాడు ప్రపంచం మొత్తములో (అన్ని చరిత్రలు, పురాణాలు పరిశీలించాను) దళితుడు మాత్రమే అని అమ్మచెబుతుంటే గర్వంగా ఉండేది.

ద్రోణాచార్యుడు, దళితుల తండాలో విలువిద్య నేర్చుకుని, ఆ ఎరుకలవారు ఇతని కుట్రలు, కుతంత్రాలు భరించలేక తరిమి వేశారు. ఇతను రాజుల పంచన చేరి కురుపాండవులకు విలువిద్య నేర్పుతానని నమ్మించి, రాజులకు దళిత తండాలపై చాడీలు చెప్పి, 'వారు కాని ఎదురు తిరిగితే మన సైన్యాలు ఏమి చెయ్యలేవు. రాజ్యాధికారం వాళ్ళ చేతుల్లోకి వెళ్తుంది. అని నమ్మించి, రాజులను, రాజ సైనికులను వెంటేసుకుని దళిత తండాపై మూకుమ్మడి దాడులు చేసి, తండాలో ఉన్న విలుకాండ్ర బొటనవేల్లు మొత్తం నరికించి, వారిని నానాహింసలు పెట్టాడు. తరువాత ఈ హింసాకాండకు అందమైన కథలల్లి 'గురుదక్షిణ' అనే పేర్లు పెట్టారు. అని తెలిసినప్పుడు కన్నముడు కోపంతో ఊగిపోయాడు. (మనకు ఒక్క ఏకలవ్యుడి కథ మాత్రం మిగిలింది. వేలమంది విలుకాండ్ర బొటనవేళ్ళు మూకుమ్మడిగా నరికారు. మచ్చుకకి ఒక కథ మాత్రం మనకు లభించింది,

బుద్ధిహీనుడైన కాళిదాసుకు మన ఆడపడచు, విద్యాబుద్ధులు నేర్పిందట. జగద్గురు శంకరాచార్యుడు అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతుంటే మన చండాలవీరుడు (జాగిలాల శిక్షకుడు) దేవుడికి, జీవుడికి ఉన్న బంధాన్ని సంబంధాన్ని విడమర్చి చెబితే కాని జ్ఞానోదయము కలుగలేదట; త్రిశంకుడనే మన రాజు, ఏకంగా మన కొఱకు ఒక స్వర్గాన్నే నిర్మించాడు. అందు మాల మాదిగలకు మాత్రమే ప్రవేశము కలదు. అంటే మాల మాదిగలకు నరకం లేదు. మనకున్నది ఒక్క స్వర్గమే, ఎందుకంటే ఈ దేశానికి రక్షకులము, శ్రామికులము మనమేనని అమ్మ చెబుతుంటే ఆనందమేసేది. అనుకుంటూ తల్లి వైపు చూశాడు. తల్లి తన వద్దనే కూర్చుని, తననే చూస్తుంది. అపుడు కన్నముడు అమ్మా! ఏదైనా కథ చెప్పు అపుడు నిద్ర వస్తుంది అన్నాడు.

అలాగే కన్నా! అని మొదలు పెట్టినది. నాయనా! క్రీస్తుకు పూర్వం మనదేశం పైకి, ప్రపంచ విజేత అలెగ్జాండర్ దండెత్తి వచ్చాడు. రోము సైన్యాలకు విజయమే కాని, అపజయము తెలియదు. అలాంటి సైన్యాలను మన జాతులు ఎదుర్కొన్నవి. మన వంశరత్నం మాల సామ్రాజ్యాధిపతి పురుషోత్తమ చక్రవర్తి, అలెగ్జాండర్‌ను ఎదిరించాడు. మన పట్టణమైన 'మాలస్థాన్' నందు అలెగ్జాండర్ సైన్యానికి ఎక్కువ గాయాలు, నష్టం జరిగినది. (నాటి మాలస్థాన్ 'లేదా' మాల్లస్థాన్‌మే, నేటి 'ముల్తాన్' నగరము అని ముందే చెప్పాను చూడగలరు). ఇక అలెగ్జాండర్ లాభం లేదనుకొని



యుద్ధవిద్యల ప్రదర్శనలో పాల్గొనే ముందు
తల్లి దీవెనలందుకుంటున్న వీర కన్నముడు

తిరిగి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. కాని 'అంభి' అనే బ్రాహ్మణరాజు, అలెగ్జాండ్‌కు మన రహస్యాలు చేరవేసి మన పురుషోత్తమ చక్రవర్తి ఓటమికి కారకుడయ్యాడు. **కన్నా! అంభి అనే బ్రాహ్మణరాజు మన దేశానికి ప్రథమ దేశద్రోహి నాయనా!**

అదే విధంగా మన మౌర్యవంశం కూడా ఒక బ్రాహ్మణుడ్ని చేరదీసి ఆదరించి అందలమెక్కించినది. అతని పేరు పుష్యమిత్రశృంగుడు. అతనికి ప్రపంచంలోనే గొప్ప సేనగా పేరు గాంచిన మౌర్య సైన్యాధిపత్యము మనవారు ఇచ్చారు. కాని పుష్యమిత్రశృంగుడు మనరాజును హతమార్చి సింహాసనమెక్కాడు. నాయనా అతను భయంకరమైన నమ్మినద్రోహి, మన పూర్వీకులలో బలమైన వంశాలు లిచ్ఛవీ సామ్రాజ్యాలు ఈ లిచ్ఛవీ సామ్రాజ్యాల మధ్య రాజుల మధ్య వైరుధ్యాలు సృష్టించిన బ్రాహ్మణుడి పేరు 'వస్సఖ' నాయనా! **దేశద్రోహం, నమ్మకద్రోహం, కలతలు సృష్టించడం వారికి వెన్నతో పెట్టిన విద్య.** వారి **యెడల కించిత్ జాగ్రత్త వహించాల్సి యుంటుంది.** అనగా కన్నముడికి అనపోతు గుర్తుకు వచ్చాడు. బహుశా తన శూలాన్ని కావాలని నీటిలో విసిరి వుంటాడు. అనుకోగానే కన్నముడి ఒళ్ళు గగుర్పొడిచినది. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. అమ్మా! ఇక వెళ్ళి విశ్రమించు నాకు నిద్ర ముంచుకొస్తుంది. అనగా ఆ తల్లి తెప్పల్నీడు మందిరము వైపు వెళ్ళినది. కన్నమునికి నిద్రపట్టలేదు. దేశద్రోహులను గూర్చి ఆలోచిస్తున్నాడు. ఇలాంటి దేశద్రోహులు లేకుంటే పరరాజులు మనవైపు కన్నెత్తి కూడా చూడలేరు కదా! అనుకున్నాడు.

యుద్ధ విద్యల ప్రదర్శన - కన్నముడు పాల్గొనుట

ప్రతి సం॥ము రివాజుగా జరిగే యుద్ధ విద్యల ప్రదర్శన ఆ రోజు జరుగుతుంది. యుద్ధ విద్యల ప్రదర్శన ఆరోజు జరుగుతుంది. యుద్ధ విద్యల ప్రదర్శన శాల చక్కగా అలంకరించబడి యున్నది. పట్టణంలో పురుషులు, స్త్రీలు, యువకులు, వృద్ధులు, పిల్లలు ఆ ప్రదర్శనను తిలకిస్తారు. ప్రదర్శనలో విలువిద్యలు, కత్తిసాము గుర్రపుస్వారీ, బల్లాలు విసరడం, మల్లయుద్ధాలు, కర్రసాము పొగరుమోతు పోట్ల గిత్తల కొమ్ములు వంచి, ముక్కుతాడు బిగించడం మొ॥న ప్రదర్శనలు జరుపుతారు. ప్రదర్శనకు ముందు కథకులు గానాలు చేస్తారు. నాట్యకత్తెలు నృత్యాలు చేస్తారు. ఈ విధముగా రెండు రోజులు జరుగుతుంది. మూడవ దినమున

నారి సవరించితే ఝూంకార ధ్వనికి వేదిక దద్దరిల్లింది. బాణాన్ని సంధించి గురిచూచి వదిలితే తిరుగులేకపోయింది. మల్లయుద్ధంలో ప్రజలకు మతిచెదిరింది. గుర్రపుస్వారీలో పల్నాటిలోనే ధీరుడు ఈ పడుచువాడు అని వేనోళ్ళ ప్రజలచే కొనియాడబడ్డాడు. అన్ని యుద్ధవిన్యాసాలలో ప్రథముడుగా వీరుడుగా నిలబడ్డాడు. ఈ వీరమాలకుల సివంగి చిన్నోడు...

పల్నాటి ప్రజలు కరతాళధ్వనులతో మన్నూ మిన్నూ ఏకమైంది. పడుచు పిల్లలు కన్నముని పై పూలు విరజిమ్మారు. సామంతరాజులు ఈర్ష్యపడ్డారు.

ఇలాంటి వీరుడు ఒక్కడైనా తమ తమ రాజ్యాలలో లేనందుకు బాధపడ్డారు. కన్నముడ్ని పూలమాలలతో ముంచెత్తారు. మర్నాడు పతకాలు బహుకరించారు. అలుగు విభుడు స్వయంగా వీర తిలకం దిద్ది కన్నముడ్ని కౌగిలించుకున్నాడు. పల్నాటి తల్లులంతా ఇలాంటి బిడ్డ తమకు లేనందుకు బాధ చెందారు. కన్నముడే అందర్ని అమ్మా! అని పిలుస్తాడు. కనుక ఊరట చెందారు. తండ్రి తెప్పలి మోమున వీరగర్వం తొణికిసలాడింది. వారంరోజులపాటు పల్నాటిలో ప్రజలంతా ఎక్కడ చూచినా ఒక్కటే మాట మాల కన్నముని ప్రతిభా పాటవాల గురించి, అతని యుద్ధ నైపుణ్యం గురించి మాత్రమే చర్చ జరిగింది.

కథకుల ప్రకారం మాలకన్నముడు ఎవరితోనైనా ఏవిధంగా పోరాడుతాడంటే..

కొండలు కొండలు

పోరుపడరీతి

ఆబోతు లాబోతులు

రంకెలేసిన రీతి

మత్తగజాలు రెండు మల్లాడిన రీతి

ఏటికి మధ్య బండి ఎదురెక్కిన రీతి... (కథకులు)

అలుగు రాజు కొలువు తీరుట - కన్నముని ప్రవేశము

గురివిందలు కొట్టించి గురిజాల కట్టించి అలుగురాజు అందంగా పరిపాలిస్తున్నాడు. ఆనాటి దర్బారు సమావేశములో రాజకుటుంబీకులు, దాయాదులు, పరివారము మేధావులు, కవులు, పండితులు, ఉన్నారు. రాజుగారికి పరిచారికలు వింజామరలు విసురుతున్నారు. రాజుగారు వేగుల్ని పిలిపించి రాజ్య పరిస్థితులు విచారించాడు. ప్రజలు ఎలా ఉన్నారు? అని అడిగాడు. దానికి వేగులు మహారాజా! మన పల్నాడులో

"అడవి బొలుసుల కూర - ఆవుల మజ్జిగ

కొండ బొలుసుల కూర - గోవుల మజ్జిగ

అరచేతిలో పోసుకు త్రాగుతూ ప్రజలు కాలం గడుపుతున్నారు.

పశువులకు మేతలేదు అని సెలవిచ్చారు. పశుగ్రాసం లేక గుర్రాలు, ఒంటెలు, ఎద్దులు, ఏనుగులు, అలమటిస్తున్నాయి. అనగా విని చలించిన అలుగురాజు క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే వీరతెప్పల నీడికి కబురుపంపాడు. వీరతెప్పలినీడు కుమార కన్నమునికి, కత్తి సాములో మెళుకువలు నేర్పుతున్నాడు. కన్నముని అశ్వము 'కారుమాల- అది నల్లని అశ్వము. ఎదురెండకు నిగనిగలాడుతున్నది. (మన చరిత్రకారుడు ఆ గుఱ్ఱంపేరు 'కారుబూల' అని మార్చారు గమనించాలి) అలుగురాజు కబురందుకున్న తెప్పలి - కన్నమ రెండు అశ్వాలపై సైనిక స్థావరం నుండి రాజధానికి ఆఘమేఘాలపై వస్తున్నారు. వీర తెప్పలి అశ్వము తెల్లనిది పాల నురగలాగ ఉన్నది. మాలకన్నముని అశ్వము కారునలుపుతో మదమెక్కినట్లున్నది. గుఱ్ఱపు ప్రకంపనలకు లేస్తున్న ఎఱ్ఱని ధూళి గుఱ్ఱాలపై పడ్తున్నది. ప్రజలు దారి పొడవునా తండ్రీ కొడుకులకు తలలు వంచి నమస్కరిస్తున్నారు. వీరిని అనుసరించి వస్తున్న పన్నెండు మంది యోధులు విశ్వాసానికి మారు పేరుగా యజమాని కొరకు ప్రణాలివ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు వెనుక గుఱ్ఱాలపై వస్తున్నారు.

కన్నమునికి ఇరువది సం॥లు ఉంటాయి. తెప్పలికి 50 సం॥లు. వారి

నిరంతర వ్యాయామం వలన తెప్పలికి కండరాలు సడలలేదు. గుఱ్ఱాలు రెండూ ఒక్కసారి కోటగుమ్మం వద్ద వెలుపల ఆగినవి. కన్నముడు తలవెం(త్రుకలు ఒక్కసారి రెండు చేతులతో పైకినెట్టి ఒక్క దుముకు దుమికాడు. తలవెనక్కు విసురుగా విసిరాడు. తం(డ్రిని అనుసరించాడు. వెనుక వచ్చిన భటులు కోటగుమ్మం బయట దిగి వినయంగా నిలబడ్డారు.

రాజదర్బారులోనికి తెప్పలి, కన్నమ ఠీవిగా కొదమ సింగాల్లా నడుస్తూ ఉంటే ఆ దర్బారులో ఉన్నవారు ముచ్చటగా చూస్తుంటారు. ఇది ఎప్పుడూ జరిగే విషయమే.

తెప్పలినీడు రాజుకు ముకళిత హస్తాలతో నమస్కరించి 'రాజా సెలవివ్వండి' అని నిలబడ్డాడు.

రాజు, వీరుడా! మన పశువులు,ఏనుగులు, గుఱ్ఱాలు, ఎద్దులు, మేతలేక ఉన్న మేత చాలక మన పశువుల కాపరులు ఇబ్బందులు పడ్తున్నారు. మన పశువులకు పశు(గ్రాసం కావాలి. తెప్పించుము. అని ఆజ్ఞాపించాడు.

తెప్పలన్న సరే! అలాగేరాజా! అని దర్బారునుండి శలవుగైకొని, తన స్థావరానికి వెళ్ళి ఈటెలు, బల్లెములు, నుస్త్రపక్షులు, మత్తేభములు, వృషభములు, అశ్వములతో శక్తివంతమైన కాల్బలములో భేరీనాదులు (మోగించుకుంటూ ఆరెగండ్లకు వెళ్ళి, పెద్ద పెద్ద రవుతులను పిలిపించి గజతురగ దళాలకు పశు(గ్రాసమిండని అడిగాడు. నిముషాలలో గడ్డివాములు, జొన్న కట్టలు, జనుపకట్టలతో (ప్రత్యక్షమయినవి. ఆ గడ్డివాములను, ఏనుగులు, ఒంటెలు, బండ్లపై ఎత్తించి పట్నాలు, పల్లెలు, పరగణాలు దాటుకుంటూ సంతోషంగా తిరిగి వస్తున్న మోటుపల్లి (త్రోవలో "ఊరకోట" అనే ఊరి వద్ద ఒక జొన్న చేనును చూచి కడు ఆశ్చర్యము పొందారు. ఆ చేను కాపలాదారు రెడ్డి (ఆనాడు రెడ్లు చేలకు కాపలాదార్లగా జీతగాళ్ళగా ఉండి ఉంటారు) సైన్యం కోరిన మీదట కొన్ని జొన్న కంకులు కోసుకోమన్నాడు. ముత్యాలవంటి ఆ జొన్నకంకులు, తెప్పలి కూడా చూచి ఆశ్చర్యపోయినాడు. వాటిని అంతఃపురానికి తీసుకపోయినాడు. అంతఃపురకాంతలు ఆ జొన్న కంకులు చూచి మురిసిపోయారు. ఆ కాంతలతో గండు కాంతమ్మ ఆమె కోడం(డ్రు, పెనుమాలమ్మ పెద్దసానెమ్మ,

వీరవిద్యలదేవి దేవమ్మ కాంత ముఖ్యులు. అందు శీలమ్మ (బ్రహ్మనాయుడి తల్లి) ఎక్కువగా మనస్సు పడినది. తన ముచ్చట తీర్చమని వీరతెప్పలిని మరి మరి అడిగినది. ఆమె మురిపెం తీర్చే నిమిత్తం, వీరతెప్పలి మరియొక మారు యుద్ధం చేయాల్సివచ్చినది. శీలమ్మ కోర్కె తీర్చే నిమిత్తమై శీలమ్మ రహస్యంగ ఆకోరిన మీదట వీరతెప్పలి మీసాలు మెలేసి, మరలా యుద్ధానికి సన్నద్ధమయ్యేడు. అదే తన చివర యుద్ధం అవుతుందని ఆ వీరునికి తెలియదు. ఒక స్త్రీ కొరకు మరియు సమఈడు కలిగిన స్త్రీ కొరకు ప్రాణాలను కూడా ఎక్కపెట్టకుండా యుద్ధానికి బయలుదేరాడు తెప్పలి. రాజుగారైన, అలుగురాజు ఇది గమనించి గమనించనట్లున్నాడు. వీరతెప్పలిపై రాజుగారి అభిమానము ఆ విధంగా చేసినది. (వీర తెప్పలి ద్వారా బ్రహ్మనాయుడు జన్మించి ఉంటాడు). అందువలననే బ్రహ్మనాయుని దుష్టచేష్టలు, చివరివరకు నలగాముడు మలిదేవుడు కన్నమనీడు ఖండించ సాహసించలేదు)

వీరతెప్పలి - ఊరకోట పేరమరాజుని హతమార్చుట :

వీరతెప్పలన్న విజృంభించాడు. కోరక కోరక కోరిన శీలమ్మ కోరికను తీర్చడం తన దర్మంగా భావించాడు వీరతెప్పలి. ఈసారి రెట్టించిన ఉత్సాహంతో తన సైన్యాన్ని ఉసిగొల్పాడు. మదగజ తురగ సమూహముతో భీకర ధ్వనులను చేస్తూ, రెడ్డి చేనును సైన్యము చేరినది. అప్పుడు తెప్పలినీడు, ఓయీరెడ్డి, నీకు కావలసిన ధనము ఇచ్చెదము. ఈ చేనును కోసుకుని వెళ్ళెదము. ఎందువలననగా ఇది మా అలుగురాజు ఆజ్ఞ! అని చెప్పాడు.

అప్పుడు ఆ రెడ్డి తెప్పలన్న మాటను లెక్కబెట్టక, అనుగురాజును తూలనాడుతాడు. మీ రాజు కంటే మా పేరమరాజు గొప్పవాడు అని సెలవిచ్చేడు.

ఆ మాటలకు ఉగ్రుడైన తెప్పలి ఓ సైనికులారా! సేనాపతులారా! అనుగురాజును తూలనాడిన ఈ రెడ్డికి, వారి రాజుకు బుద్ధిచెప్పాలి. పంట చేనును కొయ్యండి. అనుగురాజు అంటే ఎవరో, అతని బలమేమిటో, ఈ రెడ్డికి తెలియజెప్పండి. అన్నాడు. ఆ మాట విన్న సైన్యం అత్యుత్సాహంతో పంటనంతా కోయించి బండ్లకెత్తించినారు.

రెడ్డి పరుగున ఊరకోటకు వెళ్ళి పేరమరాజుకు జరిగినదంతయూ కన్నీరు, మున్నీరుగా విన్నవించుకుంటాడు. పరరాజు మన పొలాలు తొక్కించుటకు ఎంత ధైర్యము వారిని చీల్చి చెండాడుదాము. అనగా వెంటనే మంత్రివర్యులు చతురంగబలములు, గదలు, బిండివాలములు, విచ్చుకత్తులు, పరిఘలు, చక్రములు, బాకులు, కటార్లు, చక్రాయుధములు, గైకొని యుద్ధభేరీలు మ్రోగుచుండ నాయకులెల్ల పయనమయ్యారు.

పేరమరాజు తెప్పనీడుని సమీపించి నిలువెల్ల పరికించి చూసాడు. మాల తెప్పలనీడు అరివీర భయంకరునిలా ఉన్నాడు. అయినా పేరమరాజు నిలదొక్కుకుని గుండెదిటవు చేసుకుని ఓయి ఎవరునీవు, నీరాజు పేరేమి, పొలము తొక్కించి దాన్యము దోచుకుపోతారా? అని ఆ వీరులెల్ల బండ్లు చుట్టుముట్టినారు.

తెప్పలి ఆగ్రహము : భీకరయుద్ధము

తెప్పలన్నకు ఒక్కసారి ఆగ్రహము కట్టలు త్రెంచుకుని ఉబికినది. తనను తూలనాడినందులకు అలుగురాజుని అవమానముతో మాట్లాడినందుకు తన సైన్యానికి క్రీగంట కనుసైగచేసి, ఒక్కసారి కుప్పించి దుమికినాడు. గజముల కుంభస్థలములు చీల్చినాడు. తెప్పలి వీరవిహారమునకు, శత్రుసైన్యాలు భీకర ధ్వనులతో పెడకేకలు పెట్టుచు దిక్కుల వెంట పరుగులిడుతున్నది. ఈటెలు రెండు చేతులతో రెండుత్రిప్పుతూ,శత్రుమూకల గుండెలలో క్రుమ్ముచూ, దొరికిన పట్టాకత్తితో మొనగాండ్లను మొండెములుగా నరుకుచుండెను. ముక్కులు,చెవులు, మూపులు, తలలు తుత్తురుముగా తరుగుచూ సింహనాదాలు చేయుచూ చెలరేగి నరుకుచుండగా, యుద్ధభూమి మొత్తము రక్తముమడుగయ్యెను.

తెప్పలనీని భీకర గర్జనలకు పెరమరాజు సైన్యము నలుదిక్కులకు కకావికలై పోతుంది. పెరమరాజు నలుదిక్కులకు కకావికలై పోతున్న తన సైన్యాన్ని నిలువరించి ఈ విధంగా హెచ్చరించాడు. "విజయమో వీర స్వర్గమో తేల్చుకోండి. యుద్ధభూమి నుండి పారిపోయిన వీరుడు నపుంసకునితో సమానము" అనగా వీరులు మరలా యుద్ధ సన్నద్ధులయ్యారు. పేరమరాజు తన వింటినారిని సంధించి, వీరతెప్పలిని సమీపించాడు. వారిద్దరు పోరాడుతుంటే కొదమసింహాలు కోట్లాడినట్లు మదపుటేనుగులు ఢీకొన్నట్లు ఉంది. ఒక్కసారిగా పేరమరాజు సైన్యాలు చలిచీమల

దండువలె తెప్పలిని సమీపించాయి. ఇది గమనించిన తెప్పలి తన కరవాలాన్ని ఒక్కసారి గిరగిర తిప్పి రెండు పల్టీలు కొట్టి, ఒక్క ఉదుటున పేరమరాజుపై కుప్పించి, దుమికి, ఒక్క వ్రేటున అతని కంఠాన్ని తుంచాడు. ఇది చూచిన సైన్యందిక్కుతోచక భయంతో నలుదిక్కులకు పరుగులు తీసింది.

పేరమరాజు కుమారుడు ఉత్తరుడు ఒక్కసారిగా తెప్పలిని పాదాల పైబడి శరణు వేడాడు. ప్రాణభిక్ష పెట్టమని ప్రాధేయ పడ్డాడు. శరణన్న వారిని, స్త్రీలను, పారిపోతున్న వారిని, క్షమించి వదలడం తెప్పలిని యుద్ధనీతి కనుక అతనికి ప్రాణభిక్ష పెట్టి వదలివేశాడు.

వెంటనే బిరుదురాజు ఒక శాసనాన్ని చెక్కించెను."అవనిలో రాజులంతా అతివలతో సమానము, అనుగురాజొక్కడే పురుషుడన చెల్లు" అని దాని అర్థము. తెప్పలనీడు ఈ శాసనము చెక్కించవద్దని బిరుదురాజును వారించినా అతను వినలేదు. ఆ విజయోత్సాహములో ఆ శాసనాన్ని గురించి తప్పలనీడు అంతగా పట్టించుకొనలేదు. ఈ బిరుదు శాసనాన్ని ఊరకోటలో ప్రతిష్టించారు.

విజయోత్సాహముతో వీర దుంధుబులు మ్రోగించుకుంటూ గురజాలకు చేరిన సైన్యానికి, అలుగురాజు, విజయ స్వాగతాన్ని చెప్పాడు. సేనాపతిని ఘనంగా సన్మానించాడు. సైన్యానికి కృతజ్ఞతలు తెల్పాడు. వారికి విందులు వినోదాలు కల్పించవలసినదిగా మంత్రి దొడ్డనాయుడిని ఆజ్ఞాపించాడు.

మాలతెప్పలి - చందోలు రాజుతో యుద్ధం

బిరుదు శాసనాన్ని గూర్చి తెలుసుకున్న రాజులు, హతాశులయ్యారు. ఔరా! ఏమి? అలుగురాజు గర్వము ఒక్క పేరమరాజును ఓడించినంత మాత్రాన అంత గొప్పవాడయ్యాడా? అని మదిలో అనుకున్నారు.

ఈ విషయము తెలుసుకున్న చందోలు (చందలోలు) రాజు, అధిక రోషముతో వెంటనే అలుగు రాజుపై యుద్ధాన్ని ప్రకటించాడు. అలుగురాజు భటునితో తెప్పల్నీడికి కబురంపాడు తెప్పలి మరియు కన్నమదాసు వారి వద్దకు వచ్చారు. శెలవు! మహారాజా! అనగా,

అలుగు: ఔరా! వీరతెప్పలి విన్నావా? ఈ విడ్డూరం, మనపై చందోలు

రాజు యుద్ధాన్ని ప్రకటించి కయ్యానికి కాలుదువ్వుతున్నాడు.

తెప్పలి : జౌను మహారాజా! రణభేరి మ్రోగించమంటారా? తమ ఆనతి కొరకు ఎదురు చూస్తున్నాను.

అలుగు : తప్పదు మరి. వీరుల్ని యుద్ధసన్నద్ధుల్ని చెయ్యండి. కుమార కన్నమనీడ్ని నివారించి పేర్నీడు, బాదన్న,మొదలయిన వీరులు వెంటరాగా,తన సర్వసైన్యం, వీర తెప్పలినికి జై మాలతెప్పలికి జై, జై, అరివీర భయంకరికి జై, అని నినాదాలు చేసుకుంటూ జయభేరి మ్రోగించి,యడిదములు, బల్లెములు, బాకులు, ఈటెలు, ముద్గరములు, విండ్లు, శూలములు, విచ్చుకత్తులు ధరించి వీరనాయకులు వెంటరాగా తప్పెట ధ్వనులతో దిక్కులు పిక్కటిల్ల కదనభూమికి కదలినారు.

చందోలు రాజు కణకణ మండుతున్నాడు. వింటినారి సంధించి శత్రువులపై శరవృష్టి కురిపిస్తున్నాడు. వారి దాటికి తెప్పలినీని సైన్యం హతాశులై చూస్తూ నిలబడింది. ఇది చూచిన బాదన్న, పేర్నీడు, తెప్పలి ఆజ్ఞ కొరకు వెళ్ళారు. అప్పుడు మాలతెప్పలి, ఆలోచించి, పేర్నీడుకు ఆ బాధ్యతలు అప్పగించి, తొమ్మిది మంది వీరుల్ని పేర్నీడుకు వలయంలా ఏర్పరచి సైన్యానికి విజృంభించమని ఉసిగొల్పాడు.

అంత పేర్నీడు, సైన్యము, భళీ,భళీ యనుకుంటూ, ఎదురువచ్చిన చందోలు రాజు సైన్యం పైకి దూకి ఎక్కడివారినక్కడే పట్టుకుని కాళ్ళు, కరములు, తలలు, కంఠములు కరకర నరుకుతుంటే సైన్యం నలుదిక్కులకు చావుకేకలతో పరుగులు పెట్టినది. పేర్నీడు అశ్వాన్ని ఒక్క ఉదుటున దూకించి చందోలు రాజు ఎక్కిన ఏనుగు తొండాన్ని నరికాడు. ఏనుగు ఘీంకరిస్తూ నేలకు ఒరిగెను. క్రిందపడిన చందోలు రాజు శరణు, శరణు అనుచూ, చేతులెత్తి మ్రొక్కెను. అతనిని బందీగా తెచ్చి వీరతెప్పలి యొద్ద పడవేసెను.

సేనాపతి వీరతెప్పలినీడు ఈ విషయాన్ని అనుగు విభునకు తెలియజేశాడు. బంధించిన చందోలు రాజును రాజదర్బారుకు తీసుకొని వెళ్ళారు. రాజు అమితంగా సంతోషించి, అనేక ఆభరణములు, భూషణాలు, దివ్యవస్త్రములు, దివ్యమాన్యాలు సైన్యాలకు ఇచ్చి విందులు, వినోదాలు చేసుకొండని సెలవిచ్చేరు.

అంతలో చందోలు రాజు, అలుగురాజును ప్రాణ భిక్షపెట్టమని, పాదాలపైబడి ప్రాధేయపడ్డాడు. రాజా " నిన్నెదిరించగా నేనెంతవాడను, మీరు దయ తలిస్తేనే, నాకు దిక్కు, మీపై పగ సాధించడానికి నేనెంతవాడను". నా యందు దయ తలచి, నా యొక్క చిన్నకుమార్తె మాలమ్మదేవిని వివాహమాడి, నా జన్మ ధన్యంబు జేయండి". అనగా అలుగురాజు అందులకు అంగీకరించెను. మాలమ్మదేవితో అలుగురాజు వివాహము రంగరంగ వైభోగంబుగా జరిగెను. చందోలు పృథ్వీ జననాయకుండు పెండ్లి అనంతరము పసుపుకుంకుమల క్రింద "పల్నాడు" ప్రాంతాన్ని అలుగురాజుకిచ్చెను.

అలుగురాజు గురజాల నందు గృహములు దేవాలయములు నిర్మించి, ప్రత్యేకముగా శయ్యామందిరాలు నిర్మించి, ముగ్గురు పట్టపుదేవేరులను పెట్టి, ముచ్చటగా మురిపెంబు పెంపారగా పల్నాడును పాలించుచుండెను.

వీరతెప్పలి - వీరమరణం :

ఊరకోట ప్రభువు పేరమరాజు కుమారుడైన ఉత్తరుడు, తన తండ్రిని హతమార్చిన అలుగురాజుపై పగతీర్చుకొనవలయునన్నాడు. ఇతను అనేకమార్లు కదనరంగాన కన్నమనీడు చేతిలో ఓడిపోయినాడు. (ఆ విషయం శ్రీనాథుడు తన పల్నాటి వీరచరిత్రము నందు ఈ విధంగా అన్నాడు.

"కన్నమ నాడు కదన రంగమున
ఓడించిన యట్టివో యుత్తరిండిపుడు
తన తండ్రి చావుకు తాను కోపించి"

అని సాగిన ద్విపదను బట్టి మాలకన్నమనీడు ఇంతకు ముందే అనేక పర్యాయములు ఉత్తరుడిని ఓడించినట్లు తెలుస్తుంది. బహుశా కఱ్ఱసాము, కత్తిసాము (కత్తియుద్ధాలు), గుఱ్ఱంస్వారీలు, మల్లయుద్ధాలు,లాంటివి ఇంతకు ముందు వీరి మద్య జరిగి యుంటాయి. అయినా సిగ్గులేదు. వివిధ దేశాలరాజులకు బిరుదశాసనం గురించి లేఖలు వ్రాసాడు. భూమిమీద రాజలు మొత్తము ఏ విధంగా స్త్రీలైరి. ఈ భూమి మీద అలుగురాజు ఒక్కడే. మగాడా? మనమంతా కలసి గురజాలపై యుద్ధానికి వెళ్ళాలి. సన్నద్ధులు కండి. అని శెలవిచ్చాడు.

రాజులు, సామంత రాజులు వారి వారి సైన్యాలను తరలించుకుంటూ, నాగస్వరము, భేరీవాయిద్యములు ఫెళ ఫెళ మ్రోగించుకుంటూ, భూమ్యాకాశాలు దద్దరిల్లగ, పగటి చుక్కలు తళతళ మెరయగా వరుసగా రాజులు గురజాలవైపు తరలి 'అరణిగండ్ల' ఆరుబయట సమావేశమైనారు.

ఈ వార్త తెలుసుకున్న ఉత్తరుడు ఎకాఎకిన సర్వసైన్యాలను సమీపించి అందరికి నమస్కరించి ఆయాదేశాల రాజులతో సమావేశమై సమాలోచనలు జరిపి ఒక జాబువ్రాసి దూతకిచ్చి పంపించాడు. ఆ దూత గురజాల రాజాస్థానమున ప్రవేశించి ఈ విధంగా అన్నాడు.

"రాజకులాధశ! రాజదేవేంద్ర

రాజరాజాధీశ! రాజమార్తాండ

మాలకుల వంశ సంజాత

సమరతేజ మార్తాండ

సకలకళా విద్యా పారంగద

అలుగు రాజ భూపాలా! నమో! నమః

'అరణగండ్లలలో రాజులందరూ ఈ కమ్మ తమకు అందజేయమని నన్ను పంపిరి నరవరా! అనగా ఆకమ్మ అందుకుని మంత్రి దొడ్డనాయుని చదవమనె' అలుగురాజు. అంత మంత్రి చదువుగా ఆకమ్మలో విషయము ఈ విధముగా యున్నది.

"ఈ భూమి మీద రాజులందరూ గాజులు తొడుక్కున్న స్త్రీలైతే, మీరొక్కరే మగతనం రోషంగల వీరులా ? ఆ విషయమేదో సమర రంగములో తేల్చుకొండి". అనగా అలుగురాజు చిరుదరహాసంతో ఊరకుండెను.

అదేరోజు సాయంత్రం వీరతెప్పలి, మాలకన్నమునికి బిరుదురాజుకు కబురు చేసి, బిరుదురాజును మందలించెను. వీరులు జయించడమే కాని, తిరిగి గొప్పలు చెప్పుకొనరు. అదేవిధంగా, ఓడిన శత్రువులను కించపర్చరు. నీఒక్కడి వలన (బిరుదురాజు) మరలా యుద్ధము చేయాల్సి వస్తుంది. అనగా బిరుదురాజు

రాజుగారికి క్షమాపణ చెప్పెను. సరిసరి! మీరు వెళ్ళండి అని బిరుదు రాజును పంపివేసెను.

కుమార కన్నముడు మరియు వీరతెప్పలితో రాజుగారు సమావేశమయ్యెను. తెప్పలి ఇది నాకూ నీకూ కూడా పరువు, ప్రతిష్టలతో కూడుకున్న విషయము. మొత్తం ఈ ప్రాంత రాజులందరితో ఒకేసారి పోరు. యుద్ధంలో విజయం సాధించితే చక్రవర్తులమౌతాం! ఓడితే వీరస్వర్గం అలంకరించుతాం. కనుక వెంటనే సర్వసైన్యం, అశ్వ, గజ, తురగ,పదాది దళాలను యుద్ధానికి సన్నద్ధపరచి అరణిగండ్లకు తరళివెళ్ళుము. కుమార కన్నముని మాత్రము రాజప్రసాదములో కాపలాయుంచి వెళ్ళుము. అనగా విన్న వీరతెప్పలి రాజా! అలుగు భూపాలా ! నాదొక చిన్నవిన్నపము. యుద్ధమన్న తరువాత జయాపజయాలు దైవాధీనాలు, వీర మరణాలు మామూలే. కాని, నా వీర కన్నమనీడిని మీ చేతులో ఉంచి వెల్తున్నాము. మీపై నాకు అపారమైన భక్తి, నాపై కూడా మీకు అపారమైన నమ్మకము. అదేవిధంగా నా కుమారుడ్ని కూడా చూడండి. రాజా! అనగా అలుగు భూపాలుడు అలాగే వీరనాయకా! అని అభయమిచ్చాడు. మాలవంశానికి వన్నెతెచ్చే వీరకన్నముడికి అభయమిస్తున్నాం.

వీరతెప్పలి తన దళాన్ని యుద్ధానికి ఆయత్తపరచాడు. ఈ వీరనందనుడు రణభేరి ముందుగా మ్రోగించాడు. మిగిలిన రణభేరులు ఒకసారిగా మ్రోగాయి. భూమి దద్దరిల్లింది. ఏనుగులు ఘీంకరించాయి. అశ్వాలు సకిలించాయి. కాల్బలము పరికించి చూచినది. పేర్నీడు ముదముతో ముందు కదలగా వెనుక విచ్చు కత్తుల వారు వీరనాయకులు, బాకులవారు, బరిశెలవారు కదిలారు. తెప్పలి ఎక్కే ఏనుగు తేజముతో వెలుగుతుంది. అంబారి ఎత్తించి బొడ్డుకు గంటకట్టి, దాని కంఠము నిండాకంచుగంటలు కట్టి దాని తోకకు కుచ్చులు కట్టిరి. నాలుగు కాళ్ళకు అందెలు (మువ్వలు) కట్టిరి. దానిలో వీరతెప్పలి కొలువయ్యెను. మువ్వల గజ్జెలు, మువ్వల తప్పెట్లు, రంజులు, రుద్రవీణలు, మిన్నంటి మ్రోగినవి. ఆ విధముగా దరణి ఆకాశాలు దద్దరిల్లగ కొండలన్నీ మార్మోగగా సర్వసైన్యము అరణగండ్ల ఆరుబయట జేరి గుడారాలు ఎత్తించినది. అందు ఒక గుడారము తెప్పలికి ఎత్తించెను. సూర్యునికి ఎదురుగా ఈ గుడారంలో వీరతెప్పలి సూర్యునికి ప్రతిసూర్యునిలాగా వెలుగుచుండెను.

వీర్వసైన్యము తెప్పలి ఆనతికొరకు ఎదురు చూచుచుండెను. వెంటనే వీరతెప్పలి, పతాకాన్ని ఎగురవేయించెను. దానిపై నాగుపాము బొమ్మ ఉన్నది. ఆ పతాకము యుద్ధోన్ముఖులను చేయుటకు సూచన. యుద్ధభేరీలు ఒక్కసారిగా మ్రోగినాయి. కూతలు పెట్టుచూ యువవీరులంతా ఆయుధములు పూని, దుముకుచూ విందుకి తెచ్చిన గొఱ్ఱెలను నరికినట్లు కరకర కంఠములు ఖండించుచూ ముందుకుర్కెను. చేనులో చాలులు చాలులుగా చక్కగా నిల్చున్న ఉత్తరుని సైన్యము కూడా తలపడెను.

తెప్పలి సైన్యము ఎక్కడి వారినక్కడే పట్టి మోకాలు పైకి లాక్కొని మొలనున్న పిడిబాకుని పీకి గట్టిగా పట్టి, కుతికలు కోసి కుప్పలు కుప్పలుగా కూల్చిరి. ఆరోజు ఉత్తరుని సైన్యము చెల్లా చెదురగుచుండెను. దానిని గమనించిన ఉత్తరుడు ఇక లాభము లేదనుకుని, మిగిలిన రాజుతో మంత్రములు నెరపెను. వారు కూడా ఉత్తరుని ఆజ్ఞ తమ ఆజ్ఞ అని చెప్పెను. అప్పుడు ఉత్తరుడు దొంగ దెబ్బద్వారా మాత్రమే వీరతెప్పలిని ఎదుర్కొనగలము. ధర్మయుద్ధమున జయించలేమని చెప్పెను. వీరతెప్పలి అరవీరభయంకర రూపానికి ఎదురుగా శతృసేనలు నిలువ లేకుండెను. వీరతెప్పలి ఇంకా వేగంగా విజృంభించి పట్టా కత్తితో భళ్ళున నరుకుచుండెను. శత్రు సైన్యంలో ఎవ్వరూ నిలువ లేకపోతున్నారు. వీరతెప్పలి మదగజం ఘీంకరించుకుంటూ, తన కాళ్ళతో సైన్యాన్ని చిదురు, చిదురు చేయుచున్నది.

అప్పుడు దొంగచాటుగా శతృరాజులు మొత్తము కూడబలుక్కుని, వెనుకనుండి ఒక బలమైన బాణాన్ని వీరతెప్పలి వెన్నుకు గురిచూచి వదిలినారు. ఒకసారిగా ఆ బాణానికి హతాశుడైన వీరతెప్పలి మనసునందు 'పిరికి పందలు' అనుకున్నాడు. కళ్ళు తిరిగినట్లైనవి. తన ఏనుగుపై ఒరిగి పోయెను. ఈ వార్త తెలిసిన వీరతెప్పలి సైన్యములో హాహాకారాలు మిన్నుముట్టినవి. అంతా హతావులై నీరసపడినారు. వీరుడైన పేర్నీడు తన గుఱ్ఱాన్ని అతివేగంగా శతృరాజుల మధ్యకు దూకించి ఉత్తరుని జుట్టును వడిసి పట్టి శిరస్సు ఖండించినాడు. మిగిలిన రాజుల శిరస్సులు ఒక్కొక్క వ్రేటున తెగవేసినాడు. అంతలో చీకట్లు క్రమ్మినవి. వీరతెప్పలి మరణవార్త గురజాలనందు అనుగుభూవిభునకు చేర్చినారు.

అలుగురాజు - భోరున విలపించుట :

తెప్పలి మరణవార్త తెలుసుకున్న అలుగురాజు నిలువెల్లా కంపించాడు. కళ్ళలో నీరు, ఏరులై పారుతుంది. అన్న వీరతెప్పలి మరణం, లావా ఉప్పొంగినట్లు గుండెను బ్రద్దలు చేస్తుంది. నిగ్రహించుకొనటానికి ప్రయత్నిస్తున్నాడు. అయినా ఆగలేదు. వెంటనే కొలువు అర్ధాంతరంగా ముగించి వడివడిగా రహస్యమందిరాన చేరి, పట్టుపరుపు పై బోర్లాపడి, బోరుబోరున విలపించాడు. అరివీరభయంకరుడు, అపజయమెరుగని ధీరుడు శత్రువులకు వెన్నుచూపని మగధీరుడు, రణసింగమని పల్నాడు నందు ముద్దుగా పిలుచుకునే వీరతెప్పలి మరణం, అలుగురాజు జీర్ణించుకోలేకపోతున్నాడు. అయినా మనసు దిటవు పరచుకుని, వీరకన్నముడు ఎక్కడున్నాడు అని ప్రశ్నించాడు. రాజా! కన్నమానీడు ఈ రోజు వేటనిమిత్తమై అడవికి వెళ్ళాడు. పులి ఒకటి మన సరిహద్దు గ్రామము పైబడి, ప్రజల్ని చంపడం జరుగుతుంది. ప్రజలు భయభ్రాంతులై మనకు విన్నవించుకున్నారు. దానిని హతమార్చు నిమిత్తమై వేటకు వెళ్ళాడు. అని చెప్పగా! సరే అలాగైన దొడ్డనాయుడ్ని పిలిపించండి అని చెప్పి గురజాల నుండి ప్రయాణమై వెడలెను. చతురంగ బలములు వెంటరాగా సప్తవాయిద్యములు సంతాప సంగీతం మ్రోగించుకుంటూ అరణిగండ్లకు తన రథము పై వేగముగా వెళ్ళెను. మేరునగ పర్వతము వలె పడియున్న వీరతెప్పలి కళేబరాన్ని చూచి, అతని వెన్నులో దిగిన బాణాన్ని ఒక్క ఉదుటున ఎగపీకి పడవైసి, ఆ దేహాన్ని వెల్లకిలా తిప్పి, ఆమోమునుగాంచి, వలవల ఏడ్చెను. వెంటనే నిగ్రహించుకుని, తెప్పలి వీరుని కళేబరాన్ని గురజాలకు తరలించవలసినదిగా ఆజ్ఞాపించెను. వీరతెప్పలి దేహాన్ని రథము పై పరుండబెట్టి చతురంగ బలాలు దిగులుగా నెత్తుటి చుక్కలేని మోముతో గురజాల చేరుకున్నారు.

గురజాలలో యావన్మంది ప్రజలు అధికారులు, సైనికులు, అంతఃపుర కాంతలు వేదనా హృదయ తప్తులై యున్నారు. ఆ దేహాన్ని ప్రజల దర్శనార్థము ఉంచారు.

వీర తెప్పలి మరణము శీలమాదేవి (బ్రహ్మనాయుడి తల్లి)ని మరింత కృంగదీసినది. తాను కోరిన కోరిక తీర్చడానికే కదా వీరతెప్పలి యుద్ధభూమికి వెళ్ళినది. బ్రహ్మనాయుడి పుట్టుకకు కారకుడు, ఆనాడు తెప్పలి దీవెనతోనే కదా బ్రహ్మనాయుడు జన్మించినది. మాలతెప్పలినాయుడి ఆశీస్సులు శీలమ్మ పై అధికముగా

ఉండెను. మంచి మనసుతో దీవించడము వలననే బ్రహ్మానాయుడు జన్మించినాడని శీలమాదేవి నమ్మకము. అందువలననే శీలమాదేవి, కన్నమనీడుని కూడా తన కన్నకొడుకుగా భావిస్తుంది. మాలతెప్పలినీడు కూడా బ్రహ్మానాయుడిని తన సొంతకుమారునిగా చూచుకుంటూ ఉండేవాడు. కన్నమనీడు పై సంబంధాలను గమనించి చిన్ననాటినుండి బ్రహ్మానాయుడ్ని పెద్దసోదరునిగా భావించి మెలగుచుండెడివాడు. అంతఃపుర కాంతలందరూ వీరతెప్పలిని అన్నా! వీరనాయకా! అని సంభోదించెడివారు. అందువలన అంతఃపురంలో ఆరోజు ఒక్కరుకూడా అన్నం మెతుకు ముట్టలేదు.

కన్నముని రాకః-

వేటకు వెళ్ళిన కన్నముడు, పులికొరకు మాటేసి, దానిని వెంబడించి విల్లంబు లెక్కుపెట్టి, శరపరంపరలు కురిపించాడు. అందులో ఒక బాణం పులి కడుపులో దిగింది. అది అడవి మొత్తము గాండ్రించుకుంటూ పిచ్చెక్కినట్లు రెచ్చిపోయి తిరుగుతుంది. ఎక్కడి పరివారము అక్కడ చెట్లెక్కి కూర్చున్నారు. పొదలో నక్కిన పులి ఇంకా బయటకు రాలేదు. మాలకన్నముడు మాత్రము తన 'కారుమాల' (నల్లని అశ్వము)పై అటూ ఇటూ తిరుగుతున్నాడు.

అంతలో గురజాలనుండి వచ్చిన భటుడు, ఒక జాబు యువకన్నమునికి అందించాడు. అది చదివిన కన్నముడు ఒక్కసారి హతాశుడైనాడు. దాని సారాంశము ఈ విధముగా యున్నది. "యుద్ధరంగానికి వెళ్ళిన వీరతెప్పలికి తీవ్రగాయాలైనవి. అతనిని గురజాలకు తీసుకొచ్చాము. చికిత్స జరుగుతుంది. నీవు వెంటనే రావలయును".

ఇట్లు

అలుగు భూపాలుడు.

జాబు చదువుకున్న కన్నముని మనస్సు కీడు శంకించుచున్నది. అయినా, తన జనకుని అమోఘమైన ప్రతిభ, వీరత్వము మీద అపార నమ్మకమున్నది. 'కారుమాల' ని వేగంగా అదిలించాడు. వేటకు వచ్చిన సకల పరివారము, కన్నముని అనుసరించిరి. కారడవిలో రయ్యి రయ్యిన వీస్తున్న గాలిని చీల్చుకుని నల్లని

అశ్వము దూకుతుంది. కన్న తండ్రిని గూర్చిన ఆలోచనలు, కన్నముని మనస్సుని ముసురుతున్నవి. తన తండ్రి చెప్పిన వీరగాధలు, ఎన్నెన్నో లీలగా స్ఫురణకు వస్తున్నాయి. వీరుల మరణాలు, వారి అమరత్వాలు గుర్తుకొస్తున్నాయి. తన వంశము, తన వారసత్వము, తన సోదరులు ఎంత యుద్ధవీరులో ఎరిగిన కన్నముడు, తన పరివారాన్ని యుద్ధనైపుణ్యాన్ని తలుచుకొని కొంత ఊరట చెందుతున్నాడు. 'కారుమాల' అలుపెరుగని అశ్వము, గురజాలను సమీపిస్తుంది. మెట్టపల్లాలు అధిగమిస్తుంది. ఊరును సమీపించినది. కన్నముడు గుఱ్ఱాన్ని డొక్కలో మోకాలుతో ఒక్క కుమ్ముకుమ్మినాడు. గుఱ్ఱం ఒక్కసారి సకిలించి ముందుకు దూకింది.

కన్నముని నగర ప్రవేశంతో గుఱ్ఱపు డెక్కల ప్రకంపనలకు ప్రజలు దారిపొడవునా నిలుచుని చూస్తున్నారు. వేటకెళ్ళిన వీరులు అనుసరించి వస్తున్నారు. కన్నముడు క్రీగంట ప్రజలను గమనిస్తున్నాడు. జయజయధ్వానాలు లేవు. వినోదాలు లేవు. కన్నముని మనసున ఏదో నీరసము ఆవరించినది. జరుగకూడనిదేదో జరిగినది. అని మాత్రము అర్థము చేసుకున్నాడు. 'కారుమాల' కోటగుమ్మం ముందు ఆగినది. కోట బయట చేరిన ప్రజల జాలి చూపులను కన్నముడు గమనించాడు. గుఱ్ఱం దిగిన కన్నముడు పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. భారంగా అడుగులో అడుగు వేసుకుంటూ కోటలోనికి ప్రవేశించాడు. ఎదురుగా మేరునగ పర్వతంలా పడి పూలదండ్లతో కప్పబడియున్న తన తండ్రి కళేబరాన్ని చూచి కుప్పకూలిపోయాడు. బోరుబోరున విలపించాడు. ఎంతమంది ఓదార్చుతున్నా పొంగివస్తున్న దుఃఖాన్ని ఎంత అపుకుందామన్నా ఆగటం లేదు. తాను వీరుడన్న సంగతి మరచి పిల్లవాడిలా విలపించాడు. అంతలో తన తల్లి పెనుమాలమ్మ గుర్తుకొచ్చి తలెత్తి చూచాడు. తండ్రి పాదాల వద్ద చీరకొంగు ముసుగు దాల్చి తలవాల్చి కూర్చున్న తల్లి వద్దకు జరిగాడు. పిచ్చిదానిలా బిత్తరచూపులు చూస్తూ కళ్ళల్లో కొనఊపిరితో ఉన్న తల్లిని చూచి అమ్మా! అని దగ్గరకు తీసుకుని, వారించబోయి విలపించాడు. తన మూగ వేదనతో తల్లి రోదన, ఏ విధంగా సంభాళించాలో అర్థముకాక సతమతమయ్యాడు.

అంతలో అలుగు విభుడు కన్నముని సమీపించి తలపై చెయ్యుంచి ప్రేమతో నిమిరాడు. మాలకన్నమనీడిని తన చేతుల్తో పైకెత్తి, గుండెకేసి అదిమి పట్టుకున్నాడు. నాయనా! కుమార కన్నమా! వీరులకిది తగునా? మన వంశాలు ఎంత వీరత్వం

కలిగినవో నీకు తెలుసుకదా! నిదానించు. అని చెప్పి మంత్రిని తదుపరి కార్యక్రమములకు ఆదేశించాడు.

పెద్దలంతా శవానికి తలారా స్నానం చేయిద్దామని పట్టారు. పెనుమాలమ్మ ఆ దృశ్యాన్ని ఒక్కసారి చూచి, కెవ్వున కేకపెట్టి కుప్పకూలింది. ఆమెను అచ్చట నుండి తీసుకెళ్ళండి అని పెద్దలు చెప్పగా అచ్చట స్త్రీలు, పెనుమాలమ్మను పట్టుకున్నారు. ఆమె యాలగిల పడిపోతుంది. చేతుల నుండి జారిపోతుంది. ఆమెను పట్టుకున్న స్త్రీలు పెద్దగా అరుస్తున్నారు. రాజస్థాన వైద్యుడు వచ్చి, పెనుమాలమ్మ చేయిపట్టి నాడిని చూచి, ఆమె మరణించినదని చెప్పినారు. ఆ వార్త దావానంలో వ్యాపించినది. మాలకన్నమనీడు కూలిపోయాడు. గోరుముద్దలు తినిపించిన తల్లి, అలసి సొలసి ఇంటికొస్తే, గోముగా తల నిమిరే మాతృమూర్తిలేదని తెలిసి మిన్నూ, మన్నూ ఏకమయ్యేలా రోదిస్తున్నాడు. పుణ్యదంపతులు, ప్రేమమూర్తులని గురజాల ప్రజలు వారిని వేనోళ్ళ కొనియాడుతున్నారు. జీవితంలో బాధలో కూడా భాగస్వాములు, కలిసే పరమపదించారు. అని చెప్పి ఇరువురికీ తలారాస్నానము చేయించి కొత్త బట్టలు చుట్టి రాజలాంఛనాలతో.కాటికి తీసుకెళ్ళి ఖననం చేసి, గురజాల ప్రజలు బరువెక్కిన హృదయాలతో ఇంటిముఖం పట్టారు.

మాలకన్నమునికి సర్వ సైన్యాధిపత్యము :

ఒక ప్రక్క శవానికి అంత్యక్రియలకు ప్రయత్నాలు జరుపుతుంటే బ్రహ్మనాయుడు మాత్రము తన అనుచరులతో మంతనాలు జరుపుతున్నాడు. తన పెద్దన్న బాదరాజుని ఎలాగైనా సర్వసైన్యాధ్యక్షుని చెయ్యాలని అతని ఆలోచన, అయితే అతని హృదయంలో మాట బయటకు చెప్పలేక, పుకార్లుగా ఆ వార్తను షికారు చేయించాడు. ఆ వార్త ఆనోటా, ఆ నోటా అలుగువిభుని చెవిని సోకినది. రాజావారు విని మిన్నకున్నారు. తన తండ్రికి (వీరగామునికి) సోదరులు ఐదుగురు. అందు తను, బిరుదురాజు, అర్ధరాజు, తెప్పలిరాజు తేజస్సురాజు. అందు వీరతెప్పలి పరమపదించారు. వారి కుమారుడైన వీరకన్నముని, సర్వసైన్యాధిపత్యము రావలయును అంతేకాని, ఈ వార్తలు ఎక్కడనుండి వస్తున్నవో, కనుక్కోవలసినదిగా వేగుల్ని నియమించాడు. వేగులు సేకరణ ప్రకారము బ్రహ్మనాయుడు ఈ వార్తల సృష్టికి కారకుడని తెలిసినది. అలుగురాజుకు కోపము, బాధ వేసినది. దొడ్డనాయుడ్ని

చేరదీసి, ఆదరించి మంత్రిగా అందలమెక్కించినది చాలక, అతని కుమారునికే సైన్యాధిపత్యమా ? ఏమి, బ్రహ్మనాయుడి ఆలోచన. అని తలపంకించాడు. తరువాత రెండురోజులు గడచినది. పై విషయాలు దొడ్డనాయుడికి కాని, బాదన్నకు కాని అస్సలు తెలియవు. ఇది కేవలము బ్రహ్మనాయుడి కుట్రమాత్రమేనని తెలిసిన, అలుగురాజు కొంత శాంతించాడు.

తన సోదరులైన బిరుదురాజు, అర్ధరాజు, తేజస్సురాజును రహస్యమందిరానికి పిలిపించి, వారితో రహస్య సమాలోచనాలు జరిపినాడు. "అన్న తెప్పలి మరణం, మనకు తీరని లోపం. కాని యువకిశోరం కన్నమ, మనకు అండగా ఉన్నాడు. కనుక పల్నాటి వారికి భయం లేదు. కాని బ్రహ్మనాయుని చేష్టలు నాకు చికాకు కలిగిస్తున్నాయి. రాజులమైన మనము తీసుకోవాల్సిన నిర్ణయాలను విషయాలను తనకు అనుకూలంగా రాజ్యంలో ప్రచారము చేయడము అతనికి తగదు". దానికి మీరేమంటారు అనగా వీరుడైన బిరుదురాజు తలపంకించి గంభీరంగా ఉన్నాడు. తేజస్సురాజు "అన్నా! అలుగురాజా! మనం విసిరిన ఎంగిలి మెతుకులతో, మన అండతో బ్రతికే దొడ్డనాయుడుకాని, అతకి కుమారుడైన బ్రహ్మనాయుడ్ని గూర్చిగాని మనం పెద్దగా ఆలోచించాల్సిన పని లేదు. వారు యుద్ధవీరులూ కాదు. రాజనీతిజ్ఞులూ కారు. అలాంటప్పుడు మనం [illegible]చాల్సిన అవసరము లేదు. బాదన్న మాత్రము వీరుడు, నెమ్మదస్తుడు అతనికి ఈ కుట్రలేవీ తెలియదు. మనం బ్రహ్మనాయుడ్ని, అతని దుష్ట ఆలోచనల్ని ఒక కంట కనిపెట్టి ఉంటే సరిపోతుంది. రేపు ఉదయం 11 గం॥ 11 నిముషములకు, మాలకన్నమనీడుకు పల్నాటి సర్వసైన్యాధిపత్యం ఇవ్వాలి. ఆ నిర్ణయంతో ఆ రోజు సమాలోచనలకు స్వస్తి చెప్పి సోదరులు నిష్క్రమించారు.

గురజాల పట్టణంలో ఒక వార్త దావానలంలా వ్యాపించినది. అది వీరకన్నమునికి, సర్వసైన్యాదిపత్యం యువకిశోరం, రాజసింహం, అరివీర భయంకరునిగా కీర్తి గాంచి, పల్నాటివారి గుండెలలో ఆప్యాయత, అనురాగాలు సంపాదించుకున్న, వీరుడు, మాలకన్నముడు సేనాపతి అవుతున్నాడు. తెలతెల వారుతుండగా ప్రజలు, గుట్టలు, గుట్టలుగా ఎక్కడ చూచినా ఒక్కటే చర్చ అది మాలకన్నమునికి సర్వ సైన్యాధిపత్యము గూర్చి మాత్రమే !

వేకువ జామున నిదురలేచిన సొగసైన మాలకన్నముడు, వ్యాయామ శాలనందు ప్రవేశించి ఒక గంట తర్వాత తిరిగి ఇంటికి చేరుకున్నాడు. కన్నముని మేడ అంతా కోలాహలంగా ఉంది. యువతులు హారతులు పట్టి స్వాగతం పలికారు. వందిమాగధులు జై జై ధ్వానాలు చేస్తున్నారు. తన అమ్మలైన, మాలమ్మదేవి భూరమాదేవి, వీరవిద్యలదేవి, ఉచితాసనంలో కూర్చున్నారు. తన సోదరులైన, నలగాముడు, కామరాజు, నరసింగరాజు, పెరుమాలరాజు, రఘుట్టిరాజు, పెదమాలదేవుడు, పినమాలదేవుడు, బాలమాలదేవుడు, అశ్వాల నధిరోహించి వచ్చారు. కన్నముని మేడ ముందు పందిళ్ళు మొత్తం వీరులతో నిండిపోయింది. నలగాముని ముద్దులకుమార్తె, మాలకన్నముని సోదరి రత్నాల పేరమ్మ పట్టులంగా పరికిణీ వేసి పందిరిలో సందడిగా తిరుగుతుంది.

కన్నమునికి తలారా స్నానం చేయించి నుదుట సింధూర తిలకం దిద్ది, మొలన పిడిబాకు ధరించి, ఖడ్గాన్ని ఒరనందు పెట్టి, కాళ్ళకి వెండి కడియములు తొడగి ఎట్టిచారికలు కట్టి, కండ్ల రెప్పలు ఒకసారి గట్టిగా మూసి, తెరచి చూస్తున్నాడు. గంభీరంగా తొణకకుండా, చిర్నవ్వుతో, చురుకైన చూపులతో అప్పుడప్పుడూ చురకత్తె చూపులతో ఉన్నాడు. తన నల్లని అశ్వము 'కారుమాల' అలంకరించి, కొత్తజీను వేసి, నొసట కుంకుమ, పసుపు రాసి, బయట సిద్ధపరచారు. అంతలో విజయధ్వానాలు మిన్నుముట్టినవి. ప్రజలంతా అటుకేసి తిరిగారు. అలుగురాజు, అర్ధరాజు, బిరుదురాజు, తేజస్సురాజు, నాలుగు రథాలపై వచ్చారు. వారు ప్రచండ తేజస్సులతో ప్రకాశిస్తున్నారు. వీరకన్నముని, తోడ్కొని వెళ్ళడానికి రాజులు నలుగురు వచ్చారు. అది పల్నాటి సంప్రదాయం. వీరకన్నమునికి దీవెనలందించి మరలా వారి వారి రథాలపై ఆశీనులయ్యారు.

మాలకన్నమనీడు, బయట ఆగి ఉన్న తన కారుమాలను సమీపించి ఒక్క ఉదుటన ఎగిరి అశ్వముపైకి ఎక్కి కూర్చున్నాడు. గుఱ్ఱాన్ని అదిలించాడు. అది రాజఠీవితో గురజాల రాజకోట వైపు పరుగులిడుతుంది. ముందు రాజులయొక్క నాలుగు రథములు, వెనుక సైన్యము, పరివారము, పట్టమహిషీలు ఎక్కిన రథాలు, వాటి మధ్య నల్లని అశ్వముపై వీరకన్నముడు, అలా బయలుదేరిన వారు రాజకోటకు చేరుకున్నారు. కన్నమునికి స్వాగత తోరణాలు కట్టి ఉన్నవి. కన్నముడు అశ్వాన్ని

దిగి మదగజంలా, మత్తేభంలా, రాజసింహంలా నడుచుకుంటూ సభావేదిక నలంకరించాడు. అతనికి వీరతిలకం దిద్ది, హారతులు పట్టారు. పూజామందిరము నందుంచిన 'వీరభైరవ ఖడ్గాన్ని' అలుగు విభుడు పట్టుబట్టలతో చుట్టి దానిని బంగారు పళ్ళెము పైపెట్టి, దానిపై పసుపు, కుంకుమ చల్లి జైజై ధ్వానాల మధ్య దానిని తీసుకుని నడుచుకుంటూ కన్నమునకు అందించాడు. కన్నముడు సభకు నమస్కరించి అలుగు విభుని పాదాలకు నమస్కరించి ఖడ్గానికి ముకుళిత హస్తాలతో నమస్కరించి, ఆ ఖడ్గాన్ని అందుకుని ఒడుపుగా ఒరనందుంచాడు. సభాస్థలి ఒక్కసారి కేరింతలతో దద్దరిల్లింది. అలుగు విభుడు మాలకన్నముని కంఠాన వజ్రాలహారాన్ని వేసి, ఆనాటికి సభ చాలించాడు.

తండ్రి తెప్పలిని చంపిన వారిని - కన్నముడు హత మార్చుట

కన్నమనీడు తండ్రిని తలచుకొని, కుములుతున్నాడు. భగభగమండుతున్నాడు. అయినా సంభాలించుకున్నాడు. అంతలో భటుడు, ఒక లేఖను పట్టుకొని కన్నమనీయుని మేడకి వచ్చి లేఖనందించాడు. అచ్చట ఉన్న బ్రహ్మనాయుడు ఆ లేఖనందుకుని సారాంశము చదివి వినిపించాడు. వీరులంతా కదన భూమికి వెళ్ళి శత్రురాజులను ఓడించండి'. అని అనుగురాజు పంపిన లేఖ నందుకున్నాడు. వీరకన్నమ. కన్నుల వెంట అగ్నికణాలు వర్షిస్తున్నాయి. తన తండ్రిని హతమార్చిన ఉత్తరుడి శిరస్సును తుత్తునియలు చేయడానికి తహతహలాడుతున్నాడు.

ఇది ఇలా ఉండగా అరణగండ్లలో రాజులంతా తమ గుడారాలలో సమావేశమైనారు. వారంతా గురజాలపై దండయాత్రకు తమ తమ సైన్యాలను కదిలించారు. మాలకన్నముడు తమ సైన్యాలను ముందు అశ్వబలము, గజబలము, రథబలము, కాల్బలములను తోడ్కొని, స్వారీ చేసుకుంటూ ధూళి రేణువులు రేపుకుంటూ, అరణిగండ్లకు ప్రయాణమయ్యి మధ్యలోనే శత్రురాజులను ఎదుర్కొన్నాడు. ఎదురువచ్చిన సైన్యాన్ని, ఏనుగుల్ని, గుఱ్ఱాల్ని కూలబొడిచి, కన్నముని సైన్యము ముందుకు కదిలింది. దళములను ఖండించుకుంటూ వారి కావరమణచుకుంటూ, గుఱ్ఱాలను, ఏనుగుల్ని ఈటెలతో, బాకులతో పొడుచుకుంటూ, శత్రుసైన్యాన్ని, గుమ్మడిపండులా తరుగుకుంటూ, కుప్పనూర్చిన రీతిగా సైన్యాన్ని

హతమార్చుకుంటూ కదిలింది కన్నమనీని సేన. శత్రురాజులను ఖైదీలుగా పట్టుకున్నారు. చెట్లు ఎక్కినవారిని, చేతులెత్తినవారిని, శరణు వేడిన వారిని క్షమించమని కన్నమ ఆన. తాను బంధించిన రాజులందర్నీ అలుగు విభుని ముందు హాజరుపర్చాడు వీరకన్నముడు. అప్పుడు అలుగురాజు వారికి ప్రాణభిక్ష పెట్టి కప్పములు సరిగా కట్టేటట్లు కట్టడి చేసి వారిని సామంతులుగా ప్రకటించి వదిలి వేశాడు.

ఇలా కొన్ని ఏండ్లు గడచిన పిదప రెండవ భార్య భూరమాదేవి కుమారులైనట్టి కామరాజు, నరసింగరాజు, జెట్టిరాజు, పెరుమాలరాజుకు, పెండ్లి కుమార్తెలను వెతికి రంగ రంగ వైభవంగా వివాహము జరిపించాడు. మొదటి భార్య కుమారుడైన 'నలగాముడికి' ఇంతకు ముందే వివాహము జరిగినది. మూడవభార్య కుమారులైన పెదమాల దేవుడికి రాకుమారి సీరాదేవితో వివాహము జరిపించాడు. ఇంకా పినమాల దేవుడు, బాలమాలదేవుడు మాత్రమే వివాహము జరుగవలసి యున్నది. కన్నమనీడు మాత్రము, ఎక్కువగా యుద్ధవిన్యాసాలు అభ్యాసన, వ్యాయామశాలనందు ఎక్కువగా గడపడం యుద్ధవ్యూహాలు నిర్మించడం వాటిలో తన సైన్యానికి శిక్షణ నివ్వడంలో మునిగితేలుతున్నాడు.

ఇది ఇలా ఉండగా ఒకనాడు అలుగురాజు, అడ్డకత్తులవారు, అరిగెలవారు, చేకత్తిపిడిబాకు శరములవారు, పచ్చబద్దలవారు బరిసెలవారితో కలసి వేటకు బయలుదేరివెళ్ళి, చిరుతలు, గండుపులులు మదగజములను వేటాడి, వేటాడి వీరులు అలసిపోయి తిరిగి ఇంటి ముఖం పట్టారు. మధ్యలో మార్గమధ్యమున జెట్టిగా మాలపాడునందు, ఒక వీరనారి, రాజువద్దకు వచ్చి రెండు చేతులెత్తి నమస్కరించి తమ ఆతిథ్యము స్వీకరించవలసినదిగా కోరినది. అసలే అలసి, ఆకలిగొని ఉన్న పరివారాన్ని దృష్టిలో ఉంచుకొని రాజు అంగీకరించారు. షడ్రషోపేతమైన భోజనాలు క్షణాలలో తయారుచేసి పరివారానికి వడ్డించినది. ఆమెపేరు నాగమ్మ, నాగవంశస్త్రీ, ఆమె వీరనారిలా, బిగుతైన శరీరంతోయున్నది. ఆమె తెగువ, ఆమె తెలివితేటలు, రాజును ఆకట్టుకున్నవి. రాజు ఆమెను ఒకసారి అంతఃపురానికి రావల్సినదిగా చెప్పి తన పరివారంతో గురజాలకు వెడలెను. అప్పటినుండి నాగమ్మ అప్పుడప్పుడూ రాజాంతఃపురానిని వస్తూ ఉన్నది. ఆమె తెలివితేటలు, వాదనా పటిమ, అమోఘమైన

జ్ఞాపకశక్తి పై రాజుకు నమ్మకం బలపడసాగినది. ఆమె చొరవతో రాజాస్థానములో రాజుగారి కుమారులతో సాన్నిహిత్యము పెంచుకున్నది. ముఖ్యముగా నలగాముడు, నరసింగుని మనస్సునందు ఆమె ఉన్నతస్థానమున్నది. ఆమె మేధస్సు వారిని మంత్రముగ్దుల్ని చేసినది.

ఇది ఇలా ఉండగా అలుగురాజు ఆరోగ్యము నానాటికి క్షీణించసాగినది. వెన్నునందు లేచిన రాచపుండు రాజాస్థాన వైద్యులకు అంతుపట్టడం లేదు. అనేక దేవతలకు శాంతి చేయించినారు. ఆయుర్వేద వైద్యులు కూడా తమ వంతు ప్రయత్నము చేసినారు. అయినా రాచపుండు నానాటికీ రాజుగారిని కృంగదీసినది. చివరి క్షణాల్లో తన కుమారులైన నలగాముడు, కామరాజు నరసింగరాజు, పెరుమాలదేవుడు, బాలమాలదేవుళ్ళను పిలిపించుకున్నాడు. తన సోదరులైన బిరుదురాజు, అర్థరాజు,తేజస్సురాజులను కూడా రప్పించి ఉచితాసనములపై కూర్చుండపెట్టినాడు. తనకు అంతిమ ఘడియలు సమీపించినవి కనుక నలగాముడ్ని పల్నాటికి చక్రవర్తిగా ప్రకటించుచున్నాను. మీరందరూ సహకరించండి అని చెప్పినాడు. అందరూ సమ్మతించినారు. కాని ఈ విషయము తెలిసిన వీరవిద్యలదేవి, తన కుమారులకు అన్యాయము జరుగును అని భావించినది. మాలమ్మదేవి కుమారుడైన నలగాముడు రాజైనట్లయితే, భూరమాదేవి కుమారులలో ఒకరైన నరసింగరాజుకు ప్రాముఖ్యత పెరుగును. ఎందువలననగా నలగాముడు మొదటనుండి, నరసింగరాజుతో సన్నిహితంగా ఉంటాడు. మరియు నరసింగునిపై అమితమైన వాత్సల్యమున్నది. ఇది తెలిసిన వీరవిద్యలదేవి నలగామునకు పట్టాభిషేకమును, వ్యతిరేకించినది. (ఒకసారి పల్నాడునందు, పగలతో రగిలిపోయిన ఇరువర్గాలు గడ్డివాములకు, నిప్పుపెట్టుకున్నారు. ఆ గడ్డివాములను ఆర్పుటకు వెళ్ళినపుడు అలుగురాజు వళ్ళు కాలినది. ఆ గాయాలు చాలారోజుల వరకు మానలేదు. ఆ గాయాలతో క్షీణించి మరణించాడు. అని కథకులు కథలలో చెబుతున్నారు.)

కాని అంతలో అలుగురాజు మరణించాడు. అతని మరణంతో అంతఃపురంలో కొన్నాళ్ళు నిశ్శబ్ధం నెలకొన్నది. రాజుగారి కోరికపై నలగాముడు చక్రవర్తి అయినాడు.

నలగాముడు, నరసింగరాజును రప్పించి రాజ్యవ్యవహారములన్నియూ

చక్క పెట్టవలసినదిగా ఆజ్ఞాపించెను. సేనాపతి మాలకన్నముని రప్పించి సైన్య విషయాలు చర్చించెను. నాగమ్మను రప్పించి రాజతంత్రములు నెరపెను. ఇంతలో మంత్రి దొడ్డనాయుడు కూడా మరణించెను. దొడ్డనాయుడి తరువాత మంత్రిత్వము కొరకు బ్రహ్మనాయుడు (దొడ్డనాయుని కుమారుడు) ఆశతో ఎదురు చూస్తున్నాడు. రాజుగారి నుండి కబురు రాలేదు. నలగామునికి ముందుగానే బ్రహ్మనాయుడి కుచ్చిత మనస్సు తెలుసు, మరియు అతనికి రాజనీతి సరిగ్గా తెలియదు. గొప్పమేధావి కూడా కాదు,కనుక అఖండ ప్రజ్ఞావంతురాలైన నాగమ్మను అన్ని విషయాలలో సంప్రదించుచూ, ఆమెకు 'నాయకురాలు' అని బిరుదు కూడా నొసగెను. నాగమ్మ పల్నాటిసీమలో ఆదాయశాఖతో దాడులు నిర్వహించెను. అప్పుడు బ్రహ్మనాయుడి ఇంట్లో అతని హితుల ఇండ్లలో ఎక్కువ ధనరాసులు అభ్యమయినవి. దీనితో నలగామునకు బ్రహ్మనాయుడి మీద పూర్తిగా సదభిప్రాయము పోయినది.

రాజ్యభాగాల పంపిణి - బ్రహ్మనాయుడి కుట్ర - కన్నముని మనస్తాపం

ఇది ఇలా ఉండగా, వీరవిద్యలదేవి ఆలోచన ఇంకొక విధముగా ఉన్నది. తాను 'పట్టమహిషి'. రాజ్యాధికారము పట్టమహిషి కుమారులలో మొదటివానికి చెందాలి. అనగా న్యాయంగా పెదమాలదేవుడు రాజు కావాలి.కాని జరిగింది ఏమిటి? చిన్నభార్య కుమారుడైన 'నలగాముని'కు పట్టాభిషేకము చేసారు. ఏవిధంగా ఆలోచించినా విద్యలాదేవికి ఇది న్యాయంగా తోచలేదు. పల్నాటి ప్రజామోదము కూడా, అటూ ఇటూగా యున్నది. అంతా మిశ్రమ స్పందనగా యున్నది.

విద్యలాదేవి తన బావలైన బిరుదురాజును, అర్ధరాజును, తేజస్సురాజును విడివిడిగా కలిసి, న్యాయంచేయమని అర్థించినది. తన కుమారులలో పెద్దవాడిని రాజును చెయ్యవలసినదిగా వేడినది. తరువాత కన్నమనీడుకు కబురుచేసినది. ఆ కబురందుకుని కన్నమ ఆఘమేఘాలపై అంతఃపురానికి చేరి విద్యలదేవి మందిరానికి వెళ్ళి, నమస్కరించి తల్లీ! సెలవివ్వండి. అని నిలబడ్డాడు.

అప్పుడు విద్యలదేవి కన్నీరుమన్నీరుగా కన్నమునితో ఇలా అన్నది. నాయనా! కన్నమా! ఈ అన్యాయాన్ని చూసావా? పట్టమహిషిని నేను, వారసత్వం దక్కాల్సింది నా కుమారునికి. అలాంటప్పుడు రాజుగారు నలగామునికి పట్టాభిషేకము జరిపారు.

అనగా కన్నముడు తల్లీ! అది రాజాజ్ఞ, దానిని ధిక్కరించే అధికారము ఎవ్వరికీ లేదు. అనగా అక్కడే ఉన్న పెదమాలదేవ్, చినమాలదేవ్, బాలమాలదేవ్, ముగ్గురు కన్నముని వద్దకు వచ్చి, అన్నా కన్నమా! మాదొక చిన్న కోరిక. రాజ్యాధికారం, పట్టాభిషేకము ఎలాగూ జరిగిపోయినది. కాని మాకు అనగా పెదమాలదేవునికి మంత్రి పదవి ఇవ్వమని అన్నగారైన నలగామునకు మా విన్నపముగా చెప్పుము. ఎందువలననగా పల్నాటి ప్రజలలో తలెత్తుకుని తిరుగలేకున్నాము. అని చెప్పారు.

ఈ విషయాన్ని సావధానంగా ఆలకించిన కన్నముడు సరే! అట్లే నేను రాజుగారితో ఈ విషయము చెప్పి చూస్తాను. అని చెప్పి వెళ్ళిపోయినాడు. మంత్రిపదవి దక్కక, మంత్రిపదవి లభిస్తుంది అని ఆశకొంచెమైనా లేని బ్రహ్మనాయుడు ఎప్పటికప్పుడు వివరంగా అన్నివిషయాలు సేకరించుకుంటున్నాడు. బ్రహ్మనాయుడు, పట్టమహిషి విద్యలదేవి వద్దకు చేరి వినయంగా మ్రొక్కి, అమ్మా! కన్నముని రాయబారము ఎందులకు? తమ కుమారునికి మంత్రి పదవి అడగడం న్యాయం కాదు. అసలు రాజ్యం మీది, అది దక్కలేదు. రాజ్యభాగాన్ని అడగండి, కళ్యాణపురాధీశుడైన వీరసోమునితో వియ్యమందిన పెదమాల దేవునికి మొత్తం సామంతరాజుల మద్ధతు ఉన్నది. వీరసోముడు తన ముద్దుల పుత్రిక సీరాదేవి కొరకు ఏమి చేయడానికైనా వెనుకడుగు వేయడు. అనగా విజ్జలదేవి అలాగే ఆలోచిస్తాం. మీరు వెళ్ళిరండి. అని చెప్పింది. ఆ విషయము అంతటితో వదిలి వేసినది. ఎందువలననగా ఆమెకు బ్రహ్మనాయుడి మీద సదభిప్రాయము అంతగా లేదు.

కాని బ్రహ్మనాయుడు ఆ రాత్రికి రాత్రి కళ్యాణపురము చేరినాడు. అచ్చట వీరసోమునకు సన్నిహితుడైన ఒక భటుని బ్రహ్మనాయుడు వజ్రవైఢూర్యాలిచ్చి లోబర్చుకున్నాడు. తాను చెప్పినట్లు చేస్తే లెక్కలేనన్ని ధనరాశులు ఇస్తానని ఆశ పెట్టినాడు. ఆ భటుడు సరేనన్నాడు. బ్రహ్మనాయుడు వీరసోముడు వ్రాసినట్లుగా ఒక లేఖ సృష్టించినాడు. వీరసోముని రాజముద్రికను దానిపై ముద్రించి, ఆ భటునికిచ్చి ఆ లేఖ నలగామునకు పంపినాడు.

ఆ జాబునందుకున్న నలగాముడు ఆ లేఖను చదువుకున్నాడు. "నలగామ రాజా నీవు పట్టాభిషేకమునకు అనర్హుడవు. నాఅల్లుడు మాలదేవునకు రాజ్యాధికారము

అప్పగించుము. లేకున్న యుద్ధము తప్పదు." అని ఉన్నది. నలగాముడు నిలువెల్లా ఉడికిపోయాడు. పల్నాటి వారి వంశములో జోక్యము చేసుకునే స్థాయికి వీరసోముడు ఎదిగాడా? ఎవరక్కడ, ఈ రాత్రికి రాత్రి విజ్జలాదేవి ముగ్గురు కుమారులైన పెదమాలదేవుడు, పినమాలదేవుడు, బాలమాలదేవుళ్ళను చెరసాల నందు బంధించండి. అనగా వెంటనే వారిని బంధించి చెరసాలలో వేసినారు.

బ్రహ్మానాయుడి కుట్ర తెలియని నలగాముడు, వేదనా భరిత హృదయంతో ఆ రాత్రి నిద్రలేకుండా గడిపినాడు. ఈ విషయము అప్పటికప్పుడే కన్నమనీడికి చేరేటట్లు పథకం పన్నాడు బ్రహ్మానాయుడు. ఆ వార్త తెలుసుకున్న మాలకన్నమనీడు నిలువెల్లా కంపించాడు. ఏమి జరిగిందో తెలియని వీరకన్నముడు నలగాముని యెడల విరక్తి చెందాడు. తన సోదరులు, చిన్నవారన్న జ్ఞానం లేకుండా రాజుగారు చేసిన పనికి కన్నముని మనసంతా బాధతో నిండింది.

తెల తెల వారుతుండగానే కన్నముడు ఒక్కడే 'కారుమాల' నధిరోహించి, రాజాంతఃపురం చేరినాడు. తెల తెల వారుతుండగా విద్యలాదేవి పుత్రులను చెరసాల నందుంచిన వార్త పల్నాటి ప్రజలలో సంచలనం కలిగించినది. పల్నాటి ప్రజలంతా నిరసన వెల్లువెత్తినది. రాజుగారిని కలిసిన కన్నముడు వేదన చెందుతూ, రాజా! మాలదేవాదులను బంధించుట నీకు న్యాయమా, వారికి పట్టాభిషేకం జరగాలి. అది జరుగకపోగా వారు కోరిన కోరిక 'మంత్రిత్వము' దానిని ఇవ్వడానికి తమకు అభ్యంతరము ఎందుకు? అని కన్నముడు ప్రశ్నించాడు. దానితో రాజు గందరగోళంలో పడ్డాడు. వీరసోముని నుండి వచ్చిన జాబు చూపించాడు. అది చూచిన కన్నముడు రాజా! పొరపాటు ఎచ్చటో జరిగినది. అని మాత్రము అనగలిగినాడు.

రాజుగారు మాలదేవాదులను బంధించినందుకు బాధ చెందాడు. దానికి పశ్చాత్తాపం చెందుతూ, నాయనా కన్నమా! వారిని ఇప్పుడే చెరసాలనుండి వదిలి వేస్తాను. వారికి రావల్సిన భాగం వారికి పంచి ఇస్తాను. ఈ రోజు కొలువులో పెద్దల్ని సంప్రదించి వారికి ధర్మంగా రావల్సిన భాగం, వారికి చెందేటట్లు చూస్తాను. నేను చేసిన తప్పును సరిదిద్దుకొనుటకు, ఇంతకంటే ఏమి చేయగలవాడను. అనగా కన్నముడు ముకుళిత హస్తాలతో రాజుగారికి నమస్కరించి నిష్క్రమించాడు.

కన్నముడు వేగంగా, విద్యాలాదేవి మందిరానికి చేరాడు. విద్యాలాదేవి చింతాక్రాంతురాలై ఉన్నది. కన్నముడు ఆమెకు చేతులెత్తి నమస్కరించి అమ్మా! నీ కుమారులకు వచ్చిన కీడేమియులేదు. వారిని చెరసాల నుండి వదిలేస్తున్నారు. రాజ్యంలో వారికి న్యాయంగా చెందాల్సిన భాగాన్ని పంచడానికి రాజుగారు అంగీకరించారు. అనగా, విద్యాలాదేవి సంతోషించినది.

ఆ రోజు మధ్యాహ్నం, రాజదర్బారు, రాజ్యాన్ని విభజించినది. దాని ప్రకారము మాలదేవాదులు, చంద్రవంక నదీతీరాన ఒక పట్టణాన్ని నిర్మించారు. దాని పేరు 'మాలచర్ల'. (శాసనాలలో మాల్ చర్ల, మహాదేవిచర్ల అని ఉన్నది. ప్రస్తుతము దానిని 'మాచర్ల' అంటున్నారు). ఈ మాచర్లనందు అంతఃపురాలు, కోటలు రాచవాడలు, నాటక శాలలు, సైనిక కోటలు నిర్మించారు. పట్టణం శోభాయమానంగా ఉన్నది.

రాజ్యవిభజన సమయమునుండి వేదన చెందిన మాలకన్నముడు ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నాడు. తాను నలగామాదులను వదిలి, మాలదేవాదుల ప్రక్క చేరినందులకు మొదట బాధ చెందాడు. క్రమంగా మానసికంగా సర్దుకున్నాడు. తాను మాలదేవాదులకు సర్వసైన్యాధిపత్యము వహించాడు. తన సైన్యానికి, అన్ని వ్యూహాలు నేర్పుతున్నాడు. కొత్త యువకులను సైన్యమునందు చేర్చుకొనుచున్నాడు. చతురంగ బలాలను సమకూర్చుకున్నాడు.

గురజాల నందు సైన్యంలో కన్నముడు లేని లోటు కన్పిస్తుంది. మునుపటి ఉత్సాహము కానరావటం లేదు. ఆ ప్రోత్సాహము లేదు. ప్రస్తుతము సర్వసైన్యాధిపత్యము నరసింగునికి ఇచ్చారు. నరసింగుడు గొప్పవీరుడే కాని వ్యూహాలు పన్నడం,ఎత్తులు వేసి సైన్యాన్ని నడిపించడంలో అతనికి పెద్ద అనుభవము లేదు. కన్నముడు తన తండ్రి తెప్పలి వద్ద యుద్ధవ్యూహాలు నేర్చుకున్నాడు. అందువలన కన్నముడు లేని లోటు గురజాల సేననందు కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. బ్రహ్మనాయుడు కన్నముని అండతో మాలదేవాదుల వద్దకు చేరినాడు. మాలదేవాదులు కూడా, తెప్పలిపై శీలమ్మ (బ్రహ్మనాయుడి తల్లి)పై ఉన్న అభిమానంతో బ్రహ్మనాయుడ్ని కొలువునందు ఉంచారు. అతనికి మంత్రిత్వము ఇచ్చారు. మాలకన్నమునికి బరువు బాధ్యతలు పెరిగిపోయినవి. కొత్తగా రాజ్యాన్ని

స్థాపించారు. సైన్యాన్ని బలపరచడం కోటలు నిర్మించడం, అంతఃపురాలకు రక్షణ ఏర్పాటు చేయడము. వేగుల్ని నియమించడం. ఒక్కటేమిటి? అన్నివిషయాలు కూడా కన్నముడే చూచుకొనుచున్నాడు. బ్రహ్మనాయుడికి మంత్రిత్వము ఇచ్చారేకాని, అతనిని మాలదేవరాజులు నమ్మడం లేదు. రాజుగారి తల్లి విద్యలాదేవి రాజ్యవ్యవహారాలలో అస్సలు జోక్యము కల్పించుకొనుట లేదు. బ్రహ్మనాయుడు, మాల కన్నముడి ప్రాపకం కొఱకు ప్రాకులాడుతున్నాడు. నిత్యం సేనాపతిని అనుసరించి ఉంటున్నాడు. సహజంగా భోళామనిషి అయిన కన్నముడు, అతి మంచివాడు. అందువలన బ్రహ్మనాయుడి కుచ్చితాలు గమనించుకునేవాడు కాడు. బ్రహ్మనాయుడు అందరిలానే, తనతో ఉంటున్నాడులే అనుకునేవాడు, బ్రహ్మనాయుడు మాత్రము కన్నమునితో ఎక్కువగా సన్నిహితంగా మెలిగితే కాని, మాచర్ల రాజ్యంలో, తనని పట్టించుకునే వారు లేరు అనే విషయాన్ని ఎరిగి ప్రవర్తిస్తున్నాడు.

అన్ని వ్యవహారాలు చూస్తున్న కన్నముని, రాజులు గౌరవించి 'నాయకుడు' అని బిరుదు నొసంగినారు. అతనిని మాచర్ల ప్రజలంతా 'కన్నమనాయకుడు' అని పిలుచుకొంటున్నారు. ఆనాటినుండి మాలకన్నమనాయకుడు అయినాడు. ఆ పేరే క్రమముగా **మాలకన్నమనాయుడు** అయినది. మాచర్ల రాజ్యం బలపడినది. మాలదేవరాజులు ప్రజల సంక్షేమాలపై దృష్టిసారించారు. కన్నముడు సైన్యాన్ని దుర్భేధ్యం చేసినాడు. అచ్చట గురజాలలో నలగాముడు, నరసింగుడు కూడా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరిపాలిస్తున్నారు. ప్రజలంతా (గురజాల-మాచర్ల) సుఖసంతోషాలతో ఉన్నారు.

కోడిపోరు : అల రాచమాల తీర్పు :

ఈ పరిస్థితి చూచిన బ్రహ్మనాయుడు సహించలేకున్నాడు. తన తండ్రి దొడ్డనాయుడు పల్నాడులో అనుబవించిన గౌరవాలు చూశాడు. తాను ఇలా అయినందులకు బాధపడ్డాడు. ఎలాగైనా లేని సమస్యలు సృష్టించి వానిని పరిష్కరించి, తాను ప్రాముఖ్యతను సంతరించుకొనవలయునని తలచాడు.

మాలదేవరాజుల వద్దకు వెళ్ళి నమస్కరించి రాజా! అలరాచమాల (అలరాజు) వివాహమై చాలా నెలలు అయినది. రత్నాల పేరమ్మ అచ్చట గురజాలనందేయున్నది. నలగాముడు మరి ఎందువలననో, కాపురానికి పంపడం లేదు.. నేను వెళ్ళి మాట్లాడి

వస్తాను సెలవివ్వండి. అని అడిగాడు. సరే మంచి కార్యానికి వెళ్తానన్నాడు కదా! అని తలచి పెదమాలదేవరాజు సరేనన్నాడు. బ్రహ్మనాయుడు పరివారంతో బయలుదేరి గురజాల చేరుకున్నాడు. తనతో పాటు గురజాలకు ప్రయాణమయిన కన్నమనాయుడ్ని వారించాడు. అలరాజు భార్య విషయము కదా! నేను కూడా వచ్చి నలగామరాజుని అడుగుతాను అని కన్నముడు అనగా నేను నచ్చచెప్పి కాపురానికి తీసుకువస్తాను అని వెళ్ళాడు. బ్రహ్మనాయుడికి గురజాలనందు అంతఃపురానికి సమీపమున విడిది ఏర్పాటు చేసారు. తన కుమార్తె కాపురం విషయమై వచ్చినందున బ్రహ్మనాయుడికి అన్ని సపర్యలు జరిగినవి. తాను కాపురానికి పంపడానికి నిశ్చయించుకున్నాడు. రత్నాల పేరమ్మ ఆ దినం సంతోషంతో అంతఃపురం కలియ తిరుగుతుంది.

ఉదయమే లేచిన బ్రహ్మనాయుడు తాను విడిది వద్ద రెండు పుంజుల్ని తెప్పించి పందానికి వదిలి తాను ఆరుబయట ఆశీనుడై కూర్చున్నాడు. ఆ పందెం కోళ్ళు ఒక జాము పోరాడినవి. గురజాల ప్రజలు పందెం చుట్టూ చేరినారు. వ్యసనపరుడు, కుతంత్రుడు అయిన బ్రహ్మనాయుడు కోడిపోరును చూస్తున్నాడు. ఆ రెండు పందెం కోళ్ళు జోరుగా పోరాడుతున్నాయి. ఉన్నట్లుండి ఒక పుంజు పారిపోసాగింది. చివ్వున బ్రహ్మనాయుడు లేచి, మీసాన్ని మెలి త్రిప్పి, చెయ్యెత్తి గురజాల వారి కోడి పారిపోతుంది. అన్నాడు. ఆ మాటకు గురజాల ప్రజ నివ్వెరపోయింది. ఆమాట ఆనోట, ఆనోట నలగామునకు చేరినది. నలగాముడు ఆ మాటలకు ఎంతగానో నొచ్చుకున్నాడు. కుమార్తె కాపురాన్ని సరిచేస్తాడు కదా! అనుకుంటే తన కుట్ర బుద్ధి చూపించాడు అనుకున్నాడు.

సరే! అనుకుని నాగమ్మకు కబురు పంపాడు. "బ్రహ్మనాయుడికి , తన మాటగా చెప్పండి. మాచర్ల వారిని కోడిపోరుకు సిద్ధం అవ్వమని" చెప్పండి. పందాలు తరువాత నిర్ణయిద్దాం! అని చెప్పిన రాజుగారి మాటలను బ్రహ్మనాయుడికి నాగమ్మ చెప్పినది.

ఆదే అదునుగా చూస్తున్న బ్రహ్మనాయుడు, సపరివారాన్ని తరలించుకుని మాచర్లకు చేరుకున్నాడు. దైవం తనకు అనుకూలముగా ఉన్నది. తన వ్యసనము తీరుతుంది. తన మాట నెగ్గుతుంది. అని తలచిన బ్రహ్మనాయుడు వెంటనే పెదమాల దేవరాజును కలిసాడు.

రాజా! నేను తమ ఆజ్ఞపై గురజాల వెళ్ళాను. నలగాములవారు కనీసం రత్నాలపేరమ్మ విషయం మాట్లాడలేదు సరికదా! మనల్ని కోడిపోరుకు సిద్ధంకండని, నాయకురాలు నాగమ్మతో కబురంపాడు. ఆ కబురందుకుని వెనుదిరిగొచ్చాను. అని చెప్పాడు.

ఆ మాటకు పెదమాలరాజు ఖిన్నుడయ్యాడు. తన అన్నగారు ఆ విధంగా అన్నారా! కోడిపోరులో ఎందరు పతనమయ్యారో తనకు తెలుసు. మనసులో మదన పడ్డాడు. బ్రహ్మనాయుడ్ని పంపించి వేసాడు. భటులతో కొమ్మరాజుకు కబురు పంపాడు. అలరాజును, కన్నమనీడ్ని కూడా పిలిపించాడు. రత్నాలపేరమ్మ విషయమై దూతగా వెళ్ళిన బ్రహ్మనాయుడు, కోడిపోరుకు ఒప్పుకొచ్చాడు. అతని ప్రవర్తనకు అతనిని ఏమిచేద్దాం మీరే చెప్పండి అనగా, కొమ్మ భూపతి ! రాజా అతని తండ్రి పల్నాటి వారికి ఎంతో నమ్మినబంటులా పనిచేసాడు. అతని అన్న బాదన్న, తమ్ముడు పేర్నీడు కూడా మనకు విశ్వాసపాత్రులుగా ఉన్నారు. ఇతనిని మొదట నుండీ అందువలననే సహిస్తున్నాము. అతనికి కోడిపోరు ఒప్పుకునే అధికారము కాని, హక్కులు కాని లేవు. అనగా అలరాజు, రాజా! ఈ విషయంలో ఏదైనా కుట్ర ఉన్నదేమో ఆలోచించండి. అని మాత్రం ఊరుకున్నాడు. కన్నమనీడు మాత్రము రాజుగారు తీసుకునే ఏ నిర్ణయానికైనా కంకణాబద్ధుడ్ని అన్నాడు.

అటులైన మాలదేవరాజులు ఆలోచించి మనం కూడా కోడిపోరుకు సిద్ధమే అని కబురు చేద్దాం. కోడిపందాలే కదా! అదికూడా ఒక వేడుకలాగానే ఉంటుంది. చరిత్రలో ముఖ్యమైన రాజవంశాలన్నీ, ఇలాంటి కోడిపందాలు జూదాలు, గుఱ్ఱపుపందాలు మొదలైనవి జరుపుతుంటారు. మరియు పల్నాటి వారి పౌరుషానికి కోడిపందాలు ప్రతీకలుగా ఉంటాయి. అనుకొని నిశ్చయించారు.

కోడి పందాలకు ఉపయోగించిన రెండుకోళ్ళు నల్లమాల, చిట్టిమాలలను కూడా నాగలోకం నుండి తెచ్చి వాటిని పెంచినట్లు కథకులు చెబుతారు. నాగలోకంలో కోడిని తేవడానికి వెళ్ళిన సైనికులు అదిరి, బెదిరి, గుండెలు దద్దరిల్లగా పోరాడి తెచ్చారు. అని చెబుతుంటారు. నాగలోకమనగా దళితదేశమని నాగులు అనగా దళితులని ముందే తెలుసుకున్నాము. గమనించగోర్తున్నాను.

కోడిపందాలకు మాచర్లవారు సిద్ధమే అనే కబురు గురజాలకు చేరేటట్లు

బ్రహ్మనాయుడు జాగ్రత్తపడ్డాడు. కోడిపందాలకు కాలము 'తొలిఏకాదశి' గా నిర్ణయమైనది. ఇరువర్గాలు కోళ్ళను సిద్ధపర్చుకుంటున్నారు.

గురజాల వారి కోడిపుంజును గూర్చి బ్రహ్మనాయుడికి తెలుసు. ఆ కోడిపుంజు పేరు '**నల్లమాల**' ఆ కోడికి ఆ ప్రాంతములో ఎదురు లేదు. దానిని ఎదుర్కొనుటకు మాచర్లనందున్న కోళ్లు చాలవు. అందువలన మంచికోడిని గురించి తెలుసుకొమ్మనగా బ్రహ్మనాయుడు తెలుసుకున్నాడు. 'నల్లమాల'ను ఎదుర్కొనవలెనన్న చిట్టేలరేవు **దాటి** పానుగల్లు పట్టణము చేరినచో అచ్చట చెట్టువద్ద మాస్టీలు వారు '**చిట్టిమాల**' అని ఒక కోడిని పెంచుతున్నారు. దానిని తెప్పించవలెననగా! కన్నమనీడు వీరపడాలును రప్పించి, ఆ పుంజు తీసుకొని రావలసినదిగా ఆజ్ఞాపించాడు. వీరపడాలు పానుగల్లు చేరి మాస్టీలు (దళితులు) వారితో పోరాడి ఆ 'చిట్టెమాల' ను తీసుకుని మాచర్లకు చేరెను. ఆ పుంజును రాజకొలువుకు రప్పించి సుంకరివారు, రేణూరివారు, ఆబోతులవారు, ఆణెంవారు, రేవనూళ్ళవారు, రేచర్లవారు, పాలపర్తివారు, మతసానివారు, ముయ్యూరివారు, అట్లూరివారు, ఆవాలవారు, అచ్యుతలవారు, కొండెడ్లవారు, గోవిందువారు, పెద్దన్న, పేరినీడు, గండుకన్నమ, రాయనిబోయడు, రాయపడాలు, బాలగోపన్న, మొదలయిన అరువది ఆరు(66) మంది వీరులు ఆ కోడిని పరికించి చూచినారు. దానిని నిమిరినారు. అన్నెవన్నెలడేగ, అందనాల చిట్టెమాలను పోరుకు సిద్ధపరచవలసినదిగా రాజుగానిరి కోరినారు.

కాలం కదిలింది. 'ఏకాదశి' రానే వచ్చింది. మాలదేవరాజులెవ్వరు కూడా కోడిపందాలకు వెళ్ళుటకు నిర్ణయించుకొనలేదు. వారు బ్రహ్మనాయుడ్ని కొద్దిపరివారాన్ని వెళ్ళి రావలసినదిగా ఆజ్ఞాపించారు. ఇలాంటి చేష్టలు పెదమాల దేవరాజుకు అసలు ఇష్టముండదు. బ్రహ్మనాయుడు తనతో పాటు సేనాపతి కన్నముని పంపాల్సినదిగా రాజుగారిని కోరినాడు. బ్రహ్మనాయుడు కన్నమనీడు లేకుండా కాలు కదిపే సాహసం చేయడు. ఎందుకంటే కన్నమనీడు ఉంటే తనపై ఈగవాలదు గురజాల వారు కూడా మెదలకుండా ఉంటారు. కన్నమనీడుని తీసుకుని వెళ్ళమని రాజుగారు చెప్పగానే బ్రహ్మనాయుడు సంతోషం పట్టలేకున్నాడు. కన్నమనీడు తన సేనను కొద్దిగా సమాయత్తపరచుకున్నాడు. కాని సేన అనవసరమని ఆలోచించి తొమ్మండుగురు వీరవిద్యావంతులను (మాలల్ని) తీసుకుని మాచర్లకు పయనమయ్యాడు. బ్రహ్మనాయుడు కూడా బయలుదేరాడు. కోడిపుంజుకు అలంకరణ చేసారు. అందరూ మాచర్ల బయలుదేరారు.

అచ్చట గురజాలలో, 'నల్లమాల' (కోడిపుంజు) సిద్ధపరిచారు. నలగాముడే స్వయంగా బయలుదేరాడు. ఎందువలనంటే ఆనాడు బ్రహ్మనాయుడు గురజాల పుంజు పారిపోతుందన్నాడు. దానికి జవాబు చెప్పడానికి సిద్ధపడ్డాడు. ఇరువర్గాలు మాచర్లనుండి గురజాల వెళ్ళే మార్గమధ్యాన ఉన్న మంచి కల్లు గ్రామం చేరుకున్నారు. దానికి దగ్గరలో ఉన్న పాలవాయి (పాల్వాయి) గ్రామం సమీపంలో చేరుకున్నారు. (ఈనాటికి కూడా, అచ్చట కోడిపందాలు జరిగినప్పుడు ప్రజలు కూర్చోవటినికి నున్నని బండలు తెచ్చుకున్నారట. పందాలు అయిన తరువాత వాటిని రెండుగుట్టలుగా వేసారు. వాటిని నేటికీ కోళ్ళ గుట్టలని, కోడేరు గుట్టలని అంటారు. తెచ్చుకున్న రాళ్ళు కూర్చోవడానికి మరియు శ్రుతి మించితే ఒకరిపై ఒకరు విసురు కొనెడివారు) (పాలవాయి=మాలవాయి; పాల=మాల ఒకటే పదము అని ముందే తెలుసుకున్నాము)

"పాల్వాయి రెంటాల పాలబయతాచౌళ్ళ
కోలేరు దాపునాకోలదిబ్బల కాడ
కోడిజగడానికై కొత్తపుంజులు దెచ్చి
పట్టిరే పందాలు పంతాలు ఎగదట్టి" (జానపదులు)

ఒకవైపు మాలకన్నమనీడు, అలరాచమాల (అలరాజు) బ్రహ్మనాయుడు మరొకవైపు నలగాముడు, నాయకురాలు మొదలగు యోధానుయోధులంతా ఉచితాసనాలపై కూర్చున్నారు. న్యాయనిర్ణేత మంచి మనసున్నవ్యక్తి, ఇరువర్గాలకు బంధువు, రాజనీతి దురంధరుడు రాజనీతి తత్త్వజ్ఞుడు, ధర్మపరాయణుడు అమితబలశాలి, ధైర్యవంతుడు. ఇన్ని మంచి లక్షణాలు కలిగిన అలరాచమాలను కోడిపోరులో న్యాయనిర్ణేతగా ఉండవలసినదిగా ఇరువర్గాలు కోరినవి. నలగాముడు ఒక్కసారిగా అల్లుడ్ని చూచుకొని వాత్సల్యము పొంగినది. నిగ్రహించుకున్నాడు. మామగారిని చూచి తన ముద్దుల భార్యను గూర్చి అడగాలనుకున్నాడు. కాని సభామర్యాద అడ్డొచ్చినది.

పందెంగాళ్ళు కోడి పుంజులతో బరిలోకి దిగారు. ప్రజలంతా గోల, ఈలలు, చప్పట్లు చిందులు. చిట్టిమాలను చెవులగోపన్న పట్టుకున్నాడు. ఆ రెండిటిని

దగ్గరకు తెచ్చి ముక్కులతో ఒకదానితో ఒకటి పొడిపించారు. రెండూ ఒక్కసారిగా 'కొక్కొరో...కో' అని కూత పెట్టినవి. ప్రేక్షకులంతా నిశ్శబ్దమయినారు. చెవుల గోపన్న పెద్దపెట్టున అరచినాడు. పందెం ఏమిటో నేను చెబుతాను. ప్రజలంతా వినండి అని బ్రహ్మనాయుడి వైపు చూచినాడు. బ్రహ్మనాయుడు కన్నుగీటినాడు. గోపన్న పెద్దగా "ప్రజలారా రాజ్యమే పందెంగా ఒడ్డుతున్నాము. ఓడిపోయినవారు తమ రాజ్యం విడిచి ఏడేండ్లు వనవాసానికి వెళ్ళాలి. గడువు తీరిన తరువాత వచ్చి రాజ్యం తీసుకొనవచ్చు". అనగానే ప్రజలంతా చప్పట్లు కొట్టారు. కాని నలగాముడు, నాయకురాలు, అలరాజు, కన్నమనీడు అవాక్కయినారు. బ్రహ్మనాయుడి కుతంత్రానికి అతని నీచపుబుద్ధికి ఛీ!ఛీ! అనుకున్నారు. పందానికి ప్రజల ఆమోదము చప్పట్లతో లభించినట్లు ఉన్నది. అందువలన నాయకులంతా కిమ్మనకుండా కూర్చున్నారు.

కాళ్ళపై ఉన్న జుట్లను పరస్పరం కొరికించారు. ఒకదాని జుట్టు ఒకటి పట్టి పీకినది. కాళ్ళకు కట్టిన కత్తుల పదును ఒకసారి చూచినారు. వేళ్ళతో సరిచూచినారు. రెండుకోళ్ళను బరిలో వదిలినారు. వాయిద్యాలన్నీ ఒక్కసారిగా మారుమ్రోగాయి. పోరుకు విడిచిన పుంజులు రెండుకూడా రెక్కలు విదిల్చి పొంగార్చినవి. తలక్రిందికి వంచి మెడవద్దనున్న ఈకలు విప్పారినవి. ఒకదానిని ఒకటి నిప్పులు కురుస్తున్న ఎరుపెక్కిన కళ్ళతో చూచుకున్నవి. కొండలన్నీ మార్మోగే విధంగా కూత కూసినవి. వెనుకకు ముందుకూ ఊగినవి. ఎగిరి ఎగిరి తన్నుకొన్నవి. రెక్కలు తటపట కొట్టుకొన్నవి. ఊకించి, ఊకించి, రెక్కలు ఫెళ ఫెళ విరచినవి. ధూళి లేచి ఎర్రగా కావిరి క్రమ్మినది. కత్తులు రెండింటికి దిగినవి. పుట పుట రక్తం బొట్లు పడుతున్నవి. పుంజుల్ని పందెం గాళ్ళు పట్టి, వాటి తలలు పట్టుకుని, నోటితో ఊదుతూ ఆవిరి వేస్తున్నారు. వాటిని మరలా యుద్ధభూమిలో ఉంచుతున్నారు. నల్లమాల-చిట్టిమాల భయంకరముగా పోరాడుతున్నవి. ఉన్నట్లుండి 'నల్లమాల' ఒక్కసారి వెనుదిరిగి పల్టీ కొట్టి చిట్టిమాలను తన్నినది. దాని డొక్కలో పేగులు వేలాడినవి. 'చిట్టిమాల' నేలపై పడిపోయినది. ఇక లేవలేక పోయినది. గురజాల ప్రజలంతా కేరింతలతో ఉన్నారు. మాచర్లవారంతా ఖిన్నులయ్యారు. మాలకన్నమదాసు మాత్రము గంభీరంగా నిలబడ్డాడు. నోటమాట పెగలలేదు. అలరాజు పందెం ఫలితాలను నిష్పక్షపాతంగా ప్రకటించాడు. గురజాల వారి విజయాన్ని ప్రకటించి తన నిజాయితీ నిరూపించుకున్నాడని ప్రజలంతా

అలరాచమాలను వేనోళ్ళ పొగిడారు. బ్రహ్మనాయుడ్ని తలో మాటా అన్నారు. అచ్చటనుండి పిల్లిలా బ్రహ్మనాయుడు జారుకున్నాడు. మాలదేవరాజుల అభీష్టం మేరకు పందెం జరుగలేదు. అదీ బ్రహ్మనాయుడి భయం. మంత్రి అయి ఉండి రాజుకు కనీసం పందెం గూర్చి తెల్పాలని, అనుమతి పొందాలని జ్ఞానం లేకుండా పోయినది. చెవుల గోపన్నను రెచ్చగొట్టి ఏవిధంగానైనా జగడాలు సృష్టించడానికి బ్రహ్మనాయుడు ప్రయత్నం చేసాడు. చెవుల గోపన్న గురజాల వారిని నలగాముడ్ని తిడుతూ తిరుగుతున్నాడు. అన్యాయంగా గెలిచారని. నాగమ్మ కుట్రలు చేసినదని సృష్టించారు. చెవుల గోపన్న ఎంతకూ ఊరుకొనుట లేదు. తన రాజ్యంలో ప్రవేశించి తననే తూలనాడుతాడా? అనుకొనిన నలగాముడు సంభాళించుకుంటున్నాడు. అయినా గోపన్న చేష్టలు మితిమీరినవి. గోపన్నను నివారించవలసినదని సేనకు రాజుగారి ఆజ్ఞలు జారీ అయినవి. వీరులు, విల్లంబులు, కత్తులు చేపట్టి గోపన్నను సమీపించారు. వీరుల్ని నివారించి ఆరిజోగన్న (మాల) ఒక్కడే వచ్చి గోపన్నతో యుద్ధం చేసి అతనిని హతమార్చాడు. గోపును చంపివేసిన గుఱ్ఱపు దళం, కేకలు పెట్టుకుంటూ బ్రహ్మనాయుడి వైపు కదిలింది. ఇది గమనించిన బ్రహ్మనాయుడు పరుగున మాకన్నముని వద్దకు చేరినాడు. సైన్యం యావత్తు మాలకన్నముని వద్దకు వచ్చి ఆగినది. సైన్యం మొత్తం నివ్వెరపోయి ఆగినది. కన్నమునిపై యుద్ధమా? ఒక్కరికి కూడా గుండె చాలడం లేదు. బ్రహ్మనాయుడు ప్రాణాలు అరచేత పట్టుకుని గజగజలాడుతున్నాడు. అతని ప్రాణాలు నిలబడి ఉన్నాయంటే, కారణం కన్నముడు. అడ్డుగా నిలిచాడు కనుకనే, బ్రహ్మనాయుడికి కన్నముని శక్తిపై అపారమైన నమ్మకముంది. కన్నముని శౌర్య ప్రతాపాలు బ్రహ్మనాయుడికి తెలుసు. కాని స్వతహాగా భయస్థుడైన బ్రహ్మనాయుడు ఒళ్ళంతా ముచ్చెమటలు పట్టినాయి.

కన్నముడు - ఆరిజోగన్నను వధించుట

కన్నముడు తన కరవాలాన్ని ఒర నుండి లాగి, కరకర తిప్పినాడు. గోపన్నను చంపిన ఆరిజోగన్న గుఱ్ఱంపై ఆశీనుడై అల్లంతదూరాన ఉన్నాడు. కన్నముని కళ్ళు చింతనిప్పులు చెరిగాయి. పట్టాకత్తిని కస్సు కస్సున త్రిప్పి ఆరిజోగన్నపై విసిరాడు. జోగన్న తల కసక్కున తెగి, ఇంకొక గుర్రానికి తగిలి దబ్బున క్రిందపడినది.

సైన్యము మొత్తము హాహాకారాలు మిన్నుముట్టినవి. కన్నముని వైపు కదిలినవి. అలా కదిలిన సైన్యాన్నుద్ధేశించి, ఓయి! సైనికులారా! మా గోపును అన్యాయంగా, జోగన్న హతమార్చాడు. అందువలన నేను జోగన్నను చంపాల్సివచ్చినది. చావుకు, చావు సరిపోయినది. మీరిక తరలి వెళ్ళండి. అనగా సైన్యము ఆ మాటలు వినిపించుకొనక కన్నముని పైకి దూసుకొచ్చినది. కన్నముడు తన 'కారుమాల' ను అదిలించాడు. అది ఒక్కసారి ముందున్న రెండుకాళ్ళు పైకెత్తి సకిలించినది. కన్నముడు తన ఖడ్గాన్ని తిప్పుకుంటూ సైన్యం మధ్యకు దూసుకెళ్ళాడు. గుఱ్ఱాలను నుజ్జు నుజ్జు చేస్తున్నాడు. తన కత్తికి సైనికుల ప్రక్కటెముకలు ఫెళ ఫెళ విరుగుతున్నాయి. నోర్లు చీలి పండ్లు విరుగుతున్నాయి. చేతులు ముక్కలుగా తెగిపడుతున్నాయి. భుజాలు తెగి వ్రేలాడుతున్నాయి. తొడలు, మెడలు, జబ్బలు తునాతునకలవుతున్నాయి. కన్నముని శరీరంపై చిందిపడిన నెత్తురు, ముఖాన పేరుకున్న నెత్తురు కలిసిన మాంసపు ముక్కలతో కన్నముని రూపము అరివీరభయంకరముగా ఉన్నది. దానిని గమనించిన సైనికులు, కన్నముని పైకి గోవుల మందలు, ఎద్దుల బండ్లు తోలినారు. సైన్యం మొత్తము ఫలాయనం చిత్తగించి ఇండ్లలో చేరి తలుపులు మూసుకున్నారు. ఎడ్లను, గోవులను చంపుట ఎందుకని తలచిన యువకన్నముడు, మ్రోకులు నరికి, పలుపులు తెగ్గొట్టి ఇరుసులు ఖండించి బండ్లను బోర్లించి నుగ్గు నుగ్గు చేసి, కొందర్ని రంపంతో కోసినట్లు కోసి పడవేశాడు. కాళ్ళు తునాతునకలు చేసి, గాత్రములు ఖండించి, చెవులు చెక్కి, ముక్కులు తెగ్గోసి, నజ్జుగా నరికి పడవేస్తున్న కన్నముని దాటికి సైన్యం యావత్తూ పరుగులు పెట్టినది. కనుచూపు మేరలో ఎవ్వరూ కానరాని కన్నముడు యేరునగ పర్వతంలా నిలబడ్డాడు. తన వీరఖడ్గాన్ని ఒరనందుంచి చెవుల గోపన్న శవాన్ని తీసుకుని, గురజాలకు చేరినాడు. చెవుల గోపన్న తల్లి ధారమ్మ కన్నీరు మున్నీరుగా ఏడ్చుచున్నది. చెవులగోపన్నకు గౌరవమర్యాదలలో అంత్యక్రియలు జరిపినారు.

మాచర్ల ప్రజలంతా బ్రహ్మనాయుడ్ని ఛీ! ఛీ! అని చీత్కారిస్తుంది. తాను మాలదేవరాజులకు చెప్పకుండా రాజ్యాన్ని కోడిపోరులో ఎందుకు ఫణంగా పెట్టినట్లు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పెదమాలదేవరాజు చాలాకోపంగా ఉన్నాడు. బ్రహ్మనాయుడు చేసిన నేరానికి అతనికి మరణదండన విధించాలని సమాలోచనలు జరిపాడు. మరలా ఆలోచించాడు. పల్నాటి వీరులు పౌరుషానికి మారుపేరు.

మాటిచ్చిన తరువాత చావైనా బ్రతుకైనా పాటించి తీరవలసినదే. అలాంటి వంశంలో పుట్టిన నేను, తప్పకుండా రాజ్యాన్ని విడిచి అరణ్యవాసము ఏడేండ్లు చేయవలసినదే. అలాంటప్పుడు అల్లునికి మరణదండన విదించి తన ఉన్నతిని ఎందుకు కించపర్చుకోవాలి. అని ఆలోచించిన మాలదేవరాజు మిన్నకున్నాడు.

కొమ్మరాజు, అలరాజు, కన్నమనాయుడు మాలదేవరాజులు మొదలగు వీరులంతా వలస వెళ్ళుటకే నిర్ణయించుకున్నారు. నలగాముడు, భటుల్ని పంపి మాచర్లనుండి తమను వెళ్ళమని చెప్పకముందే వలస వెళ్ళుటకు నిర్ణయించుకున్నారు.

మాచర్ల రాజుల వలస - కన్నముని రక్షణ

సకల పరివారము, అంతఃపుర స్త్రీలు ఎద్దులబండ్లు, ఆలమందలను, అరువది ఆరుగురు వీరుల్ని తీసుకుని వాడిన ఆయుధాలు ఒళ్ళో పెట్టుకుని, వలసగంపలు నెత్తికెట్టుకుని వలసకు సిద్ధమయ్యారు. మాచర్ల ప్రజలంతా విషన్నవదనులై ఏడ్చుచున్నారు. ఎక్కువమంది ప్రజలు వలస వెళ్ళుటకు సిద్ధపడినారు. వారినందరిని కొమ్మభూపతి వారించి, సంభాళించి, నచ్చచెప్పి వెనుకకు మరలించాడు. మాచర్ల పౌరులంతా విధిలేక వెనుకకు మరలివెళ్లారు. సకల పరివారమంతా, 'మండాది' (దీనిని మల్లాది లేదా మాలాది అని కూడా పూర్వం పిలిచెడివారు) అనే గ్రామం చేరుకున్నారు. అచ్చట స్మశానానికి కొద్దిదూరంలో బీడువారిన భూములను కొన్ని కొనుక్కున్నారు. వాటిని బాగుచేసి, వారు తీసుకొని వెళ్ళిన ధనకనక వస్తువులను కొన్నిటిని అమ్మి, కొన్ని మేడలు నిర్మించుకున్నారు.

ఏడు సంవత్సరాల పాటు వారు అచ్చటే ఉండవలసి ఉన్నందున రక్షణగా ఒక కంచెను ఏర్పరచుకున్నారు. వలస వచ్చిన పరివారం మొత్తము కూడా తమ ఆశలన్నీ వీరుడైన మాలకన్నమునిపై పెట్టుకున్నారు. అతని రక్షణలో తమకు ఎలాంటి హానీ జరుగదు అని నిశ్చింతగా గడుపుతున్నారు. ఆవులమందలు పగటిపూట పచ్చికబయళ్ళలో మేసి, సాయంత్రానికి తిరిగి 'మండాది' తోలుకుని వస్తున్నారు. ఆవుపాలు, నెయ్యి, పెరుగులు పరివారానికి సంవృద్ధిగా సరిపోతున్నాయి.

ఈ విధంగా మాచర్ల రాజ పరివారం వలస వెళ్ళిన సందర్భముగా మాలదేవరాజులకు వచ్చిన కష్టాలు తలచుకొని, నలగాముడు బాధపడ్తున్నాడు.

తన తమ్ములకు అన్యాయము చేసానేమో! అని చింతిస్తున్నాడు. రాచకార్యాలేవీ గురజాలనందు జరుగుట లేదు. ఇది గమనించిన నాగమ్మ నరసింగరాజు మొదలయిన వారికి ఏమీ పాలుపోవడం లేదు. నలగామరాజు యొక్క మనస్సు సంతోషపర్చడానికి అతనిని దిగులునుండి వేరే వ్యాపకాల వైపు మరల్చడానికి, అంతఃపురంలో రాజనర్తకీమణులతో నాట్యాన్ని ఏర్పాటు చేశారు. ఆది చూడడానికి కూడా రాజుగారు సుముఖత చూపలేదు. తన తమ్ములను ఎలాగైనా మరలా పిలిపించి వారి రాజ్యాన్ని (మాచర్ల లేదా మాలచర్ల) వారు పరిపాలించుకునేటట్లు చేయాలి. అప్పుడు మాత్రమే తనకు మనశ్శాంతిగా యుంటుంది. అనుకుని ఆ రాత్రి విశ్రమించాడు.

ఉదయానే లేచి భటులను పిలిపించి, అర్థవీటి అధికారులైన వీధుల పల్నీడు, చెంచు నాయకులను రప్పించవలసినదిగా ఆజ్ఞాపించాడు. ఆ వార్తనందుకుని కొద్దిపాటి సైన్యాన్ని తీసుకుని, గురజాల చేరుకున్నారు. రాజా! జయము, జయము సెలవివ్వండి, అని మ్రొక్కి వినమ్రంగా నిలబడ్డారు.

పల్నీడా! చెంచునాయకుడా! నా మనస్సు కుదుట పడలేదు, తమ్ముళ్ళు వనవాసము వెళ్ళారు, ఎలాంటి కష్టాలు పడ్తున్నారో, అసలే పసివాళ్ళువారు. నేను వారిని అల్లారు ముద్దుగా చూచుకున్నాను. మీకు తెలిసిన విషయమే! మీరిద్దరంటే మా తమ్ముళ్ళకు చాలా ప్రేమ మరియు గౌరవము. అందువలన మీరిద్దరూ 'మాండాది' వెళ్లి "వారి రాజ్యాన్ని వారు సరిపాలించుకొమ్మని" నామాటగా వారికి చెప్పండి. అనగా వెంటనే పల్నీడు, చెంచునాయకుడు కొంత సైన్యాన్ని తీసుకుని మండాది బయలుదేరినారు. వారు మండాదికి సమీపమునందున్న చింతలతోపులో విడిది దిగినారు. మండాదిలో విషయాలు తెలుసుకుని రావల్సినదిగా, దామినీడు పల్లన్న, మల్లన్న అనే ముగ్గురు భటుల్ని గ్రామములోనికి పంపించారు. వారు మండాదిలో ప్రవేశించి మాచర్ల రాజుల గూర్చి వాకబు చేసినారు. వారు ఊరికి దూరంగా నివసిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఏమీ పాలుపోక రోజూ గ్రామం నడిబొడ్డున గుడిపై కాసేపు కూర్చుని, పిచ్చాపాటి మాటలతో కాలం గడిపే అలవాటున్న బ్రహ్మానాయుడు,క్రొత్తగా ప్రవేశించిన ఆ భటుల్ని గుర్తు పట్టాడు. దూరం నుండి వారిని పిలిచాడు. వారు దగ్గరకు వచ్చారు. మీరు గురజాల నుండి

వచ్చారు కదా! ఏమిటి విషయము అని అడిగాడు, దానికి భటులు నలగామ ప్రభువులు ఇచ్చటకు పల్నీడు, చెంచు నాయకుడ్ని పంపించాడు. వారు ఊరికి దూరంగా చింతలతోపులో ఉన్నారు. రాజుగారు వారి తమ్ముళ్ళయిన మాలదేవ రాజులకు కబురు పంపాడు. 'జరిగినదేదో జరిగినది. కోడిపోరును మరచిపోయి, మాచర్లకు తిరిగివచ్చి రాజ్యాన్ని పరిపాలించుకొమ్మన్నాడు. అని విన్నవించారు. దీనినంతా సావధానంగా విన్న బ్రహ్మనాయుడు వారికి కొంత ధనము ఇచ్చి పంపివేసినాడు. తనలో ఈ విధంగా ఆలోచించాడు. నలగాముని కబురు మాలదేవరాజులకు చేరినచో, తమ్ముళ్ళు అన్నగారి మాటలకు కట్టుబడి మరలా మాచర్లకు వెళ్తారు. కోడిపోరులో రాజ్యాన్ని పందెం కాచినందులకు ఇప్పటికే నాపై సదభిప్రాయం లేదు. అన్నాదమ్ముళ్ళు ఒక్కటి అయ్యేనా? తనకు అంతంతమాత్రంగా ఉన్న మంత్రిపదవి ఊడిపోవును. అని తలచి, ఈ గండాన్ని ఎలాగైనా గట్టెక్కించవలెనని దీర్ఘముగా ఆలోచించెను.

ప్రతి చిన్న విషయానికి రెచ్చిపోయేవాడు, కోపిష్టి, మూర్ఖుడు అయిన లంకన్నను సమీపించాడు. బ్రహ్మనాయుడు. 'లంకన్నా! చూసావా ఈ అన్యాయం, మాచర్ల నుండి వచ్చి గుట్టుగా బ్రతుకుతున్న మనల్ని మన గోవుల్ని హతమార్చమని నలగాముడు కొంతమందిని మనపైకి పంపాడు. వారు చింతల తోపులో ఉన్నారు. వారిని ఎదుర్కొనగల వీరుడవు నీవొక్కడివి మాత్రమే అని రెచ్చగొట్టెను. దానితో లంకన్న నలగామరాజు ప్రభువులు ఇంత అన్యాయానికి పూనుకున్నారా! అటులైన నేను సహించలేను. వారిని హతమార్చుతాను. ఈ విషయము కన్నమునికి చెప్పి వస్తాను. అనగా, బ్రహ్మనాయుడు, నేను ఆ విషయము కన్నముని చెబుతాను. నీవు కొద్దిమంది వీరుల్ని తీసుకుని వారిని హతమార్చు అని ఉసిగొల్పాడు. లంకన్న వీరుల్ని తీసుకుని చింతలతోపులోనికి వెళ్ళాడు. లంకన్న సింహగర్జన చేసి కుంతంతో శత్రువులను సంహరించడము మొదలు పెట్టాడు. నెత్తురు వరదలై పారింది. కుంతపుచ్చుకుని ఒక్కవ్రేటున వీధుల పల్నీడును చంపివేశాడు. కాని చెంచు నాయకుడు మిగిలిన వారు లంకన్నను చుట్టుముట్టి, ఆయుధాలతో కొట్టగా లంకన్న నెత్తురు మడుగులో ఒరిగిపోయాడు.

ఈ వార్తను జాగ్రత్తగా కన్నమునికి చేర్చాడు బ్రహ్మనాయుడు. "నలగాముడు

మన ఆవుల్ని చంపమని సైన్యాన్ని పంపాడు. మన లంకన్న ఆ విషయాన్ని గమనించి ఎదుర్కొన్నాడు. అతనిని నలగాముని సైనికులు హతమార్చారు." అని చెప్పాడు.

విషయాలేమి తెలియని మాల కన్నముడు పూర్వాపరాలు ఆలోచించే ఓర్పు లేకుండా పోయినది. ఒక్కసారిగా ఉగ్రుడై "కారుమాల"ను అధిరోహించి చింతలతోపు చేరాడు. చీకట్లో సేనలు సరిగ్గా కనిపించుట లేదు. దివిటీల వెలుగులో మినుగురుల గుంపుల వలె కన్పిస్తున్నారు. కన్నమనీడు పెద్దపెట్టున కేకలు పెట్టి గుంపుపై పడి, తత్తరపడక తలలు తెగవేసి ఎగురవేశాడు. నెత్తురు కాల్వలై పారినది. ఆవు దూడలపై, పులి పడినట్లుగా పడిన కన్నముని ధాటికి, గురజాల వారి సేన కాలికి బుద్ధి చెప్పి ఫలాయానం చిత్తగించినది. ఇక అచట తోపులో ఒక్కరు కూడా లేరని గమనించిన కన్నముడు మండాది తిరిగి వచ్చాడు.

గురజాల చేరిన చెంచు నాయకుడు, రాజుగారిని కలసి, రాజా! మా మాటలు ఏమియునూ మాల దేవరాజులు ఆలకించలేదు. మన వీధుల పల్నీడును హతమార్చిరి. మన సైన్యాన్ని హతమార్చిరి. ఆ మాటలు విన్న నలగాముడు ఉగ్రుడై మండిపడ్డాడు. రాయబారులుగా వెళ్ళిన వారిని హతమార్చుట న్యాయంకాదు. చరిత్రలో ఇలాంటి సంఘటనలు లేవు. మాల దేవరాజులు ఇంత నీచానికి ఒడిగట్టారా! అని మనస్సు నందు నొచ్చుకున్నాడు. మండాదిలో మాలదేవరాజులు కూడా బాధపడ్డారు. ఏడు సంవత్సరముల వనవాసము నిమిత్తము మాచర్ల నుండితరలి దూరంగా వచ్చిన, మమ్మల్ని ఇంకా వెంటాడటం ఏమి న్యాయం, మేము చేతగాని వారమనా? అనుకొని చింతించారు. తన పాచిక పారినందుకు బ్రహ్మనాయుడు సంతోషంగా ఉన్నాడు. ఆ రాత్రి విందు వినోదాలలో మునిగితేలాడు. పల్నాటి వారు ఇక కలిసే అవకాశము లేదు. అనుకొని నిశ్చింతగా నిద్రపోయాడు.

మండాది నుండి కదిలి, పరివారం మొత్తము "మేడపి" చేరుకున్నారు. ఇది వినుకొండ తాలూకాలోనిది. మాచర్లవారు వలసలో నాలుగు సంవత్సరములు మండాది నందున్నారు. చివరి మూడు సంవత్సరములు మేడపి నందున్నారు. (స్త్రీలకు ప్రత్యేకంగా, ముఖ్యంగా అంతఃపురం స్త్రీలకు నిర్మించారు. కనుక దానిని స్త్రీల మేడపి అంటారు. వాస్తవానికి అది స్త్రీల మేడ.) బ్రహ్మనాయుడు

మాలదేవరాజులకు సన్నిహితంగా ఉంటున్నాడు. వారికి కావల్సిన సేవలు, పరిచర్యలు తానే స్వయంగా దగ్గరుండి చూచుకొనుచున్నాడు. వనవాసము ముగిసిన వెంటనే రాజ్యాధికారము, తనకు మంత్రి పదవి వస్తుంది. అందువలన బ్రహ్మనాయుడు అతి వినయంగా ఉంటున్నాడు. మేడపిలో చివరి మూడు సంవత్సరములు కూడా గడిచినవి. మాల దేవరాజులలో సంతోషానికి హద్దు లేకుండా పోయినది. ఇక మాచర్లకు తరలి వెళ్ళి పరిపాలించుకొనవచ్చుననే ఆలోచనలో ఉన్నారు. అప్పుడు బ్రహ్మనాయుడు రాజా! మనం ఒక రాయబారిని గురుజాలకు పంపి, వనవాసము అయినది కనుక మన రాజ్యము మనకివ్వవలసినదిగా అడుగుదాం. అది న్యాయసమ్మతంగా ఉంటుంది. అనగా మాలదేవరాజులు అటులైన ఒక భటుని గాని, బ్రాహ్మణుడ్ని కాని రాయబారానికి పంపి మన సందేశాన్ని తెలియచేయండి అని చెప్పి నిష్క్రమించారు.

అలరాచమాల - రాయబారం - కన్నముడు అనుసరించుట

బ్రహ్మనాయుడుకి ఒక అవకాశము చిక్కినది. రాయబారానికి, రాయబారిని పంపాలి. ఈ అవకాశాన్ని కూడా అతను చక్కగా వినియోగించుకున్నాడు. రాయబారము ఫలించి, మాచర్ల రాజ్యాన్ని పరిపాలించే అవకాశము వచ్చినా తాను మంత్రిస్థానములో ఉన్నప్పటికి రాజుగారికి అలరాచమాల (అలరాజు) మాలకన్నమనీడు అంటే వల్లమాలిన అభిమానము వారి రాజనీతిజ్ఞత శౌర్యప్రతాపాల మీద ఎక్కువ విశ్వాసము. కనుక వారిద్దరు ఉన్నంత కాలము తనకు సరైన ప్రాముఖ్యత ఉండదు. అందువలన వారిని మాయోపాయము చేత హతమార్చాలి. లేదా రాజుగారి నుండి దూరం చేయాలి. ఈ రెండింటిలో ఏదో ఒకటి చేయగలిగినా తన స్థానము పదిలము. తన మాటకు మాచర్లలో ఎదురులేదు. వారిద్దరిని అడ్డు తొలగించుటకు పథకము సిద్ధ పర్చుకున్నాడు. ఆ రాత్రి బ్రహ్మనాయుడికి సరిగ్గా నిద్ర పట్టలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూశాడు. కాకుల అరుపులు పక్షులు కిలకిలరాముతో తెలతెల వారింది.

అలరాచమాల హత్యకు బ్రహ్మనాయుడు పన్నిన కుట్ర అత్యంత హృదయ విదారకము. అసలు రామబారమే వద్దన్న మాల దేవరాజులను మాయ మాటలలో ఒప్పించాడు. అలరాజు అమితమైన శక్తివంతుడు. కధకుల ప్రకారము అడ్డము ఆరుమూళ్ళు ఆజాన బాహుడు, పాదము పిడిమూరెడు అతని అడుగుల



అలరాచమాలతో కలసి (అలరాజు) రాయబారానికి వెల్తున్న మాలకన్నముడు

నవ్వడికి భూమి అదురుతుంది. అతని అడుగులు కొదమ సింహాలు నడచినట్లుండెడివి. అతని కండలు నల్లరాతి బండలు, యుద్ధంలో వెనుదిరిగి చూచిన దాఖలాలు లేవు. అలాంటి బలవంతుడ్ని హతమార్చుటకు పథక రచన చేశాడు బ్రహ్మనాయుడు. బ్రహ్మనాయుడు కొమ్మరాజు వద్దకు వెళ్ళి, కొమ్మ భూపతికి మ్రొక్కి రాజా ! గురజాల వారికి, మాచర్ల వారికి ఇష్టుడు, ధర్మతత్త్వపరాయణుడు, ఇరువర్గాలకు బంధువు అయిన మన అలరాచమాలను రాయబారినికి పంపాలి. అటులైన సంధి కుదురుతుంది. అనగా కొమ్మభూపతి, బ్రహ్మనాయుడా! భటుని కాని, బ్రాహ్మణుడ్ని కాని పంపు ఇంకొక మాటనా ఎదురుగా మాట్లాడవద్దు వెళ్ళిరా! అనగా బ్రహ్మనాయుడు తన పట్టు విడవకుండా కొమ్మభూపతి భార్య అయిన చల్లమాదేవి వద్దకు చేరినాడు. అమ్మా చెల్లమ్మా, మన అలరాజును గురుజాలకు రాయబారముగా పంపుదామను కుంటున్నాను. ఎందువలననగా, ఇరు వర్గాలకు సంధి కుదర్చాలి. తన భార్య రత్నాల పేరమ్మను చూచివస్తాడు. తన మామ నలగామునితో మాట్లాడి వస్తాడు. మరియు మన అలరాజుకు తోడుగా సర్వసేనాపతి మాలకన్నముని పంపిస్తున్నాను. అనగా చల్లమా దేవి సరే అన్నది. ఈ విషయాన్ని విన్న అలరాచమాల తల్లిమాట ప్రకారము తాను తలరాస్నానం చేసి, కడుపారా తృప్తిగా భోజనము చేసి రాజులు ధరించే వస్త్రాలు,భూషణాలు ధరించి,మణులు పొదిగిన కిరీటం పెట్టుకొని నొసట పట్టుభాసికం, పసిడి పల్లెము, కత్తుల కళ్ళెము తన "సూర్య భేతాళ" ఖడ్గాన్ని ఒరనందు పెట్టి బంగారు జీనుతో అలంకరించిన తన "నవరాల గోడిగ" (పంచ కళ్యాణి గుఱ్ఱం) ఎక్కి తల్లి దగ్గరకు వచ్చాడు. తన హితుడు, సన్నిహితుడు, ఆప్తుడు, అయిన మాలకన్నముడు సూర్యతేజస్సుతో వెలుగుతున్నాడు. అతను తన ప్రక్కనుండగా, తనకు జయము తప్ప అపజయము లేదని మనస్సు నందు తలంచుకున్నాడు. తల్లిపాదాలకు మ్రొక్కి గురజాలకు ప్రయణమయ్యాడు.

నవరాల గుఱ్ఱం పై అలరాజు, కారుమాలపై కన్నమనీడు వెనుక కొద్ది పరివారము బయలు దేరినారు. మంగళ వాయిద్యాలు మ్రోగాయి. జయజయ ధ్వానాలు చెలరేగాయి.

అలరాజు బయలుదేరి మర్రివేముల దాటి పడమట కంభం పాడు వచ్చాడు.

అప్పటికి ప్రొద్దుకూకింది. ఆరోజు రాత్రి అచట ప్రజలు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆ రాత్రి ఆచట నిద్రించి మరునాటి ఉదయమే కోలేరు దాటి రెంటాల గ్రామం విడచి గురుజాల సమీపాన వచ్చాడు. గురాజాల సమీపంలో తన రాకను తెలియజేస్తూ భేరీ వాయిద్యాలు మ్రోగించాడు. ఆధ్వనికి దిక్కులు పిక్కటిల్లాయి. రత్నాల పేరమ్మ తన భర్త రాక కొఱకు, తనను వచ్చి కాపురానికి తీసుకెల్తాడని, ఆ రాత్రి నిదురలేకుండా ఉన్నది. ఉదయానే తలస్నానం చేసి, పట్టు చీరకట్టి భర్తరాక కొఱకు ఎదురు చూస్తున్నది. మామ నలగాముడు, అల్లుని భేరీ వాయుద్యాలు విన్నాడు. రాక రాక వస్తున్న అల్లునికి రాచమర్యాదలు జరిపించాల్సిందిగా, ఆజ్ఞాపించాడు. అంతలో అలరాజు పంపిన భట్టు, నలగామిని వద్దకు వచ్చాడు "మహారాజా అలరాచమాల రాయబారానికి వచ్చాడు. గురజాల వెలుపల విడిది చేసి ఉన్నాడు. ఆ సంగతి తమకు విన్నవించమన్నాడు". అని చెప్పి తిరిగి అలరాజు వద్దకు వచ్చాడు భటుడు. అంతట అలరాజు గురజాలనందు ప్రవేశించి, పల్లకీలో వస్తున్నాడు. అంతఃపురం కిటికీలో నుండి రత్నాల పేరమ్మ తన భర్తను చూస్తున్నది సరిగా కనిపించడము లేదు. ఆమెకు కన్నీరు కారుతున్నది. పల్లకీ దాటిపోయినది. రాజదర్బారు ముందు ఆగినది. అలరాజు పల్లకీదిగి, పావుకోళ్ళు తొడిగి కొలువు కూటంలో ప్రవేశించాడు. అందరు రాజులు లేచి నిలబడ్డారు. వారందరికి అలరాజు సవినయంగా నమస్కరించి, తాను నలగమరాజుకు నమస్కరించి, తెచ్చిన పట్టు శాలువ వినయంగా రాజుగారి పాదలపై పెట్టెను. అప్పుడు నలగాముడు అల్లుడికి సకల మర్యాదలు చేసి గద్దె మీద కూర్చోవలసినది ఆహ్వానించాడు.

రాజా! పందెం ప్రకారము మాచర్లవారు ఏడు సంవత్సరములు వనవాసము ముగించారు. వారి రాజ్యాన్ని వారికి మర్యాద పూర్వకముగా అప్పగించండి. ఆ పని నిమిత్తమైనన్ను మాల దేవరాజులు పంపారు. అనగా నలగాముడు సంతోషముగా ఆ మాటలకు అంగీకరించాడు. సభా వేదిక మొత్తము ఆనందము వెల్లివిరిసింది. కాని అలరాజు, కన్నమునితో పాటు రహస్యముగా తమ భంటుని బ్రహ్మానాయుడు పంపాడు. ఆ విషయము అలరాజుకి కాని, కన్నమునికి కాని తెలియదు. కథకుల ప్రకారం అతని పేరు అప్పం భట్టు, ఇతను గుఱ్ఱం స్వారీలో దిట్ట అతను ఆఘ మేఘాలపై ఈ విషయాన్ని బ్రహ్మానాయుడికి చేరవేశాడు.

బ్రహ్మనాయుడు గురుజాలనందున్నప్పుడు అతనిని నమ్మిన భంటుగా ఉండే తంబళ్ళ జిమ్మరు అనే బ్రహ్మణుడు ఇంకా గురజాల నందే ఉన్నాడు. అతను నమ్మక ద్రోహి, రాజద్రోహి, అతనిని వెంటనే పిలిపించి, ఆ రాత్రికి రాత్రే అతనికి ధన, కనకములు మస్తుగా ముట్ట చెప్పి తాను చెప్పిన విధముగా చేయమని గురజాలను పంపాడు. తెల తెల వారుతుండగా, అప్పుంభట్టు, తంబళ్ళ జియ్యరు గురజాలకు చేరుకున్నారు. ఏమి వెరుగనట్లున్నారు.

ఉదయాన నిదురలేచిన, అలరాజు రాచకార్యం పూర్తయినందుకు సంతోషముగా ఉన్నాడు. ఉదయాన అల్పాహారము తీసుకొని ఇక మాచర్లకు ప్రయాణమయ్యాడు. తన వద్దకు వచ్చిన మామ నలగామునికి నమస్కరించి, "మేడపి వెళ్ళి, రాజులకు ఈ విషయము తెలిపి, మరలా తిరిగి వచ్చి రత్నాల పేరమ్మను తీసుకొనివెళ్తాను" అని చెప్పి బయలుదేరాడు. నలగాముడు అల్లునికి, కన్నమునికి వీడ్కోలు పలికాడు. వారిద్దరు "కారుమాల" పై ఒకరు 'సవరాల గొడిగ' పై ఒకరు ఆఘ మేఘాలపై మేడపికేసి వస్తున్నారు.

బ్రహ్మనాయుడి కుట్ర - అలరాజమాల హత్య - కన్నముడు విలపించుట

బ్రహ్మనాయుడి ఆజ్ఞమేరకు ద్రోహి అయిన బ్రహ్మణజియ్యరు ఒక పూల చెండును తయారు చేసుకున్నాడు. అందులో కాలకూటవిషం ఉండేటట్లు ఏర్పాటు చేసుకున్నాడు. ఆ పూల చెండు వాసన చూచిన వెంటనే విషం తలకెక్కి చనిపోయేటట్లు నేర్పుగా పూలను అల్లాడు. ముందుగా పూలచెండు తీసుకొని చెర్లగుడి పాడుచేరి, అలరాజు మరియు కన్నమునికై ఎదురు చూస్తున్నాడు. అంతలో అలరాజు పరివారం రానే వచ్చినది. తంబళ్ళ జియ్యరు ఎదురుగా వచ్చి అలరాజుకు నమస్కరించి రాజా! రాజ నీతిజ్ఞులు మీరు అన్నదమ్ముల మధ్య కలహాలు నివారించి, పెద్ద యుద్ధాన్ని తప్పించారు. అందులకు సూచనగా ఈ దండ తమరకు వేసుకుంటాను. అనగా అలరాజు మెడ వంచి వేయమన్నాడు. దండవేసినాడు. గుర్రాన్ని అదిలించినాడు. మెడలో ఉన్న దండలో నుండి విషం ఘాటైన వాసనాలు విరజిమ్ముతుంది. అది పూల వాసన అనుకొని ఘాటుగా ఆ ఘ్రాణించాడు. అంతే తలతిరిగి వాలి పోయాడు. గుబ్బిం కళ్ళవెంట కన్నీరు బొటబొట కారుతుంది.

ప్రక్కనే ఉన్న కన్నముడు ఏదో మోసము జరిగినట్లు గమనించాడు. అలరాజును పట్టుకొని దండతీసి దూరంగా తిసిరి, ఒక చెట్టు క్రింద పరుండబెట్టి, పారిపోతున్న తంబళ్ళ జియ్యరును పట్టుకొచ్చి చెట్టు వద్ద నిలబెట్టాడు. తంబళ్ళజియ్యరు పై ఎత్తిన కత్తి దించాడు. ఎందువలనంటె వీడు సాక్ష్యానికి ఉండాలి. ఏమి జరిగిందో రహస్యం చెప్పాలి కదా ! అనుకున్నాడు. అలరాజు వద్దకు చేరాడు. అలరాజు రత్నాల పేరమ్మను తీసుకొని రావల్సినిదిగా కన్నముని కోరినాడు. కన్నముడు గురజాలకు బయలుదేరినాడు. తంబళ్ళ జియ్యరు తనకు ఎలాగైనా చావు తప్పదని తెల్సుకొని దూరంగా పడి ఉన్న ఆ దండను తీసుకుని తాను వాసన చూచి కూలిపోయినాడు. ప్రాణాలు అనంతవాయువుల్లో కలసి పోయినవి.

గురజాల నందు ప్రవేశించిన కన్నముడు పెద్దగా రోదిస్తూ ! అమ్మా ! పేరమాదేవి ! చిట్టితల్లీ ! రత్నాల పేరమ్మ ! ఇంకేమి శృంగారమమ్మా ఇంకేమి వ్రతాలమ్మా ! అయ్యోతల్లీ, నీ బ్రతుకు బండలయిదమ్మా, రాయబారానికి వచ్చిన నీభర్త అలరాజు పై విషప్రయోగము జరిగిందమ్మా ! అనగా ఆ వార్తకు పేరమా దేవి మూర్చిల్లినది. ఆమె ముఖము పై నీళ్లు చిలకరించారు. బోయీలు పల్లకీ తెచ్చి ఆమెను అలరాజు పడిన్నచోటకు చేర్చారు. ఆమె అలరాజును సమీపించి, గుండె చెఱువయ్యేలా ఏడ్చింది. అలరాజు తల తన ఒళ్ళో పెట్టుకొని కూర్చున్నది. అలరాజు కొన ఊపిరితో కళ్ళు తెరచి, ఒక్కసారిగా తనభార్యను చూచి కంటినిండా నీటి తెరలు క్రమ్మగా ఆమెకు చెతులెత్తి మ్రొక్కి ప్రాణాలు విడిచాడు. ఈ దృశ్యాన్ని చూచిన పేరమాదేవి, ముర్చిల్లినది. వారిద్దరిని చెరొక పల్లకీలో ఉంచి, కన్నమనాయుడు తన కారుమాలపై ముందుగా మేడపి చేరి ఈ వార్త తెలియ జేశాడు. మాల దేవరాజు అతని తమ్ములు గోడు గోడున దుఃఖించారు. నోటిలో ఉన్న తాంబూలాలు ఉమ్మివేశారు. మేడపి అంతటా విషాదచ్ఛాయలు అలముకున్నాయి. ఈ వార్త విన్న కొమ్మ భూపతి చెట్టులా కూలిపోయాడు.

అంతలో అలరాజు భౌతిక దేహము రానే వచ్చినది. మేడపి సమీపాన, రాచరేవుల వద్ద పల్లకీని దించారు. అలరాజు భౌతిక కాయాన్ని క్రింద మెత్తని పరుపుల పై పరుండ బెట్టారు. సాంబ్రాణి అత్తరు, పన్నీరులు చల్లారు.

వీరవీర్యల దేవి శీలమ్మ అలరాజు తల్లి చల్లమాదేవి, గోపమ్మ, కొలది

సుబ్బమ్మ మొ॥న అంతఃపురకాంతలు, అక్కలు, చెల్లంద్రు అత్తలు, వదినెలు అంతా వచ్చారు. ఏడ్పులు, పెడబొబ్బలు తప్ప ఏమి వినిపించుట లేదు.

"అయ్యా! కొడుకా! సుగుణాల పట్టీ,ఎక్కడికి పోయావు నాయనా ! ఒక్క మాట మాట్లాడురా ! నావరాల పట్టీ ! నీవు లేని పల్నాడు పాటిదిబ్బతో సమానము నాయనా ! నీవు లేని ఈ లోకంలో నేనుండ జాలునా అని అలరాజు ముఖానికి ముఖం చేర్చి చెల్లమ్మా దేవి దుఃఖిస్తుంది. అప్పుడు అక్కడ ఉన్న వారంతా ఆమెను ఓదార్చురు.

విధి బలీయమైనది, ఎవరిని నిందించి ఏమి లాభము, పోయిన వారు తిరిగి రారుకదా ! బిరుదు రౌతు బిరుదు లెటు పోయెను. నమ్మించి చంపిన ఎవ్వరేమి చేయగలరు? అనుకుంటూ, అలరాజు అంత్యక్రియలకు ఏర్పాటు చేసిరి. అలరాజు కాయానికి పన్నీరు చల్లిరి. పూలదండలు వేసినారు. చితిపై పరుండబెట్టి చితికి నిప్పు పెట్టినారు. అప్పుడు అగ్నిహోత్రము ప్రజ్వరిల్లినది. చితివద్దకు వచ్చిన వీరకన్నముడు, చితికి నమస్కరించి "వీరుడా! ఏదిఏమైనా ప్రతీకారము తీర్చుకుంటాను '. అని అచటకు దూరంగా వెళ్ళి నిలబడ్డాడు. మంటలు మింటికెగసినవి. భగభగలు చెలరేగినవి. ధగ ధగ జ్వాలలు ఎగసినవి. చితి చట్టూ గిరగిర తిరిగి పేరమాదేవి ఒక్క ఉదుటున చితిలో దూకినది. ఈ హటాత్పరిణామానికి అందరు ఆహాకారాలుచేసారు. జరగాల్సినది జరిగిపోయినది. అచ్చట నుండి అందరు మేడపిలో ఎవరి ఇండ్లకు వారు చేరుకున్నారు. ఆ రాత్రి ఎవ్వరికీ కంటిపై కునుకు లేదు.

ఆ రాత్రి బ్రహ్మనాయుడికి నిద్రపట్టలేదు. ఒక ప్రక్క సంతోషము. ఒక ప్రక్క భయము. తనకు ఎవరివల్లనైతే ప్రాముఖ్యము తగ్గుతుందో వారిలో ఒక్కరిని తన మాయోపాయము చేత హతమార్చాడు. రెండవ వీరుడైన కన్నమునిపై అపనిందలు సృష్టించాడు. వీరుడై యుండి, అంగరక్షకుడై యుండి, అలరాజు మరణాన్ని ఆపలేకపోయాడని, కన్నమునిపై ప్రజలలో అనుమానాలు ప్రచారము చేసాడు. మాలదేవరాజులు తప్పనిసరి పరిస్థితులలో తనను దగ్గరకు చేరదీసేటట్లు పరిస్థితులు కల్పించాడు. ఇంకొకవైపు తాను చేసిన నేరము ఎక్కడ బయటపడుతుందో అని భయము పట్టుకుంది. తాను చేసిన పని వీరకన్నమునికి తెలిస్తే తనను కత్తికొక కండగా చీల్చి కాకులకు, గద్దలకు వేస్తాడు అనే భయము బ్రహ్మనాయుడికి

పట్టుకుంది. అందువలన మాలదేవరాజు ఆలోచించుకునే సమయము ఇవ్వకుండగానే యుద్ధానికి ప్రయత్నాలు ప్రారంభించాడు.

నలగామునిపై మేడపి నందున్న వీరులంతా కోపంతో ఉన్నారు. కన్నమునికి ఒక ప్రక్క కోపము మరొక ప్రక్క ఆప్తుడు మరణించిన దుఃఖము కలసి వస్తున్నాయి. అల్లుడ్ని హతమార్చాడనుకొంటున్న నలగామునిపై మేడపిలో అందరు కోపముతో ఉన్నారు. ఇక యుద్ధము తప్పదని భావిస్తున్నారు. ఆ సమయములో బ్రహ్మనాయుడు నెమ్మదిగా పిల్లిలా మాలకన్నముని వద్దకు చేరినాడు. వీరుడా!కన్నమా! నీ నిర్ణయము కొరకు మేడపిలో వీరులంతా ఎదురు చూస్తున్నారు నీ అభిప్రాయము తెలుపుము, వీరుడైన అలరాజు మరణంతో అందరు భగభగమండుతున్నారు. నలగామునిపై పగతీర్చుకొనుటకు అవకాశము కొఱకు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. నీవు నిమ్మకు నీరెత్తినట్లున్నావు. అనగా కన్నముడు తలెత్తిచూసాడు. కళ్ళు చింతనిప్పుల్లా ఎఱ్ఱగా ఎరుపెక్కి ఉన్నాయి. అప్పుడు కన్నముడు "బ్రహ్మనాయుడా! యుద్ధము తప్పదు. మనకు విజయమూ తప్పదు. అని వడివడిగా నడుచుకుంటూ మాలదేవరాజుల వద్దకు వచ్చాడు. రాజా! తమరి ఆజ్ఞ ఏమి చేయమంటారో సెలవివ్వండి. అనగా కన్నమా! నీవు మాకు ఆప్తుడవు. యుద్ధము తప్పదనుకుంటే అలాగే కానివ్వు. అనగా వీరకన్నముడు యుద్ధము తప్పేటట్లు కనిపిపంచడము లేదు. మహారాజా! అనగా అటులనే కానివ్వండి. అని రాజుగారు చెప్పి బ్రహ్మనాయుడిని పిలిపించి, బ్రహ్మనాయుడా ఒక భటుని చివరిసారిగా రాయబారానికి పంపుము. అన్నగారు అంగీకరిస్తారేమో! అని నాకు అనిపించుచున్నది. అనగా బ్రహ్మనాయుడు భటుని రాయబారిగా గురజాలకు పంపెను. కన్నముడు సైన్యాన్ని యుద్ధానికి సన్నద్ధులను చేస్తున్నాడు.

మాచర్ల (మాలచర్ల) యోధులు యుద్ధానికి సన్నద్ధం - కన్నముడు దండు నడుపుట

బ్రహ్మనాయుడు త్రిపురాంతకమున ఉన్న భూతరాట్ స్థంబము పెకిలించి బండ్లకెత్తించి అచ్చటే ఉంచినాడు. ఆ విషయము తెలిసిన కన్నమనీడు భూతరాట్ స్థంభము ఎందుకు పెకలించినావు. యుద్ధము త్రిపురాంతకములోనే కదా!

యుద్ధభూమి ఎచ్చటో యుద్ధము జరగాల్సిన స్థలము ఎచ్చటో నిర్ణయించాల్సినది సర్వసేనాపతి, అంతేకాని నీవు కాదు. అనగా బ్రహ్మనాయుడు యుద్ధము నాగులేటి నది ఒడ్డున ఉన్న కార్యంపూడి అయినచో మనకు అనుకూలంగా ఉంటుంది. మరియు నాకు కలలో చెన్నకేశవుడు కన్పించి 'కార్యంపూడి' లో యుద్ధము మేలని చెప్పాడు. అనగా కన్నముడు అటులైన సరే! అని అచ్చట నుండి చక చకా వెళ్ళిపోయాడు.

మాలకన్నముడు సైన్యాన్ని మొత్తము సిద్ధపరిచాడు. భేరివాయిద్యాలు ఒక్కసారి ఝుళ్ళుమన్నవి. ఎద్దులు, కోడెలు రంకెలేసినవి. కన్నముడు 'మాడచి' (మాడచి=మాలచి, మాలచిన్నది. శక్తివంతురాలైన వీరవనిత)అనే వీరనారిని పిలిపించి అంతఃపుర రక్షణకు ఆమెను నియమించెను. ఆమెకు మరికొందరిని తోడుగా ఇచ్చెను. పెదమాలదేవుడి కుమారుడైన బాలమాలదేవుడికి పట్టాభిషేకము చేసినారు. మాలదేవరాజును, వీరుల్ని పరివారాన్ని సన్నద్ధులను చేసి, తాను భైరవ ఖడ్గానికి మ్రొక్కి కారుమాల ఎక్కి, రణభేరి వేయించాడు.

పెదమాలదేవుడు పంచకళ్యాణి గుఱ్ఱాలు కట్టిన రథాన్ని ఎక్కినాడు. ఇద్దరు తమ్ముళ్ళు అంబారీ వేసిన ఏనుగులు ఎక్కినారు. అన్నగారి వెనుక కదిలినారు. అందరి కన్నాముందు కన్నమనీడు అశ్వముపై బయలుదేరినాడు. బండ్లు కట్టించినారు. బల్లాలు ఉంచిన బరిసెల కట్టలు, పట్టెమంచాలు, తమ్మవడిగెలు, చామరాలు రంగురంగుల సుగంధద్రవ్యాలు,ఆహార పదార్థాలు, అన్నీ బండ్లకు ఎత్తించారు. కత్తులు కఠారులు, ఈటెలు, బల్లేలు, కుంతములు, బరిసెలు, ముసలాలు, ముద్గరములు మున్నగు అనేక ఆయుధాలు ధరించారు. సమస్త పరివారము గుర్రాలు, పల్లకీలు ఏనుగులు ఎక్కి, భేరీలు, ఢంకాలు, శంఖాలు, మురజలు, కనక తప్పెట్లు, సన్నాయిజోళ్ళు, మృదంగాలు, రుంజులు బూరలు, జేగంటలు మ్రోగించుకుంటూ, కులగిరిలు మార్మోగుచుండగా,ఆవాలవారు, ఆణెంవారు, కొండవీటివారు, గోవిందువారు, గోసంగివారు, మయ్యూరువారు, నరమాలవారు, పెదమాలవారు, చినమాలవారు, నాయనివారు పైడిముక్కలవారు, పాలపర్తివారు బలుమారివారు పాలెంవారు,దేవనూళ్ళవారు, రేచర్లవారు, ఎల్లమ్మవారు, చాంబీరు వారు, చాలవాడవారు, జగ్గలివారు, సింధోళ్ళు, అనుముగంటివారు, అల్లంవారు,

అట్లూరివారు, ముట్లూరివారు, మొదలుగా గల వీరులు బయలుదేరినారు.

వీరందరికి ముందున్న సర్వసైన్యాధిపతి మాలకన్నమదాసు ప్రచండ తేజోవంతుడుగా వెలుగుతున్నాడు. ఉద్దండులైన మాస్టీలు వారు వీరభైరవ కత్తులు జాగ్రత్తగా పట్టుకుని వెనుకనే వస్తున్నారు. ఆ యొక్క వీరభైరవ ఖడ్గాన్ని బలమైన మాస్టీలు వారు ఇద్దరు పట్టుకుని తెస్తున్నారు. **ఆ ఖడ్గాన్ని ఎవరైనా చూస్తే అదరి, బెదరి, గుండెలు దద్దరిల్లాల్సిందే, కన్నముని కన్ను నల్గొండ మోనుభైరవ ఖడ్గం వద్ద జొన్నలుచల్లితే పేళాలు వేగేవట (కధకుల ప్రకారం),** అందరు కలసి త్రిపురాంతకము చేరినారు. మాలదేవుడు భూతరాట్ స్థంభానికి నమస్కరించి అమ్మా! నీవు మాకు వంశపారంపర్యంగా వస్తున్నావు. మా యొక్క మాలవంశానికి కులగురువులాంటి దానివి నాగకంకణాలు నీకు కడ్తున్నాను. సిద్ధులు, దుర్గ, కాలభైరవుడు కలసిన రూపం నీది. నిన్ను తరలించి కార్యంపూడి రణక్షేత్రంలో ప్రతిష్టిస్తాను. నీ యొక్క రక్తదాహం తీర్చుకో. అని నమస్కరించి రధమెక్కినాడు. కన్నముడు కూడ భూతరాట్ స్తంభానికి మ్రొక్కి అమ్మా! మాలజాతులు, నాగవంశీలు, నాశనము కాకుండా చూడు తల్లీ, అని నమస్కరించి 'కారుమాల' ఎక్కినాడు.

ఆ స్తంభాన్ని తరలించుకుని మర్రివేముల, గుమ్మడం పాడు, గరికెపాడు దాటుకుంటూ కంకణాల పల్లె చేరినారు. అచ్చట వీరుల చేత మాలకన్నముడు ప్రతిజ్ఞ చేయించాడు. వారి వారి చేతులకు ఒకరి చేతికి వేరొకరితో కంకణాలు కట్టించినాడు. తరువాత కదలి పమిడిపాడు వచ్చి "మాలవాగు" చేరినారు. మాలవాగు ఉరవళ్ళు, పరవళ్ళు త్రొక్కుచూ పారుతున్నది. ప్రభువులు, దొరలు బంధువర్గాలు, వీరులు, వీరవిద్యావంతులు, సాహసులు, అశ్వ, గజ, తురగ, పదాతిదళాలు మొత్తము ఆ నదికి చేరుకున్నారు. అప్పటికి ప్రొద్దుగుంకినది. కారుచీకట్లు క్రమ్మినవి. చుక్కలు మినుకు మినుకున మొరయుచున్నవి. పక్షులరావాలు వినిపిస్తున్నాయి. గుడ్లగూబలు తిరుగుచున్నవి. నది గట్టునున్న సర్పాలు, కప్పలు నదిలోకి దూకినది. ఆ రాత్రికి ఆచట సేదదీరాలనుకున్న కసైన్యానికి, ఆటాపాటలు, విందు, మందు, వినోదాలు బ్రహ్మనాయుడు ఏర్పాటు చేసినాడు. ఇలాంటి వాటిలో అందెవేసిన చెయ్యి బ్రహ్మనాయుడు. మనుషుల బలహీనతలను తనకు అనుకూలముగా మల్చుకొనుటలో సిద్ధహస్తుడు. జారకామినులను చేర బిలిపించి, తగు ఏర్పాట్లు చేసినాడు. ఆ

రాత్రి సైన్యం సలిపిన రతీకేళీ విలాసాన్ని శ్రీనాధుడు ఈ విధంగా వర్ణించినాడు.

దానిని గమనించండి

"జార కామినులెల్ల సంతోషమున

- - - - - - - - - - - - - - -

ఇసుక దిబ్బల ముందు నిరవైన పొదల

కుంటెన కత్తెలకూడి కాపాడ

మనసుల తమిమించ మదనుడా వేళ

పూలబాణములు వింట బూని సందించి

- - - - - - - - - - - - - - - - - -

ఘన నఖక్షత దంత ఘాతలు మాని

- - - - - - - - - - - - - - - - - -

కొందరు శయనించి కొందరు నిలచి

- - - - - - - - - - - - - - - - - -

కలయచుండిరి. మేన కుపంబులలను"

కాళరాత్రి ఒంటరిగా యుద్ధ భూమిలో కలియతిరిగిన - వీర కన్నముడు

అర్ధరాత్రి నిద్దుర పట్టక తిరుగుతున్న కన్నమునికి బ్రహ్మనాయుడు సలుపుతున్న రతికేళీ విలాసాలు నచ్చటం లేదు. సైన్యాన్ని ఉత్సాహపర్చడానికి నేను ఆవిధంగా చేస్తున్నాను అని బ్రహ్మనాయుడు చెబుతున్నప్పటికి ఆ మాటలు రుచించుట లేదు. కన్నముడు కాలభైరవునిలా తిరుగుతున్నాడు. కన్నమునికి మెరుపులాంటి ఆలోచన వచ్చినది. తాము యుద్ధభూమిగా ఎన్నుకున్న "కార్యంపూడి రణక్షేత్రాన్ని' ' ఈ రాత్రికి రాత్రే చూచివస్తే మంచిదని తలచాడు. ఎందువలనంటే ఆ యుద్ధభూమిలో తన సైన్యాన్ని ఎటువైపు నిలపాలి, ఏ స్థలము తమకు అనుకూలముగా యుంటుంది. శతృవులను ఏ వైపు నుండి దెబ్బతీయవచ్చు మొదలైన

వ్యవహారాలు తెలుసుకొనవలెనన్న యుద్ధభూమిని చూడాల్సిందే, అనుకున్న తడవుగా, ఆ నిశిరాత్రి ఒంటరిగా బయలుదేరినాడు.

ఆజానబాహుడు, నల్లని కండరాలు మెడలో నాగమాల ధరించి, చేతులకు ధరించిన కడియాలు మెరయుచుండగా, పచ్చల పిడిబాకు మొలను వ్రేలాడుతుండగా, నల్లగా దట్టంగా ఉన్న కనుబొమ్మలు, గుబురుమీసాలు, డేగ కన్నులతో ఇనుప వలలాంటి కవచాన్ని ధరించి వీరభైరవ కత్తిని ధరించి మీసాన్ని దువ్వుకుంటూ ఎత్తైన భుజాలు రాతిబండలాంటి కండలతో కాలికి పెండరము తొడగి, నల్లని కొండకదలినట్లు, కారుమాలపై ఎక్కి కన్నముడు కదలెను కదనభూమికి. కదనభూమిని పరికించి చూసాడు. దూరంగా కొండలగుట్టలు కారుచీకట్లో జుట్టు విరబోసుకుని కూర్చున్న రక్తపిశాచములవలె ఉన్నాయి. గుడ్లగూబలు, గబ్బిలాలు, తిరుగుతున్నాయి. మిణుగురులు తళతళలు కనిపిస్తున్నాయి. ఎక్కడో దూరంగా పులివేటు పడ్డ లేడి పిల్ల ఆర్తనాదం ఇతని చెవిన పడినది. పాము నోటిలో దొరికిన కప్ప దీనాలాపాలు విన్నాడు. గుట్టం మీద నుండి ఒక రాతిపైకి దూకి నిలబడ్డాడు. కన్నుపొడుచుకున్నా కానరాని కారుచీకట్లు ఆవరించాయి. ఇచ్చట రేపటి దినాన ఎందరి ప్రాణాలు గాలిలో కలిసి పోవలెనో కదా! రాజులు, వీరులు ఎందరిభార్యల రోదనలలో ఈ భూమి దద్దరిల్లుతుందో, భూత, ప్రేత, పిశాచగణాలకు, ఈ నేల ఎంతప్రియమౌతుందో కదా! ఈ కొండలు ఆర్తనాదాలతో, అరుపులతో దద్దరిల్లుతాయి కాబోలు. ఈ బండలు నెత్తుటి మడుగులతో నిండి, కనబడవు కదా! ఆ బండపై కూలబడ్డాడు. రెండు మోకాళ్ళపై తల పెట్టి అన్నదమ్ముల పోరు ఎంత ముదిరినది. ఇరువర్గాలకు ప్రేమలు తగ్గలేదు. అయినా పోరు తప్పలేదు. అంతా విధి వ్రాత, ఇంతకు ముందు పల్నాడు అంతా కలసి ఉన్నప్పుడు ఎంత ఉత్సాహంగా అన్నదమ్ములు ఉండేవారు! తన తండ్రి తెప్పలి మొత్తం వీరుల్ని ఎంతబాగా చూచుకునేవాడు. అందరు కలసి మెలసి ఉండటం నేను చూడలేను కాబోలు, ఇట ఎన్ని తలలు తెగి దొర్లి పడతాయో, కన్నీరు నిండిన కళ్ళతో కన్నముడు తలెత్తి చూచినాడు. దూరంగా గురజాల దీపస్తంభము మినుకు మినుకున కనబడుతున్నది. ఆ దీప స్తంభం దగ్గర తన చిన్నతనంలో తానూ, మాలదేవరాజు కలసి ఆడుతున్న దినాలు గుర్తుకొచ్చినవి. ఒక్కడే అర్ధరాత్రి, ఆ కాళరాత్రి ఎక్కి ఎక్కి ఏడ్చాడు. తలెత్తి చూశాడు. కారు చీకట్లు ఆవరించినాయి. ఈదురు గాలులు మొదలైనవి, ఆకాశాన

ఉరుములు మెరుపులు మొదలైనవి. ఆ వర్షానికి ఆ ప్రాంతమంతా ఒక్కసారి పరిశుభ్రమైనది. బండలన్ని చల్లబడినవి. కుతకుత ఉడుకుతున్న కన్నముని మనస్సు కుదుటబడినది. కారుమాలనెక్కి ఆ జోరు వానలో మాలవాగుచేరినాడు. అలసి సోలసి ఉన్నాడేమో! ఒళ్ళుమరచి నిద్రపోయాడు.

ఉదయానే సకల పరివారము కదిలినది. మాలదేవరాజులు ముత్యాల పల్లకీ నెక్కినారు. వారి వెనుక దండు కదిలినది. ముందు కన్నముని కారుమాల కదనానికి నడుస్తుంది. తమ్ముడు బంధుజనాలు ఇరువైపులా వస్తున్నారు. భూతరాజ స్తంభము బండ్లలో కదిలింది. భేరీ వాయాద్యాల మ్రోతలు మిన్ను ముట్టినవి. వాటి మ్రోతలకు ఆకాశము అదురుతుంది. గురజాల వరకు వినిపించాలి. మ్రోగించండి అని అరుపులు వినబడుతున్నాయి. కార్యంపూడి చేరుకున్న దళం, గుడారాలు ఎత్తింది. పరివారమంతా స్నానాదులు ముగించారు. పెదమాలదేవుని గుడారంలో పరిమళ గంధం వెదజల్లారు. అంతా సాంబ్రాణి సువాసనలు నిండాయి. కత్తుల పదును చూచుకుంటున్నారు. కొందరు వీరఖడ్గాలకు నమస్కరించు కుంటున్నారు. కొందరు తమ గోత్రమైన రేచర్లను గూర్చి చెప్పుకుంటున్నారు. మాలదేవుని గుడారములో వింజామరలు విసురుతూ చెలికత్తెలున్నారు. అంతలో బ్రహ్మనాయుడ్ని పిలిపించి భటుడ్ని రాయబారిగా, రాజుగారైన నలగామునికొలువుకు పంపావా? అని అడిగాడు. దానికి బ్రహ్మనాయుడు పంపినాను ప్రభూ అని చెప్పినాడు.

నలగాముని ఆ స్థానములో - నాట్య ప్రదర్శన

అచట గురజాలలో నలగాముడు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టడం లేదు. తన ప్రియాతి ప్రియమైన అల్లుని మరణము మరియు గారాల పట్టి పేరమాదేవి సతీసహగమనము రాజుగారిని కృంగదీసాయి. రోజురోజుకూ రాజుగారు మనోవేదనతో చిక్కిపోతున్నారు. ఎందరు ఎన్ని విధాలు చెప్పినా, కుమిలికుమిలి ఏడుస్తున్నాడు. రాజుగారి బాధ గమనించిన నాగమ్మ రాజదర్బారులో నర్తకీమణులతో నాట్యప్రదర్శన ఏర్పాటు చేసినది. (ఈ నాటికి కూడా ప్రతియేట చైత్రశుద్ధ పూర్ణిమ మొదట ఆరురోజులు చెన్నకేశవ స్వామి ఉత్సవాలు జరుగుతాయి.

చివరి రోజు రథోత్సవం. ఆ రోజు పొన్నమాను ఊరేగిస్తారు. నిన్న మొన్నటి వరకు దేవదాసీలు ఈ ఉత్సవంలో నాట్యం చేసెడివారు. చంద్రముఖి అని ఒక సుప్రసిద్ధ నర్తకీమణి ఉండెడిదట. ఆమె గురించి ఆమె అందచందాల గురించి గొప్పలు ఈ నాటికీ చెప్పుకుంటారు. "లక్ష్మీం దేవిమెద్దెలు" అని దేవదాసీ ఇండ్లు ఈనాటికీ ఉన్నాయి. ఆ వీధి గుండానే రథాన్ని ఊరేగిస్తారు. 'చంద్రవంక' అనే నదికి ఆ పేరు 'చంద్రముఖి' నుండి వచ్చి ఉంటుంది. ప్రతిరోజు ఉదయాన్నే చంద్రముఖి ఆ నదిలో స్నానం చేసి వెల్తుండెడిదని కథకులు చెబుతారు. ఆనదికి 'చంద్రబాగ' అని పేరు కూడా ఉన్నట్లు శాసనాల ద్వారా తెలియుచున్నది. దేవదాసీల, నర్తకీమణుల వేశ్యాతనము చట్టబద్ధముగా సాగుచుండెడిది. అది ఆనాడు ఉన్నత స్థానములో ఉన్న పురుషులకు ఒక అలంకారప్రాయముగా ఒక గౌరవ సూచకంగా ఉండెడిది అనుటలో సందేహము లేదు.)

సభాస్థలము ముత్యాలతో ముగ్గులు పెట్టి కస్తూరిచల్లించి, కర్పూరము వెలిగించారు. సువాసనలు వెదజల్లుతుంది. నాట్యమందిరములోని మధ్యహాలుకు చుట్టూ గోడలకు అద్దాలు బిగించి ఉన్నవి. ఎటుచూచినా నర్తకీమణులు కనిపిస్తారు. రత్నకంబళులు క్రింద పరచినారు. బంగారుతో చేసిన నవరత్నఖచితమైన పీఠము తెచ్చి మధ్యగా ఉంచినారు. నలగాముడు పన్నీటి స్నానము చేసి, పట్టు వస్త్రాలు ధరించి పట్టు పంచెను ముంజేతిపై వేసుకుని, నుదుట ఎర్రని తిలకం దిద్ది సభావేదికకు వచ్చి సభనలంకరించినాడు. నిలువుటద్దము చూచుకుని తలలెగురవేయగా చెవులకు పెట్టిన బంగారు కుండలాలు కదలాడినవి. భుజకీర్తులు మెరియుచున్నవి. చేతి మురుగులు, గొలుసులు మెరియుచున్నవి. పదివేళ్ళకు ఉంగరాలు వెలుగుచున్నవి. బంగారు గొలుసులు అమర్చిన పాదుకలు విడిచి, క్రింద అమర్చిన పాన్పుపై కూర్చుని, దిండుపై చేయి ఉంచినాడు. నరసింగుడు, నాగమ్మ వెనుక కూర్చున్నారు. సామంతరాజులు, కవులు వాద్యకారులతో కొలువు కూటము నిండినది.

గాయకులు వీణల తంత్రులు బిగించి శ్రుతి చేసుకొని సరిగమల సప్తస్వరములు ఆరోహణ అవరోహణలు క్రమము తప్పకుండా బహుచక్కగా, రసాభాసము కాకుండా మీటుచున్నారు. గాయకులు తమ గాత్రములు జతచేసి

పాడుచుండిరి. ఆ గానాలకు శిలలు ద్రవిస్తున్నవి. ఎండిన మ్రానులు చిగురిస్తున్నాయి. బాధలు మరచి నవ్వుచూ నాట్యకత్తెలకు నాట్యము చేయమని చేతితో సైగ చేసాడు. సభలో ఉత్సాహము ఉరకలువేసినది.

వీణ వాయించు వానివద్ద నిలచిన నాట్యకత్తెలు, మద్దెల తాళంబులు వేయువానికి కనుసైగలు చేసినారు. వెనుక కూర్చున్న సంగీత విదుషీమణులు సరిగమలనందుకున్నారు. అప్సరాంగనలను తలదన్నిన నర్తకీమణులు పంచెవన్నెల చీరలు బిగుతుగా కట్టి, కాళ్ళకు గజ్జలు కట్టి, తాళం తప్పకుండా కనుబొమలు లయబద్ధంగా ఎగురవేస్తూ అందెల సవ్వడులు చేస్తూ, భరతనాట్యం కూచిపూడి, సమ్మేళవించి చేస్తున్న నృత్యం ముగ్ధమనోహరంగా ఉన్నది. సభలో ఉన్న రసజ్ఞులంతా పరవశంతో తన్మయంతో ఉన్నారు.

ఆ సమయమున మాలదేవరాజులు పంపిన భట్టు, నలగాముని కొలువు కూటంలో ప్రవేశించాడు. అంతలో నాట్యప్రదర్శన ముగిసినది. వార్తాహరుడొచ్చాడు అని తెలుసుకున్న రాజుగారు అతనిని ప్రవేశపెట్టమని ఆజ్ఞాపించాడు. ఆ భట్టు ప్రవేశిస్తూ **మాలకుల సంజాత! మహిలో ఘనవీర! కరుణాంత రంగ! మానధన సుయోధన! సకల కళావిద్యాపారంగా! మాలమ్మతనయా! జయము జయము.** మాలదేవరాజులు నన్ను రాయబారిగా పంపినారు. వారు దండుతో కార్యంపూడి (కారంపూడి) తరలివచ్చారు. వారి మాటలు చెబుతాను ఆలకించండి. రాజ్యభాగము ఇవ్వనిరాకరించారు! రాయబారిగా వచ్చిన అలరాజును హతమార్చారు! సర్వసేనాపతి కన్నమనీడుని హత్యచేయ ప్రయత్నించారు! విజయమో! వీరస్వర్గమో యుద్ధములో తేల్చుకుంటాము. రణక్షేత్రానికి తరలిరండి." అని విన్నవించాడు.

ఆ మాటకు నలగాముడు భగ్గున మండి పడ్డాడు. కళ్ళెరజేసి సభనంతా కలియజూచి 'విన్నారా! మాలదేవరాజు మాటలు! అల్లుడు పోయిన బాధలోనేనుంటే తన దండుతో రణక్షేత్రానికి తరలివచ్చి మరలా సంధి పలుకులా! అవ్వ నవ్విపోదురు. అతని రాజనీతిజ్ఞతకు,మేమంతా గాజులు తొడుక్కుని ఉన్నామనుకున్నారా! వారికి రాజ్యం ఇచ్చాము. దానిని దక్కించుకొనలేకపోయినారు. సరే! మరలా వారి రాజ్యం వారికిస్తాం ఏలుకోమను. అంతేకాని మా బలగం, బలం ముందు సవాలు విసరకండి' అని అన్నాడు.

బ్రహ్మనాయుడి వద్ద లంచం, ధనము తీసుకున్న భట్టు ఎలాగైనా సంధి జరగకుండా చూడమని, బ్రహ్మనాయుడు చెప్పిన మాటలు గుర్తుకొచ్చినవి. అప్పుడు భట్టు, రాజా! బలగం బలగం అంటున్నావు కాకులకు లేదా బలగం, మిడుతలకు లేదా దండు, కాని ప్రయోజనం మా వీరుల ముందు వారి శూరత్వం ముందు 'బలగం' మాడి మసి అయిపోవాల్సిందే అని రెచ్చగొట్టాడు. భట్టు మాటలకు ఉగ్రుడైన నలగాముడు ఒరనుండి తన ఖడ్గాన్ని సర్రున లాగి, పైకి ఎత్తి మరలా ఒక్కక్షణం ఆలోచించి ఛీ! అల్లుడివి మరియు రాయబారిగా వచ్చిన భటుడివి కనుక వదిలివేస్తున్నాను. రణక్షేత్రానికి తరలి వస్తున్నాము. చావుకు సిద్ధంగా ఉండమని మీ వీరులకు చెప్పు అన్నాడు. తనకు బ్రహ్మనాయుడు అప్పగించిన పని ఇంత సులువుగా నెరవేరినందులకు లోపల సంతోషించి భట్టు వెనుదిరిగి కార్యంపూడి వెళ్ళినాడు.

ఆరోజు నలగాముడు, నరసింగుని,నాగమ్మను రప్పించి కార్యంపూడి రణక్షేత్రానికి సర్వసైన్యాన్ని సిద్ధపర్చండి. శత్రువును తక్కువగా అంచనా వేయకూడదు. అలరాచమాల మరణించినప్పటి నుండి కొమ్మభూపతి, కన్నమనీడు మొ॥న వీరులంతా భగభగ మండుతున్నాడు. కనుక మన సామంతరాజులైన గుండకోటరాజు, ధరణికోటరాజు, కొలంగిరాజు, ఘూర్జరపతి, ఓంద్రురాజు ఉరగసేనుడికి, ఏడుమండెం ఏలే ఎరుకకాముడికి, పౌన్నాడ భూపతికి, పొదిలె రాజుకు, కటకభూపతికి కల్వరాయుడికి, దేవగిరినేలే తెలుగురాజులకు పెదబాహుదేవుడికి, భీమసేనుడికి, చోళరాజునకు జయదేవునకు చంద్రగిరి రాజుకు వీరసేనుడికి, వీరభల్లాణునికి, అరవసింగాళునకు బంగాళపతికి పాండ్యరాజులకు, మళయాల, కర్ణాట రాజులకు ఇంకా మిగిలిన సామంతరాజులకు వారి వారి సేనలు పంపాల్సినదిగా ఉత్తర్వులు జారీ చేసినాడు. అవి పంపండి అని ఆజ్ఞాపించినాడు. ఇలా లెక్కలేనంత మంది వీరులను రావించండి అని ఆజ్ఞాపించాడు.

నలగాముడు సకల పరివారములతో - యుద్ధానికి తరలుట

నలగాముడు చెన్నునకు మ్రొక్కి తన కొరకు సిద్ధపరచిన రథాన్ని ఎక్కాడు. నరసింగుడు పల్లకీని ఎక్కాడు. నాగమ్మ గుఱ్ఱాన్ని అధిరోహించినది. గురజాల కోట రక్షణకు కొంతమంది వీరులనుంచినారు. రణభేరి వేయించినారు. నలగాముడు,

నరసింగుడు మీసాలు మెలి తిప్పారు. సైన్యం గుంపులు గుంపులుగా గుఱ్రాలు, ఏనుగులు, కాల్బంట్లు, పనివారు, పరిచారికలు, సురియలు, పరఘులు, శూలములు, కుంతములు, ఖడ్గములు, ముసలములు, గదలు, ముద్గరలు,చక్రములు, బండివాలములు బల్లెములు, బరిశెలు, బాకులు, ధనస్సులు ధరించి దిక్కులు పిక్కటిల్లే ధ్వనులు చేసుకుంటూ మహాసముద్రంలా కదిలింది. అలా కదిలిన నలగామునికి దారిపొడవునా ప్రజలు జయ జయ ధ్వానాలు చేస్తున్నారు. కొదమగుండ్లదాటి, మిరియాల సరిహద్దు చింతపల్లి దాటి ప్రయాణించారు. మధ్యమధ్యలో సామంత రాజులు తమ తమ సేనలతో వచ్చి కలుస్తున్నారు. ఈ విధంగా సకల పరివారము కార్యంపూడి రణక్షేత్రము చేరుకున్నారు. సైన్యము మొత్తము గుడారాలు ఎత్తారు. నలగాముడు కొలువుదీరినాడు. దాపట నరసింగరాజు, కొండ మన్నెమరాజు, కోటకేతుడు ఆశీనులైనారు. కుడిప్రక్క రెడ్డి, మున్నుంట అరవై మంది వీరులు కూర్చున్నారు. అన్నీ ఏర్పాట్లు నాగమ్మ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నది. అది ఒక పట్టణంలా తయారైనది. వీధులు మొగసాలలు, చౌకలు, పేటలు ఏర్పడ్డాయి. నలగాముని సేన ఇసుకవేస్తే రాలనంతగా ఉన్నది.

ఆ దండు సమరోత్సాహాన్ని చూచిన వీరులు కొంతమంది కన్నమునితో చెప్పారు. చూసావా కన్నమా! మన గుడారాలకు ఎదురుగా గుడారాలు ఎత్తించాడు. భూమిలో తనకెవ్వరు ఎదురులేరనుకొన్నట్లు విర్రవీగుతున్నాడు. ఆ మాటలకు వీరకన్నముడు మందహాసము చేసినాడు. కొమ్మరాజు తన వింటె నారి సంధించి, వాడియైన బాణాన్ని ఎక్కుపెట్టి విడిచాడు. అది నిప్పులు చిమ్ముకుంటూ నలగాముని గుడారానికి తగిలినది. గుడారములో భగ భగ మంటలు ఆవరించినవి. ఆ హఠాత్పరిణామానికి పరివారం పారిపోయినది. నలగాముడు వారిని సంభాళించాడు. జరిగిన విషయానికి కన్నముడు నొచ్చుకున్నాడు. కొమ్మభూపతి! నీవు వీరుడవు! నీకు చెప్పాల్సిన అవసరము లేదు. కాని ఎలాంటి హెచ్చరికలు లేకనే యుద్ధనాదాలు మ్రోగకుండానే బాణాన్ని సంధించావు. ఇది తప్పుకాదా? అనగా కొమ్మభూపతి తలవొంచుకుని అక్కడ నుండి వెళ్ళిపోయాడు!

ఇరువర్గాలు యుద్ధభేరీలు మ్రోగించాయి. ఇరువర్గాలు కత్తుల పదును చూచుకున్నారు. కరవాలాల్ని తిప్పారు. కత్తుల సాధన గుజ్జాల డెక్కలచప్పుడు,

మదమెక్కిన మత్తగజాల వీరవిహారము, యుద్ధభూమి భయంకరంగా ఉంది. సంధించిన బాణాలు సర్రుసర్రున దూసుకెళ్తున్నాయి. పోట్లగిత్తలు యుద్ధభూమిలో కలియతిరుగుచున్నవి. కన్నమనీడు యుద్ధవ్యూహాలు పన్నుతున్నాడు. మొదటి రోజున సైన్యం ఎక్కువ నష్టపోకుండా తొందరపడకుండా, జాగ్రత్తగా, నిదానంగా వ్యవహరించాల్సినదిగా వీరులకు ఆజ్ఞలు జారీ చేసినాడు. ఒక పదిమంది రౌతులు యుద్ధభూమిలో వార్తలు ఎప్పటికప్పుడు సేకరించి మాలకన్నమునికి చెప్పే ఏర్పాట్లు చేసినాడు. వీరులంతా రణోత్సాహంతో ఉన్నారు. కొద్దిగా జననష్టం అశ్వగజ, పదాతి దళాలు కూడా మరణించాయి. కన్నమనీడు యుద్ధభూమికి సమీపంగా వైద్యశిబిరాలు నెలకొల్పినాడు. జంతువుల్ని చూచే వైద్యులు మనుష్యులను చూచే శిబిరాలు విడివిడిగా ఉన్నాయి. వైద్య శిబిరాలు ఎలా నడుస్తున్నాయి. చూడడానికి ముగ్గురు నాయకులతో కూడిన కూటమి ఏర్పాటు చేసినాడు. యుద్ధభూమిలో దాహం తీర్చుకోవడానికి ఏర్పాట్లు కూడా రహస్యంగా జరిగినవి. యుద్ధభూమిలో గాయాలు తగిలిన వారిని వెంటనే వైద్య శిబిరాలకు తరలించడానికి ఇరువది మందితో ఒక కూటాన్ని ఏర్పాటు చేసినాడు. ఆ రోజు ప్రొద్దుకుంకినది. ఎవరి గుడారాలు వారు చేరినారు. వీరులు ఎవరు మరణించారో, ఎవరికి గాయాలు తగిలినవో, తెలియనివ్వరు. ఎందువలననగా మిగిలిన వీరులలో నిరుత్సాహము ఏర్పడుతుంది. అందువలన ఇరువర్గాలు కూడా, ఎదుటి వర్గాన్ని ఎక్కువగా నష్టపరిచినట్లు తమ సైన్యం తక్కువుగా నష్టపోయినట్లు ప్రచాచం గావిస్తారు. ఆరోజు కారుచీకట్లు ఆవరించినవి. శవాలగుట్టలపై రాబందుల రెక్కల చప్పుళ్ళు విన్పిస్తున్నాయి.

యుద్ధ భూమిలో భయంతో వణికిన బాల చంద్రుడు

మేడపిలో బాలచంద్రుడు (బ్రహ్మానాయుడి కుమారుడు) బొంగరాల ఆట ఆడుతున్నాడు. అతను ఒక గొట్టెపొట్టేలుపై ఆకతాయి కుర్రాళ్ళను నలుగుర్ని కూడగట్టుకుని, బొంగరాలు ఆడడం, వేశ్యల ఇండ్లలలో తిరగడం ఇతని పని, ఇతను మంత్రి తనయుడైయుండి కనీసం గుఱ్ఱం స్వారీ తెలియదు. కత్తిసాముురాదు. అంటే అసలు బాధ్యత రహితంగా ప్రవర్తిస్తాడన్నమాట, బాలచంద్రుడు మేడపిలో ఎవ్వరు మగవారు లేకపోవడం గమనించాడు. ఆవిషయమై అడిగి

తెలుసుకున్నాడు. వీరులంతా కార్యంపూడి రణక్షేత్రానికి యుద్ధానికి వెళ్తునట్లు తెలుసుకున్నాడు. ఇతనికి కనీసం రాజ్యంలో ఏమి జరుగుతుంది. యుద్ధభేరీనాదాలు ఏమి తెలియవు. ఎందువలననగా వేశ్య శ్యామంగి వద్ద పీకల వరకు త్రాగి పడుకుంటాడు. అతనికి బాహ్యప్రపంచంతో పనిలేదు. తనభార్య 'మాంచాల'ను వదిలివేశాడు. శోభనంనాడు కూడా బార్య వద్ద కాకుండా శ్యామంగి (వేశ్య) వద్దకు వెళ్లాడు. (చరిత్రకారులంతా ఒప్పుకున్నారు) అది అతని వేశ్యాలోలత్వానికి ఒక మచ్చుతునక. మేడపిలో మగవారు ఎవరు లేకపోయేసరికి స్త్రీలు బాలచంద్రుడ్ని అతని స్నేహితుల్ని సూటిపోటి మాటలతో పొడిచారు. ఆ మాటలతో గొట్టెపొట్టేలు నెక్కి (చరిత్రకారులంతా) ఆ విధంగా (వ్రాశారు) యుద్ధభూమికెళ్లినాడు. ఇతను యుద్ధభూమికి రావడం చూచి బ్రహ్మనాయుడు కలవరం చెందాడు. తనకొడుకైన బాలచంద్రునికి యుద్ధవిన్యాసాలు తెలియవు. పైగా నోరుకూడా కదరదు. అందువలన బ్రహ్మనాయుడు భయపడ్డాడు. బాలచంద్రుడు సరాసరి యుద్ధభూమికి చేరుకున్నాడు. అచ్చట యోధానుయోధులను చూశాడు. యుద్ధమంటే బొంగరాలాటకాదు కదా? ఒక వైపు నరసింగులు, నాగమ్మ, వీరభద్రుడు, జోదుల సోముడు మొదలైన యోధులు, రెండవవైపు మాల కన్నమనీడు, కొమ్మ భూపతి మొదలైన అరువది అయిదు మంది వీరాధివీరులు మోహరించి యుద్ధాన్ని చేస్తున్నారు.

ఆనాటి యుద్ధంలో అరివీర భయంకరుడు కన్నమదాసు, విజృంభించాడు. నలగాముని సైన్యాన్ని తునాతునకలు చేస్తున్నాడు. గుఱ్ఱాల్ని, ఏనుగుల్ని, రధాన్ని కూల్చుతున్నాడు. యుద్ధభూమి చాలా భయంకరంగా ఉన్నది. కొమ్మభూపతి బాణాలవర్షం కురిపిస్తున్నాడు. నలగాముని సైన్యం కకావికలై పారిపోతున్నది. గుఱ్ఱాల సకిలింపులు భేరిడంకాల ఢమరు ధ్వనులు మ్రోగుతున్నాయి. కత్తులు, బల్లాలు, ఈటెలు తీసి పొడుచుకుంటున్నారు. యుద్ధభూమి మొత్తము హాహాకారములతో నిండి యున్నది. బాలచంద్రుడు ఒక రథం చాటున నక్కి యుద్ధాన్ని చూస్తున్నాడు. అతని గుండె ఝుళ్ళుమన్నది. భయంతో వణికిపోతున్నాడు. కాని తాను వీరుడ్ని అనిపించుకోవలెనని ఆలోచిస్తున్నాడు. అతనికి దూరంగా పడి ఉన్న ఒక శిరస్సు జుట్టు పట్టుకొని, నరసింగుని హతమార్చాడు. నరసింగుని హతమార్చాను! అని కేకలు పెట్టుకుంటూ బ్రహ్మనాయుడి వద్దకు వచ్చి ఆ శిరస్సు చూపించాడు. ఆ శిరస్సు చూచిన బ్రహ్మనాయుడు అతనిని నాలుగు చీవాట్లు

పెట్టి, ఛీ! ఛీ! ఇది నరసింగుని శిరస్సు కాదు. అసలు నరసింగుడు నీకు తెలియదు అని ప్రజలకు తెలిస్తే నిన్ను ఛీ కొట్టి చీదరించుకుంటారు. నరసింగుడు ఆ వర్గానికి సర్వసేనాపతి, అతనిని హతమార్చడం నీ తరం గాదు. నీవు కదలక ఇచ్చటే ఉండుము అని మందలించి వదలివేశాడు.

కన్నముడు ఆ దినం రణభూమిలో విచ్చలవిడిగా రెచ్చిపోయాడు. ఏనుగుల తొండాలు పట్టుకుని నరికాడు. కుంభ స్థలాన్ని పగల గొట్టాడు. మావటులను బాకుతో పొడిచి చంపాడు. గజ సమూహాలు పర్వతంలా గుట్టలు పోగుపడ్డాయి. కార్యంపూడి రణక్షేత్రము భయంకరంగా ఉన్నది. నెత్తురు వరదలై ప్రవహిస్తున్నది. కూలిన ఏనుగులు సముద్రంలో దీవుల్లా కనిపిస్తున్నాడు. తెగిపడిన గుర్రాలు, గుట్టలుగాను, పొర్లాడే వీరుల తలలు బుడగలుగా ఉన్నవి. విరిగి పడిన ప్రక్క టెముకలు నురగలుగాను మెదడు మాంసము బురదవలె, డాలు వాలు తాబేళ్ళ వలెను, కళ్ళు చేపలవలెను, వెండ్రుకలు నాచు వలెనూ ఈటెలు సర్పముల వలెను, నుగ్గు, నుగ్గు అయిన యోధుల భూషణాలు ఆభరణాలు సముద్రంలో ఇసుక, గవ్వలు, ఆల్చిప్పలు వలెను ఉన్నాయి. సూర్యుడు ఎర్రబడ్డాడు. సాయంత్రం సంధ్య అయినది. పడమటి కొండలలో క్రుంకాడు. రణక్షేత్రమంతా దట్టమైన చీకట్లు ముసిరినాయి. సైనికులు విశ్రమించారు.

ఆరోజు రాత్రి నలగాముడు, నరసింగుడు, నాగమ్మ మొదలగువారు వేదనా భరిత వదనులై యున్నారు. కన్నముని ధాటికి నిలువ కలిగిన వీరులు ఈ పల్నాటి గడ్డ మీద లేరు. దేశ దేశాల నుండి వొచ్చిన యోధానుయోధులు, వీరలు కూడా. తెల్లముఖం వేసినారు. కన్నముని యుద్ధపద్ధతులు, అతను చెలరేగి, మధ్యాహ్నం మార్తాండునిలా ఎర్రగా ఎరుపెక్కినవి. జుల్పాలతో యుద్ధభూమిలో నిలుచుంటే ఎదుట వారి గుండెలు అదురుతున్నాయి. మనం యుద్ధంలో విజయం సాధించడం అసంభవము. కన్నమనీడు అటువైపు ఉన్నంతకాలము మనం విజయము చవిచూడలేము. కనుక సంధి ప్రయత్నాలు ప్రారంభించుదాము అని ముగ్గురు అనుకున్నారు.

సంధియత్నం - బాలచంద్రుని వలన విఫలం - కన్నముని హెచ్చరిక

అనుకున్న వెంటనే అన్నమరాజు, కోట కేతన్న, మాడుగుల వీరారెడ్డి మొ॥న వీరుల్ని రావించి, సంధి విషయమై తెలిపి, మాలదేవరాజులకు చెప్పండి. వారి రాజ్యాన్ని వారు ఏలుకొమ్మనండి అని పంపారు. వారు సరాసరి మాలదేవరాజులున్న చోటికి వచ్చి సంధి విషయములు చెప్పారు.

మొదట తటపటాయించినా, తరువాత పల్నాటి ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కన్నముడ్ని సంప్రదించారు. కన్నముడు సంతోషం పట్టలేకున్నాడు. యుద్ధంలో ఎంతమంది ఆప్తులను చంపాల్సి వస్తుందో! అని అప్పటి వరకు దిగులుగా ఉన్నవాడు సంధి విషయము తెలుసుకొని సంభరపడిపోయాడు. దానితో సంధి విషయమై ఒక అంగీకారము కుదిరిని సంధి షరతులు. వాటి ఒప్పందాలు రేపు కుదుర్చుకుందాము అని ఆ రాత్రి అందర్ని కలసి విందు భోజనాలు చేసినారు.

ఈ విషయాన్ని తెలుసుకున్న బ్రహ్మనాయుడికి నిద్దురపట్టలేదు. సంధి జరిగితే అన్నదమ్ములు కలిసిపోతే! తాను చేసిన ద్రోహాలు తెలసిపోతాయి. నాకు ఉరి తప్పదు. అనుకుని పీకల దాకా త్రాగి, తన గుడారంలో చేరినాడు. ఏ భట్టునైతే గురజాం రాయబారానికి పంపాడో వాడ్ని పిలిపించాడు. వాడు బ్రహ్మనాయుడికి చాలా విశ్వాస పాత్రుడు.

అదే రాత్రి కన్నమునికి హృదయంతా సంతోషము నిండి పోయినది. రెండు రాజ్యాలు యుద్ధ విరమణ జరిగితే; మాల వంశం నాశనం తప్పుతుంది. ఇప్పటికే ఆ జాతులలో వీరులు చాలామంది అస్తమించారు అనుకుంటూ గుడారాల మధ్యగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఒక గుడారం నుండి మాటలు వినబడుతున్నవి. అది బ్రహ్మనాయుడి గుడారం ఆ గొంతు బ్రహ్మనాయుడిదే! బ్రహ్మనాయుడు భట్టు నుద్దేశించి, అరే భట్టూ! నేను చెప్పిన విధముగా గురజాలలో రాయబారాన్ని విఫలం చేశావు! నేను చెప్పిన విధముగా తంబళ్ళ జియ్యరు, అలరాజును హతమార్చాడు. కన్నముడు కూడా పూల వాసన చూచినట్లయితే మనకు ఇంకా సంతోషముగా ఉండేది. అయినా ఫర్వాలేదు. కన్నమునికి ఇలాంటి ఎత్తుగడలు అర్థము కావు. అతను విశ్వాసంగా పడి ఉంటాడు. కాని ఈ నాడు మరలా

నలగాముడే సంధికి రాయబారుల్ని పంపాడు. ఏమి చెయ్యాలో తోచడం లేదు!' అని త్రాగిన మైకంలో తడబాటుగా మాట్లాడుతున్నాడు.

ఈ మాటలు విన్న కన్నముడు ఒరలో నుండి సర్రున భైరవ ఖడ్గాన్ని లాగాడు. అంతలోనే తమాయించుకుని ఛీ! బ్రహ్మనాయుడు ఇంత నీచుడా? తన తండ్రి మరణానికి ముందు బ్రహ్మనాయుడ్ని కూడా జాగ్రత్తగా చూచుకో కన్నా! అతను నీకు అన్నలాంటి వాడు, అన్నాడు. అప్పటినుండి ఇతన్ని ఎక్కువగా గౌరవిస్తున్నాను. ఇలాంటి పరమ దుర్మార్గుడు,రాజద్రోహి, నమ్మకద్రోహి బ్రతికి ఉండటానికి వీలులేదు. ఎలాగైనా ఇతనిని హతమార్చవలసిందే. ఈ విషయాలు ఇప్పుడు రాజుగారికి చెప్పినా అంతః కలహాలు తప్ప ప్రయోజనముండదు అనుకుంటూ ముందుకు కదిలాడు. ఆ రాత్రి కన్నమునికి నిద్ర పట్టలేదు. పక్షుల కిలకిల రావాలతో తెల్లవారింది.

రెండవ దినం సంధి ఒప్పందాలు చేసుకునే నిమిత్తం గురజాల నుండి వచ్చిన పెద్దలు, మాలదేవరాజు తరపు వారు చర్చలకు కూర్చున్నారు. ఇంతలో కారుకూతలు కూచుకుంటూ బాలచంద్రుడు ఊడిపడ్డాడు. నలగాముని నానా దుర్భాషలాడుతున్నాడు. చేతకానివాడు, గాజులు తొడుక్కున్నాడు లాంటి పదాలు మాట్లాడుతున్నాడు. అక్కడే అజేయుడిగా నిలబడ్డ కన్నముడు ఉగ్రుడైలేచాడు. ఒరనుండి ఖడ్గం తీసినాడు. ఒక్కమాట మాట్లాడితే, రెండు తుండాలుగా నరుకుతాను, బాలచంద్రా! నోరుమూసుకో! అన్నాడు. అసలే అంతకు ముందు రాత్రి బ్రహ్మనాయుడి కుట్ర తెలుసుకుని వేడెక్కినాడు. మరలా కొడుకు మాట్లాడటం సహించలేక పోతున్నాడు. సభాసదులారా! చూసారా, వీడిపొగరు, పెద్దలను ఎంత చులకనగా మాట్లాడుతున్నాడో గమనించారా? అని కన్నమదాసు రౌద్రాకారంతో కత్తి ఝళిపిస్తూ నిలబడ్డాడు. బాలచంద్రుడు కన్నముని పాదాలపైబడ్డాడు. ప్రాణభిక్ష పెట్టమని వేడుకొనినాడు. ఛీ శరణన్నవారిని ఈ భైరవ ఖడ్గం ఖండించదు. పిరికి పందా! పో అన్నాడు. అచ్చట నుండి బాలచంద్రుడు వెళ్ళినాడు. కాని సంధికి వచ్చిన వారు మనస్సునొచ్చుకున్నారు. ఇదంతా బ్రహ్మనాయుడు చేయించి ఉంటాడని అనుకున్నారు. నలగాముడ్ని గాజులు తొడుక్కున్న ఆడంగిలి' అన్నందుకు వారు లేచి, ఇక సంధి కుదరదు. ఎవరు వీరులో! ఎవరు గాజులు తొడుక్కున్నవారో యుద్ధభూమిలోనే తేల్చుకుంటాం. అని గుర్రాల్ని ఎక్కి అచ్చట నుండి వెళ్ళిపోయినారు.

సంధి విఫలమైనందుకు మాల దేవరాజులు బాధపడ్డారు. కాని కన్నముడు బాధపడలేదు. సంధి కుదిరితే బ్రహ్మనాయుడు బ్రతికిపోతాడు. బాలచంద్రుడు బ్రతికిపోతాడు. అలాంటి నీచులకు జీవించే హక్కు లేదు. అనుకున్నాడు.

యుద్ధంలో కొమ్మ భూపతి - వీరమరణం

మరుసటి రోజున యుద్ధబేరీలు మ్రోగినాయి. ఆనాడు కొమ్మభూపతి విజృంభించాడు. అతని వాడి అయిన శరాఘాతాలకు శతృమూక చెల్లాచెదురౌతుంది. ఆవాలనాయుడు, గండుకన్నముడు, సుంకర రాముడు, వీరపడాలు, బాదన్న నారన్న మొ॥న వీరులు మాలదేవరాజుల తరుపున పోరాడుతున్నారు. నరసింగరాజు,నాగమ్మ, వీరభద్రుడు, అన్నమరాజు కేతన్న, మాడుగల వీరారెడ్డి, నలగాముని తరపున పోరాడుతున్నారు.

విలువిద్యలో కొమ్మభూపతికి సరిజోడు అయిన జోదుల మాలసోముడు ఎదురు నిలిచాడు. ఇద్దరు చిత్ర విచిత్ర గతులతో యుద్ధాన్ని చేసారు. ఒకరు వేసిన బాణాలు ఇంకొకరు త్రుంచివేసారు. సోముడు వదిలిన బాణాల దాటికి కొమ్మవిభుడు నిలబడలేకున్నాడు. అప్పుడు కొమ్మభూపతి నాగాస్త్రము తీసి వదిలినాడు. అది సోముని శిరస్సు ఖండించినది. సోముడు చనిపోయినాడు అనేవార్త నలగాముని సేనలో అల్లకల్లోలము సృష్టించినది. దానితో అంగ,వంగ, కళింగ, కాశ్మీర్, కాంభోజ, చోళ, కేరళ, పాంచాల, బర్బర, కురు, బాహ్లిక, నేపాళ, నిషధఘోట, గూర్జర, కేకయ, సౌవీర, శూరసేన, మత్స్య మాగధ, మాళవ, గాంధార రాజులు అందరూ కలసి, కొమ్మరాజును చుట్టుముట్టినారు. అల్లంత దూరంగా ఉన్న నరసింగునిపై కొమ్మరాజు గురిచూసి బాణాన్ని సంధించినాడు. నరసింగుని తలతెగి యుద్ధభూమిలో దొర్లినది. దానితో రెచ్చిపోయిన రాజులు శరపరంపరలు కురిపించినారు. కొమ్మభూపతి శరీరము తూట్లుపడినది. కొమ్మరాజు మ్రానులా నేలకొరిగినాడు. ఉత్సాహం ఉరకలు వేస్తూ నలగాముని సైన్యం విజృంభించినది. వీరభద్రుడు పట్టాకత్తి చేతితో ఎత్తిపట్టుకుని, పరిగెత్తుతున్న బాలచంద్రుడ్ని రెండుముక్కలుగా నరికినాడు. చీకట్లు ఆవరించాయి. ఆ రోజు యుద్ధము ముగిసినది.

మాల వంశానికి మణిరత్నాలైన అలరాచమాల అతని తండ్రి కొమ్మభూపతి

మరణం మాలదేవరాజులను కలవరపపరచినది. మరుదినం మాలదేవరాజులు కూడా యుద్ధానికి బయలు దేరినారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నలగాముడు కూడా యుద్ధానికి సిద్ధమయ్యాడు. కన్నముడు తన కారుమాలను ఒక పర్వతముపైకి ఎక్కించాడు. నలగాముని సైన్యాన్ని చూసాడు. అది ఒక మహాసముద్రంలా నేల ఈనినట్లున్నది. తూర్పుజూలకల్లు నుండి పడమర ఒప్పిచర్లవరకు ఉత్తరం జన్నిదేవరగుళ్ళు (సవనాలమేడ) నుండి దక్షిణాన నల్గొండవరకు ఆవరించి నలగాముడు ముఖ్యబలగంతో మధ్యలో ఉన్నాడు. నాలుగు దిక్కుల ఉన్న సేనాపతులను చూశాడు. పడమటి దిక్కున పౌజుల బ్రహ్మ, తూర్పుదిక్కున సంకోజ గణపతి, దక్షిణ దిక్కున నాయకురాలు నాగమ్మ చింతపల్లి రెడ్డి, ఉత్తర దిశన, అందెల రాముడు, వీరమాలన్న ఉన్నారు. నలగాముని సైన్యం యొక్క యుద్ధరీతులు, వ్యూహలకు తాను ముచ్చట పడ్డాడు ఎందువలనంటే "తానేకదా! ఆ సైన్యానికి కూడా గతంలో సేనాపతి అప్పుడు ఇచ్చి తర్ఫీదు ఉపయోగించుకుంటున్నారు." అనుకున్నాడు.

కన్నముని యుద్ధ దావానలం - కన్నముని అనంత పయనం

కారుమాల కొండదిగి వచ్చినది ఇరువార్గల యుద్ధ బేరీలు మ్రోగించారు. సింహనాదాలు చేశారు. సైన్య మూకలన్ని ఒక్కుమ్మడిగా రణగోణధ్వనులతో యుద్ధభూమి మార్మోగినది. రధకుడు, రధకుని, అశ్వకుడు అశ్వకుని, కాల్బంటు కాల్బంటుని, ఏనుగు ఏనుగుని ఢీకున్నది. మల్లయుద్ధాల నుండి, ధనుర్యుద్ధాల వరకు సాగుతున్నవి.

కన్నమనీడు విజృంభించాడు, కార్చిచ్చు అడవిని దహిస్తున్నట్లు, ఉప్పెన పొంగినట్లు సాగరాన్ని మధించినట్లు, భైరవ ఖడ్గం తళతళలు యుద్ధభూమిని వణికిస్తున్నాయి. ధనుర్ధారులు ప్రయోగించే బాణాలు త్రుంచినాడు. శతృవుల శిరస్సులు కూరలు తరిగినట్లు తరుగు తున్నాడు. పరిఘాయుధం చేత పట్టుకుని చిత్ర విచిత్ర గతుల యుద్ధభూమిలో కలియతిరుగుతున్నాడు. గధాయుధం అందుకుని గధా ధరులను ఎదుర్కుంటున్నాడు. అన్నివిధాలా అన్నిరకాల ఆయుధాలను ఉపయోగిస్తున్నాడు. బ్రహ్మనాయుడు మాత్రము తన కుంతాన్ని చేత బట్టుకుని, ఏనుగు పై నెక్కి, కన్నమనీడుకి వెనుక వైపున ఉంటున్నాడు. బ్రహ్మనాయుడి

చేష్టలకు కన్నమనీడు రగిలిపోతున్నాడు. అయిన యుద్ధభూమిలో పోరాడు తున్నాడు. ఏవిధంగా పోరాడుతున్నాడంటే

(కధకుల ప్రకారం)

కొస్తే పడతాయి - రామ

కొవ్వులు దబ్బాలే - రామ

నరికి తెపడతాయి - రామ

నల్లని శిరమూలే - రామ

మేకలు రావి ఆకులు మేసిన విధముగా నాయనా ! మన కన్నముడు శతృమూకను చీల్చి చెండాలుతున్నాడు. అయినా ప్రయోజనము లేకుండా ఉన్నది. శతృసేనలు ఉప్పొంగిన సముద్రంలా ! పొంగి వస్తున్నాయి. కన్నమనీడు యొక్క అశ్వగజ బలాలు తరిగిపోతున్నాయి. ఎద్దులకు కోడెల కొమ్ములకు దివిటీలుకట్టి వాటిని వెలిగించి శతృముకలపై తోలినాడు శత్రువులు పరారవుతున్నారు. ఇది గమనించిన నలగాముడు పారిపోవద్దని వారించి, సైన్యాన్ని ఉపిగొల్పినారు. బాణాల వర్షం కురుస్తుంది. ఒక బాణం దూసువచ్చి పెదమాల దేవుని గుండెలో గుచ్చుకున్నది. అంతే వొరిగి పోయాడు, ఈ దృశ్యాన్ని చూచిన బ్రహ్మనాయుడు వణికిపోతూ కన్నముని వెనుకకు వచ్చాడు.

నలగాముని సైన్యం బ్రహ్మనాయుడి వైపు దూసుకువస్తున్నది కన్నముడు కారుమాలను అదిలించి దూరంగా వెళ్ళినాడు బ్రహ్మనాయుడు పరుగు లంకించుకున్నాడు. సైన్యం బ్రహ్మనాయుడ్ని తరుముకుంటూ వెంబడించినది. బ్రహ్మనాయుడు పరుగు పరుగున గుత్తి కొండ బిలంలో చొరబడ్డాడు. సైన్యం ఈటెలతో వెంబడించి ఓరబడినది. బ్రహ్మనాయుడ్ని బిలంలోనే ఈటెలతో, బాకులతో నుజ్జు నజ్జుగా పోడిచినారు. ఆ శవాన్ని బయటకు తెచ్చి ముక్కలు ముక్కలుగా నరికి కాకులకు, గద్దలకు వేసినారు, నలగాముడు విజయోత్సాహంతో సైన్యాన్ని వెనుకకు మరల్చినాడు. పల్నాటి రాజ్యన్ని స్థాపించే నిమిత్తం గురజాలకు చేరుకున్నాడు. యుద్ద భూమిలో ప్రాణులు కన్పించడంలేదు. శవాల గుట్టలు

కన్పడుతున్నాయి. పీనుగులపై కాట్ల కుక్కలు కలబడి మాంసపు ముక్కల్ని పీక్కు తింటున్నాయి. కన్నముడు ఒక్కడే 'కారుమాల' పై కూర్చున్నాడు. కారు చీకట్లు క్రమ్మినవి. కన్నముడు ఆలోచిస్తున్నాడు. అమాయకులు ఈ యుద్ధాగ్నిలో సమిధలై పోయినారు. పుట్టెడు నల్లపూసలు ఒక్క రోజులో తెగిపోయినవి. పచ్చని పంట పోలాల్తో విలసిల్లాల్సిన పల్నాడు బ్రహ్మనాయుడి మూలంగా బీడై పోయినది, అనుకున్నాడు.

నాగమ్మ మాత్రం మాలోల్ల దుర్గంలో తన స్వగ్రామమైన ఆరవెళ్ళి గ్రామానికి వెళ్ళి శేషజీవితాన్ని ప్రశాంతంగా గడపాలనుకున్నది. కన్నమనీడు రణవ్యూహంలో, రాజతంత్రంలో, రాజభక్తిలో, రాజనీతిలో, ప్రజా శ్రేయస్సులో ఘనుడు. ఆ చీకటి రాత్రి, కారుమాల నెక్కి అదిలించాడు. కారుమాల స్వారి నందుకుంది, అడవులు, కొండలు, గుట్టలుదాటు కుంటూ వెల్తుంది. **ప్రళయోగ్రమూర్తి, గంభీరమూర్తిగా మారిన మాలకన్నముని అనంత పయనం ఎటకు సాగిందో ???....**

నలగాముడు యుద్ధభూమి మరియు ఆ పరిసర ప్రాంతాలను మాలకన్నముని కొఱకు వెతికించాడు. తనసేనకు సర్వసేనాధిపతిగా కన్నముని నియమించాలని నలగాముని కోరిక. భటులు, కొండలు, అడవులు చుట్టు ప్రక్కల ప్రాంతాలు వెతికారు. ప్రయోజనం కనిపించలేదు. నలగాముడు విజయోత్సవ వేడుకలు జరుపుకున్నాడు. మాలనాడును (పల్నాడును) ప్రజారంజకంగా సర్వజనామోదంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన చేశాడు.

ఉపయుక్త గ్రంథాలు - అంశాలు

BOOKS

1. The Original Inhabitants of Bharatavarsha or India – Gustavoppert.
2. Dalit Vision – Gail OMVDET
3. పల్నాటి వీర చరిత్ర - అక్కిరాజు ఉమాకాంతం
4. పల్నాటి వీర చరిత్ర - శ్రీనాథుడు
5. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము - కుందూరి ఈశ్వరదత్తు
6. ప్రాచీన దక్షిణ భారత చరిత్ర - రామకృష్ణాచార్యులు
7. డా॥అంబేద్కర్ రచనలు -
8. అర్థశాస్త్రము (కౌటిల్యుడు) - మామిడిపూడి వెంకట రంగయ్య
9. కాటమరాజు కథలు - మొదటి సంపుటి
10. ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర - కంభంపాటి సత్యనారాయణ
11. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
12. చెన్నకేశవస్వామి-హరిజనార్చకులు - గంధం నాగేశ్వరరావు
13. భక్త పలనాటి వీర చరిత్ర - కలవల సుబ్బారావు
14. పలనాటి వీరకథాచక్రము - డా॥ తంగిరాల వేంకట సుబ్బారావు
15. నాయకీ నాగమ్మ - లల్లాదేవి
16. పల్నాటి వీరచరిత్ర - గుర్రం చెన్నారెడ్డి
17. ఆంధ్రుల చరిత్రము - చిలుకూరి వీరభద్రరావు
18. పల్నాటి సీమలో కోలాటాలు - డా॥బిట్టు వెంకటేశ్వర్లు
19. పల్నాటి వీరభారతము - శ్రీ కేతవరపు కృష్ణమూర్తి
20. పల్నాటి వీరచరిత్ర - రెంటాల గోపాలకృష్ణ
21. పల్నాటి వీరభాగవతం - ముదిగొండ వీరభద్రకవి

22. చంద్రగుప్త మౌర్య - లల్లన్‌జీ గోపాల్
23. సింహ సేనాపతి - రాహుల్ సాంకృత్యాన్
24. క్రీడాభిరామము - వినుకొండ వల్లభరాయుడు
25. చాటు పద్యమంజరి - వేటూరి ప్రభాకరశాస్త్రి
26. ప్రభావతీ ప్రద్యుమ్నము -
27. అప్పకవీయం - గిడుగు రామమూర్తి పంతులు
28. C.P. Brown Dictonary -
29. మృచ్ఛకటికం - శూద్రకుడు
30. మహాభారతం -
31. ఆంధ్రదేశ చరిత్ర భూగోళసర్వస్వం - ఖండవల్లి లక్ష్మీరంజనం
32. పలనాటి వీరచరిత్ర (పద్యకావ్యం) - పింగళి లక్ష్మీకాంతం
33. వీరభాగవతము (అవతారిక) - ముద్దులపల్లి గురుబ్రహ్మశర్మ
34. పల్నాటి వీరచరిత్ర - చిట్టిబాబు
35. చెన్నకేశవ క్షేత్రమహత్యము - సూరపరాజు వేంకట్రామయ్య
36. మగువ మాంచాల - బాలచంద్రుడు - అలరాజు - ఏటుకూరి వేకంట నర్సయ్య
37. పల్నాటి యుద్ధం (నాటకం) - మేళ్ళ చెరువు పద్మనాభం
38. పల్నాటి యుద్ధం (నాటకం) - డా॥ కంబాలమఠం బసవలింగదేవర
39. పల్నాటి వీరచరిత్ర (నాటకం) - కొర్లపాటి శ్రీరామమూర్తి
40. బ్రహ్మనాయుడు - డా॥ బిట్టు వెంకటేశ్వర్లు
41. Riddles Three Oceans - Alexander Kondroton
42. మరుగున పడ్డ వారసత్వం - కాశ్యాపాండ్యన్
43. చెంఘిజ్ ఖాన్ - తెన్నేటి సూరి.
44. వీర భారతము - ఎం.పి. జానుకవి
45. పల్నాటి సోదర కవుల జీవితము - సాహిత్యము - డా॥ చిట్టిప్రోలు సుబ్బారావు

సహకరించిన కథకులు:


1.	కనపర్తి వెంటేశ్వర్లు	అద్దేపల్లి - భట్టిప్రోలు మండలం గుంటూరు జిల్లా
2.	కనపర్తి గోవిందు	
3.	నక్కా సుబ్బారావు	
4.	కర్రా పోతురాజు (ప్రధాన కథకుడు)	పెదపల్లి (అల్లూరు) - పిట్టలవానిపాలెం (మండలం) భావాజీపాలెం - గుంటూరుజిల్లా
5.	వడ్డీ శంకరం	కొల్లూరు, గుంటూరు జిల్లా (తెనాలి)
6.	గరిక వెంకటేశ్వర్లు	పందిల్లపల్లి, చీరాల, ప్రకాశం జిల్లా
7.	నక్కా సుబ్బారావు	పెరవలి - తెనాలి (మండలం)
8.	పిల్లి సాంబయ్య	

మా యొక్క ప్రచురణలు

1. ఎంగిలి (దళిత కవితలు) - ఆరార్ బొనిగల
2. మాల - మాదిగల ప్రాచీన చరిత్ర - ఆరార్ బొనిగల
3. పల్నాటి చారిత్రక వీరుడు
   మాల కన్నమనీడు - ఆరార్ బొనిగల




తండ్రి వద్ద కత్తి యుద్ధంలో మెలుకువలు తెలుసుకుంటున్న కుర్ర కన్నముడు




మాలకన్నముని గుడి (మేడ)



ఆదిత్యుని నాగశాసనం



మాలకన్నముని వీరభైరవ ఖడ్గం



త్రిపురాంతక నివాసి, పాలుట్ల తిరుమాలయ్యా కుమారుడు
ఓబన్న ప్రతిష్ఠించిన రాతి కంభం.